

ఈనాడు



కరీంనగర్ 7-1-2019 సోమవారం సిటీ సంపుటి 45 సంచిక 148

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

పదవీ యోగం!

తెరాస మహిళా ఎమ్మెల్యేలకు సువర్ణావకాశం

- మంత్రి, సభాపతి/ ఉపసభాపతి, పార్లమెంటరీ కార్యదర్శులుగా ఛాన్స్
- ముఖ్యమంత్రి కేసీఆర్ యోచన



పద్మాదేవేందర్ రెడ్డి



రేఖానాయక్



గొంగిడి సునీత

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రసమితి తరపున ఎమ్మెల్యేలుగా గెలిచిన ముగ్గురు మహిళలకు పదవీ యోగం కలిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. వారికి ప్రాధాన్యం కల్పించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిసింది. మంత్రి పదవి, పార్లమెంటరీ కార్యదర్శి పదవులు పొందడం ఖాయం కాగా.. ఉపసభాపతి స్థానానికి సైతం వారిని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. ఎన్నికల్లో పద్మా దేవేందర్‌రెడ్డి (మెదక్), రేఖానాయక్ (ఖానాపూర్), గొంగిడి సునీత (ఆలేరు)లు తెరాస తరపున ఎన్నికయ్యారు. గత ప్రభుత్వ హయాంలో పద్మకు ఉపసభాపతిగా, సునీతకు విప్‌గా పదవులు లభించాయి. ఆసిఫాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న కోవా లక్ష్మిని పార్లమెంటరీ కార్యదర్శిగా నియమించారు. అయితే మంత్రివర్గంలో మహిళలకు చోటు దక్కకపోవడం లోటుగా మారింది. ఈ నేపథ్యంలో సీఎం ఈసారి విధిగా మంత్రివర్గంలోకి ఒక మహిళను తీసుకోవాలనుకుంటున్నారు. పద్మా దేవేందర్‌రెడ్డి పేరు ఈ జాబితాలో ముందుంది. ఉద్యమ నేపథ్యం, శాసనసభ్యురాలిగా, ఉపసభాపతిగా అనుభవం ఆమెకు లాభించనుంది. సమీకరణాలు మారితే ఎస్టీ, మహిళా కేటగిరీ రెండూ కలిసొచ్చి రేఖానాయక్‌కు అమాత్య పదవి దక్కవచ్చని భావిస్తున్నారు. పద్మాదేవేందర్ రెడ్డి (మిగతా 2లో)

మళ్లీ స్టీఫెన్‌సన్!

- ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యే నియామకానికి సిఫార్సు
- పార్లమెంటరీ కార్యదర్శులపై ఆర్డినెన్స్
- నేటి మంత్రిమండలి తొలి సమావేశంలో నిర్ణయం!



ఈనాడు, హైదరాబాద్: ఆంగ్లో ఇండియన్ శాసనసభ్యుని ఎంపిక, పార్లమెంటరీ కార్యదర్శుల నియామకంపై ఆర్డినెన్స్, శాసనసభ సమావేశాలకు ఆమోదం వంటి పలు కీలక నిర్ణయాలు తీసుకునేందుకు తెలంగాణ మంత్రివర్గం నేడు తొలిసారి సమావేశం కానుంది. సోమవారం ఉదయం 11.30కి ప్రగతిభవన్‌లో జరిగే ఈ సమావేశంలో ముఖ్యమంత్రి (మిగతా 2లో)



గాంధీభవన్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు కుంతియా. పక్కన టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్, ఏఐసీసీ కార్యదర్శి బోస్‌రాజు, పొన్నం



కాంగ్రెస్ సమీక్షలో బాహాబాహీ!

కుంతియా, ఉత్తమ్‌లపై సర్వే తీవ్ర వ్యాఖ్యలు

- సర్వే - కిషన్ దాడులు
- కేంద్ర మాజీమంత్రిపై సస్పెన్షన్ వేటు

ఈనాడు, హైదరాబాద్: పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేశారు. ఆదివారం గాంధీభవన్‌లో సమీక్ష నేపథ్యంలో జరిగిన తీవ్రమైన గొడవ ఈ పరిణామానికి దారితీసింది. ఓటమికి కారణాలను విశ్లేషిస్తుంటే.. తనపై రౌడీ మూకలతో దాడి చేయించారని సర్వే తీవ్రస్థాయిలో ఆరోపించారు. మూడు రోజులుగా లోక్‌సభ స్థానాలవారీగా కాంగ్రెస్ సమీక్షలు జరుగుతున్నాయి. ఆదివారం హైదరాబాద్, సికింద్రాబాద్, మెదక్, చేవెళ్ల, మల్కాజిగిరిల సమీక్ష జరిగింది. ఇందులో (మిగతా 2లో)





దెబ్బతిన్న అయ్యప్ప భక్తుల వ్యాను ★ ప్రమాదానంతరం అపస్మారక స్థితికి చేరి, వైద్యం కోసం ఎదురుచూస్తున్న క్షతగాత్రులు

మరణ ఘోష

తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

వ్యానును ఢీకొన్న కంటైనర్ వాహనం

10 మంది అయ్యప్ప భక్తుల మృతి

మరో ఐదుగురి పరిస్థితి విషమం

డ్రైవర్ మినహా మృతులంతా మెదక్‌వాసులే

చెన్నై, నర్సాపూర్, న్యూస్‌టుడే: మెదక్ జిల్లాకు చెందిన 15 మంది అయ్యప్ప భక్తులు ప్రయాణిస్తున్న వాహనం తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో వ్యానులోని భక్తుల్లో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో ముగ్గురు మరణించారు. మరో ఐదుగురు క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఖాజీపేట, మంతూరు, రెడ్డిపల్లి, చిన్నచింతకుంట, హత్నూర మండలం మంగాపూర్ గ్రామాలకు చెందిన 15 మంది అయ్యప్ప భక్తులు 3 రోజుల క్రితం శబరిమల యాత్రకు వ్యానులో బయలుదేరారు. శనివారం స్వామిని దర్శించుకున్నారు. రాత్రికి తిరుగు (మిగతా 2లో)

ఉలిక్కిపడ్డ ఊళ్లు.. 6లో

నా పేరుతో సంఘాలొద్దు



- యువసేనలు, యువజన, అభిమాన సంఘాలను రద్దు చేసుకోవాలి
- అంతా తెరాసలో, అనుబంధ సంఘాల్లో పనిచేయాలి
- పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సూచన

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో తన పేరు మీద ఏర్పాటు చేసిన సంఘాలకు ఎలాంటి గుర్తింపు లేదని, అలాంటి వాటిని తాను అంగీకరించేది లేదని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. వాటిని వెంటనే రద్దు చేసుకోవాలని ఆదేశించారు. పార్టీ పైన, తనపైన అభిమానం ఉంటే కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీతో కానీ పార్టీ అనుబంధ సంఘాల్లో చేరి వాటితో కలిసి పనిచేయాలని కోరారు. ఆదివారం కొందరు కార్యకర్తలు ఆయనను కలిసి కేటీఆర్ యువసేన పేరుతో సంఘం నడుపుతున్నామని చెప్పారు. వారితో కేటీఆర్ మాట్లాడారు. మనదంతా ఒకటే పార్టీ. అది తెరాస మాత్రమే అని వారికి చెప్పారు. మరో వేదిక పేరిట గందరగోళం సృష్టించవద్దన్నారు. వెంటనే యువసేనను రద్దు చేసుకోవాలని, వారంతా తెరాస కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. 'కేటీఆర్ యువసేనతో పాటు కేటీఆర్ సేవాదళ్, కేటీఆర్ అభిమాన సంఘం వంటి పేర్లతో పలు సంఘాలు నడుస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. ఇలాంటి వాటిని ఆమోదించను. ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లోనూ కేటీఆర్ యువసేన, కేటీఆర్ అభిమాన సంఘం వంటి వివిధ పేర్లతో కార్యకలాపాలు (మిగతా 2లో)



యువ హృదయం.. జర పదిలం

- యుక్త వయసులో గుండెపోటు ప్రాణాంతకం
- అమెరికాతో పోల్చితే హృద్రోగాలు మన దగ్గర ఐదింతలు ఎక్కువ
- బ్రిటన్, అమెరికాల్లో కుటుంబ వైద్యుడికే పట్టం
- అవసరమైతేనే స్పెషలిస్టు వైద్యుని వద్దకు..
- ఆపీ సదస్సు కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ శ్రీని గంగసానితో 'ఈనాడు' ముఖాముఖి

- పూర్తి వివరాలు 11లో

రైతుల ఖాతాల్లోకే పాల పైసలు

- విజయ డెయిరీ కొత్త విధానం

2లో

డ్రైవింగ్ లైసెన్సుతో ఆధార్ అనుసంధానం

- కేంద్రమంత్రి రవిశంకర్

అమెరికాలో తెలంగాణ విద్యార్థిపై కాల్పులు

- 3న డెట్రాయిట్‌లో ఘటన
- ప్రాణాపాయ స్థితిలో మహబూబాబాద్ వాసి సాయికృష్ణ



ఈనాడు డిజిటల్, మహబూబాబాద్: తెలంగాణ విద్యార్థిపై అమెరికాలో గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపారు. మిషిగన్ రాష్ట్రం డెట్రాయిట్ నగరంలో 3వతేదీ అర్ధరాత్రి (భారత కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం) జరిగిన ఘటనలో మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన పూస సాయికృష్ణ(24) తీవ్రంగా గాయపడ్డాడు. ప్రాణాపాయ స్థితిలో అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

హైదరాబాద్‌లోని కె.ఎస్.రాజు ఇంజినీరింగ్ కళాశాలలో సాయికృష్ణ మెకానికల్ ఇంజినీరింగ్ చదివాడు. ఎంఎస్ చేయడానికి 2014లో అమెరికాకు వెళ్లాడు. మిషిగన్ రాష్ట్రం డెట్రాయిట్‌లోని లారెన్స్ టెక్ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ పూర్తి చేశాడు. ఏడాదిగా ఉద్యోగ వేట కొనసాగిస్తూ నెల రోజుల కిందటే అక్కడి ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. 3న రాత్రి ఓ హోటల్ నుంచి తాను ఉంటున్న గదికి వస్తుండగా గుర్తు తెలియని ఆగంతకులు అతనిపై కాల్పులు జరిపినట్టు సమాచారం. అనంతరం దుండగులు సాయికృష్ణ వద్ద ఉన్న నగదు, ఇతర పత్రాలు తీసుకుని పరారైనట్టు తెలిసింది. నెత్తుటి మడుగులో ఉన్న బాధితుణ్ని ట్రాఫిక్ పోలీసులు ఆస్పత్రిలో చేర్పించారు. శస్త్ర చికిత్స చేయాల్సిన అవసరం ఉండడంతో అక్కడి (మిగతా 2లో)

ఇదీ సంగతి!



లోక్‌పాల్ నియామకంపై కమిటీ వేశాం. అది చేయాల్సిన పనిమీద మరో కమిటీ వేస్తాం, ఇది చేస్తున్న పనిమీద పరిశీలన కమిటీ వేస్తాం, ఈ కమిటీలు పని ఎందుకు చేయట్లేదని ఇంకో కమిటీ వేస్తాం!

దయచేసి వినండి..

20 నిమిషాల ముందే రావాలండి

- విమానాశ్రయాల మాదిరిగానే రైల్వేస్టేషన్లలోనూ తనిఖీలు
- అనుమానితుల ముఖాలను గుర్తించే సాంకేతికత వినియోగం

దిల్లీ: విమానాశ్రయాల్లో మాదిరిగానే రైల్వేస్టేషన్లలోనూ ఇకపై ప్రయాణికుల్ని తనిఖీ చేయనున్నారు. తనిఖీలకు వీలుగా ప్రయాణికులు నిర్ణీత సమయం కంటే ఓ ఇరవై నిమిషాలు ముందుగానే రైల్వేస్టేషన్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. స్టేషన్లో ప్రవేశించేందుకు వీలు కల్పిస్తున్న మార్గాలు ఇప్పటిలా కాకుండా పరిమితంగానే ఉంటాయి. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో కూడిన భద్రత తనిఖీలను ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్), హుబ్బళ్లి స్టేషన్లలో ప్రారంభించామని, మరో 202 స్టేషన్ల కోసం ప్రణాళిక సిద్ధం చేశామని రైల్వే పరిరక్షణ దళం (ఆర్‌పీఎఫ్) డైరెక్టర్ జనరల్ అరుణ్‌కుమార్ ఆదివారం ఒక వార్తాసంస్థకు తెలిపారు. 'రైల్వేస్టేషన్లను దిగ్బంధం చేయాలనేది మా ప్రణాళిక. ఎక్కడెక్కడ ప్రవేశ మార్గాలున్నాయో గుర్తించి, వాటిలో ఎన్నింటిని మూసివేయవచ్చో తేలుస్తాం. శాశ్వతంగా ప్రహరీ గోడలు కట్టి కొన్నింటిని మూసివేస్తాం. మరికొన్నింటి వద్ద ఆర్‌పీఎఫ్ బలగాలను మోహరిస్తాం. ప్రతీ ద్వారం వద్ద అడపాదడపా (మిగతా 2లో)



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగుల తనిఖీ (పాతచిత్రం)

సూళ్లూరుపేటలో దేశంలోనే అతిపెద్ద మల్టీప్లెక్స్

రూ.40 కోట్లతో 106 అడుగుల వెడల్పు తెర

నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో భారీ మల్టీప్లెక్స్ థియేటర్ రూపొందుతోంది. పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారి పక్కన పిండిపాళెం వద్ద దీన్ని తీర్చిదిద్దుతున్నారు. 670 సీట్ల సామర్థ్యం, 3డీ 'సౌండ్ సిస్టమ్'తోపాటు.. దేశంలోనే తొలిసారిగా 106 అడుగుల వెడల్పుతో తెర ఏర్పాటుచేస్తుండడం విశేషం. రూ.40 కోట్ల వ్యయంతో 'యూవీ క్రియేషన్స్' సంస్థ ఏడున్నర ఎకరాల విస్తీర్ణంలో ఈ మల్టీప్లెక్స్‌ను నిర్మిస్తోంది. 106 అడుగుల వెడల్పు గల భారీ తెరలు ప్రపంచంలో మరో రెండు మాత్రమే ఉన్నాయి. ఆ కోవలో ఇది మూడోదని, ఆసియాలో రెండోదని థియేటర్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ మల్టీప్లెక్స్‌లో ఒక్కోటి 170 సీట్ల సామర్థ్యంతో మరో రెండు తెరలు ఉంటాయి.

–సూళ్లూరుపేట, న్యూస్‌టుడే



థియేటర్‌లో ఏర్పాటుచేసిన సీట్లు



106 అడుగుల వెడల్పయిన తెర

డ్రైవింగ్ లైసెన్సుతో ఆధార్ అనుసంధానం తప్పనిసరి

- త్వరలో పార్లమెంటులో బిల్లు
- కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్

చండీగఢ్: మోటారు వాహనాల డ్రైవింగ్ లైసెన్సును ఆధార్‌తో అనుసంధానం తప్పనిసరి చేయనున్నట్లు కేంద్ర న్యాయమంత్రి రవిశంకర్‌ప్రసాద్ తెలిపారు. దీనికి సంబంధించి బిల్లు ప్రస్తుతం పార్లమెంటులో పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఈ బిల్లు ఆమోదం పొందితే దేశవ్యాప్తంగా మోటారు వాహనాలకు సంబంధించిన పలు కేసుల దర్యాప్తు సులువవుతుందన్నారు. దేశంలో ఒకచోట రోడ్డుప్రమాదానికి కారణమైన వ్యక్తి, మరోచోట కొత్త డ్రైవింగ్ లైసెన్సు తీసుకుంటున్నాడని, ఫలితంగా పోలీసులకు దొరక్కుండా తప్పించుకుంటున్నాడని మంత్రి చెప్పారు. అదే ఆధార్‌తో అనుసంధానం చేస్తే.. తప్పుడు చిరునామా, ధ్రువీకరణపత్రాలతో కొత్త లైసెన్సు పొందలేరన్నారు. పంజాబ్‌లోని ఫగ్వారాలో నిర్వహిస్తున్న సైన్స్‌కాంగ్రెస్‌లో మాట్లాడిన కేంద్రమంత్రి ఈ వివరాలు వెల్లడించారు.

ఆధార్‌తో భారీగా ఆదా: జైట్లీ

దిల్లీ: 'ఆయుష్మాన్ భారత్' తరహాలో మూడు భారీ పథకాల అమలుకు సరిపడా నిధులు ఆధార్ అనుసంధానంతో ఆదా అయ్యాయని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ చెప్పారు. ఆధార్ పథకం విజయవంతం కావడానికి ప్రధాని నరేంద్రమోదీ నిర్ణయాత్మక నాయకత్వమే కారణమన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కారు వివిధ కారణాల వల్ల ఆధార్‌పై పూర్తిస్థాయిలో ముందుకు వెళ్లలేకపోయిందని చెప్పారు. ఆధార్ ప్రయోజనాలపై ఆదివారం ఆయన ఈ మేరకు ఫేస్‌బుక్‌లో ఒక వ్యాసం రాశారు. అనర్హుల, బినామీల ఏరివేత ద్వారా ఈ ఏడాది మార్చి వరకు రూ.90,000 కోట్లు ఆదా అయ్యాయంటే దానికి కారణం ఆధార్ పథకమేనన్నారు. ఇప్పటి వరకు రూ.1.69 లక్షల కోట్ల రాయితీలు నగదు బదిలీ ద్వారా ప్రజలకు చేరాయని వివరించారు.

రైతుల ఖాతాల్లోకే పాల పైసలు

- 50 సంఘాల్లో అమలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల్లో పాలు పోస్తున్న రైతుల బ్యాంకు ఖాతాల్లో ఇక నుంచి నేరుగా పాల బిల్లు డబ్బులు జమ కానున్నాయి. ఇప్పటి వరకు సహకార సంఘం ఖాతాల్లోకి వచ్చే సొమ్మును సొసైటీ పెయిడ్ కార్యదర్శి రైతుల ఖాతాల్లోకి మళ్లించేవారు. ఇకపై ఎవరి ప్రమేయం లేకుండా ఆన్‌లైన్ ద్వారా సొమ్ము బదిలీ కానుంది. ఇప్పటికే 5 సహకార సంఘాల్లో అమలు చేయగా మంచి ఫలితాలు వచ్చాయి. దీంతో ఈ నెల చివరి వారం నుంచి పాత పది జిల్లాల ప్రాతిపదికన జిల్లాకు ఐదు సహకార సంఘాల చొప్పున మొత్తం 50 సంఘాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు.

అనలైజరే ఆన్‌లైన్‌కు ఆధారం

సంఘాల్లో ఉండే ఎలక్ట్రానిక్ మిల్క్ అనలైజర్ యంత్రాన్ని ఆన్‌లైన్‌తో అనుసంధానిస్తారు. రైతు ఎన్ని లీటర్ల పాలు పోశారు, అందులో వెన్న, ఎస్‌ఎన్‌ఎఫ్ శాతం మొదలైన వివరాలన్నీ ఇందులో నమోదవుతాయి. అనంతరం వాటిని రికార్డులో రాసి పంపిస్తేనే, డెయిరీ నుంచి బిల్లులు విడుదలయ్యేవి. ఇకపై అనలైజర్‌లో నమోదయ్యే వివరాలు రోజు వారీగా డెయిరీకి చేరుకుంటాయి. వాటి ఆధారంగా 10, 15 రోజులకు ఒకసారి బిల్లులు విడుదల చేస్తామని విజయ డెయిరీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. రైతులకు డెయిరీ ద్వారా అందిన ప్రయోజనాలన్నీ నమోదవుతాయి. పాలు పోసిన రైతు ఇంటికి వెళ్లేలోపు ఎన్ని లీటర్లు పోశారు. వెన్న, ఎస్‌ఎన్‌ఎఫ్ శాతం ఎంత అనే వివరాలు సెల్‌ఫోన్‌కు వస్తాయి.

రాష్ట్రం మొత్తం విస్తరిస్తాం

–శ్రీనివాసరావు, టీఎస్‌డీడీసీఎఫ్, ఎండీ

రాష్ట్రంలో 50 సహకార సంఘాల్లో ఆన్‌లైన్ బిల్లుల చెల్లింపును ప్రారంభించనున్నాం. ఇందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్, సామగ్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాక, సమస్యలేమైనా ఉంటే పరిష్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఈ విధానాన్ని విస్తరిస్తాం.

కాంగ్రెస్ సమీక్షలో బాహాబాహీ!

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి కుంతియా, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు బోసురాజు, శ్రీనివాస కృష్ణన్, సలీం అహ్మద్‌లు పాల్గొన్నారు. మల్కాజిగిరి లోక్‌సభ సమీక్ష సమయంలో సర్వే సత్యనారాయణ మాట్లాడుతుండగా వాగ్వాదం చోటుచేసుకుంది. ఉత్తమ్, కుంతియాలపై సర్వే తీవ్ర విమర్శలు చేశారు. ఓటమికి బాధ్యులైన వారే సమీక్షలు నిర్వహిస్తే ప్రయోజనం ఏముంటుందనే వ్యాఖ్యలతోపాటు వివిధ అంశాలను ఆయన ప్రస్తావిస్తుండగా కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీ ముఖ్యనేతలపై తీవ్ర వ్యాఖ్యలు సరికాదని పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ వారించారు. దాంతో సర్వే సత్యనారాయణ, బొల్లు కిషన్‌లు పరస్పరం దూషించుకుని బాహాబాహీకి దిగారు. తీవ్ర గందరగోళం నేపథ్యంలో సర్వే సమావేశం నుంచి వెలుపలికి వచ్చేశారు. ఏఐసీసీ, పీసీసీ ముఖ్యనేతల సమావేశంలో జరిగిన ఈ ఘటనపై తక్షణం చర్యలు తీసుకోవాలని భేటీలో పాల్గొన్న పలువురు నేతలు డిమాండ్ చేశారు. సర్వేను పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని సంతకాల సేకరణ కూడా చేపట్టారు. వెంటనే సర్వే సత్యనారాయణను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు పీసీసీ ప్రకటించింది. ఏఐసీసీ పెద్దలతో మాట్లాడి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కుంతియా, ఉత్తమ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్‌పై దాడి నేపథ్యంలో సర్వేను సస్పెండ్ చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

నాపై రౌడీ మూకల్ని ఉసిగొల్పారు: సర్వే

పార్టీని సర్వనాశనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సర్వే సత్యనారాయణ డిమాండ్ చేశారు. అన్ని విషయాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఘటనపై ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్టీ ఓటమికి కారణాలను విశ్లేషిస్తుంటే ఇష్టపడని వారు రౌడీ మూకలతో తనపై దాడి చేయించారని ఆరోపించారు. వాస్తవాలను జీర్ణించుకోలేకే ఇలా చేశారని దుయ్యబట్టారు. ఇంట్లో వాళ్లు కూడా ఓటేయని వారికి పార్టీ పదవులు ఇచ్చి.. వ్యతిరేకంగా మాట్లాడితే దాడులు చేయిస్తున్నారని దుయ్యబట్టారు. ఓటమికి కారణాలు చెబుతుంటే తనను అడ్డుకున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏం జరిగింది? ఓటమికి కారణం ఎవరెవరు? సహా అన్ని విషయాలు సోమవారం విలేకర్ల సమావేశంలో వివరిస్తానని తెలిపారు.

దూషణ వద్దన్నందుకే నాపై దాడి: బొల్లు కిషన్

పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ మాట్లాడుతూ.. కుంతియా, ఇతర నేతల్ని సర్వే సత్యనారాయణ అసభ్య పదజాలంతో దూషించారని.. ఇలా దూషణలు తగదని అన్నందుకు వాటర్‌బాటిల్‌తో కొట్టి తనపై దాడికి దిగారని ఆరోపించారు. చౌక్కా పట్టుకుని తనపై దాడి చేశారని పేర్కొన్నారు. పార్టీ నుంచి సర్వేను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా సిద్ధం కావాలి

లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా సిద్ధం కావాలని ఏఐసీసీ ఇన్‌ఛార్జి కుంతియా, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బూత్, మండల కమిటీలను పటిష్ఠ పరుచుకోవాలని నేతలకు సూచించారు. పంచాయతీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల, మెదక్ లోక్‌సభ స్థానాల పరిధిలోని నేతలతో సమీక్షా సమావేశంలో వారు మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేసేందుకు అన్ని అంశాలపై దృష్టిసారించాలని కోరారు. లోక్‌సభ అభ్యర్థులను ముందుగానే ప్రకటించాలని పలువురు నేతలు సూచించారు. శాసనసభ ఎన్నికల్లో ఓటమికి కారణాలను పలువురు వివరించారు. ఆదివారంతో 17 లోక్‌సభ నియోజకవర్గాల సమీక్షలు పూర్తయ్యాయి.

రాష్ట్రంలో పొడి వాతావరణం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడిందని వాతావరణ అధికారి రాజారావు తెలిపారు. ఉత్తరకోస్తా ప్రాంతంలో ఏర్పడిన తుపాను వ్యతిరేక గాలులు ఉత్తరాది శీతలగాలులను అడ్డుకుంటున్నాయని చెప్పారు. ప్రస్తుతం తూర్పు, ఈశాన్య భారతం నుంచి తెలంగాణ వైపు గాలులు వీస్తున్నాయి. ఆదివారం తెల్లవారుజామున అత్యల్పంగా మెదక్‌లో 11, రామగుండంలో 13, ఆదిలాబాద్‌లో 14, హైదరాబాద్‌లో 15 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పగటిపూట సాధారణంకన్నా 3 డిగ్రీలు పెరిగి గరిష్ఠంగా మహబూబ్‌నగర్‌లో 33 డిగ్రీలు నమోదైంది. రాత్రిపూట చలి సాధారణ స్థాయిలో ఉంటోందని రాజారావు తెలిపారు.

నా పేరుతో సంఘాలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహిస్తున్న వారు సైతం వాటిని వెంటనే ఆపేయాలి. ఇకపై ఏ కార్యక్రమమైనా తెరాస పేరిటే సాగాలి' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

హార్వర్డ్ ఇండియా వార్షిక సదస్సుకు కేటీఆర్‌కి ఆహ్వానం

అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయం తాము నిర్వహించే హార్వర్డ్ ఇండియా వార్షిక సదస్సుకు తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ఆహ్వానించింది. ఫిబ్రవరి 16, 17 తేదీల్లో మసాచుసెట్స్‌లో జరగనున్న ఈ సదస్సుకు వివిధ దేశాల నుంచి వేయి మంది మేధావులు, రాజకీయ ప్రముఖులు, విద్యావేత్తలు, విద్యార్థులు, యువ వృత్తి నిపుణులు హాజరుకానున్నారు. భారతదేశం ఎదుర్కొంటున్న సవాళ్లు, వివిధ అభివృద్ధి అంశాలపైన రెండు రోజులపాటు చర్చిస్తారు. తెలంగాణలో పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రిగా విధులు నిర్వర్తించి, ఆవిష్కరణలను, పరిశోధనలను ప్రోత్సహించడం, అభివృద్ధికి కృషి చేయడంతో పాటు రాజకీయాల్లోనూ రాణిస్తున్నందున సదస్సుకు కేటీఆర్‌ను ఆహ్వానిస్తున్నట్లు హార్వర్డ్ పేర్కొంది. ప్రత్యేక వక్తగా హాజరై భారతదేశ ఔన్నత్యం అనే అంశంపై ప్రసంగించాలని నిర్వాహకులు కేటీఆర్‌ను కోరారు.

దయచేసి వినండి..

(మొదటి పేజీ తరువాయి)

తనిఖీలు నిర్వహిస్తాం. విమానాశ్రయాల్లో మాదిరిగా ప్రయాణికులు కొన్ని గంటల ముందుగా రావాల్సిన పనేమీ లేదు. 15-20 నిమిషాల ముందు వస్తే భద్రత తనిఖీలతో జాప్యం కాకుండా ఉంటుంది. దీనికోసం సిబ్బంది అవసరం పెద్దగా ఉండదు. సమీకృత భద్రత వ్యవస్థ (ఐఎస్‌ఎస్)లో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నాం' అని ఆయన వివరించారు.

ఖర్చు రూ.385 కోట్లు

ఐఎస్‌ఎస్‌లో భాగంగా సీసీటీవీ కెమేరాలు, తనిఖీ యంత్రాలు, బాంబుల్ని గుర్తించి నిర్వీర్యం చేయగలిగే పరికరాలు వంటివి సమకూర్చుకునేందుకు రూ.385 కోట్లు ఖర్చవుతుందని అరుణ్‌కుమార్ తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో ప్రయాణికులు ప్రధాన స్టేషన్లోకి రావడానికి ముందే తనిఖీలు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. ముఖాలను గుర్తించగలిగే సాఫ్ట్‌వేర్ కూడా ఉంటుందని, అనుమానితులు కనిపించగానే ఆర్‌పీఎఫ్ కమాండ్‌ను ఇది అప్రమత్తం చేస్తుందని వివరించారు. యాదృచ్ఛిక పద్ధతిలో కొంతమంది ప్రయాణికుల్ని ఎంపిక చేసుకుని తనిఖీలు చేస్తామని చెప్పారు.



ప్రమాదానికి కారణమైన కంటైనర్ లారీ



ప్రమాద బాధితులు దర్శనానంతరం శబరిమలలో తీసుకున్న చిత్రం



తల్లిదండ్రులతో సాయికృష్ణ(ఎడమవైపు చివరన) (పాత చిత్రం)

అమెరికాలో తెలంగాణ విద్యార్థిపై కాల్పులు

(మొదటి పేజీ తరువాయి)

వైద్యులు మహబూబాబాద్‌లో ఉంటున్న అతని తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. 'గొంతు, వెన్నుపూస వద్ద శస్త్ర చికిత్స చేస్తున్నామని, రక్తం అవసరమైతే ఎక్కిస్తామని, వైద్యపరంగా అందించాల్సిన సేవలన్నింటినీ అందిస్తామని వాళ్లు మాతో చెప్పారు. మేము అంగీకరించిన తర్వాతనే శస్త్ర చికిత్స చేశారు' అని సాయికృష్ణ తల్లిదండ్రులు శైలజ, ఎల్లయ్య 'ఈనాడు'తో చెప్పారు. 'ఇప్పటివరకు మా కుమారుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడనే భావిస్తూ వచ్చాం. కాల్పులు జరిగినట్లు ఇప్పుడే తెలిసింది. కుడి చేతిపైన, మెడపైన బుల్లెట్ గాయాలున్నట్లు సమాచారం అందింది. అసలు అక్కడ ఏం జరిగిందోననే ఆందోళన వెంటాడుతోంది' అని వారు రోదించారు. ఆమెరికా వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. ఎల్లయ్య ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్నారు.

మరణఘోష

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణమయ్యారు. ఆదివారం ఉదయానికి రామేశ్వరం చేరుకున్నారు. అక్కడి రామనాథస్వామిని దర్శించుకున్నారు. అక్కణ్నుంచి బయలుదేరిన వీరి వాహనం మధ్యాహ్నం పుదుకోట్టై జిల్లా తిరుమయం వద్ద తిరుచ్చి-రామేశ్వరం రహదారిలో ప్రయాణిస్తుండగా ఎదురుగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. ఢీకొన్న వేగం, తీవ్రతకు వ్యాను ముందు భాగం నుజ్జయింది. వ్యాను డ్రైవరు సహా ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను వెంటనే పుదుకోట్టై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరో ముగ్గురు మరణించడంతో మృతుల సంఖ్య 10కి చేరింది. మిగిలిన ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నా, ప్రాణాపాయం లేదని స్థానిక వైద్యులు తెలిపారు. కంటైనర్ తప్పుడు మార్గం(రాంగ్‌రూట్)లో ఎదురుగా రావడమే ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు.

మృతులు వీరే

- కర్రె నాగరాజుగౌడ్ (28), జుర్రు మహేష్ (28), బోయిని కుమార్(22) - ఖాజీపేట
- అంబర్‌పేట కృష్ణ గౌడ్ (40), నక్క ఆంజనేయులు(45)- రెడ్డిపల్లి
- ప్రవీణ్‌గౌడ్(25), సురేశ్ (23)- చిన్నచింతకుంట
- అయ్యన్నగారి శ్యామ్ గౌడ్ (23), సాయి(26)- మంతూరు
- డ్రైవర్ సురేశ్(45)- హైదరాబాద్ నగరం బోయిన్‌పల్లి

క్షతగాత్రులు వీరే

- కర్రె నరేశ్ గౌడ్, దొంతి భూమయ్య, మచ్కూరి రాజు- ఖాజీపేట
- శ్రీశైలం-మంతూరు
- వెంకటేశ్వర్లు- హత్నూర మండలం మంగాపూర్

ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి

ఈనాడు, హైదరాబాద్: అయ్యప్ప భక్తులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలని, మృతదేహాలను ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తరలించాలని అధికారులను ఆదేశించారు. తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

మృతదేహాలు రప్పించేందుకు ఏర్పాట్లు: హరీశ్

మృతదేహాలను సోమవారం ఉదయానికల్లా స్వగ్రామాలకు తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ప్రమాదంపై అక్కడి కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, తమిళనాడు మంత్రితో మాట్లాడినట్లు చెప్పారు. మృతులకు తమిళనాడు ప్రభుత్వం పరిహారం ప్రకటించిందని, తెలంగాణ ప్రభుత్వం తరఫున కూడా బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలను, క్షతగాత్రులను తీసుకొచ్చేందుకు నర్సాపూర్ తహసీల్దారు భిక్షపతి, సీఐ సైదులు ఆదివారం రాత్రి ప్రత్యేకంగా విమానంలో తమిళనాడుకు వెళ్లారు. వీరితో పాటు తెరాస మాజీ జిల్లా అధ్యక్షుడు మురళీయాదవ్ కూడా వెళ్లారు.

గ్రహం అనుగ్రహం

7–1–2019 సోమవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
హేమంత రుతువు; పుష్య మాసం; శుక్ల పక్షం
పాడ్యమి: ఉ. 7.44 తదుపరి విదియ
ఉత్తరాషాఢ నక్షత్రం: రా. 7.28 తదుపరి శ్రవణం
అమృతఘడియలు: మ. 12.26 నుంచి 2.12 వరకు
వర్జ్యం: రా. 11.53 నుంచి 1.39 వరకు
దుర్ముహూర్తం: మ. 12.29 నుంచి 1.13 వరకు
తిరిగి మ. 2.41 నుంచి 3.25 వరకు
రాహుకాలం: ఉ. 7.30 నుంచి 9.00 వరకు
సూర్యోదయం: ఉ.6-37; సూర్యాస్తమయం: సా.5-37
చంద్రదర్శనం

మళ్లీ స్టీఫెన్‌సన్!

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్, హోం మంత్రి మహమూద్ అలీ పాల్గొంటారు. గత శాసనసభలో ఉన్న ఆంగ్లో ఇండియన్ శాసనసభ్యుడు ఎల్విస్ స్టీఫెన్‌సన్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని సీఎం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఆయన నియామకానికి గవర్నర్ నరసింహన్‌కు మంత్రిమండలి తరఫున సిఫార్సు చేయనున్నారు. శాసనసభ వాస్తవ బలం 120. ఇందులో 119 మంది ఎన్నికల ద్వారా వస్తారు. మిగిలిన స్థానంలో ఆంగ్లో ఇండియన్ సభ్యుడిని నియమిస్తారు. గత ప్రభుత్వంలో స్టీఫెన్‌సన్ ఆంగ్లో ఇండియన్ శాసనసభ్యునిగా ఉన్న సమయంలో 'ఓటుకు నోటు' ఉదంతం జరిగింది. ఆ సమయంలో స్టీఫెన్‌సన్ తన వద్దకు బేరసారాలకు వచ్చిన వ్యక్తుల సమాచారాన్ని సీఎం కేసీఆర్‌కు అందించి, వారిని పట్టుకునేందుకు అనువుగా వ్యవహరించారు. నిజాయతీగా వ్యవహరించినందున ఆయనకే మళ్లీ అవకాశం ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. స్టీఫెన్‌సన్ ఎంపికతో తెరాస బలం 91కి చేరుతుంది. ఆంగ్లో ఇండియన్ సభ్యునికి ఎమ్మెల్యేలతో సమానంగా అవకాశాలుంటాయి. శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లోనూ ఓటు వేయవచ్చు. వచ్చే శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల దృష్ట్యా సీఎం వెంటనే ఆంగ్లో ఇండియన్ సభ్యుడిని నియమించాలని నిర్ణయించారని తెలుస్తోంది.

శాసనసభ సమావేశాలకు ఆమోదం

ఈ నెల 17 నుంచి 20 వరకు తెలంగాణ రెండో శాసనసభ మొదటి సమావేశాలు జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి మంత్రి మండలి ఆమోదం తెలపనుంది. శాసనసభ సమావేశాలకు మంత్రిమండలి ఆమోదం తెలపడం ఆనవాయితీగా వస్తోంది.

పార్లమెంటరీ కార్యదర్శుల నియామకానికి ఆర్డినెన్స్

తెలంగాణ శాసనసభలోని 120 మంది సభ్యుల బలాన్ని బట్టి 18 మందిని మాత్రమే మంత్రిమండలిలోకి తీసుకోవాలి. రెండోసారి అధికారం చేపట్టిన తెరాసకు 90 మంది ఎమ్మెల్యేలుండడంతో అమాత్య పదవులకు ఆశావహుల సంఖ్య కూడా భారీగా ఉంది. దీంతో పలువురు ఎమ్మెల్యేలను పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమించాలని సీఎం భావిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోనూ ఆరుగురు ఎమ్మెల్యేలను పార్లమెంటరీ కార్యదర్శులుగా ప్రభుత్వం నియమించింది. దీనిపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం వారి నియామకాలను హైకోర్టు కొట్టివేసింది. ఈసారి అలాంటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకొని ఆర్డినెన్స్‌ను రూపొందిస్తున్నారు. ఈ ఆర్డినెన్స్ జారీకి మంత్రిమండలిలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

హామీలపైనా..

2014లో తెరాస ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన తొలి మంత్రిమండలి సమావేశం ఒకేసారి 42 హామీలకు ఆమోదం తెలిపింది. దీంతో సోమవారం జరగనున్న మంత్రిమండలి సమావేశంపై అందరి దృష్టి కేంద్రీకృతమయింది. అయితే గ్రామ పంచాయతీ ఎన్నికల నిబంధనావళి దృష్ట్యా ఈ సమావేశంలో హామీలపై చర్చించడానికి అవకాశం లేదు. నిబంధనావళి పరిధిలో లేని ఇతర నిర్ణయాలు తీసుకుంటారు.

పదవీ యోగం!

(మొదటి పేజీ తరువాయి)

ఉపసభాపతిగా రాణించినందున ఈసారి సభాపతిగా ఎంపిక చేయాలని సీఎం భావిస్తున్నారు. అయితే సభాపతి పదవిని ఆమె తిరస్కరిస్తే మరొకరిని అందులో నియమించి, సునీత, రేఖల్లో ఒకరిని ఉపసభాపతిగా చేయాలనే ప్రతిపాదన ఉంది. ఒకరు మంత్రి, మరొకరు సభాపతి లేదా ఉపసభాపతి అయ్యాక మరో సభ్యురాలికి పార్లమెంటరీ కార్యదర్శి పదవి ఇవ్వాలనే ఆలోచన కూడా ఉంది.

ఇతర పార్టీల నుంచి చేరితే...

ఇతర పార్టీలకు చెందిన కొందరు మహిళా సభ్యులు తెరాసలో చేరతారనే ప్రచారం జరుగుతోంది. వారికి కూడా కీలక పదవులు ఇస్తామని తెరాస అధిష్ఠానం ఇప్పటికే హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. వారి చేరికలపై స్పష్టత వస్తే మంత్రి, పార్లమెంటరీ కార్యదర్శుల పదవుల ఎంపిక వాయిదా పడవచ్చని తెలుస్తోంది.

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
మెదక్	11.3	35.5
రామగుండం	13.4	28.4
ఆదిలాబాద్	13.8	31.3
విశాఖపట్నం	15.0	27.6
హైదరాబాద్	15.0	28.8
కరీంనగర్	15.0	30.0
మహబూబ్‌నగర్	15.5	32.4
హన్మకొండ	16.0	30.0
నిజామాబాద్	16.1	30.9
నల్గొండ	16.2	29.0
సూర్యాపేట	17.0	29.5
గుంటూరు	17.4	29.2
తిరుపతి	17.5	29.9
ఖమ్మం	20.0	32.0



Nithin Babu

All India Rank

216

in JEE Advanced 2018

Presently he is pursuing Electrical Engineering at IIT Madras

Though I was selected in FIITJEE Test,

I was not able to fetch any Scholarship

This did not deter me from my aspiration. I went ahead and joined FIITJEE. Today I am a proud IITian.

Student of FIITJEE's **Four Year Classroom Program** (IX - XII)

In FIITJEE Admission Test, he scored only 155 marks out of total 474 marks.

My name is Nithin and today, at this stage of my life, when I am about to live my dream of studying at IIT, I can say that True guidance is like a small torch in a dark forest.

I enrolled in FIITJEE's Four Year Classroom Program through FIITJEE Admission Test wherein I got 155 marks out of 474. Though I was selected in FIITJEE Test, I was not able to fetch any scholarship. This did not deter me from my aspiration of studying at IITs. I went ahead and joined FIITJEE and today I am a proud IITian. FIITJEE's teaching methodology and highly competent faculty have not only helped me to strengthen my fundamentals but have also boosted me to make rapid academic progress both in School and Coaching. All this have eventually helped me to secure a good Rank in JEE Advanced.

FIITJEE's winning methodology and relaxed yet superior learning environment helped me sail successfully through the tough times.

FIITJEE has certainly given me the edge that I have been looking for. I am thankful to FIITJEE in helping me live my dream of studying at IIT.

Nithin Babu



Himanshu Choudhary

All India Rank

219

in JEE Advanced 2018

Presently he is pursuing Computer Science & Engineering at IIT Kharagpur

Not getting any Scholarship

in FIITJEE Test was the moment when I thought of letting go off my dream. But Thank God ! I did not give up & joined FIITJEE.

Student of FIITJEE's **Three Year Classroom Program** (X - XII)

In FIITJEE Admission Test, he scored only 236 marks out of total 405 marks.

My name is Himanshu Choudhary and honestly, I cannot thank FIITJEE enough for the way it has helped me realize my distant dream of studying at IIT. I remember, while I was in Class 10, I was confused about which institute to join.

It is when I decided to appear in FIITJEE's FTRE. In this exam I could only score 236 marks out of 405 and was not able to get any scholarship. Not getting any scholarship in FIITJEE Test was the moment when I thought of letting go of my dream of becoming an IITian. But Thank God! I did not give up and joined FIITJEE. FIITJEE's easy to understand & relaxed methodology was icing on the cake as not once was I under any kind of stress and pressure. FIITJEE has come as a blessing in my life. Only through its constant guidance, through support and most of all "its belief in Me" that I have been able to perform way beyond my potential and secure this Rank. I recommend every JEE aspirant that if you have a flair for Science & Mathematics and have a dream to study at IIT then FIITJEE is the place for you. Thank you FIITJEE for making my dreams come true.

Him

Other FIITJEE Students, who did not get any Scholarship in FIITJEE Test but secured a Rank in Top 1000 All India Ranks in JEE Advanced 2018.

AIR **436**



Harsh Shrivastava
Four Year Classroom Program

AIR **478**



Aman Kumar Singh
Three Year Classroom Program

AIR **518**



Kartikay Goel
Four Year Classroom Program

AIR **650**



Bhavesh Jain
Three Year Classroom Program

AIR **671**



Manav Pillai
Three Year Classroom Program

AIR **751**



Harman Singh
Three Year Classroom Program

AIR **849**



Chakshur Tyagi
Three Year Classroom Program

AIR **923**



Divyansh Chaturvedi
SUPREME - Four Year Integrated School Program

AIR **967**



Fathima Zarin Faizal
Four Year Classroom Program

Each & Every Student is Important for us

Aided by FIITJEE's unmatched Transformational Ability, all Students are empowered to an extent where they effortlessly surpass every challenge, every obstacle and achieve what they themselves thought was never possible. **And these Results are a True Testimony of our Honest Endeavours.**

With FIITJEE Goal Setting & Academic Cult Metamorphosis, say Yes to Success without stress, tension & uncertainties.

The Best. The Ethical. The only Professional Institution.

FIITJEE
FORUM FOR IIT-JEE

National Admissions Office : FIITJEE House, 29-A, Kalu Sarai, Sarvapriya Vihar, New Delhi-110 016

Hyderabad Centres - Dilsukhnagar : D No : 16-11-477/6/2/2, Sahadeva Reddy Buildings, Lane Beside Sahadevareddy Sweets, Dilsukhnagar - 500 036 Ph: 040 - 66757890 /91 **Saifabad** : 5-9-14/ B, Saifabad (Opp. Secretariat), Hyderabad - 500 004 Ph. : 040 - 66777000 /01 /02, 9885166636 **Kukatpally** : H. No. 22-97, Plot No. 1, Opp. Patel Kunta, Huda Park, Vijaynagar Colony, Kukatpally - 500 072 Ph. : 040 - 48533211, 48565559

This Advertisement has been released by FIITJEE Limited headquartered at New Delhi. Below mentioned Tests are not Admission Tests to our Schools or Colleges and Admissions are done on "First Come First Serve Basis" as per Telangana Board norms.

Toll Free No. 1800114242 Web: www.fiitjee.com www.facebook.com/fiitjeeindia123 www.twitter.com/fiitjee www.youtube.com/fiitjeeltd www.instagram.com/fiitjee.india www.linkedin.com/company/fiitjee/

FIITJEE Students in **TOP 50** All India Ranks in **JEE Advanced 2018** from Classroom / Integrated School Programs

All India Rank **3**



Kalash Gupta
Four Year Classroom Program

All India Rank **5**



M S K Manohar
PINNACLE - Two Year Integrated Program

AIR **13**



Saumya Goyal
Intensive Contact Program

AIR **17**




Shubham Gupta
Intensive Contact Program

AIR **18**



Shivam Goel
Two Year Classroom Program

AIR **19**



Shalabh Gupta
Four Year Classroom Program + UDAYA - One Year Classroom Program

AIR **22**



Vipul Agarwal
Intensive Contact Program

AIR **25**



Anuj Srivastava
PINNACLE - Two Year Integrated School Program

AIR **29**



Parth Lataria
Intensive Contact Program

AIR **32**



Shreya Pathak
Four Year Classroom Program

AIR **33**



Arjun S Kashettiwar
PINNACLE - Two Year Integrated School Program

AIR **35**



Ayush Garg
Four Year Classroom Program + UDAYA - Two Year Classroom Program

AIR **43**



Adway Girish
Four Year Classroom Program

AIR **44**



Pratyush Agarwal
Two Year Classroom Program

AIR **48**



Nimay Gupta
Four Year Classroom Program

JEE Main 2018

10544 FIITJEE Students from all Programs qualified for JEE Advanced 2018

XII Boards 2018

All India Topper in CBSE (Science Stream) & ISC Board. **1634** Students Scored ≥ 95% & **4468** Students Scored ≥ 90% agg. marks

KVPY (Stage-I) 2018-19

Total **959** FIITJEE Students have qualified for KVPY (Stage - II), 2019

KVPY Fellowships 2017-18

Total **698** FIITJEE Students were awarded KVPY Fellowships

Int. Olympiads 2017 & 2018

Gold Medals : **4**, Silver Medals : **3** & Bronze Medals : **3**

NTSE Scholarships 2018

All India Topper in NTSE. Total **401** FIITJEE Students were awarded NTSE Scholarships

All our results are from General Category only

FIITJEE - THE PREMIER INSTITUTE FOR IIT-JEE and More...

FIITJEE Tests : **3rd February 2019**

FINANCIAL ASSISTANCE ELIGIBILITY TEST
For Students going to **Class IX, X, XI & XII**
http://admissiontest.fiitjee.com

IITGenius For Students going to **Class IX, X, XI & XII**
It's time to award the Genius in You and get set for **Free Education at any IIT** without joining FIITJEE !
www.iitgenius.com

FORTUNATE 40 For Students going to **Class IX & XI**
A Social Initiative by FIITJEE to help the Economically Deprived
www.fiitjee.com/f40.htm

ఈనాడు

అవినీతిపై పోరు ఇలాగేనా?

ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా ఎనిమిదిసార్లు పార్లమెంటు గర్భకుహరంలోనే భ్రూణ హత్యకు గురైన శాసనమది. ఎట్టకేలకు చట్టరూపం దాల్చిన- లోక్‌పాల్ వ్యవస్థ నిర్మాణంలో జరుగుతున్న అలవిమాలిన జాప్యం, సామాన్య పౌరులనుంచి సర్వోన్నత న్యాయపాలిక దాకా అన్ని వర్గాలవారినీ కుపితుల్ని చేస్తోంది. జాతి నవనాడుల్నీ కబళించి తింటున్న అవినీతి మహాజాడ్యంపై ఎత్తిన కత్తిగా లోక్‌పాల్ వ్యవస్థ ఆవిర్భావానికి 2013లోనే పార్లమెంటు ఉభయ సభలూ ఆమోద ముద్ర వేశాయి. రాష్ట్రపతి రాజముద్ర దరిమిలా 2014 ఆరంభంలోనే అది శాసనరూపం దాల్చినా- అయిదేళ్లుగా లోక్‌పాల్ నియామక క్రతువును కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంలో, ఎప్పటికప్పుడు కుంటిసాకులే సంజాయిషీలుగా మారుతున్నాయి. సెప్టెంబరు చివరివారంలోనే లోక్‌పాల్ సెర్చ్ కమిటీని ఏర్పాటు చేశామని, తన పని పోకడలకు విధి విధానాల్ని అదే రూపొందించుకొంటుందని కేంద్రం సుప్రీంకోర్టుకు తాజాగా విన్నవించింది. లోక్‌పాల్‌గా సరైన అభ్యర్థి వెతుకులాట ఎంతవరకు వచ్చిందో వివరిస్తూ ప్రమాణపత్రం దాఖలు చేయాలన్న సుప్రీం ధర్మాసనం ఆదేశం- కాలయాపన ఎత్తుగడల్ని మరే మాత్రం ఉపేక్షించేది లేదన్న సందేశాన్ని ప్రస్ఫుటీకరిస్తోంది. ఎప్పటిలోగా లోక్‌పాల్ నియామకం పూర్తి చేయనున్నదీ కాలపట్టిక సమర్పించాలంటూ నిరుడు సుప్రీంకోర్టు కోరినప్పుడు- కేంద్రం సమర్పించిన ప్రమాణపత్రం ఏమాత్రం సంతృప్తికరంగా లేదని న్యాయపాలిక తూర్పారబట్టడం తెలిసిందే. సుప్రీంకోర్టు పోరగా పోరగా సెర్చ్ కమిటీ ఏర్పాటుకు తీరిక చేసుకొన్న కేంద్రం- దానికి నిర్దిష్ట కాలావధులు నిర్ధారించకపోవడం విస్మయపరచేదే! లోక్‌పాల్ చట్టంలోని నాలుగో సెక్షన్ అనుసారం, లోక్‌పాల్ నియామక కసరత్తు యావత్తూ పారదర్శకంగా జరగాల్సి ఉండగా సంబంధిత వివరాలేవీ వెబ్‌సైట్లో పొందుపరచనే లేదని వ్యాజ్యం దాఖలు చేసిన స్వచ్ఛంద సంస్థ కామన్ కాజ్ ఆరోపిస్తోంది. అవినీతి అంతానికి పంతం పట్టి అధికారానికి వచ్చిన భాజపా ప్రభుత్వం- లోక్‌పాల్ నియామక వ్యవహారంలో ఇంతగా పిల్లిమొగ్గలేయడం ఏమిటి?

సర్కారీ కొలువులు అవినీతి కొలుపులవుతున్న వాస్తవాల వెలుగులో మొట్టమొదటిసారి అయిదున్నర దశాబ్దాల క్రితం లోక్‌పాల్ తరహా వ్యవస్థ ప్రస్తావన పార్లమెంటులో చర్చకు వచ్చింది. పిమ్మట మూడేళ్లకు మొరార్జీ దేశాయ్ సారథ్యంలోని మొట్టమొదటి పాలన వ్యవహారాల సంస్కరణల సంఘం కేంద్ర, రాష్ట్రాల స్థాయిల్లో స్వతంత్ర వ్యవస్థల్ని ఏర్పాటు చేసి ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా ప్రభుత్వాధికారులందరిపైనా వచ్చే ఫిర్యాదులపై దర్యాప్తు జరిపించాలని సూచించింది. అందుకు అనుగుణంగా 1968లో పెట్టిన మొట్టమొదటి బిల్లు ఆమోదానికి నోచుకోనే లేదు. 2జీ, బొగ్గు కుంభకోణాలతో లక్షల కోట్ల రూపాయల ప్రజాధనానికి బొర్రెపెట్టిన అవినీతి అనకొండల విశ్వరూపం జాతి జనుల్ని దిగ్భ్రాంతపరచిన వేళ, అన్నాహజారే ఆందోళన నేపథ్యంలో ప్రజాగ్రహానికి వెరచి యూపీఏ ప్రభుత్వం- కాలంతో పోటీపడి మరీ లోక్‌పాల్ బిల్లును నెగ్గించింది. ఎన్నికల్లో లబ్ధిని ఆశించి, కొన్ని సర్దుబాట్లకు సిద్ధపడి నాటి ఎన్‌డీఏ కూటమి మద్దతు పలకడంతో లోక్‌పాల్ చట్టం గట్టెక్కినా- యూపీఏ జమానాలో లోక్‌పాల్ నియామక ప్రక్రియ ఒడుదొడుకుల లోనైంది. సొంతంగా భాజపాకే విస్పష్ట మెజారిటీ దఖలుపడి ఎన్‌డీఏ సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా- లోక్‌పాల్ నియామక ప్రక్రియలో పాల్గొనవలసిన 'ప్రధాన ప్రతిపక్షనేత' ఎవరూ లేరన్న మిషతో కాలం దొర్లించేసింది. 2017 ఏప్రిల్లో- ప్రతిపక్షనేత లేరన్న కారణంతో లోక్‌పాల్ నియామకాన్ని అటకెక్కించాల్సిన అవసరం లేనేలేదని సుప్రీంకోర్టు స్పష్టీకరించినా, కేంద్రంలో కదలిక మెదలలేదు. అవినీతి మీద పోరాటం ఉత్తుత్తి మాటలకే పరిమితమైనంత కాలం- బడుగు జనం నోటి దగ్గర ముద్దను కబళించేస్తున్న లంచావతార రాబందుల విశ్శృంఖలత్వానికి అడ్డూఆపూ ఉండదు!

కేంద్రం అందించిన జాబితానుంచే లోక్‌పాల్ పదవికి, ఆ వ్యవస్థలోని ఇతర సభ్యుల స్థానాలకు అర్హుల్ని సెర్చ్ కమిటీ గుర్తించాలని సంబంధిత చట్టంలోని 10(1) నిబంధన చాటుతోంది. లోగడ సెర్చ్ కమిటీ సారథిగా నియమితులైన జస్టిస్ కేటీ థామస్- ఆ అసంబద్ధ నిబంధనను ఎత్తిచూపుతూ పదవికి రాజీనామా చేయడంతో, తగు సవరణలు చేపట్టదలచినట్లు కేంద్రం 2014 మే నెలలోనే సుప్రీంకోర్టుకు తెలిపింది. లోక్‌పాల్ సెర్చ్ కమిటీ స్వేచ్ఛను శృంఖలాలు బిగిస్తున్న ఆ నిబంధనను తొలగించింది లేనిదీ- అగమ్యం. సెప్టెంబరు చివరివారంలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రంజనా ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలో నియుక్తమైన సెర్చ్ కమిటీ- తొలి రెండున్నర నెలల్లో ఒక్కసారి కూడా భేటీ కాలేదన్నది సమాచార చట్టం ద్వారా బట్టబయలైన వాస్తవం! ప్రధానమంత్రి సహా అన్ని విభాగాల ప్రజాసేవకుల్నీ లోక్‌పాల్ పరిధిలోకి తెచ్చిన చట్టం- నిజాయతీపరులైన అధికారులకు తగు రక్షణలు కల్పిస్తూనే, అవినీతి మోతుబరుల తాట తీసే పటిష్ఠ నిబంధనలతో పరిపుష్టమై ఉంది. కేంద్ర స్థాయిలో లోక్‌పాల్, రాష్ట్రాల పరిధిలో లోకాయుక్తలు- విస్పష్ట కాలావధులలోగా దర్యాప్తు విచారణల్ని పూర్తి చేయడంతోపాటు, అవినీతి ఆస్తుల జప్తు అధికారాన్నీ కలిగి ఉండటం, చేతివాటంగాళ్ల వెన్నులో వణుకుపుట్టిస్తుంది. ఇంతకాలం అవినీతి నేరారోపణలపై చట్టసభల్లో సాగిందంతా రాజకీయ రచ్చకాగా, తగు సాధన సంపత్తితో లోక్‌పాల్ వ్యవస్థను అవతరింపజేస్తే- అక్షరాలా చట్టం తన పని తాను చేసుకుపోయే మంచి కాలం రాబోతుంది. సర్కారీ అవినీతి కళ్మలాన్ని ప్రక్షాళించే మేలిమి చొరవను వాయిదాలు వేస్తూ- ప్రభుత్వ అధికారగణంపై అవినీతి దర్యాప్తు కోసం ముందస్తు అనుమతి తప్పనిసరి చేస్తూ తెచ్చిన సవరణ, జాతి విశాల హితానికే శరాఘాతమవుతోంది!

వాణిజ్య యుద్ధంలో సంధికాలం



అమెరికా-చైనా వాణిజ్యయుద్ధం కచ్చితంగా ఉభయులకూ నష్టమే. ఇది 2019-20లో ప్రపంచాన్ని మహామాంద్యంలోకి నెడుతుందని విధానకర్తలు, విఖ్యాత ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. అంతవరకు చేతులు ముడుచుకుని కూర్చోకుండా పరిస్థితిని చక్కదిద్దడానికి జపాన్ నాయకత్వ బాధ్యత స్వీకరించింది. జపాన్ చొరవతో రూపుదిద్దుకున్న సమగ్ర, ప్రగతిశీల విశాల పసిఫిక్ భాగస్వామ్య ఒప్పందం (సీపీటీపీపీ) 2018 డిసెంబరు 30 నుంచి అమలులోకి వచ్చింది. సీపీటీపీపీలో జపాన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, సింగపూర్ సహా మొత్తం 11 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ఈ దేశాల స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 13.5 లక్షల కోట్ల డాలర్లు. ఇది ప్రపంచ జీడీపీలో 13.4 శాతానికి సమానం. చైనాను కట్టడి చేయడానికి ఒబామా హయాములో రూపుదిద్దుకున్న టీపీపీకి ట్రంప్ నీళ్లు వదలడంతో సీపీటీపీపీ రంగప్రవేశం చేసింది.

ఆసియా దేశాలకు లబ్ధి

ట్రంప్ హయాములో అమెరికా-చైనాలు వాణిజ్య సమరాన్ని ఎంత సాగలాగితే కొన్ని దేశాలకు అంత మేలు. ఈ రెండు దేశాల వ్యాపారంలో కొంత ఇప్పటికే ఐరోపా సమాఖ్యకు, జపాన్, దక్షిణ కొరియా, భారత్ వంటి ఆసియా దేశాలకు మళ్లుతోంది. 2017 ఏప్రిల్- 2018 మార్చి మధ్య చైనాకు జపాన్ ఎగుమతులు 18.3 శాతం పెరిగాయి. అవి అంతక్రితం సంవత్సరం కన్నా 7.5 శాతం ఎక్కువ. మరోవైపు 2007 నుంచి చైనాకు అమెరికా ఎగుమతులు 8.5 శాతం మేర తగ్గాయి. అమెరికా-చైనా వాణిజ్య సమరం నుంచి భారత దేశమూ భారీగా లబ్ధి పొందవచ్చు. ఇంతవరకు అమెరికా నుంచి పత్తిని దిగుమతి చేసుకున్న చైనా, ఇప్పుడు కొంతభాగాన్ని భారత్ నుంచి దిగుమతి చేసుకొంటోంది. దీంతో గత రెండు నెలల్లో చైనాతో భారత్ వాణిజ్య లోటు కాస్త తగ్గింది. చైనా నుంచి ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా సుంకాలు పెంచగా, చైనా అమెరికా నుంచి సోయా దిగుమతులను తగ్గించేస్తూ బ్రెజిల్ నుంచి దిగుమతులను పెంచుతోంది.

పోటాపోటీ సుంకాలు తమ వ్యాపారానికి గండి కొడుతున్నాయని చైనాలో కార్యకలాపాలు సాగిస్తున్న 430 అమెరికన్ సంస్థలు వాపోతున్నాయి. ప్రస్తుతం చైనా సరకుల ఎగుమతుల్లో 43 శాతం అక్కడ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ)తో నడిచే బహుళజాతి సంస్థల ద్వారా జరుగుతోంది. ట్రంప్ సుంకాల వల్ల ఈ కంపెనీల ఎగుమతులు ఖరీదైపోతున్నాయి. అందుకే అవి నెమ్మదిగా తమ ఉత్పత్తి కార్యకలాపాలను వియత్నాం, మలేసియా, సింగపూర్‌లకు తరలించవచ్చని నోమురా సంస్థ తెలిపింది. వాటి తరవాత అవకాశం భారత్‌కు వస్తుంది. భారతదేశంలోని సువిశాల విపణి అతి పెద్ద ఆకర్షణీయ అంశం. చైనాలో తయారుచేసి అమెరికా తదితర దేశాలకు కార్లను, విడిభాగాలను ఎగుమతి చేస్తున్న కంపెనీలు ఇప్పటికే కొన్ని ఉత్పత్తి కార్యకలాపాలను మలేసియా, థాయిలాండ్‌లకు తరలించాయి. మలేసియాలో 800 ఆటో విడిభాగాల యూనిట్లు ఉండటం దీనికి కారణం. ట్రంప్ సుంకాల తాకిడి నుంచి తప్పించుకోవడానికి చైనాతో పాటు బహుళజాతి సంస్థలు కూడా ఆసియా దేశాల్లోని చౌక కార్మిక శక్తిని వినియోగించుకోవాలని అనుకొంటున్నాయి. నిరుడు సెప్టెంబరుకల్లా అంతర్జాతీయ సంస్థలు ఇండొనేసియాలో కొత్త ప్రాజెక్టులకు 2,800 కోట్ల డాలర్ల పెట్టుబడులను ప్రకటించాయి. వియత్నాం కొత్త ప్రాజెక్టులకు 1,800 కోట్ల డాలర్లు, ఫిలిప్పీన్స్‌కు 1,200 కోట్ల డాలర్లు అందించాలని అవి యోచిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి వ్యాపార, అభివృద్ధి సభ ప్రకటించింది.

నేడు రేపు చైనా-అమెరికా చర్చలు

మారుతున్న పరిణామాలను సద్వినియోగం చేసుకోవాలంటే మొదట భారతీయ విధానకర్తలు చైనా-అమెరికా వాణిజ్య యుద్ధం నుంచి గరిష్ఠ లబ్ధి పొందడానికి వ్యూహరచన చేయాలి. ఎక్కడెక్కడ అవకాశాలు ఉన్నాయో కనిపెట్టాలి. ప్రస్తుతం చైనా నుంచి అమెరికా ఎక్కువగా మొబైల్ ఫోన్లు, టెలికం సామగ్రి, గృహోపకరణాలు, బొమ్మలు, టెలివిజన్లు, సెమీ కండక్టర్లు, పారిశ్రామిక యంత్రాలను దిగుమతి చేసుకొంటోంది. భారత్ వీటిని ఇప్పటికిప్పుడు తయారుచేసి అమెరికాకు ఎగుమతి చేయగల స్థితిలో లేదు. జౌళి, దుస్తులు, ఆటో విడిభాగాలు, కొన్ని రకాల రసాయనాలను ఎగుమతి చేయడం మాత్రం భారత్‌కు సులువే. అన్నింటినీ మించి ఆధునిక వాణిజ్యంలో అన్ని వస్తువులూ ఒకే చోట తయారు కావడం లేదని గుర్తించాలి. ముడిసరకు అంతిమ ఉత్పత్తిగా మారాలంటే మధ్యలో పలు అంచెలు దాటాల్సి ఉంటుంది. ఉదాహరణకు కారు ఇంజిన్ ఒక దేశంలో తయారైతే కారు బాడీ, విడిభాగాలు వేర్వేరు దేశాలు, ప్రాంతాల్లో తయారవుతున్నాయి. అలాగే మొబైల్ ఫోన్ల డిజైన్ ఒకచోట రూపుదిద్దుకుంటే దాని ఉత్పత్తి వేరే దేశంలో జరుగుతోంది. దీన్నే సరఫరా గొలుసు అంటారు. అమెరికా, ఐరోపా, జపాన్, దక్షిణ కొరియా, ఆగ్నేయాసియా. తైవాన్, చైనాలలో ఈ గొలుసులు వ్యాపించి ఉండగా, భారత్ ఇంతవరకు వీటిలో చురుగ్గా భాగస్వామి కాలేదు. నేడు అంతర్జాతీయ వాణిజ్యం దేశాల మధ్యకన్నా కంపెనీల మధ్యనే జరుగుతోంది. ఉత్పత్తిదారు నుంచి అంతిమ వినియోగదారుకు వస్తువులను చేరవేయడంలో కంపెనీలదే ముఖ్యపాత్ర. ముందే చెప్పుకొన్నట్లు కంపెనీలు తమ ఉత్పత్తి, పంపిణీ కార్యకలాపాలను వేర్వేరు దేశాల్లో నిర్వహిస్తున్నాయి. అందుకే పెట్టుబడి విధానాన్ని, వ్యాపార విధానాన్ని వేరు చేసి చూడలేం. ట్రంప్ సుంకాలు పెంచినప్పటి నుంచి అమెరికన్ కంపెనీలు తమ ఉత్పత్తుల విడిభాగాలను చైనా నుంచి కాకుండా ఇతర ఆసియా దేశాల నుంచి తెచ్చుకోవడానికి పెట్టుబడులు పెడుతున్నాయి. భారత్ కూడా క్రమక్రమంగా వీటిని ఆకర్షించ సాగింది. ఐక్యరాజ్య సమితి సులభతర వాణిజ్య సూచీలో భారత్ ర్యాంకు మెరుగుపరచుకున్నా పెద్దనోట్ల రద్దు, వస్తుసేవల పన్ను వల్ల సరఫరా గొలుసులు విచ్ఛిన్నమయ్యాయి. ఈ లోపాలను సరిదిద్దుకునే కార్యక్రమాన్ని భారత్ ఆలస్యంగానైనా మొదలుపెట్టడం హర్షణీయం. ఇంకా ఇతర చర్యలను చకచకా తీసుకొని, తగు నియంత్రణ చట్రాన్ని ఏర్పరచి ఎఫ్‌డీఐకి భారత్‌ను ఆకర్షణీయంగా మార్చాలి.

అగ్రరాజ్యానికే నష్టం

భారతదేశ వ్యాపార తీరుతెన్నుల్లో ఈ మధ్య వచ్చిన ఓ కీలక మార్పును మరింత ముందుకు తీసుకెళ్లాలి. గతంలో భారత ఎగుమతుల్లో 50 శాతం ఉత్తర అమెరికా, ఐరోపా దేశాలకే వెళ్లేవి. ఇప్పుడది 35 శాతానికి తగ్గింది. భారత్ ఇతర విపణులపై దృష్టి సారించి అమెరికా, ఐరోపాలపై ఆధారపడటం తగ్గించుకుంది. ట్రంప్ చలవతో ఆసియాలో తన వ్యాపారాన్ని మరింత పెంచుకునే అవకాశం భారత్‌కు అందివస్తోంది. మొత్తం మీద ట్రంప్ ప్రారంభించిన సుంకాల యుద్ధం చైనాకు, ఆసియా దేశాలకూ ప్రయోజనకరంగా మారే సూచనలున్నాయి. చైనా నుంచి అమెరికా మొబైల్ ఫోన్లు, సెమీ కండక్టర్లను, కంప్యూటర్ హార్డ్‌వేర్ వంటి ఆధునిక వస్తువులను దిగుమతి చేసుకొంటుంటే అమెరికా నుంచి చైనా సోయా వంటి వ్యవసాయ సరకులను కొంటోంది. వీటికోసం అమెరికా మీదనే ఆధారపడనక్కర్లేదు. భారత్, బ్రెజిల్ వంటి దేశాల నుంచీ తేలిగ్గా దిగుమతి చేసుకోవచ్చు. వాణిజ్య యుద్ధం ముదిరేకొద్దీ చైనాకన్నా అమెరికాయే ఎక్కువ నష్టపోతుందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. పైగా చైనా సుంకాల విషయంలో పట్టువిడుపులు ప్రదర్శిస్తోంది. ఏదిఏమైనా ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనాలు వాణిజ్య సమరాన్ని కొనసాగించడం ప్రపంచానికి మంచిది కాదు. వ్యవహారం చేయిజారిపోక ముందే అమెరికా, చైనాలు సంధికి ప్రయత్నించడం అందరికీ మంచిది. నేడు రేపు బీజింగ్‌లో జరగనున్న అమెరికా-చైనా చర్చల్లో రెండు పక్షాలూ వివేకం ప్రదర్శించి సామరస్యం కుదుర్చుకుంటాయని ఆశిద్దాం!

- కైజర్ అడపా

భారత్‌కు సదవకాశం



చైనాకు అమెరికా నిలిపేసిన 100 సరకుల ఎగుమతులను భారత్ భర్తీ చేసి లబ్ధి పొందవచ్చునని వాణిజ్య శాఖ గుర్తించింది. గత ఏడాది ఈ సరకుల ఎగుమతుల విలువ 13,000 కోట్ల డాలర్లు (దాదాపు రూ. 8,70,000 కోట్లు). భారత్ అందులో కొంత భాగాన్ని ఎగుమతి చేయగలిగినా చైనాతో మన వాణిజ్య లోటు గణనీయంగా తగ్గుతుంది. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ రూ. 86,015 కోట్ల విలువైన సరకులను చైనాకు ఎగుమతి చేయగా, చైనా మనకు రూ. 4.91 లక్షల కోట్ల మేరకు ఎగుమతులు చేసింది. అంటే భారత్ వాణిజ్య లోటు నాలుగు లక్షల కోట్ల రూపాయలు. అమెరికా నుంచి నిలిచిపోయిన ఎగుమతులను భర్తీ చేయడం ద్వారా భారత్ ఈ లోటును తగ్గించుకోవాలి. ఉదాహరణకు అమెరికా నిరుడు రూ. 70 కోట్ల విలువైన తాజా ద్రాక్ష పండ్లు, పింజ తీసిన పత్తి, క్యూరింగ్ చేసిన పొగాకు, ల్యూబ్రికెంట్లు, బెంజీన్ వంటి రసాయనాలను చైనాకు ఎగుమతి చేసింది. మరో రూ. 70 కోట్లకు పైగా విలువైన కమలా పండ్లు, అక్రోట్, బాదం, జొన్న, మొక్కజొన్న, పేస్ట్రీ తయారీకి ఉపయోగించే గోధుమలనూ ఎగుమతి చేసింది. సుంకాల యుద్ధం వల్ల నిలిచిపోయిన ఈ ఎగుమతులను భారత్ చేపట్టవచ్చు. అమెరికా నుంచి వచ్చే ఈ సరకులపై చైనా 15-25 శాతం సుంకాలు విధించేది. ఇవే సరకులు ఇతర దేశాల నుంచి వస్తే 5-10 శాతం సుంకం చెల్లిస్తే చాలు. అదీ కాకుండా ఆసియా పసిఫిక్ వ్యాపార ఒప్పందం (ఆప్టా)లో భాగస్వామి కావడం వల్ల భారత్‌కు పలు సరకులపై ఆరు నుంచి 35 శాతం వరకు రాయితీలు లభిస్తున్నాయి. దీన్ని భారత్ సద్వినియోగం చేసుకోవాలి. 2017-18లో భారత్ ప్రపంచ విపణికి 14.36 కోట్ల డాలర్ల విలువైన మొక్కజొన్నలు ఎగుమతి చేయగా, అదే సంవత్సరం చైనా 60 కోట్ల డాలర్ల విలువైన మొక్కజొన్నలను దిగుమతి చేసుకుంది. అంటే చైనాకు మన ఎగుమతులు పెంచడానికి సమృద్ధిగా అవకాశాలున్నాయి. అమెరికా మొక్కజొన్నపై చైనా 25 శాతం సుంకం విధిస్తుంటే, ఆప్టా సభ్య దేశాలు మాత్రం సుంకం కింద పైసా చెల్లించనక్కర్లేదు. ఇది భారత్‌కు ఎంతో మంచి అవకాశం. 2025కల్లా భారతదేశ ఎగుమతులను రెట్టింపు చేయాలన్న లక్ష్యాన్ని సాధించడానికి చైనా విపణి ఎంతో ఉపయోగపడుతుంది.

గోకులమూ నవ్వింది...

'అదిగో ద్వారక' 'ఆలమందల విగో... అందందు గోరాజు' అని అర్జునుడు రంగస్థలం మీద ఎంతో ఉత్సాహంగా పాడుతుంటే, వీధుల్లో గోవులు మందలు మందలుగా తిరుగుతున్నట్లు అందరి మనోనేత్రాల ముందు గోచరిస్తుంది. ఆలోచనలను వెనక్కి మళ్లిస్తే, అది ద్వాపరయుగం కాబట్టి సరిపోయింది. ద్వారక కాబట్టి సరిపోయింది. అదే ఇప్పటి ద్వారకా నగరమైతే- అమ్మబాబోయ్... ఎన్ని ప్రమాదాలు! వాటి గురించి అప్పటి అర్జునుడికి తెలీదు కానీ, ఇప్పటి (యోగి) ఆదిత్యనాథ్‌కు బాగా తెలుసు.

గోవులకు ప్రమాదాలు, గోవుల వల్ల ప్రమాదాలు- ఆయనకు కొట్టిన పిండి. కలలో ఆవు కనబడ్డా 'ఆవో' అనడం ఆయనకు అలవాటు. ఇలలో సమస్యను ఎవరు లేవనెత్తినా పరిష్కారం కోసం ఆయన 'ఆవు'రావురుమంటుంటారిప్పుడు.

భరత భూమి తనచుట్టూ తాను తిరుగుతూ గోవుల చుట్టూ తిరుగుతోంది. గోజాడ గురించి తెలుసుకోవాలంటే గురజాడను కదిలించినా చాలు. ఆయన అందించిన కన్యాశుల్కంలో గిరీశం, ఆయన శిష్యుడు- వెంకటేశంల మధ్య ఉవ్వెళ్లూరించే సంభాషణ వింటే ఆవు అంతెత్తున కనిపిస్తుంది. 'ఆవురా' అనిపిస్తుంది.

గిరీశం ఆవులిస్తే పేగులు లెక్కపెట్టే రకం. 'క్రియేషన్ అనగానేమి?' అని గిరీశం తన ప్రియశిష్యుడు వెంకటేశాన్ని ప్రశ్నించగానే తడుముకోకుండానే 'ఆవులు' అనేశాడు! ఆ తరవాత గిరీశానికి తిక్క రేగగానే 'క్రియేషన్ అంటే ప్రపంచం. నేను, యెదట ఆవులు కనబడితే ఈ ఆవు పెరుగు యీ నెలరోజులే కదా తినడవని ఆలోచిస్తూన్నాను' అని వెంకటేశం వివరణా ఇచ్చేశాడు. ఒక్క ఆవు పెరుగేమిటి, పాలేమిటి, ఆవు మూత్రమేమిటి, ఆవు పేడ ఏమిటి, ఆవుకు సంబంధించినదేదీ కాదేదీ ప్రపంచానికి అనర్హం! అవునవును... ఆవు అమూల్యం అనాల్సిందే, తప్పదు.

దేవతలకు ఉన్నట్లే గోవులకూ అసంఖ్యాకమైన భక్తులున్నారు. వందమంది మనుషుల ప్రాణాలు పోయినా ఫర్వాలేదు, ఒక్క ఆవు ఉసురు తగలకూడదనే గో తీవ్రవాదులూ ఉన్నారు. గోరక్షణ పేరుతో సామూహికంగా మనుషులను కొట్టి చంపడం నేరమని కొన్ని నెలలక్రితం సుప్రీంకోర్టు సైతం స్పష్టం చేసింది. ఇటువంటి దాడులను అరికట్టే బాధ్యత రాష్ట్రప్రభుత్వాలదేనని తేల్చిచెప్పింది. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోకూడదని హెచ్చరించింది. అయితే గోవధకు పాల్పడినవారికి మరణశిక్ష విధించాలని కోరుతూ భాజపా నాయకుడు సుబ్రమణ్యంస్వామి ఏడాది కిందట రాజ్యసభలో ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టారు. ఇదంతా మనుషుల బారినుంచి గోవులను రక్షించడానికి సంబంధించినదైతే, గోవులవల్లా కలిగే ఇబ్బంది ఇంకో సమస్య అయి కూర్చుంది... కాదు వీధుల్లో నిలుచుంది. ఈ సమస్య ఉత్తర్ ప్రదేశ్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

యజమానులు గోవులను ఏడాదిలో ఆర్నెల్లపాటు పోషించి, ఆ తరవాత వాటిని వాటి మానాన వీధుల్లోకి వదిలేస్తున్నారు. ఈ ఆవుల స్వైరవిహారం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అంతేకాదు, ఆవులు పంట పొలాల్లోకి వెళ్లి పంటలను ధ్వంసం చేస్తున్నాయనీ రైతన్నలు రగిలిపోతున్నారు.



ఉత్తర్ ప్రదేశ్‌లోని అలీగఢ్, మథుర, ఆగ్రా లాంటి జిల్లాల్లో వీధి గోవులను తీసుకెళ్లి పాఠశాలల్లో, ప్రభుత్వ మైదానాల్లో కట్టిపడేసి అమ్మయ్య అనుకుంటున్నారు. ఈ సమస్య పరిష్కారమయ్యేంత వరకు తరగతులను జరగనిచ్చేది లేదన్నారు. దీనికి పిల్లలు సంతోషించినా, సమర్థించినా, వారి పెద్దలకు పెద్ద సమస్య అయ్యింది.

సహజసిద్ధంగా గోభక్తుడు, మఠాధిపతి అయిన ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు ఇది తలనొప్పిగా మారింది. కింకర్తవ్యం అనుకున్నారు. అంతే, మెరుపు లాంటి ఆలోచన వచ్చింది. వీధిపాలైన గోవులను తక్షణమే గోశాలలకు తరలించాలని ఇందుకు జనవరి 10వ తేదీ గడువు అని ఆగమేఘాల మీద ఆదేశించారు. గోశాలల్లోకి ఆవుల్ని తోలి, వాటిని తీసుకువెళ్తామని ఎవరైనా వచ్చి అడిగితే, వాటిని ఇవ్వడానికి భారీయెత్తున జరిమానా విధించాలనీ చెప్పారు. దాంతో 'ఆవో, రేవో' తేల్చుకోవలసిన పరిస్థితి అధికారులకు తలెత్తింది.

ఇంత ఇబ్బంది తొలగడానికి ఎంత సిబ్బంది అవసరమన్నదీ ప్రశ్నార్థకమైంది. గోశాలల నిర్వహణ ఎలా అన్నదానికి ఆదిత్యనాథ్ మంత్రివర్గం ఓ మార్గం కనిపెట్టింది. తాగేవాడే కడతాడు తాళ్లపన్ను అన్నమాట ఎలాగూ ఉంది. గోవుల సంక్షేమం కోసం ఎక్సైజ్ వస్తువుల మీద అరశాతం సెస్సు విధించింది. రహదారుల మీద వసూలు చేసే టోల్ మీదా ఇదే పన్ను విధించారు. రాష్ట్రమంతటా మండీ పరిషత్‌ల ఒక్కశాతం సెస్సు రెట్టింపు చేశారు. గోశాలల కోసం ప్రభుత్వం స్థానిక సంస్థలకు వంద కోట్ల రూపాయలు మంజూరు చేసింది! ఎన్ని విధులు... ఎన్నెన్ని నిధులు?

ఇదిలా జరుగుతుంటే- 'ఆవా... ఎప్పుడు వచ్చితీవు, ఎల్లరున్ సుఖులే కదా' అని ప్రశ్నిస్తే- ఆవు ఏం మాట్లాడుతుంది? 'మా ముసలి ఆవుల్ని ఇకముందు అమ్మేయరు... మమ్మల్ని చంపడానికి వధ్యశిలల మీదికి తీసుకువెళ్లలేరు. అక్రమ రవాణా చేయలేరు' అని ఆశతో అంటుంది. మంచిగా ఉన్నంతవరకే ఆవు ఆవు అంటారు... ఆ పరిస్థితి లేకపోతే చావు చావు అంటారు. ఇకపై ఇది చెల్లదులే అని చెబుతుంది.

ఎటొచ్చీ విమర్శకుల కత్తికి రెండువైపులా పదునుంటుంది. చిత్రమేమిటంటే ఆదిత్యనాథ్ గోరక్షణ విధానాలు ఆయన ప్రభుత్వ ఆత్మరక్షణ విధానాలే, అవన్నీ వట్టి ప్రహసనాలే అని 'చేతులెత్తి' తిట్టిపోసేవాళ్లూ ఉన్నారు. ఎన్నో ఆవులు ఆకలిదప్పులతో, చలితో ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయని వారు కరవు లేకుండా ఏకరువు పెడుతున్నారు.

ఉత్తర్ ప్రదేశ్‌లో 'ఏ వీధి చూసినా, ఏమున్నది గర్వకారణం' అని 'ముందు గోవు, వెనక గోవు, కుడి ఎడమల గోవు గోవు' అనీ అన్నిపక్షాల వాళ్లూ గో నామస్మరణ చేస్తున్నాయి. గోవు అంటే నడిచి వచ్చే ధర్మంగా హిందూ సంప్రదాయవాదులు భావిస్తుంటారు. 'గోవో రక్షతి రక్షితః' అనీ అంటారు. గోవును మనం రక్షిస్తే ఆ గోవు మనల్ని రక్షిస్తుందని అర్థం చెబుతారు.

అవిగో అల్లవిగో అన్నట్టు కనుచూపు మేరలో దేశమంతటా లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ 'ఓట్లు ఉన్న మాకు లేనంత రక్షణ, ఓటుహక్కు లేని మూగజీవి అయిన గోవుకు ఉన్నదే' అని ఆక్రోశించేవాళ్లూ ఉన్నారు.

అయినా ఏ గోవు ఎన్ని ఓట్లు తెస్తుందో ఎవ్వరికెరుక?

- శంకరనారాయణ

ఈనాడు లేఖలు

ఏకగ్రీవ గ్రామాలపై నిఘా

పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవ ఎన్నికలకు ఆర్థిక ప్రోత్సాహకాలను ప్రభుత్వం ప్రకటించింది. దీనివల్ల కొన్ని గ్రామాల్లో బలవంతపు ఏకగ్రీవానికి ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. దీంతో ఆర్థికంగా వెనకబడిన ఆశావహ అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలబడటానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ఇలాంటి పరిణామాలు ప్రజాస్వామ్యానికి చేటు చేస్తాయి. బలవంతపు ఏకగ్రీవ ఎంపికపై చర్యలు తీసుకుంటామని ఎన్నికల సంఘం ప్రకటించడం సానుకూల పరిణామం. అనేక గ్రామాల్లో ఓటర్ల ఆదరణ పొందగల అభ్యర్థులు ఇద్దరు ఉండవచ్చు. కనుక ఎన్నికను ప్రోత్సహించాలి. 80 శాతం ఓట్ల ఆధిక్యతనూ 'ఏకగ్రీవం'గా పరిగణించాలి. ఏకగ్రీవ ఎంపిక జరిగిన గ్రామాల్లో ఎన్నికల సంఘం సునిశిత పరిశీలన జరపాలి. బలవంతపు ఏకగ్రీవాలపై ఉక్కుపాదం మోపాలి.

- రాజు కసుపోజుల,
ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

గ్రూప్-I ప్రకటన ఎప్పుడు?

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి అయిదేళ్లవుతోంది. ఇప్పటివరకు ఒక్క గ్రూప్-1 ఉద్యోగ నియామక ప్రకటననైనా ప్రభుత్వం జారీచేయలేదు. దీనివల్ల ఉన్నతాధికారులుగా ఎంపికై ప్రజాసేవ చేయాలనుకొంటున్న అనేకమంది ప్రతిభావంతుల ఆశలు నీరుగారిపోతున్నాయి. ఎన్నికలకు ముందు ఆరు నెలలుగా అదుగో ఇదుగో ప్రకటన అంటూ ఊరించారు. కొత్త జోనల్ వ్యవస్థ కారణంగా ఆలస్యమైందని వివరణ ఇచ్చారు. తెలంగాణలో నియామక ప్రకటన ఆలస్యమైనందువల్ల వయసుమీరి అభ్యర్థులు అవకాశాలను కోల్పోతున్నారు. కనుక వయసు సడలింపుతో సహా ఉద్యోగ ప్రకటన సత్వరం జారీ చేసి నిరుద్యోగ అభ్యర్థులకు ప్రభుత్వం సాంత్వన కలిగించాలి.

- కె. శేఖర్‌బాబు, హైదరాబాద్

దానశీలి

లోకంలో చాలామంది 'దానశీలి' గౌరవం పొందేవారుంటారు. కానీ, దానశీలం కలవారు బహుఅరుదు.

దానం చెయ్యడం స్వభావంగా ఉండాలి. లేక నియమంగానో వ్రతంగానో ఉండాలి. అప్పుడే ఆ వ్యక్తి దానశీలి అవుతాడు. దాత అనిపించుకుంటాడు. దయాగుణమున్న వ్యక్తే దాత కాగలడు. 'పేరు 'దయానిధి' అని ఉండటం కాదు. మనసు దయతో నిండి ఉండాలి.

దాతకు విచక్షణ ఉండాలి. వ్యసనపరుడికి దానం చేస్తే దుర్వినియోగమవుతుంది. కాబట్టి, అతడికి ఇవ్వనక్కరలేదు. ఇది విచక్షణ.

దానం విషయంలో కులమతాల్ని పట్టించుకోకూడదు. ఆకలి, దాహం, రోగంతో బాధపడేవారిపట్ల ఎలాంటి భేదభావం చూపరాదు. వారిని తక్షణం ఆదుకోవాలి.

దానం అంటే ధనమే కానక్కర్లేదు.

కనక, వస్తు, వాహనాలు, కన్యలు, సంపదలు, రాజ్యం కూడా దానాల జాబితాలోకి వస్తాయి. కర్ణుడికి దుర్యోధనుడు అంగరాజ్యాన్ని దానం చెయ్యడం ఇందుకు ఉదాహరణ.

విద్యాదానం మహత్తరమైనది. అది జీవితకాల సంపద. ప్రాణదానం లోకోత్తరమైనది. అర్జునుడు మినహా మిగతా పాండవులకు కర్ణుడు ప్రాణదానం చేశాడు. ఆంజనేయుడు సంజీవని తెచ్చి లక్ష్మణుడికి ప్రాణదానం చేయడం రామాయణంలో ప్రముఖ ఘట్టం.

ప్రచారంకోసం దానం చేస్తే ఫలితం లభించదు. 'భగవంతుడు దయతో నాకు అనుగ్రహించినదాన్ని అవసరార్థికి మన స్ఫూర్తిగా సమర్పిస్తున్నాం' అనుకుంటూ ఇవ్వాలి. మనకు భగవంతుడే అన్నీ ఇస్తున్నాడు. కాబట్టి, మనదంటూ ఏమీలేదు. సమబుద్ధి, సమర్పణభావం, త్యాగబుద్ధి- దానశీలికి ఉండి తీరాల్సిన లక్షణాలు. అవి లేకపోతే, ఇచ్చేది దానం అనిపించుకోదు.

దానం దైవలక్షణం.

ఎందుకంటే- భగవంతుడే మహాదాత.

దానపుణ్యం వల్ల ఉత్తమగతులు కలుగుతాయని మన విశ్వాసం. మన నుంచి దానం పొందినవారి ఆశీస్సులకు అమోఘమైన శక్తి ఉంటుంది. మన క్షేమం గురించి వారి ప్రార్థనలు, ఆశీస్సులు తప్పక ఫలిస్తాయని పెద్దలు చెబుతారు.



కోటీశ్వరుడు పదో వందో దానం చేయడం గొప్పకాదు. తనకు కొద్దిగా ఉన్నా అందులో అధికభాగం ఇవ్వడమే దానబుద్ధి. తనకు ప్రాణప్రమాదం ఉన్నా కవచకుండలాలను ఒలిచి ఇవ్వడం వల్లనే సూర్యవరప్రసాదితుడు దానకర్ణుడయ్యాడు.

నిస్వార్థబుద్ధితో, పరిమితులు విధించుకోకుండా ఇచ్చేదే నిజమైన దానం. ఇష్టమైతే ఇచ్చేది, లేకపోతే తిరస్కరించేది దానం కాదు. ప్రతిఫలం, ప్రయోజనం ఆశిస్తూ ఇచ్చేదీ దానం కాదు. అది రుణంతో సమానం.

అవసరార్థి అడిగితే ఇచ్చేది దానం. అవసరాన్ని గుర్తించి అడగకపోయినా చేసేది ఉపకారం. ఈ ప్రపంచంలోకి ఎవరూ ఏమీ తీసుకురారు. అలాగే తమతో ఏ వస్తువూ తీసుకుపోలేరు. ఇక్కడివన్నీ ఇక్కడ వదిలేసేవే.

పాప పుణ్యాలనే ఇరుముడులే మన వెంట వస్తాయంటారు. వాటిని సత్కర్మలద్వారా జ్ఞానాగ్నిలో దగ్ధం చేసుకోవాలి. అప్పుడు పరిశుద్ధాత్మగా ఎలాంటి బంధనాలూ లేకుండా అంతర్యామితో జతకూడి ఉంటుందని, అదే మోక్షమని చెబుతారు.

మనలోని దుర్గుణాలను దహిస్తూ, సద్గుణాల ప్రేరణతో దానశీలత్వాన్ని నిర్మించుకోవడమే మన జీవిత ఏకైక లక్ష్యం కావాలి. అప్పుడే జన్మ ధన్యమవుతుంది!

- కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

అంతర్యామి

ఆంగ్ల విద్య.. ఏదీ శ్రద్ధ

మూడేళ్ల క్రితం 4,500 పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రారంభం

- బడికి ఒకరిద్దరు ఉపాధ్యాయులకు శిక్షణ
- గత ఏడాది నుంచి కొత్త పాఠశాలల్లో ప్రవేశమే లేదు
- ఉపాధ్యాయుల బదిలీలతో మరింత అస్తవ్యస్తం


ఆంగ్ల అక్షరాలు దిద్దుతున్న చిన్నారులు (పాత చిత్రం)

సర్కారు బడుల్లో ఆంగ్ల మాధ్యమం చదువు అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వ విధానాలు, నిర్లక్ష్య ధోరణి కారణంగా అసలు ఉద్దేశం నెరవేరడం లేదు. ఉపాధ్యాయుల అంగీకారంతోనే ఆంగ్ల మాధ్యమాన్ని ప్రారంభించుకోవాలని చెప్పి.. ముందుకొచ్చిన వారికి శిక్షణ ఇచ్చిన విద్యాశాఖ.. జులైలో వారిని తెలుగు మాధ్యమ పాఠశాలలకు బదిలీలు చేయడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమ విద్య ప్రవేశపెట్టాలని, స్కూళ్ల మనుగడకు ఇది తప్పనిసరని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు మొర పెట్టుకోవడంతో 2016-17 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఆంగ్ల బోధనకు ఉపాధ్యాయులు అంగీకరించిన చోటే విద్యాకమిటీల ఆమోదంతో ప్రారంభించుకునేలా విద్యాశాఖ అనుమతి ఇచ్చింది. ఆ ఏడాది ఒకటో తరగతికి మాత్రమే ఆంగ్లం బోధించాలని.. ఏటా ఒక్కో తరగతి పెంచుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. 2016-17 విద్యా సంవత్సరం నుంచి 4,500 పాఠశాలల్లో శ్రీకారం చుట్టారు.

ఊరించి.. ఉసూరనిపించి

- ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టామని గొప్పగా చెప్పుకున్న విద్యాశాఖ క్రమేణా తన ఆలోచన మార్చుకుంది. ఒక్కో తరగతి పెంచుకుంటూ పోతే అయిదో తరగతి వరకూ సమస్య ఉండదని భావించింది. ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఆంగ్ల మాధ్యమంలో ఆరో తరగతి నుంచి పాఠాల బోధన తమవల్ల కాదంటే ఏమిటన్న ప్రశ్న విద్యాశాఖలో తలెత్తింది. అదే జరిగితే అయిదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలల్లో చదివిన వారు తర్వాత విద్య ఎక్కడ అభ్యసించాలన్నది ప్రశ్న.
- ఒకవేళ టీఆర్‌టీ ద్వారా ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు ఉపాధ్యాయులను భర్తీ చేద్దామనుకున్నా నిరుద్యోగుల సమస్యలు వస్తాయని విద్యాశాఖ భావించింది. రాష్ట్రంలో 4,500 బడుల్లో ఆంగ్ల మాధ్యమం ప్రారంభించి 2017లో ఇచ్చిన టీఆర్‌టీ ప్రకటనలో కేవలం 910 కొలువులే ఆంగ్ల మాధ్యమానికి కేటాయించడం గమనార్హం.
- పదో తరగతి వరకూ కచ్చితంగా తెలుగును ఒక సబ్జెక్టుగా చదవాలని ప్రభుత్వమే నిర్ణయించి ఈ ఏడాది నుంచీ అమలు చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రోత్సహించే అంశంపై ప్రభుత్వంలో అయోమయం నెలకొంది.
- గత జులైలో ఉపాధ్యాయులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆంగ్ల మాధ్యమం బోధిస్తామని ముందుకు వచ్చిన టీచర్లు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తెలుగు మాధ్యమం బడులకు వెళ్లారు. ఆసక్తి లేనివారు ఇతరచోట్ల నుంచి ఆంగ్ల మాధ్యమం పాఠశాలలకు వచ్చారు. ఆంగ్ల పాఠశాలలోని వారు ఆంగ్ల మాధ్యమ స్కూళ్లకు బదిలీ చేసేలా నిబంధన లేకపోవడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది.

స్పష్టమైన విధానంతో రావాలి

ఆంగ్ల మాధ్యమంపై ప్రభుత్వం సమీక్షించి స్పష్టమైన విధానంతో ముందుకు రావాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న, టీఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి కోరారు. ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు లేకపోవడం.. కొన్నిచోట్ల చేర్చుకున్నా వారికి మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు అనుమతి లేకపోవడం తదితర కారణాలతో ఒకటో తరగతిలో చేరే వారు తగ్గిపోతున్నారని వారు పేర్కొన్నారు.

నాడు కళకళ

2016లో వరంగల్, కరీంనగర్ లాంటి పలు జిల్లాల్లో మూత బడిన బడులూ ఆంగ్ల మాధ్యమంతో తెరుచుకున్నాయి. విద్యార్థులు లేక అంపశయ్యపై ఉన్న పాఠశాలలు కళకళలాడాయి. ఆ బడుల్లోని ఒకరిద్దరు ఉపాధ్యాయులకు అయిదు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు.



శిక్షణ కరవు

2017-18వ విద్యా సంవత్సరంలో ఆంగ్ల మాధ్యమం బడులకు అనుమతులపై విద్యాశాఖ ప్రచారం చేయలేదు. 2016లో దీన్ని ప్రవేశపెట్టిన బడుల్లో మిగిలిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వలేదు. టీఆర్‌టీ ద్వారా 910 ఆంగ్ల మాధ్యమ ఉపాధ్యాయుల భర్తీకి మాత్రం నిర్ణయించారు.



ఊసే లేదు

ప్రస్తుత విద్యాసంవత్సరంలో అసలు ఆంగ్ల మాధ్యమం ఊసే ఎత్తలేదు. రెండు రోజుల శిక్షణతో సరిపెట్టారు. బ్రిటిష్ కౌన్సిల్‌తో ఒప్పందం కుదుర్చుకుని శిక్షణ ఇప్పించాలని ఆలోచన చేసినా అది కార్యరూపం దాల్చలేదు.



- ఈనాడు, హైదరాబాద్

ప్రస్తుత ఖాతాను వినియోగించుకోవచ్చు

పంచాయతీ అభ్యర్థులకు ఎస్‌ఈసీ వెసులుబాటు

ఈనాడు, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థి తన ప్రస్తుత బ్యాంకు ఖాతా నుంచే ప్రచారానికి సొమ్మును ఖర్చు పెట్టుకోవచ్చు. ఎన్నికల వ్యయానికి సంబంధించి ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాను తెరవాల్సిన అవసరం లేదు. అయితే నామపత్రాల దాఖలు తేదీ మొదలుకొని ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రస్తుత ఖాతాను ఎన్నికల వ్యయానికి మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. ఎన్నికల వ్యయాన్ని అధికార యంత్రాంగం పర్యవేక్షించటానికి వీలుగా.. ప్రతి అభ్యర్థి బ్యాంకులో ప్రత్యేకంగా ఒక ఖాతాను ప్రారంభించాలనే నిబంధన ప్రస్తుతం అమల్లో ఉంది. నామపత్రాలను దాఖలు చేయటానికి కనీసం ఒక రోజు ముందుగా దీన్ని తెరవాలి. అభ్యర్థి సొంత నిధులతోపాటు ఎన్నికల కోసం ఇతరుల నుంచి వచ్చే నిధులనూ ఈ ఖాతాలోనే జమ చేసి ఖర్చు చేయాల్సి వుంటుంది. బ్యాంకులో ఒక ఖాతాను తెరవాలంటే 10 నుంచి 15 రోజుల వ్యవధి పడుతుందని, అందువల్ల ప్రత్యేక ఖాతా నిబంధనపై క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అభ్యర్థులు వాపోతున్నారంటూ సమస్యను మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఇటీవల రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఈ అంశంపై సమీక్షించిన రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్‌ఈసీ).. కొత్త ఖాతా నిబంధనను సవరించింది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు అభ్యర్థులు తమ ప్రస్తుత బ్యాంకు ఖాతాలను ఉపయోగించుకోవచ్చని, దాని నంబరును నామపత్రాల దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలని ఎస్‌ఈసీ కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. ఇదే సమయంలో నామపత్రాల దాఖలు రోజు మొదలుకొని పోలింగ్ అయ్యేవరకు ప్రస్తుత తన బ్యాంకు ఖాతాను ఎన్నికల కోసమే తప్ప మిగతా అవసరాలకు వినియోగించనంటూ ధ్రువీకరిస్తూ హామీ పత్రం ఇవ్వాలని పేర్కొన్నారు. సర్పంచి, వార్డు సభ్యుల పదవులకు పోటీచేయబోయే అభ్యర్థులు అందరికీ ఈ వెసులుబాటు వర్తిస్తుంది.

జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు సర్పంచిగా పోటీ చేయొచ్చు

- వార్డు సభ్యుడిగా మాత్రం ఒక చోటే అనుమతి
- కొందరు ఆర్డీవోల తీరుతో జిల్లాల్లో గందరగోళం
- స్పష్టత ఇచ్చిన ఎన్నికల సంఘం
- నేటి నుంచి నామపత్రాల స్వీకరణ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని జిల్లా, మండల పరిషత్ (జడ్పీటీసీ, ఎంపీటీసీ) సభ్యులు.. సర్పంచి, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేయవచ్చు. గెలిచిన తర్వాత వాటిలో ఏదో ఒక పదవిలో మాత్రమే కొనసాగాలి. ఒక అభ్యర్థి వార్డు సభ్యుడిగాను, సర్పంచిగాను బరిలో నిలవచ్చు. రెండింటిలో నెగ్గినప్పుడు ఏదో ఒక పదవిని ఉంచుకొని రెండో దాన్ని ఖాళీ చేయాల్సి ఉంటుంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులుగా ఉన్నవారు.. సర్పంచి, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేయాలనుకుంటే తొలుత తమ పదవులకు రాజీనామా సమర్పించాల్సి ఉంటుందని కరీంనగర్‌తో సహా కొన్ని జిల్లాలోని ఆర్డీవోలు చెబుతుండటంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇది అన్యాయమంటూ అభ్యర్థులు వాపోతుండగా తమకు పైనుంచి అటువంటి ఆదేశాలే వచ్చాయని వారు చెబుతున్నారు. దీనిపై అనేక ఫిర్యాదులు రావటంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదివారం స్పష్టత ఇచ్చింది. వార్డు సభ్యుడి పదవికి పోటీ చేయాలనుకునేవారికి మాత్రం కొన్ని ఆంక్షలుంటాయి. ఒక అభ్యర్థి పంచాయతీలోని ఒక వార్డుకు మాత్రమే పోటీ చేయాలి. వేరే వార్డులకూ నామినేషన్ వేసినట్లైతే ఏదో ఒక వార్డును మాత్రమే ఉంచుకొని మిగతా వాటిని ఉపసంహరించుకోవాలి. అలా చేయకుంటే అన్ని నామపత్రాలు తిరస్కరణకు గురవుతాయి. వార్డు సభ్యుడి పదవికి పోటీ చేసే వ్యక్తి ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకూ పోటీ చేసేందుకు వీలులేదు.

ఆస్తులు, అప్పుల వివరాలివ్వాల్సిందే

శాసనసభ ఎన్నికల అభ్యర్థుల మాదిరిగానే పంచాయతీ పదవులకు పోటీ చేసే వారు కూడా తమ ఆస్తి, అప్పుల వివరాలను రిటర్నింగ్ అధికారులకు అందజేయాలి. విద్యార్హతలు, నేరపరమైన వివరాలను నామపత్రాలతో పాటుగా సమర్పించాలి. ఇద్దరు సాక్షుల సంతకాలు, స్వీయధ్రువీకరణ అవసరం. ఈ వివరాలివ్వని వారి నామపత్రాలను అధికారులు తిరస్కరిస్తారు. రాష్ట్రంలో తొలి విడత ఎన్నికలకు సంబంధించిన నామపత్రాల స్వీకరణ ఘట్టం సోమవారం మొదలవుతుంది.

నామపత్రాలను స్వీకరించే స్థానాలు	
సర్పంచులు	4,480
వార్డు సభ్యుల పదవులు	39,832
రిటర్నింగ్ అధికారుల సంఖ్య	5,097

రాజీనామా చేశాకే నామినేషన్ వేయాలి

- పంచాయతీ బరిలోకి దిగాలంటే పదవులు వదులుకోవాల్సిందే
- రైసస సభ్యులు, ఛైర్మన్లకు వ్యవసాయశాఖ ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల బరిలోకి దిగాలనుకునే రైతు సమన్వయ సమితి(రైసస)ల సభ్యులు, ఛైర్మన్లు ముందుగా వారి పదవులకు రాజీనామా చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీ ఎన్నికల నియమావళి ప్రకారం ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల్లో నియమించిన వారు ఈ ఎన్నికల్లో పోటీ చేయాలంటే వాటికి రాజీనామా చేయాలి. ఈ నేపథ్యంలో గ్రామస్థాయి సభ్యులు, ఛైర్మన్లు రాజీనామా లేఖను మండల వ్యవసాయాధికారి(ఏఓ)కి అందజేసిన తరువాతే పంచాయతీ ఎన్నికలకు నామినేషన్లు వేయాలి. మండల స్థాయి పదవుల్లో ఉన్నవారు వ్యవసాయ సహాయ సంచాలకుడి(ఏడీ)కి, జిల్లాస్థాయి పదవుల్లోని వారు జిల్లా వ్యవసాయాధికారి(జేడీ)కి రాజీనామా లేఖలివ్వాలి. రైతులను ఈ సమితుల్లో ప్రభుత్వం గతంలో నియమించింది. కానీ ఇప్పుడు సర్పంచి, వార్డు సభ్యుడి పదవులకు పలువురు పోటీ చేయడానికి ముందుకొస్తున్నారు. సాధారణంగా పల్లెలు, తండాల్లో పదవులకు పోటీపడే వారందరికీ భూములుంటాయని, వారిలో చురుగ్గా ఉన్నవారినే రైససల్లో ప్రభుత్వం నియమించినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. వారే ఇప్పుడు పంచాయతీ ఎన్నికలకు పోటీపడుతున్నందున రాజీనామా అనివార్యమని రైసస రాష్ట్ర ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి 'ఈనాడు'కు చెప్పారు. రాజీనామా తప్పనిసరి అని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసిందని ఆయన వివరించారు. పంచాయతీ ఎన్నికల కోసం కొందరు రాజీనామా చేసినందున పెద్దగా నష్టమేమీ ఉండదని, ఎన్నికల తరవాత రైససల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సమితుల్లో దాదాపు 1.61 లక్షల మంది సభ్యులు, ఛైర్మన్లుగా ఉన్నారు. వారిలో ఎంతమంది పంచాయతీ ఎన్నికలకు వెళుతున్నారనేది ఈ నెలాఖరుకు తెలుతుంది. ఈ సమితుల ద్వారా వ్యవసాయాభివృద్ధి పథకాలను పక్కాగా అమలుచేయాలని ప్రభుత్వం వీటిని ఏర్పాటుచేసింది.

ఆ వార్డులో 16 మందే ఓటర్లు

9 ఓట్లు వస్తే విజయం

సారంగాపూర్, న్యూస్‌టుడే: ఆ గ్రామంలో కేవలం తొమ్మిది ఓట్లతో విజయం వరించనుంది. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని చిన్న కొల్వాయిలోని ఓ వార్డులో 16 ఓట్లు మాత్రమే ఉన్నాయి. ఆ వార్డు బరిలో ఇద్దరు ఉంటే కేవలం తొమ్మిది ఓట్లు సాధించుకుంటే విజయం వరించనుంది. ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా మార్చిన విషయం తెలిసిందే. మండలంలోని కొల్వాయి పంచాయతీ నుంచి చిన్న కొల్వాయిని పంచాయతీగా మార్చారు. గ్రామంలో 111 ఓట్లు ఉన్నాయి. ప్రస్తుతం పంచాయతీ ఎస్టీ జనరల్‌కు కేటాయించగా నాలుగు వార్డులు చేశారు. రెండు వార్డుల్లో 26 ఓట్ల చొప్పున ఉండగా ఒక వార్డులో 43, మరో వార్డులో 16 ఓట్లు మాత్రమే ఉన్నాయి. జిల్లాలో అతి తక్కువ ఓట్లున్నట్లు పంచాయతీకి, వార్డుల్లో అతి తక్కువ ఓట్లున్న వార్డుగా గుర్తింపు లభించింది. శాసనసభ ఎన్నికల్లోనూ 95 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పంచాయతీ సర్పంచి, వార్డు సభ్యులకు ఏకగ్రీవానికి యత్నాలు జరుగుతున్నప్పటికీ పోటీ జరిగే అవకాశముంది. ఇద్దరు సర్పంచి పదవికి బరిలో ఉంటే 56 ఓట్లు సాధించిన వ్యక్తి సర్పంచి కానున్నారు.

గ్రామ స్వరాజ్యంతోనే దేశాభివృద్ధి

- 'పంచాయతీ' అభ్యర్థులకు అవగాహన సదస్సులో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యంతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్, జాయిన్ ఫర్ డెవలప్‌మెంట్ (జేడీ) ఫౌండేషన్ ఛైర్మన్ వి.వి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. స్థానిక సంస్థలకు పూర్తి అధికారాలు, నిధులు ఇచ్చినప్పుడే గ్రామాలు పురోగతి సాధిస్తాయన్నారు. పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం అవగాహన సదస్సు జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, 73, 74వ రాజ్యాంగ సవరణ ద్వారా సాధించుకున్న హక్కులపై స్థానిక ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించినప్పుడే గ్రామాలను ప్రగతిపథంలో తీసుకెళ్తారన్నారు. పంచాయతీరాజ్ చట్టం, జీరో బడ్జెట్ పాలిటిక్స్, అభివృద్ధిలో యువకుల పాత్ర, ఉపాధి కల్పన, తదితర అంశాలపై పలువురు నిపుణులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఆదర్శ గ్రామం గంగదేవిపల్లి మాజీ సర్పంచి కూసం రాజమౌళి, ప్రోగ్రెసివ్ తెలంగాణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పంచాయతీరంగ నిపుణులు శ్రీరాములు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల పరిశీలకులుగా 18 మంది ఐఏఎస్‌లు

వ్యయ పరిశీలకులుగా 30 మంది ఆడిట్ అధికారులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో పంచాయతీ ఎన్నికలను 18 మంది ఐఏఎస్ అధికారులు పర్యవేక్షించనున్నారు. రాష్ట్రంలోని వివిధ శాఖలకు చెందిన ఐఏఎస్ అధికారులకు జిల్లాలను కేటాయిస్తూ ఎన్నికల సంఘం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో కొందరు ఒక్కో జిల్లాకు, మరికొందరు రెండేసి జిల్లాలకు నియమితులయ్యారు. వీరు ఎన్నికల సంఘం ఆదేశాలను, మార్గదర్శకాలను అమలు చేయటంలో.. యంత్రాంగానికి, రాజకీయ పార్టీలకు, ఓటర్లకు మధ్యవర్తులుగా ఉంటారు. క్షేత్ర స్థాయి నుంచి ఎన్నికల సంఘానికి సమాచారాన్ని చేరవేస్తారు. అభ్యర్థులు పెట్టే ఖర్చును పరిశీలించేందుకు జిల్లాకు ఒకరు చొప్పున 30 మంది ఆడిట్ అధికారులను వ్యయ పరిశీలకులుగా నియమించారు.


సందేహాల నివృత్తికి ప్రత్యేక విభాగం

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థులు సహా ఎవరికి సందేహాలు తలెత్తినా రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) కార్యాలయంలో నివృత్తి చేసుకోవచ్చు. సందేహాల నివృత్తి, ఫిర్యాదుల కోసం హైదరాబాద్‌లోని ఏసీ గార్డ్స్‌లో ఉన్న తమ కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఈసీ కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. ఇది ఇతర కార్యాలయ సమయాలతో పాటు అదనంగా రాత్రి 9 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు కూడా ఫిర్యాదులను స్వీకరిస్తుందన్నారు. ఫిర్యాదులను 040-29802895 నెంబరు ద్వారా కూడా తెలపవచ్చన్నారు.

ఒడిశాలో మావోయిస్టుల దుశ్చర్య

- ఒకరి హత్య.. 5 వాహనాలకు నిప్పు

ఫుల్బాణీ (బ్రహ్మపుర నగరం), న్యూస్‌టుడే: మావోయిస్టులు ఓ రోడ్డు నిర్మాణ సంస్థకు చెందిన అయిదు వాహనాలకు నిప్పుపెట్టడంతోపాటు కాపలాదారు రబీంద్ర మల్లిక్‌ను కాల్చిచంపారు. ఒడిశా రాష్ట్రం కొంధమాల్ జిల్లా ఫుల్బాణీ సదర్ ఠాణా పరిధిలోని పటియంబ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) కింద సుద్రుకుంప-మెడిఖోల్ రహదారి నిర్మాణం పనులు జరుగుతున్నాయి. గుత్తేదారుకు చెందిన వాహనాలు, నిర్మాణ సామగ్రి పటియంబ వద్ద ఉన్నాయి. ఆదివారం తెల్లవారు జామున 2 గంటల ప్రాంతంలో పలువురు మావోయిస్టులు పటియంబ చేరుకున్నారు. అక్కడున్న మూడు ట్రాక్టర్లు, ఓ రోడ్ రోలర్, మినీ ట్రక్కుకు నిప్పు పెట్టారు. అనంతరం అక్కడ కాపలా ఉన్న రబీంద్ర మల్లిక్‌ను సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి కాల్పులు జరిపి హతమార్చారు. సంఘటనా స్థలంలో కొంధమాల్-కలహండి-నయాగఢ్-బౌద్ధ్ (కేకేబీఎన్) మావోయిస్టు డివిజన్ పేరిట ఉన్న లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాపలాదారు మల్లిక్‌ను పోలీసు ఇన్‌ఫార్మర్‌గా అందులో పేర్కొన్నారు.



మావోయిస్టులు తగులబెట్టిన వాహనాలు ★ రబీంద్ర మల్లిక్ మృతదేహం

సార్వత్రిక సమ్మెకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ మద్దతు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 8, 9 తేదీల్లో తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) మద్దతు తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం నాయకులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. భాగస్వామ్య పింఛను పథకాన్ని రద్దుచేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. ధరల పెరుగుదలను నియంత్రించాలని, కనీస వేతనాలను అమలుచేయాలని కోరారు. పేదలను విద్యకు దూరం చేసే డిటెన్షన్ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని నాన్ డిటెన్షన్ పద్ధతిని కొనసాగించాలని సూచించారు. రెండు రోజుల సమ్మెలో భాగంగా ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కొనసాగించాలి

- ధర్నాచౌక్‌లో బీసీ సంక్షేమ సంఘం మహాధర్నా

కవాడిగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో త్వరలో జరిగే పంచాయతీ, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను కొనసాగించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో బీసీ సంక్షేమ సంఘం నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. 2010 కోర్టు తీర్పును బూచిగా చూపిస్తూ బీసీ రిజర్వేషన్లను తగ్గించడం అన్యాయమన్నారు. శాసనసభ ఎన్నికలు ముగిసి కనీసం శాసనసభ్యులుగా ప్రమాణాలు చేయకముందే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్డినెన్స్ తేవడం సరికాదన్నారు. 2010 కోర్టు తీర్పు ఆంధ్రప్రదేశ్‌కు సైతం వర్తిస్తున్నప్పటికీ అక్కడ బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలు నిర్వహిస్తామని ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిత్తరంజన్‌దాస్, తెజస అధ్యక్షుడు కోదండరాం, ప్రొ.పీఎల్ విశ్వేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, బీసీ సంఘాల నాయకులు నీలా వెంకటేశ్, రాజేందర్, కోలా జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఉలిక్కిపడిన ఊళ్లు

తమిళనాడు ప్రమాదంతో ఐదు గ్రామాల్లో విషాదం



విషాదంలో మునిగిపోయిన నర్సాపూర్ మండలం ఖాజీపేట వాసులు

చిన్నచిన్న పల్లెలు. అభిమానం..ఆప్యాయతలు గూడుకట్టుకున్న లోగిళ్లు. తమ భర్తలు, కుమారులు, సోదరులు మాలధారులై స్వామి దర్శనానికి వెళ్తుంటే బంధువులంతా భక్తిభావంతో వారిని సాగనంపారు. వారికి తోడుగా ఊరే ఊరేగింపుగా కదిలొచ్చి మరీ వీడ్కోలు పలికింది. వారి రాకకోసం అటు అయిన వాళ్లు ఇటు స్నేహితులు, సన్నిహితులు కళ్లలో ఒత్తులు వేసుకుని మరీ వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఉరుములేని పిడుగులా రోడ్డు ప్రమాదం తమ వాళ్లను కబళించిందని తెలుసుకుని ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఒక్కొక్కరి మరణ వార్త తెలుసుకుని ఒక్కో కుటుంబం కుప్పకూలుతుంటే ఊరు కన్నీరుమున్నీరై విలపించింది.

నర్సాపూర్ – న్యూస్‌టుడే

తమిళనాడు రాష్ట్రం పుదుకోట్టై సమీపంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 10మంది మరణించగా..ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులంతా మెదక్ జిల్లా నర్సాపూర్, హత్నూర మండలంలోని ఖాజీపేట, చిన్నచింతకుంట, మంతూరు, రెడ్డిపల్లి, మంగాపూర్ గ్రామాలకు చెందిన వారే కావడంతో ఆయా గ్రామాల్లో విషాదం అలముకుంది. మృతి చెందిన వారిలో ఒక్కొక్కరిదీ ఒక్కో విషాద గాథ.

16వ సారి మాలధారణతో గురుస్వామిగా..

నర్సాపూర్ మండలం ఖాజీపేటకు చెందిన నాగరాజు గౌడ్ వృత్తిరీత్యా రైతు. ఓ ప్రైవేటు పాఠశాలకు బస్సులను అద్దెకు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. 16వ సారి అయ్యప్ప మాల వేసుకున్న ఆయన గురుస్వామిగా.. యువకులను మాల వేసుకునేలా ప్రోత్సహిస్తూ వస్తున్నారు. ఈఏడు కూడా వందల మందితో మాల వేయించారు. కొందర్ని వెంటబెట్టుకుని శబరిమలకు వెళ్లిన ఆయన మృతిచెందడం భక్తులను కలచివేసింది. ఆయనకు భార్య లక్ష్మి, కుమార్తె లోహిత, చరణ్ సంతానం. కుటుంబపెద్ద మృతితో ఆ కుటుంబం వీధిన పడింది. ప్రమాదంలో పెద్ద కుమారుడు మరణించడం, చిన్న కుమారుడు నరేష్ గౌడ్ గాయపడటంతో వారి తల్లిదండ్రులు రామాగౌడ్, యాదమ్మలను ఓదార్చడంఎవరితరం కాలేదు.

ఒక్కగానొక్క కుమారుడి మృతితో..

నర్సాపూర్ మండలం మంతూరు గ్రామానికి సుజాత, సంజీవ్ దంపతుల ఏకైక కుమారుడు శ్యామ్ గౌడ్. తండ్రి అనారోగ్యం పాలవడంతో కుటుంబ బాధ్యతల్ని భుజాన వేసుకున్నాడు. నర్సాపూర్‌లో మెకానిక్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవలే అప్పులు చేసి మరీ చెల్లెలికి వివాహం జరిపించాడు. తల్లిదండ్రులు వారించినా వినకుండా మొండికేసి తొలిసారి మాల వేసుకున్నాడు. కుటుంబానికి ఆధారంగా ఉన్న ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు కుప్పకూలారు.

ఏమని ఓదార్చగలం

ఖాజీపేటకు చెందిన బాలమణి, మల్లేశం దంపతుల రెండో కుమారుడు బోయిని కుమార్ ఐటీఐ చదివాడు. ఇటీవలే హైటెక్ సిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో ఉద్యోగంలో చేరాడు. అక్కడే ఉంటున్నాడు. కుటుంబానికి చేదోడుగా ఉన్నాడు. స్నేహితుల ప్రోద్బలంతో మాల వేశాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు హతాశులయ్యారు.

తిరిగొస్తానన్నాడు..తిరిగిరాని లోకాలకెళ్లాడు

రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నక్క ఆంజనేయులు(45) సాధారణ దుస్తుల్లో మాలధారులైన మిత్రులతో కలిసి శబరిమల వెళ్లి మృత్యువాతపడ్డాడు. ఇతనికి కుమారుడు సాయి, కుమార్తె సిరి ఉన్నారు. 'ఉదయం 11 గంటలకు కుమారుడు ఫోన్ చేసి మాట్లాడాడు. దర్శనం బాగా జరిగిందని, ఇంటికి తిరిగి వస్తున్నానని చెప్పాడు. ఇంతలోనే ఇలాగైందంటూ' ఆయన తల్లి సత్తమ్మ భోరున విలపించింది. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న ఆంజనేయులు మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలముకుంది.

ఆర్నెల్ల క్రితమే వివాహం.. అంతలోనే విషాదం

మృతుల్లో ఒకరైన ఖాజీపేటకు చెందిన జుర్రు మహేష్ ఉదయం 8గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడాడు. స్వామి దర్శనం బాగా జరిగిందని, మాల విరమణ చేశామని చెప్పాడు. మధ్యాహ్నం 2 గంటలకు రామేశ్వరం నుంచి తిరుగు ప్రయాణమవుతామని చెప్పాడు. మూడు గంటల సమయంలో కుమారుడు చనిపోయాడన్న సమాచారం అందుకున్న తల్లిదండ్రులు మల్లమ్మ, సాయిలు భోరున విలపించారు. మహేష్‌కు ఆరు నెలల క్రితమే వివాహమైంది. భర్త మరణవార్త తెలుసుకున్న భార్య మనూష విలపిస్తున్న తీరు స్థానికులను కంట తడి పెట్టించింది.

నాడు పెద్ద కుమారుడు.. నేడు చిన్న కుమారుడు

చిన్నచింతకుంట గ్రామానికి చెందిన శ్రీనివాస్ గౌడ్, భాగ్యలక్ష్మిల చిన్న కుమారుడు ప్రవీణ్ గౌడ్ (24) అవివాహితుడు. మీ సేవ కేంద్రం నిర్వాహకుడిగా పనిచేస్తూ కుటుంబానికి అండగా నిలిచాడు. పెద్ద కుమారుడు ఏడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం, చిన్నకుమారుడు తాజాగా ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం దిక్కులేనిదైంది.

పెళ్లి చేద్దామనుకుంటుండగానే మరణం

మృతుల్లో ఒకరైన చిన్నచింతకుంటకు చెందిన జమ్ముల సురేష్ హైదరాబాద్ నగరం కొంపల్లి సమీపంలో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. ముగ్గురు కుమారుల్లో సురేష్ చిన్నవాడు. అవివాహితుడైన ఇతను ఐదోసారి మాలధారణ చేసి శబరిమలకు వెళ్లి ప్రాణాలు విడిచాడు. కుమారుడికి పెళ్లి చేద్దామనుకున్నామని, ఇంతలోనే విషాదం జరిగిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

50 సార్లు వెళ్లిన అనుభవం రాజేశ్ సొంతం


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యాను డ్రైవర్, హైదరాబాద్ నగరం పేట్‌బషీరాబాద్‌కు చెందిన జి. రాజేశ్(46)కు ఇప్పటివరకు యాభై సార్లు యాత్రికులను శబరిమలకు తీసుకెళ్లిన అనుభవం ఉంది. ఇతని స్వగ్రామం మెదక్ జిల్లా నిమ్‌టూర్ గ్రామం. ఆయనకు భార్య మంజుల, కుమారులు నిఖిల్(23), అఖిల్(19) ఉన్నారు. ప్రమాదానికి గురైన వ్యానును రాజేశ్ ఏడాది క్రితమే కొనుగోలు చేశాడు. దాన్ని నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందినట్టు తెలుసుకున్న భార్య అపస్మారక స్థితికి చేరింది.



ప్రమాదంలో మృతి చెందిన నాగరాజుగౌడ్, శ్యామ్‌గౌడ్, బోయిని కుమార్, నక్క ఆంజనేయులు, కృష్ణ గౌడ్, జుర్రు మహేష్, ప్రవీణ్‌గౌడ్, సురేశ్, డ్రైవర్ రాజేశ్

తీగలే యమపాశాలు

- విద్యుదాఘాతంతో ముగ్గురి దుర్మరణం
- నియంత్రిక ఏర్పాటు చేస్తుండగా ప్రమాదం
- మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలంలో ఘటన



మృతులు రామయ్య, సురేందర్, భీంరావు (పాతచిత్రాలు)

వేమనపల్లి, న్యూస్‌టుడే: వారు ఆరుగాలం శ్రమించే రైతులు.. విద్యుత్ నియంత్రిక (ట్రాన్స్‌ఫార్మర్) ఏర్పాటు చేసుకుంటే యాసంగిలో ఇబ్బంది లేకుండా తమ భూమిని సాగు చేసుకోవచ్చని భావించారు. అందుకే అధికారులు చేయాల్సిన పనిని, కష్టమైనా చేసేందుకు సిద్ధమయ్యారు. విద్యుత్తు లైను ఏర్పాటు చేసుకునే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు రైతులు, ఒక కూలీ మృతి చెందారు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం ముల్కలపేట గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం... ముల్కలపేటకు చెందిన చిన్నగొండ రామయ్య (62), చిన్నగొండ సురేందర్ (21) ఇద్దరు రైతులు. వరుసకు అన్నదమ్ములైన వీరు నాలుగెకరాల్లో వ్యవసాయం చేస్తున్నారు. విద్యుత్ నియంత్రిక కోసం దరఖాస్తు చేసుకోగా ఇటీవల అనుమతి లభించింది. విద్యుత్తు లైను ఏర్పాటు కోసం నీల్వాయి గ్రామానికి చెందిన దినసరి కూలీ వశాఖ భీంరావు(19) సాయం తీసుకున్నారు. రాజన్న అనే రైతు వ్యవసాయ భూమి పక్కనే 11 కేవీ విద్యుత్తు లైనుతో పాటు మరో విద్యుత్తు లైను ఏర్పాటు చేసుకునేందుకు రైతులిద్దరు, కూలీ స్తంభాలను అమర్చుతున్నారు. పక్కనే 11 కేవీ విద్యుత్తు లైనుకు సంబంధించిన నియంత్రిక ఉంది. దాని కింద మరో స్తంభం ఏర్పాటు చేస్తుండగా వీరు పట్టుకున్న స్తంభం పైభాగంలోని ఇనుప కాసారం తీగలు 11 కేవీ విద్యుత్తు తీగలకు తాకాయి. ఒక్కసారిగా విద్యుదాఘాతం జరిగి స్తంభాన్ని పట్టుకున్న రామయ్య, సురేందర్, భీంరావులు అక్కడికక్కడే మరణించారు. మరోవైపు తాడు పట్టుకుని స్తంభాన్ని లాగుతున్న ముల్కలపేటకు చెందిన పరదేశీ, రమేష్‌లు విద్యుదాఘాతానికి గురై స్వల్ప గాయాలతో బయటపడ్డారు. విద్యుత్తు శాఖ ఏఈ బాపు నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆందోళన చేశారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రకటించే వరకు మృతదేహాలను తీసుకెళ్లబోమని బైఠాయించారు. అయినప్పటికీ విద్యుత్తు శాఖ అధికారులు ఘటనా స్థలానికి రాలేదు. సిమెంటు స్తంభానికి విద్యుత్తు షాక్ రావడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. స్తంభంలో నాణ్యతా లోపం కారణమా.. లేదా తవ్విన గుంతలో నీరు ఉండటంతో విద్యుత్తు ప్రవహించి ప్రమాదం జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



పెద్దపులిని చంపిన ప్రాంతాన్ని అటవీ అధికారులకు చూపుతున్న నిందితుడు ప్రకాశ్ (వృత్తంలోని వ్యక్తి)

పెద్దపులిని చంపింది.. పెంబి అడవుల్లోనే

- విద్యుత్తు తీగలు అమర్చి ఘాతుకం
- వివరాలు వెల్లడించిన నిందితుడు

ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దపులిని స్మగ్లర్లు హతమార్చింది నిర్మల్ జిల్లా పెంబి అటవీ రేంజిలోనేనని అధికారులు తేల్చారు. దసరా-దీపావళి మధ్య పెంబి మండలం తాటిగూడ గ్రామానికి చెందిన గుగ్లావత్ ప్రకాశ్, పుల్గంపాండ్రి వాసి అలావత్ మున్యాలు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని వెల్లడించారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో పెద్దపులి చర్మం విక్రయిస్తూ పట్టుబడ్డ నిందితులను ఆదివారం అటవీ అధికారులు విచారించారు. ఈ సందర్భంగా.. పెద్దపులిని చంపిన తీరును నిందితుడు ప్రకాశ్ అటవీ అధికారులకు వివరించాడు. పెంబి రేంజి పరిధిలో పులి తిరిగిన ప్రదేశంలో జంతువుల వేటకు వినియోగించే తీగలు అమర్చారు. దానికి విద్యుత్తు కనెక్షన్ ఏర్పాటు చేశారు. గత దసరా-దీపావళి మధ్య ఓ రోజు రాత్రి అటుగా వెళ్లిన పెద్దపులి తీగలకు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. మరుసటి రోజు ఉదయం అడవికి వెళ్లిన నిందితులు పులి చర్మాన్ని విక్రయించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అనుమానం రాకుండా పులి మాంసాన్ని కాల్చేశామని.. ఎముకలను కడెం వాగులో పడేశామని నిందితుడు ప్రకాశ్ అధికారులకు తెలిపాడు. పులి చర్మాన్ని రూ.25 లక్షలకు విక్రయించేందుకు ఒప్పందం కూడా కుదిరిందని వివరించాడు. అడవిలో విద్యుత్తు తీగలు అమర్చిన ప్రాంతాన్ని, పులి మాంసం కాల్చేసిన ప్రదేశాన్ని అధికారులకు చూపించాడు.



నిట్‌లో యువజనోత్సవాలు షురూ

వరంగల్ జాతీయ సాంకేతిక సంస్థ(నిట్) విద్యార్థి మండలి ఆధ్వర్యంలో నిట్ ప్రాంగణంలో జాతీయ యువజనోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సైక్లింగ్, పరుగు పందెం పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ నెల 12 వరకు జరిగే ఈ ఉత్సవాలను నిట్ విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ ఆచార్య ఎల్ఆర్‌జీ రెడ్డి ప్రారంభించారు. - న్యూస్‌టుడే, నిట్‌క్యాంపస్

వన్యప్రాణుల మనుగడకు భరోసా

- గడ్డిక్షేత్రాల పెంపకానికి అటవీశాఖ చర్యలు
- ప్రాణహిత కృష్ణ జింకల అభయారణ్యానికి కళ

కోటపల్లి, న్యూస్‌టుడే: వన్యప్రాణుల మనుగడకు అటవీశాఖ చేపడుతున్న సంరక్షణ చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. గతంలో దప్పిక తీర్చేందుకు మాత్రమే ఏర్పాట్లు చేసిన అధికారులు ఇటీవల అవి సంచరించే ప్రదేశాల్లోనే గడ్డి, నీటి వసతి కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శాకాహార జంతువుల కోసం పచ్చికబయళ్లు (గడ్డిక్షేత్రాలు) పెంచేందుకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేశారు. మంచిర్యాల జిల్లాలోని గోదావరి, ప్రాణహిత నదుల తీరం వెంబడి 136 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ప్రాణహిత కృష్ణజింకల అభయారణ్యంలో విస్తారంగా గడ్డిక్షేత్రాలను పెంచుతున్నారు. సహజంగా ఏర్పడిన గడ్డిని ఇతర జంతువులు తినకుండా ఆయా పరిధిలోని సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. తద్వారా శాకాహార జంతువులకు అనువైన స్థలాల్లోనే ఆహారం దొరుకుతోంది. అవి సంచరించే ప్రదేశాల్లో అధికారులు నిఘానేత్రాలను ఏర్పాటు చేశారు. దాహార్తిని తీర్చుకునేందుకు వన్యప్రాణులు సంచరించే ప్రాంతాలతో పాటు ఆహారం, ఇతర తాగునీటి వసతుల వద్ద రహస్య ప్రాంతాల్లో సీసీ కెమెరాలను బిగించారు.



ప్రాణహిత కృష్ణజింకల అభయారణ్యంలో పెంచిన గడ్డిక్షేత్రం

మోదీ ప్రభుత్వ హయాంలో కోటి ఉద్యోగాలు పోయాయి: కాంగ్రెస్

దిల్లీ: దేశంలో పెరిగిపోతున్న నిరుద్యోగానికి నరేంద్రమోదీ ప్రభుత్వమే కారణమంటూ కాంగ్రెస్ ఆదివారం ఆరోపించింది. 2018లో కోటికి పైగా ఉద్యోగాలు పోయాయని పేర్కొన్న మేధోమథన సంస్థ నివేదికను కాంగ్రెస్ ఈ సందర్భంగా ఉటంకించింది. ఏటా రెండుకోట్ల ఉద్యోగాలను కల్పిస్తామంటూ చేసిన వాగ్దానాలను నెరవేర్చడంలో భాజపా సారథ్యంలోని ఎన్‌డీఏ సర్కారు దారుణంగా విఫలమైందని కాంగ్రెస్ ప్రతినిధి మనీష్ తివారి ఆరోపించారు. 'అచ్చేదిన్' అని, ఏడాదికి రెండుకోట్ల కొత్త ఉద్యోగాలని గుప్పించిన హామీలన్నీ హుళక్కి అయిపోయాయన్నారు.

మంత్రి ఆదేశాలతో నన్ను నిర్బంధించారు

- మహారాష్ట్ర మంత్రి తావ్‌డేపై విద్యార్థి ఆరోపణ

ముంబయి: ఓ జర్నలిజం విద్యార్థి అడిగిన ప్రశ్నకు మహారాష్ట్ర విద్యామంత్రి వినోద్ తావ్‌డే సమాధానం చెబుతుండగా ఆ సంభాషణను ఫోన్‌లో వీడియో తీసినందుకు తనను అరెస్టు చేసి...ఫోన్‌లో సమాచారాన్ని తొలగించారని యువరాజ్ దబడ్ అనే స్టూడెంట్ ఆరోపించారు. అయితే, ఆ ఆరోపణలు అవాస్తవాలంటూ మంత్రి ఖండించారు. అమ్రావతి జిల్లాలోని ఓ కళాశాలలో వక్తృత్వ పోటీలను మంత్రి ప్రారంభించారు. అప్పుడు కొందరు విద్యార్థులు ఆయనను కలుసుకున్నారు. ఉచిత విద్యావిధానం రాష్ట్రంలో ఏమైనా ఉందా అని ప్రశాంత్ రాథోడ్ అనే విద్యార్థి అడగ్గా మంత్రి స్పందిస్తూ చదువుకయ్యే ఖర్చు భరించలేకపోతే...ఎక్కడైనా పనిచేయండి అంటూ జవాబు చెప్పారు. ఈ సంభాషణ మొత్తాన్నీ దబడ్ వీడియో తీశారు. అది చూసిన మంత్రి పోలీసులను పిలిచి వెంటనే తనను అరెస్టు చేయాల్సిందిగా ఆదేశించినట్లు దబడ్ చెప్పారు. దాంతో, పోలీసులు చుట్టుముట్టి వెలుపల ఉన్న వాహనంలోకి తీసుకెళ్లి తనను రెండు గంటల పాటు నిర్బంధించారన్నారు. తన ఫోన్‌ను తీసుకుని అందులో ఉన్న వీడియోలు, సందేశాలను డిలీట్ చేశారని దబడ్ ఆరోపించారు.

ప్రొటెం స్పీకర్‌పై పునరాలోచించాలి

మజ్లిస్ ఎమ్మెల్యే ఆ స్థానంలో ఉండగా అసెంబ్లీకి వెళ్లను: భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్

ఈనాడు, హైదరాబాద్, అబిడ్స్, న్యూస్‌టుడే: తెలంగాణ శాసనసభ ప్రొటెం స్పీకర్‌గా మజ్లిస్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌తో ప్రమాణ స్వీకారం చేయించే విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యే 17న అసెంబ్లీకి తాను వెళ్లేది లేదని, ఎమ్మెల్యేగా ఆ రోజు ప్రమాణస్వీకారం చేయనని స్పష్టం చేశారు. ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్‌కు అవకాశం కల్పించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం తెలంగాణకు మంచిది కాదన్నారు. ధర్మం పట్ల, దేశం పట్ల మజ్లిస్‌కు గౌరవం లేదని.. ఆ పార్టీ నేతలు వందేమాతరం పలకరని మండిపడ్డారు. "సీఎం కేసీఆర్ మజ్లిస్‌ను నెత్తిన పెట్టుకోవడం సిగ్గుచేటు. సీఎం వ్యవహరిస్తున్న తీరును తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాలి. ప్రొటెం స్పీకర్ విషయంలో సీఎం తన నిర్ణయం తాను తీసుకున్నారు. నా నిర్ణయం నేను తీసుకున్నా. కొత్త స్పీకర్ ఎన్నికైన తర్వాతే ఆయన ఛాంబర్‌కు వెళ్లి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేస్తా. ఇకనైనా సీఎం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటే మంచిది' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కస్టమ్ మిల్లింగ్ రైస్ ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరించాలి: అకున్ సబర్వాల్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరించాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ అధికారులను ఆదేశించారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్లతో హైదరాబాద్‌లో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అకున్ సబర్వాల్ మాట్లాడుతూ.. మిల్లింగ్ ఛార్జీల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అధికారులెవరైనా ఉద్దేశపూర్వకంగా తప్పుచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వానాకాలంలో 7.25లక్షల మంది రైతుల నుంచి 37లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన రూ.6,291 కోట్లను రైతుల ఖాతాల్లో జమచేశామని వెల్లడించారు.

ఆర్ట్ సొసైటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు

గిరిజనశాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: గిరిజన సంప్రదాయ చిత్రకళను ప్రోత్సహించేందుకు ఆర్ట్ సొసైటీ ఏర్పాటు చేసే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని గిరిజన సంక్షేమశాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. కళాకారులు సభ్యులుగా ప్రాథమిక సహకార సొసైటీ తరహాలో ఉండేలా యోచిస్తున్నామన్నారు. గోండు, కోయ, నాయక్‌పోడ్ కళలకు పునరుజ్జీవం పోశామని, వీటిని మరింతగా అభివృద్ధి చేస్తామని వివరించారు. ఈనాడులో ప్రచురితమైన 'కళకాలం నిలిచేదెలా' కథనంపై ఆయన స్పందించారు. గిరిజన చిత్రకళకు డిమాండ్ అధికంగా ఉందని, ప్రభుత్వ కార్యాలయాలు చిత్రాలను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నాయని చెప్పారు. అమెజాన్ తదితర ప్రైవేటు ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థలు గిరిజనశాఖ తరపున విక్రయించేందుకు ముందుకొచ్చాయని చెప్పారు.

నెలాఖరు నుంచి రాష్ట్రవ్యాప్తంగా షీ టీంల కార్యకలాపాలు

ఈనాడు, హైదరాబాద్: అతివలను వేధించే పోకిరీల పని పట్టేందుకు ఏర్పాటు చేసిన షీ టీంలు ఇక రాష్ట్ర వ్యాప్తంగా కార్యకలాపాలు ప్రారంభించనున్నాయి. తొలుత అవగాహన కార్యక్రమాలు చేపట్టి ఆ తర్వాత రంగంలోకి దిగబోతున్నాయి. నాలుగేళ్ల కాలంలో హైదరాబాద్‌లో వచ్చిన ఫలితాల దృష్ట్యా రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోనూ ఇదే తరహా సేవలు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. జిల్లాకు ఒకటి చొప్పున ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా షీ టీంలు ఏర్పాటు చేశారు. సీఐడీలోని మహిళా భద్రతా విభాగం ఐజీ స్వాతి లక్రా ఆధ్వర్యంలో ఈ సిబ్బందికి శిక్షణ నిర్వహించగా శాసనసభ ఎన్నికల వల్ల వారి పనితీరుకు కొంత అంతరాయం కలిగింది. ఈ నెలాఖరు నుంచి వీరు పూర్తిస్థాయిలో సేవలు అందించనున్నారు. ముందుగా దీనిపై విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. బాధిత మహిళలకు న్యాయం చేయడం కంటే అసలు పోకిరీల బారిన పడకుండా చూడటమే ప్రధానంగా షీ టీంలు రాష్ట్ర వ్యాప్తంగా కార్యాచరణ చేపట్టనున్నాయి.

రెండో రోజు ఆకట్టుకున్న చెకుముకి సంబురాలు

నిట్‌క్యాంపస్, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వరంగల్ నిట్‌లో జరుగుతున్న చెకుముకి బాలల వైజ్ఞానిక సంబురాలలో ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం రెండో రోజు వైజ్ఞానిక వేడుకలను వీక్షించేందుకు పాఠశాలల చిన్నారులు తరలి వచ్చారు. వనజీవి రామయ్య దంపతులు నిట్‌కు వచ్చి.. మొక్కల ప్రాధాన్యాన్ని వివరించారు.

చంద్రబాబు, పవన్‌లతో అలీ భేటీ

వేర్వేరుగా వారిని కలిసిన సినీనటుడు

ఈనాడు, అమరావతి: సినీ హాస్య నటుడు అలీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లతో ఆదివారం వేర్వేరుగా భేటీ అయ్యారు. సినీ నిర్మాత అశ్వినీదత్‌తో పాటు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసానికి విచ్చేసిన అలీ సీఎంను కలిశారు. అనంతరం జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను విజయవాడలోని ఆయన నివాసంలో కలిశారు. అలీ తొలి నుంచి తెదేపాతో టచ్‌లో ఉన్నారు. గత ఎన్నికల్లో ఆయన రాజమహేంద్రవరం నుంచి పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. తాజాగా ఆయన వైకాపాలో చేరతారని ప్రచారం నడుస్తోంది. పాదయాత్రలో ఉన్న జగన్‌ను కలిసేందుకు శనివారం శ్రీకాకుళం వెళ్తారనే వార్తలు వచ్చాయి. ఆ విషయాన్ని ఆయన, వైకాపా నేతలు కూడా ధ్రువీకరించారు. కానీ భేటీ జరగలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం చంద్రబాబు, పవన్‌లతో ఆయన భేటీ అవ్వడం చర్చనీయాంశమైంది.



అవినీతి చక్రవర్తి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్ జగన్. పక్కన తమ్మినేని సీతారాం, భూమన కరుణాకర్‌రెడ్డి తదితరులు

6.17 లక్షల కోట్లు దోచుకున్నారు

- సోంపేటలో చంద్రబాబుపై జగన్ ధ్వజం
- అవినీతి చక్రవర్తి పేరిట పుస్తకం విడుదల

సోంపేట, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగున్నరేళ్లలో రూ.6.17 లక్షల కోట్లు దోచుకున్నారని, ఆయన అవినీతి, అక్రమాలకు సంబంధించిన పూర్తి వివరాల జీవోలతో తెలుగు, ఆంగ్ల భాషల్లో పుస్తకం ముద్రించామని వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ పేర్కొన్నారు. 'అవినీతి చక్రవర్తి' పేరిట ముద్రించిన పుస్తకాన్ని వైకాపా నాయకులతో కలిసి ఆదివారం శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం పలాసపురంలో ఆయన ఆవిష్కరించారు. నవంబరు 2018 వరకు జరిగిన అక్రమాల్లో రూ.6,17,585.19 కోట్ల దోపిడీ జరిగిందని జగన్ ఆరోపించారు. అమరావతి ఒక అంతర్జాతీయ కుంభకోణమని, అన్ని వ్యవస్థలు భ్రష్టుపట్టించారని అన్నారు. లంచాలు, ముడుపులు, వాటాలు, కమీషన్లు.. ఇలా వీలున్న చోటల్లా బహిరంగంగా వసూళ్లు జరుగుతున్నాయని, లంచం లేకుండా రాష్ట్రంలో ఏ పనీ జరగడం లేదని ఆరోపించారు. చంద్రబాబుపై ప్రచురించిన పుస్తకంలో సాక్ష్యాధారాలతో పాటు వివరాలు ఉన్నాయని, వీటిని అన్ని దర్యాప్తు సంస్థలతో పాటు రాష్ట్రపతి, ప్రధాని, అన్ని రాష్ట్రాల గవర్నర్‌లకు పంపిస్తామన్నారు. లోక్‌సభ, రాజ్యసభలకు సంబంధించిన అన్ని రాష్ట్రాల ఎంపీలకు, ముఖ్యమంత్రులకు, ఇతర ప్రముఖులకు పుస్తకాలను అందిస్తామని చెప్పారు.



100% కుర్రాళ్లు

నిజంగా ప్రజలు ఇంతలా ఆలోచించగలరా...
నిజంగా ఓ గ్రామం ఇంతలా మారగలదా...
... వారు చేసి చూపించారు.
ఒకప్పుడు ఎన్నో సమస్యలకు చిరునామా అయిన ఆ పల్లె ఇప్పుడు అభివృద్ధికి కేరాఫ్‌గా మారింది.
నక్సలైట్లు, పోలీసుల పదఘట్టనలతో అల్లాడిన ఆ ఊరు ఇప్పుడు ప్రగతి పాటకు ప్రతిధ్వని అయింది.
ఒకనాటి అన్నల మల్కాపూర్ నేటి ఆదర్శ మల్కాపూర్‌గా మారిన వైనం అద్భుతం... అసామాన్యం.
దీనికంతటికీ కారణం ఆ కుర్రాళ్ల సంకల్పం...

2015... గ్రామజ్యోతిలో భాగంగా తూప్రాన్ మండలంలోని ఒక పల్లెను దత్తత తీసుకోవాలని అప్పటి జిల్లా పాలనాధికారి రోనాల్డ్‌రోస్ భావించారు. మారుమూల పల్లె అయితే బావుంటుందని సూచించడంతో చివరకు మల్కాపూర్‌ను ఎంచుకున్నారు. ఆ సంవత్సరం ఆగస్టు 25న గ్రామస్థులతో ఆయన తొలిసారిగా సమావేశమయ్యారు. విషయం చెప్పారు. కానీ కనీసం ఆయన మాటలను కూడా చాలా మంది వినలేదు. కొందరు అసలే మాత్రం ఆసక్తి చూపలేదు. దీంతో ఆయన వారిలో మార్పు తేవడం సాధ్యమవుతుందా? అని ఆలోచించారు. ఒక దశలో వీరిని మార్చగలనా అనే సందేహమూ ఆయనకు వచ్చింది. ఈ క్రమంలోనే ఆ గ్రామ యువతలో ఉన్న శక్తిని గుర్తించిన ఆ అధికారి...కచ్చితంగా వీరు తామేంటో నిరూపించుకుంటారని బలంగా నమ్మారు. ఇదే విషయాన్ని వారితోనూ చెప్పారు. ఎవరో వచ్చి మన ఊరి బాగు కోసం ఇంతలా ఆలోచిస్తున్నారు... మరి మనం పుట్టిన పల్లెను అభివృద్ధి చేసుకునేందుకు మనం ఇంకెంత శ్రమించాలనే ఆలోచన



గ్రామంలోని యువకుల్లోనూ మొదలైంది. ఏదైనా ఒక పనిని ప్రారంభించి తమ సత్తా ఏంటో నిరూపించుకోవాలనుకున్నారు. అలా తొలుత గ్రామంలో రహదారులకి ఇరువైపులా అయిదు వందల మొక్కలు నాటారు. 2016 వేసవిలో నీళ్లు లేక మొక్కలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. దీంతో గ్రామ యువకులు వాటిని దత్తత తీసుకొని బిందెలతో నీళ్లు మోసుకొచ్చి మొక్కలను బతికించుకున్నారు. దీంతో అధికారులకు వీరిపై పూర్తిగా నమ్మకం వచ్చింది. ప్రతి ఆదివారం అంతా కలిసి రెండు గంటల పాటు 'స్వచ్ఛత' కోసం కేటాయించాలని నిర్ణయించుకున్నారు. అలా మొదలు పెట్టిన వారు డిసెంబరు 30 ఆదివారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ 161 వారాలు పూర్తి చేశారు. స్వచ్ఛత కార్యక్రమం పక్కాగా సాగేలా గ్రామాన్ని ఆరు భాగాలుగా విభజించి ఒక్కో భాగానికి ఒక నాయకుడి పేరు పెట్టి ముందుకు సాగారు. ఏ పని చేయాలన్నా సమావేశం నిర్వహించుకోవడం, అందరి ఆలోచనలు తీసుకోవడం, మెరుగైన మార్గాన్ని ఎంచుకోవడం... ఇదే వారి అభివృద్ధి మంత్రం. లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం.. రికార్డు స్థాయిలో దానిని అధిగమించడం యువకులంతా అలవాటుగా చేసుకున్నారు. మూడేళ్ల వ్యవధిలో అన్నల మల్కాపూర్‌ను ఆదర్శ మల్కాపూర్‌గా తీర్చిదిద్దారు. 'శభాష్... మల్కాపూర్ యువత' అని అనిపించుకున్నారు. గ్రామాభివృద్ధికి ఆయనతో రూ.6కోట్ల నిధులు ఇప్పించుకోగలిగారు.

నిన్నటి కథ

మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని ఒక కుగ్రామం మల్కాపూర్. మండల కేంద్రానికి తొమ్మిది కిలోమీటర్ల దూరమే అయినా అభివృద్ధికి మాత్రం ఎంతో దూరం. ఒకప్పుడు నక్సలైట్ల ప్రాబల్యంతో అన్నల మల్కాపూర్‌గానూ ముద్రపడింది. కనీసం ఊర్లోకి రావడానికి సరైన దారి కూడా ఉండేది కాదు. మా బాధలు మావి... గ్రామంలోని సమస్యలతో మాకేం సంబంధమన్నట్లుగా ప్రజలు ఎవరి పనుల్లో వారుండేవారు. అక్కడి ప్రజలు అందిపుచ్చుకోలేరనే సందేహంతో అధికారులు కూడా అక్కడ ఏ పథకమూ అమలు చేసేవారు కాదు.



ఆ కథను మార్చారు..

మిగతా గ్రామాల్లోలాగే ఇక్కడా యువకులున్నారు. యువత అంటే అలాంటిలాంటి వాళ్లు కాదు. తమ గ్రామం కోసం ఏదైనా చేయాలనే తపన వారిది. చిన్నప్పటి నుంచి తాము చూసిన సమస్యలకు చరమ గీతం పాడాలని సంకల్పించుకున్నారు. దీనికోసం మూడేళ్ల క్రితం ఒకరు కాదు... ఇద్దరు కాదు... ఊర్లో ఉన్న 148 మందీ ఏకమయ్యారు. వీరికి ఓ ఉన్నతాధికారి సహకారం తోడైంది. అప్పుడు మొదలైంది ఆ గ్రామోద్యమ కథ.

ఫలాలివి...

- గ్రామంలో మొత్తం 339 ఇళ్లుండగా కేవలం 34 మంది ఇళ్లలోనే మరుగుదొడ్లు ఉండేవి. అందరి ఇళ్లలో తప్పనిసరిగా వీటిని నిర్మించుకునేలా చూడాలనుకున్నారు. ఇందుకోసం యువకులంతా సమావేశమై అందరినీ ఒప్పించాలని నిర్ణయించుకున్నారు. కేవలం 45 రోజుల వ్యవధిలోనే 305 మరుగుదొడ్ల నిర్మాణాలను వారే దగ్గరుండి పూర్తి చేసేలా చూశారు.
- నిర్మించుకున్న వారిలో దాదాపు 30శాతం మంది వాటిని వినియోగించుకోవడానికి మాత్రం ఆసక్తి చూపలేదు. దీంతో బృందాలుగా ఏర్పడి వారికి నచ్చజెప్పడం మొదలుపెట్టారు. కొద్దిరోజుల్లోనే అందరూ వాడేలా చేయడంలో విజయం సాధించారు. ఇదే ఊపులో ప్రతి ఇంటి వద్దా ఇంకుడుగుంత ఉండేలా నిర్మాణాలు పూర్తి చేయగలిగారు. వీటికి అదనంగా గ్రామంలో మరో ఆరు సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించారు.
- కలెక్టర్ రోనాల్డ్‌రోస్ ఇచ్చిన పిలుపును అందిపుచ్చుకున్న యువత మిషన్ భగీరథలో భాగంగా ఒకే రోజు పైపులైన్లను పరిచి ఇంటింటికీ నల్లా కనెక్షన్లు పూర్తి చేసేందుకు ముందుకొచ్చారు. ముందుగానే ఇదే అంశమై సమావేశం నిర్వహించుకున్నారు. 20శాతం మంది సాంకేతిక సిబ్బంది తోడుగా యువకులే అన్ని పనుల్లో భాగస్వాములయ్యారు. అలా ఉదయం 7గంటలకు మొదలుపెట్టి రాత్రి 11లోగా ప్రతి ఇంటికీ నల్లా బిగించి ఔరా అనిపించారు.
- గ్రామం మధ్యలో రాళ్లతో కూడి ఉన్న చిన్న గుట్టను పార్కుగా మార్చాలనుకున్నారు. దాదాపు అయిదురోజులు 100 మందికి పైగా యువకులు శ్రమించి చివరకు అందమైన రాక్ గార్డెన్‌కు రూపమిచ్చారు. ఇక్కడ మొక్క నాటిన కేసీఆర్.. ఇది రాక్ గార్డెన్ కాదు.. గోల్డెన్ రాక్ గార్డెన్ అంటూ ప్రశంసించారు.
- ప్రస్తుతం గ్రామంలో కుటుంబాల వారీగా విశ్లేషిస్తూ, అందరూ మెరుగైన ఉపాధి పొంది ఉన్నతంగా ఎదిగేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా తొలిదశలో కూరగాయల సాగు పెంచడంపై దృష్టిసారించారు. పందిరి సాగు దిశగా రైతుల్లో చైతన్యం తేవడంతో రైతులు లాభాలూ కళ్లజూస్తున్నారు.

ఈ గ్రామంలో 2017 వరకు ఏడు బెల్టు షాపులు ఉండేవి. కొందరు యువకులూ వాటిని నిర్వహించే వారు. వీటిని మూసేయాలనే అంశమై గ్రామ యువకులంతా కలిసి సమావేశమయ్యారు. అందులో గొలుసు దుకాణాలను నడుపుతున్న కుటుంబాల వారూ ఉన్నారు. వీటిని బంద్ చేయాలనే చర్చ జరుగుతుండగానే వారే స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. తాము కచ్చితంగా రేపటి నుంచి మద్యం అమ్మకాలు చేపట్టమని సంతకాలు చేసి మరీ పోలీసు శాఖ అధికారులకూ ఆ పత్రాన్ని సమర్పించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ గ్రామంలో మద్యం అమ్మడం మాయమైంది.



100శాతం మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగం

100శాతం ఇంకుడు గుంతలు

100శాతం ఇంటింటికీ నల్లా ద్వారా తాగునీరు

100శాతం సోలార్ వీధి దీపాలు

100శాతం ఇంటింటా చెత్త సేకరణ

100శాతం మద్య నిషేధం

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్కరి కంటి సమస్యలకు పరిష్కారం చూపాలనే లక్ష్యంతో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందుకు ఈ గ్రామాన్నే తొలి వేదికగా ఎంచుకున్నారు. విషయం తెలుసుకొని ఉప్పొంగిన ఈ గ్రామ యువకులు ముఖ్యమంత్రికి మరిచిపోలేని బహుమతి అందించారు. అయిదే రోజుల్లో గ్రామంలోని 752 మందితో నేత్రదానం చేయించి ఆ పత్రాలను ఆయనకు కానుకగా ఇచ్చారు. అతి తక్కువ సమయంలో ఇంత మందిని అంగీకార పత్రాలపై సంతకాలు చేయించిన విషయానికి ఆశ్చర్యపోయిన కేసీఆర్... ఎందుకమ్మా వాళ్లు అడగ్గానే కళ్లు ఇస్తానని ఒప్పేసుకున్నావ్ అని ఒక వృద్ధురాలిని అడగ్గా... '**మా పిల్లలు ఏం చేసినా మంచే చేస్తారు. మా ఊరి బాగు కోసం వారు ఎంతటి కష్టమైనా పడతారు. వాళ్లు అడిగాక ఎందుకు కాదంటాం... సంతోషంగా ఇచ్చేస్తా**'మంటూ మురిపెంగా చెప్పింది. గ్రామ ప్రజల మనసుల్లో ఈ యువకులు ఎంత బలమైన ముద్ర వేశారో స్పష్టం కావడానికి ఈ ఒక్క మాట చాలదూ..!

- రాజేందర్ సురకంటి, మెదక్
- సాటకూరి సందీప్ కుమార్, తూప్రాన్

పిచ్చుకల రక్షణ కోసం బ్రహ్మాస్త్రం





ఊరంటే... జనమేనా?
చెట్టు, పుట్ట, పక్షులు, పశువులు... అన్నీ...
కానీ మనం బతకడం కోసం వాటిని సర్వనాశనం చేయాలా...
ఇదే ప్రశ్న ఆ జానపదులను కలవర పెట్టింది.
ఒకప్పుడు ఇళ్ల ముందు సందడి చేసిన ఆ బుల్లి ప్రాణుల ఆక్రోశం వారిని ఆవేదనకు గురిచేసింది.
ఓ జీవ జాతి అంతరించిపోతుందన్న కలవరపెట్టే వాస్తవాలు వారికి గగుర్పాటు కలిగించాయి.
ఫలితం... ఓ పిచ్చుకల రక్షణ కోసం మహోద్యమం పురుడుపోసుకుంది.
ఊరూ, వాడా... పిల్లా, పెద్దా... అందరూ ఏకమయ్యారు.
పిచ్చుకలను రక్షించి ప్రకృతి పరిరక్షణలో దేశానికే మార్గం చూపారు.
ఈ ఉద్యమానికి తొలి వేదిక ఒడిశా రాష్ట్రం బ్రహ్మపుర ప్రాంతంలోని ఓ శివారు గ్రామం...

ఏం చేశారంటే..

పురాణబొంధొ... గంజాం జిల్లాలోని ఓ మత్స్యకార గ్రామం. అక్కడ ఆలివ్ రిడ్లీల సంరక్షణకు ఉద్యమిస్తున్న రుషికుల్యా సాగర ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ సమితి (ఆర్ఎస్‌టీపీసీ) ఉంది. సాగర జీవులను కాపాడేందుకు విశేష కృషి చేసిందా సంస్థ. పిచ్చుకల జాతికి జరుగుతున్న ఆపదను గుర్తించిన లింగరాజ పండా అనే ప్రకృతి ప్రేమికుడు ఆ విషయాన్ని ఆర్ఎస్‌టీపీసీ కార్యదర్శి రవీంద్రనాథ్ సాహుకు చేరవేశారు. దాంతో పిచ్చుకల సంరక్షణ ఉద్యమం పురుడుపోసుకుంది. తర్వాత్తర్వాత గంజాం జిల్లాలోనే కాకుండా ఒడిశాలోని అనేక జిల్లాలకు విస్తరించిన ఉద్యమానికి వాళ్లు ఎంచుకున్న మార్గం చాలా వినూత్నమైంది.

ప్రకృతికి తొలి సహకారం అందాల్సింది ప్రకృతి నుంచే. ఈ సిద్ధాంతాన్ని నమ్మిన పండా, సాహు అందుకు తగ్గట్లే ప్రణాళికలు రచించారు. మట్టి కుండలతో కృత్రిమ గూళ్లు ఏర్పాటుచేశారు. తొలుత పురుణాబొంధొ గ్రామంలో వీటిని అమర్చారు. అక్కడ వాటికి కావాల్సిన ఆహారాన్ని సమకూర్చారు. క్రమేపీ వీటిని పిచ్చుకలు ఆవాసంగా చేసుకోవడం ప్రారంభించాయి. పిచ్చుకల సంరక్షణపై వివిధ పాఠశాలల్లో విద్యార్థులను చైతన్యపరిచిన ఆర్ఎస్‌టీపీసీ ప్రతినిధులు వారికి ప్లైవుడ్‌తో తయారు చేసిన గూళ్లు పంపిణీచేశారు. రిడ్లేల సంరక్షణతో పాటు పిచ్చుకల సంరక్షణ ఉద్యమాన్ని సుందర్‌గడ్ జిల్లాకు విస్తరించారు. సోన్‌పూర్‌లోనూ స్థానికుల సహకారంతో ఉద్యమాన్ని చేపట్టారు.

ఇంకా...

గంజాం జిల్లా బ్రహ్మపురకు సమీపాన ఉన్న గుంటొబొంధొకు చెందిన యువ సంస్థ 'ఆంచలిక వికాస్ పరిషత్ (ఏవీపీ)' 2011లో పిచ్చుకల సంరక్షణకు నడుం బిగించింది. అనేక గ్రామాల్లోని ఇళ్ల ఆవరణలో కృత్రిమ గూళ్లు అమర్చారు. వాటికి రోజూ ఆహారంగా ధాన్యం వేసే బాధ్యతను ఆయా గ్రామాల ప్రజలకు అప్పగించారు. ఈ చర్యలు మంచి ఫలితాలిచ్చాయి.

- బ్రహ్మపుర అటవీ శాఖ, బ్రహ్మపుర సబుజ వాహిని, మార్వాడీ మహిళా సమితి బ్రహ్మపుర శాఖ, బాక్సింగ్ ఒడిశాలు అండగా నిలిచాయి. గంజాం జిల్లాలోని 22 సమితులకు ఉద్యమాన్ని విస్తరించారు. ప్రతి సమితిలో ఒక్కో సమన్వయకర్తకు పక్షుల సంరక్షణ బాధ్యతను అప్పగించారు. తర్వాత దశలో గజపతి, అనుగుల్, నువాపడ, నయాగడ్ జిల్లాల్లో పిచ్చుకల ఉద్యమాన్ని అక్కడి సంస్థల సహకారంతో ప్రారంభించడానికి సన్నాహాలు చేశారు. ఆంచలిక వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో మొబైల్ టవర్ల రేడియేషన్ స్థాయిని నిర్ధారించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.



-రాజాన శ్రీనివాస్, బ్రహ్మపుర

శభాష్... శ్రీనివాస్

పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని ఫైయింక్లెయిన్ కాలనీలో మంథెన శ్రీనివాస్ ఇంటికి వెళ్లి చూసిన వారెవరికైనా ఆశ్చర్యం కలగడం ఖాయం...

ఎనిమిదేళ్లుగా తన పెరట్లో ఉన్న కొద్ది పాటి స్థలాన్నే పక్షులకు ఆవాసంగా మార్చాడు.

ఎక్కడి నుంచో ఎగిరొచ్చే పక్షులకు తన ఇంటిని అతిథి భవనంగా తీర్చిదిద్దాడు. వాటికి అనువైన గూళ్లను డజన్ల కొద్దీ ఏర్పాటుచేయడమే కాదు... వాటికి మంచి ఆహారం, శుభ్రమైన నీటిని కూడా అందుబాటులో పెడుతున్నాడు.

శ్రీనివాస్ తండ్రి మల్లయ్య విశ్రాంత సింగరేణి ఉద్యోగి కావడంతో ఫైవ్‌యింక్లెయిన్ కాలనీలోనే నివాసం ఉంటున్నారు. రామగుండంలో రోజురోజుకు బొగ్గుబావుల తవ్వకం, పరిశ్రమల స్థాపన, మొబైల్‌ఫోన్ల వాడకం పెరిగిపోవడంతో పర్యావరణ కాలుష్యం, రేడియేషన్ పెరిగి పక్షుల సంఖ్య తగ్గిపోవడాన్ని శ్రీనివాస్ గమనించారు. శ్రీనివాస్ తల్లి సావిత్రికి మొక్కలంటే మక్కువ. ఇంటి చుట్టుపక్కల మందారం, కనకాంబరం,మల్లె లాంటి పూల మొక్కలతో పాటు కరివేపాకు, టేకు, దొండ, దానిమ్మ, జామ, వేప చెట్లను పెంచేది. అక్కడకు కొన్ని పక్షులు ఇలా వచ్చి అలా వెళ్లేవి. ఎండాకాలంలో రామగుండంలో దేశంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. దీంతో చాలా పక్షులు తిండి గింజలు, నీళ్లు లేక అల్లాడుతూ చెట్టుమీదే ప్రాణాలు కోల్పోయేవి. వీటిని గమనించిన శ్రీనివాస్ ఆ చెట్లపై చెక్కగూళ్లు నిర్మించారు. వీటికి మేతకోసం అతని భార్య ప్రియాంక సహకారంతో ఆరు రకాల అనువైన ఫుడ్ ఫీడర్స్‌ను తెప్పించారు. ప్రస్తుతం ఈ దంపతులకు నిరంతరం పక్షుల బాగోగులు చూడడమే ఓ పనిగా మారింది. దీంతో వీరింటికి పక్షుల రాక పెరిగిపోయింది.

ఆ ఎనిమిది రకాలూ... బూరుగు పిట్ట, గజిబిజి పిట్ట, ఊరపిచ్చుక, బుర్క పిట్టలు, పొల్క, నల్ల, ఆకుపచ్చపిట్టలు (గ్రీన్ ఉడ్ పిక్కర్స్), హమ్మింగ్ బర్డ్స్‌లకు ఇప్పుడు వీరి ఇల్లు ఓ సందర్శన స్థలం. రోజూ 2 కిలోల ధాన్యం, వారానికి ఒకసారి కొర్రలు, పరిశుభ్రమైన తాగునీళ్లను పాత్రల్లో శ్రీనివాస్ ఏర్పాటు చేస్తారు. హమ్మింగ్ బర్డ్స్‌లకు ముక్కు పెద్దగా ఉండటం వల్ల అవి ముక్కుద్వారా నీటిని తీసుకుంటాయి. దీంతో పంచదార కలిపిన మంచినీటిని ప్రత్యేకంగా ఉంచుతున్నారు. ఖర్చు పెద్ద సమస్య కాదని పక్షుల పెంపకం, వాటి బాగోగులే ముఖ్యమని చెబుతున్నాడీ..పక్షి ప్రేమికుడు.

- ఎం.గణేష్ కుమార్, పెద్దపల్లి





ఈ బామ్మ సూపరండీ...

యాభై దాటాక చెట్టెక్కమంటే దిక్కులు చూస్తారు. అరవై దాటాకా గుట్టలెక్కమంటే గుటకలు వేస్తారు. ఈ బామ్మ మాత్రం సెంచరీ కొట్టాక కూడా అంతకుమించిన సాహసాలు చేస్తోంది. 102 ఏళ్ల వయసులో స్కైడైవింగ్ చేసి అదుర్స్ అనిపించింది. అల్లంత దూరాన ఆకాశం నుంచి అలవోకగా దూకేసిన ఆ బామ్మ పేరు ఐరిన్ ఓషియా. ఆస్ట్రేలియా దేశవాసి. స్కైడైవింగ్ చేయాలనుందన్న బామ్మ కోరికను ఆమె కుటుంబసభ్యులు మన్నించారు. వాళ్లతో పాటు స్నేహితులు కూడా వచ్చి సాహసానికి ఒడిగడుతున్న బామ్మకు అభినందనలు తెలిపారు. వందల అడుగుల ఎత్తుకు వెళ్లిన విమానం నుంచి డైవింగ్ నిపుణుడితో కలిసి దూకేసింది. గాల్లో గింగిరాలు కొడుతూ.. ఆనందంలో తేలిపోతూ.. భువికి చేరుకుంది. సహజంగా స్కైడైవింగ్ లాంటి సాహసక్రీడల్లో పాల్గొనేందుకు యువకులు సైతం ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు. భయం భయంగానే రంగంలోకి దూకుతారు. ఈ ఆసిస్ బామ్మ మాత్రం ఏ కంగారూ లేకుండా సాహసాన్ని పూర్తి చేసి.. స్కైడైవింగ్ చేసిన పెద్ద వయస్కురాలిగా రికార్డు తిరగరాసింది. 2016, 2017లోనూ ఐరిన్ స్కైడైవింగ్ చేసింది. అప్పుడు నెలకొల్పిన చరిత్రను తనే చెరిపేసి కొత్త రికార్డును సృష్టించింది. ఈ నూటారెండేళ్ల బామ్మ ఆటవిడుపు కోసం చేసిన విన్యాసమిది. ఈ వయసులో ఆమె మరో గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కొన్నేళ్ల కిందట ఆమె కూతురు మోటార్ న్యూరాన్ వ్యాధితో కన్నుమూసింది. నాటి నుంచి ఆ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. వయసు సహకరించకున్నా.. చేతనైనంత చైతన్యం కలిగిస్తోంది. నిధులు సేకరించి నలుగురి శ్రేయస్సుకి ఖర్చు చేస్తోంది.


ఈనాడు సినిమా

కెమెరా ముందూ అదే అలవాటైంది!

పాత్ర క్లాస్ అయినా.. మాస్ అయినా అందులో ఒదిగిపోవడమే తనకి తెలుసంటోంది కీర్తి సురేష్. ఆమె ఆలోచనలకి తగ్గట్టుగానే సినిమాలు చేస్తోంది. 'మహానటి'తో అలరించిన కీర్తి, 'పందెంకోడి 2'లో మాస్ పాత్రలోనూ మెరిసింది. నేను ఇవే చేస్తానంటూ కొన్ని పాత్రలకే పరిమితమైతే నా ప్రతిభ ఎలా బయటికొస్తుందని ప్రశ్నిస్తోంది. ప్రస్తుతం తమిళంలోనే బిజీగా గడుపుతుతోందామె. చదువుకొనే రోజుల్లో ఎంత నిజాయతీగా ఉండేదాన్నో సినిమా రంగంలోకి వచ్చాకా అదే అలవాటైందని చెబుతోంది కీర్తి. "స్కూల్లో కానీ, కాలేజీలో కానీ పరీక్ష రాసి హాల్ నుంచి బయటికి రాగానే ఫలితంపై ఓ అంచనాకి వచ్చేదాన్ని. ఎలా రాశామనేది రాసిన మనకంటే ఎక్కువ ఎవరికి తెలుస్తుంది? అందుకే చాలా నిజాయతీగా ఎలా రాశానో ఇంట్లో చెప్పేదాన్ని. ఇప్పుడు కెమెరా ముందూ అదే అలవాటైంది. నేనెలా నటిస్తున్నాననేది ఆ క్షణంలోనే అర్థమైపోతుంది. అందుకే సెట్‌లో అస్సలు రాజీపడకుండా నటించి సంతృప్తితోనే బయటికొస్తుంటా" అంటోంది కీర్తి సురేష్.


కీర్తి సురేష్

సైఫ్ ఉప్పు త్యాగం


సైఫ్ ఆలీఖాన్

బాలీవుడ్ కథానాయకుడు సైఫ్ ఉప్పుకి దూరంగా ఉంటున్నారు. ఆరోగ్యపరమైన సమస్యలొచ్చి అనుకోకండి. ఓ సినిమా కోసం. సైఫ్ ప్రస్తుతం ఓ వెబ్ సిరీస్‌తో పాటు 'తానాజీ' చిత్రంతో బిజీగా ఉన్నారు. అజయ్‌దేవగణ్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో సైఫ్‌ది ప్రతినాయకుడి పాత్ర. అందుకోసం ఆయన ప్రత్యేకంగా సిద్ధమవుతున్నారు. ఇందులోని యాక్షన్ సన్నివేశాల్లో చొక్కా లేకుండా కనిపిస్తారట సైఫ్. అందుకోసం ప్రత్యేక శిక్షకుడిని పెట్టుకొని మరీ కసరత్తులు చేసేస్తున్నారు. అంతేకాదు తన ఆహారంలో ఉప్పును పూర్తిగా దూరం పెట్టేశారట. "తానాజీ' కోసం సైఫ్ చాలా కష్టపడుతున్నారు. ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటున్నారు. ఈ మధ్య విహారం కోసం స్విట్జర్లాండ్, దక్షిణాఫ్రికా వెళ్లినప్పుడూ కఠినమైన ఆహార నియమాల్నే పాటించారు. అక్కడా రెండు పూటలా వ్యాయమాలు చేసేవారు. ఒక్కోసారి సెట్‌లోనూ కసరత్తులు చేస్తున్నార"ని సైఫ్ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

రజనీ అభిమానులంతా కలసి చేసిన సినిమా పేటా


మాళవిక, బాబీ సింహా, కార్తీక్ సుబ్బరాజు, అనిరుధ్, భాస్కరభట్ల, శ్రీకాంత్, అశోక్ వల్లభనేని, అంబికా కృష్ణ, వై.వి.యస్.చౌదరి

రజనీకాంత్ నటించిన చిత్రం 'పేటా'. కార్తిక్ సుబ్బరాజ్ దర్శకుడు. తెలుగులో ఈ చిత్రాన్ని అశోక్ వల్లభనేని విడుదల చేస్తున్నారు. గురువారం 'పేటా' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక నిర్వహించారు. కథానాయిక మాళవిక మాట్లాడుతూ "రజనీకాంత్‌గారితో పనిచేయాలన్న కల ఈ సినిమాతో తీరింది. అనిరుథ్ మంచి సంగీతం అందించార"న్నారు. మరో నాయిక మేఘా ఆకాష్ మాట్లాడుతూ "ఈ సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉంది. కెమెరామెన్ తిరు అందంగా చూపించారు. మంచి టీమ్ దొరికింద"న్నారు. "వల్లభనేని అశోక్ మా కుటుంబ స్నేహితుడు. 'నవాబ్', 'సర్కార్'లతో విజయాలు సాధించాడు. ఈ సంక్రాంతికి పెద్ద సినిమాలు విడుదల అవుతున్నాయి. వాటి మధ్య 'పేటా'ను విడుదల చేయడం ఓ సాహసం. అన్ని సినిమాలతో పాటు 'పేటా' బాగా ఆడాలని కోరుకుంటున్నా. చిరంజీవి, రజనీకాంత్‌లే మాకు స్ఫూర్తి. వాళ్లని చూస్తూ పెరిగాం. రజనీ చిత్రాలు తెలుగులోనూ బాగా ఆడతాయి. ఆ ఆనవాయితీ 'పేటా' కొనసాగించాల"న్నారు శ్రీకాంత్. నిర్మాత మాట్లాడుతూ "ఈ సంక్రాంతికి పోటీ ఎక్కువగా ఉంది. థియేటర్లు తక్కువ దొరికాయి. అయినా సరే ప్రేక్షకుల మీదున్న నమ్మకంతోనే ఈ సినిమా విడుదల చేస్తున్నాం. తొలి షో పడగానే, మౌత్ టాక్‌తో మరిన్ని థియేటర్లు ఇస్తారన్న నమ్మకం ఉంద"న్నారు. "ఈ సినిమాలో మంచి పాట రాసే అవకాశం దక్కింద"న్నారు భాస్కరభట్ల రవికుమార్. "జపాన్‌లోనూ అభిమానుల్ని సంపాదించుకున్న దక్షిణాది కథానాయకుడు రజనీకాంత్. ఇక్కడా మంచి కథానాయకులున్నారని ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి రజనీ. ఆయన సినిమా ఈ సంక్రాంతికి విడుదల కావడం ఆనందంగా ఉంద"న్నారు అంబికా కృష్ణ. "రజనీకాంత్ పాటల్లో చాలా మంచి మాటలు, సూక్తులు వినిపిస్తాయి. అలాంటి పాట ఒకటి రాశా. ఈ పాటలో రజనీ కుర్రాడిలా కనిపిస్తార"న్నారు రామజోగయ్య శాస్త్రి. వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ "నిర్మాతలు లెక్కలతో వ్యాపారం చేస్తారు. దాంతో పాటు సాహసం ఉన్న వ్యక్తి అశోక్. థియేటర్లు దొరకని పరిస్థితుల్లోనూ 'నవాబ్'ని విడుదల చేశారు. 'సర్కార్' సమయంలోనూ కొన్ని క్లిష్టపరిస్థితులు ఎదురయ్యాయి. ఈసారీ అంతే. ఆ ధైర్యమే విజయాన్ని అందిస్తుంది. 'పేటా'లో రజనీకాంత్‌ని చూస్తుంటే ఆయన అభిమానులకు నచ్చే సినిమా అవుతుందనిపిస్తోంది. సంగీత దర్శకుడు అనిరుథ్ మాట్లాడుతూ "పేటా ఓ కలల సినిమా. కార్తీక్ సుబ్బరాజ్ దేశంలోనే అత్యుత్తమ దర్శకుడు. ఆయన రజనీ అభిమానినే. రజనీ అభిమానులంతా కలసి రజనీ అభిమానుల కోసం తీసిన సినిమా ఇది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "పేటా' మా అందరికీ ఇదో డ్రీమ్ ప్రాజెక్ట్. అభిమానులకు పండగలా ఉంటుందీ సినిమా. ఈ సంక్రాంతికి గట్టి పోటీ ఉంది. ప్రేక్షకులు మంచి చిత్రాల్ని ఆదరిస్తారు. పేటా వాళ్ల ఆదరణకు నోచుకుంటుందన్న నమ్మకం ఉంద"న్నారు. 'రజనీసార్ పక్కన నటించడం గొప్ప వరం"అన్నారు బాబీ సింహా.



'భారత్'లోనూ పెళ్లి కాదు

బాలీవుడ్‌లో ఈ మధ్య వరసగా పెళ్లిళ్లే. సోనమ్‌కపూర్, దీపికా పదుకొణె, ప్రియాంక చోప్రా పెళ్లి చేసేసుకున్నారు. బాలీవుడ్ మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ సల్మాన్‌ఖాన్ పెళ్లికి దూరంగా ఉంటున్నాడు. అభిమానులు కూడా మా హీరో పెళ్లెప్పుడు చేసుకుంటాడని ఆశగా ఎదురుచూస్తున్నారు. కానీ వాళ్లకి తీవ్ర నిరాశ కలిగించే విషయమే చెప్పాడు సల్మాన్. ఈ మధ్య సల్మాన్ ఓ షోకి అతిథిగా వెళ్లాడు. అందులో వ్యాఖ్యాత 'ఈ మధ్య బాలీవుడ్ తారలు ఎక్కువమందే పెళ్లి చేసుకున్నారు. మరి మీదెప్పుడు?' అని అడిగితే 'భారత్'లో నేను పోషిస్తున్న పాత్రనే అనుసరిస్తున్నాను అని చెప్పాడు. "భారత్'లో నా పాత్రకు 72 ఏళ్లు వచ్చినా పెళ్లి కాదు. అది నాకు బాగా నచ్చింది. నిజ జీవితంలోనూ అదే అనుసరిస్తాను"అని చెప్పాడు సల్మాన్.

పంచ్ డైలాగ్

మనం చదివిన చదువులు నాయకులకు కాదు. జనాలకు ఉపయోగపడాలి
చిత్రం: సరైనోడు
- పంపినవారు: ఎమ్.శోభాదేవి, మియాపూర్

గీతోపదేశం

ఉన్నవాడికి తింటే అరగదు
లేనివాడికి తిండే దొరకదు
పరుపులున్నా పట్టదు నిదర
కరకు నేలను గురకలు వినరా
హెచ్చు తగ్గులు తొలిగే రోజు
ఎప్పుడొస్తుందో ఏమో

గీతం: రింజిం రింజిం హైదరాబాద్...
చిత్రం: మట్టిలో మాణిక్యం
రచన: సి.నారాయణరెడ్డి
– పంపినవారు: పి.సత్యనారాయణ, హైదరాబాద్

తాతయ్య బయోపిక్ మావయ్య చేతుల్లోనే

ఎన్టీఆర్, ఏఎన్నార్ చిత్రసీమకు రెండు కళ్లు. ఎన్టీఆర్ కథ గురించి చెబుతూ అక్కినేని గురించి చెప్పకపోతే ఎలా? అందుకే 'ఎన్టీఆర్' బయోపిక్‌లో అక్కినేని పాత్రకు కూడా సముచిత స్థానం దక్కింది. ఈ పాత్రలో అక్కినేని మనవడు సుమంత్ నటించడం విశేషం. 'ఎన్టీఆర్' తొలి భాగం కథానాయకుడు 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా సుమంత్ చెప్పిన కబుర్లు ఇవి.



తాతయ్య పాత్రలో మిమ్మల్ని అభిమానులు ఎలా ఆదరిస్తారో అనే ఒత్తిడి ఏమైనా ఉందా?

అదేం లేదు. ఫస్ట్‌లుక్ అందరికీ బాగా నచ్చింది. అదే కొండంత ధైర్యం ఇచ్చింది. పైగా ఈ పాత్రని క్రిష్ మలచిన విధానం బాగుంటుంది. క్రిష్ అంటే నాకు చాలా ఇష్టం. తాతగారి పాత్ర గురించి క్షుణ్నంగా చెప్పారు. ఆయనపై నమ్మకంతో ఈ సినిమా ఒప్పుకున్నా. క్రిష్, బాలకృష్ణగారు.. ఇద్దరిలో ఎవరు లేకపోయినా ఈ సాహసం చేసేవాణ్ని కాదు.

ఎన్టీఆర్‌గా బాలకృష్ణ చాలా గెటప్పుల్లో కనిపిస్తున్నారు. మరి మీ మాటేంటి?

నా పాత్రలో ఐదారు గెటప్పులు ఉంటాయి. వాటిల్లో అరవై ఏళ్లవాడిగా కనిపించడమే కష్టం అనిపించింది. మేకప్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవడంతో ఆ కష్టాన్నీ గట్టెక్కేశా. బాలకృష్ణగారి గెటప్ తరవాత.. రానా గెటప్ నాకు బాగా నచ్చింది. 'ఎన్టీఆర్' సినిమా కోసం మొదటి సన్నివేశం తనతోనే తీశారు. చంద్రబాబు నాయుడు గెటప్‌లో రానాని చూసి 'అరె.. నువ్వేనా..' అంటూ ఆశ్చర్యపోయాను.

సెట్లోనూ, బయటా బాలకృష్ణ మీతో ఎలా ఉండేవారు?

ఇంటా బయటా ఎక్కడైనా ఆయన చాలా ప్రత్యేకం. అలాంటి వ్యక్తిని నేను చూడలేదు. తాతగారి డైలాగుల్ని పూస గుచ్చినట్టు చెప్పేవారు. సినిమాలపై ఆయనకున్న జ్ఞానం అపారం.

తాతగారి గురించి మీకూ చాలా విషయాలు తెలుసు. ఎన్టీఆర్‌తో ఆయనకున్న అనుబంధమూ తెలుసు. అవన్నీ తెరపై చూస్తామా?

నాకు తెలిసిన, నేను విన్న విషయాలేవీ తెరపై కనిపించవు. అంతకు మించి ఉంటుంది. అందుకే స్క్రిప్టు విన్నప్పుడు నాకే కొత్తగా అనిపించింది. ఈ పాత్ర కోసం నేను పెద్దగా హోం వర్క్ ఏమీ చేయలేదు. తాతయ్యకు సంబంధించి ఓ ఇంటర్వ్యూ చూశానంతే. అదీ అయిదు నిమిషాలే. తాతయ్య గొంతుని అనుకరించే ప్రయత్నం చేయలేదు.

ఏఎన్నార్ బయోపిక్ చేసే ఆలోచన ఉందా?

అది మావయ్య చేతుల్లోనే ఉంది. ఎందుకంటే ఆయనే మా కుటుంబానికి పెద్ద. ఆయన ఎలా చెబితే అలా. కానీ ఇప్పటి వరకూ తాతగారి బయోపిక్ గురించి మా ఇంట్లో చర్చే జరగలేదు.

'ఇదం జగత్' బాగా నిరాశ పరిచినట్టుంది కదా?

అవును. 'మళ్లీ రావా' కంటే ముందు ఒప్పుకున్న సినిమా అది. ప్రచారం సరిగా జరగలేదు. దాంతో పాటు సరైన సమయంలోనూ విడుదల కాలేదు. ఇక ముందు ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా ఉంటాను. రాబోయే చిత్రాల కోసం మంచి కథలు దొరికాయి. ఆ విషయంలో సంతోషంగా ఉంది.

శ్రీదేవి బయోపిక్... బోనీ నిర్మాత

శ్రీదేవి... భారతీయ వెండితెర మర్చిపోలేని అందం. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ తన సత్తా చాటారామె. ప్రమాదవశాత్తు ఆమె మరణించడం అభిమానుల్ని ఎంతగానో కలచివేసింది. అతిలోక సుందరి జీవిత కథను వెండితెరకు తీసుకురావాలని పలువురు దర్శక నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. వాళ్లందరి కంటే శ్రీదేవి బయోపిక్‌ను తెరకెక్కించడానికి తనకే అన్ని అర్హతలు ఉన్నాయని ఆమె భర్త బోనీ కపూర్ భావిస్తున్నారట. "అందరికన్నా ముందే శ్రీదేవి బయోపిక్‌ను తీయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు బోనీ. ఆమె గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తి కావడంతో ఆ చిత్రానికి న్యాయం జరుగుతుంది. శ్రీదేవి జీవితంపై సినిమా తీయడానికి కాపీ రైట్స్ కూడా ఆయనే తీసుకోబోతున్నారు"అని బోనీ సన్నిహిత వర్గాలు చెప్పినట్టు సమాచారం. బయోపిక్ దర్శకత్వ బాధ్యతలూ బోనీనే తీసుకుంటారా.. లేదా అన్నది చూడాలి.

శ్రీదేవి, బోనీకపూర్



పుస్తకం రూపంలోనూ...

శ్రీదేవి జీవితాన్ని పుస్తక రూపంలో తీసుకురావడానికి పలువురు రచయితలు, పాత్రికేయులు బోనీని కలిశారట. వాళ్లలో ఒకళ్లకి బోనీ ఆ బాధ్యతలు అప్పగించే ఆలోచనలో ఉన్నార"ని బోనీ సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.


వెంకటేష్, వరుణ్‌తేజ్, అనిల్ రావిపూడి, రాజేంద్రప్రసాద్


సెట్లో సందడి

అంతేగా... మరంతేగా

భార్యా బాధితుల సంఘానికి అధ్యక్షుడు వెంకటేష్ అయితే, అది తప్ప మిగిలిన అన్ని పదవులూ వరుణ్‌తేజ్‌కి కట్టబెట్టాలి. అన్ని కష్టాలు పడ్డారు వారిద్దరూ. 'భార్యని గ్రిప్పులో పెట్టుకోవడం ఓ ఆర్ట్' అని గంటల కొద్దీ లెక్చర్లు దంచిన ఈ మగధీరులిద్దరికీ పెళ్లయ్యాక మగాడి బతుకు 'మిక్సీలో నలిగే మిక్చరే' అనే నిజం తెలిసొచ్చింది. అందుకే 'బాబోయ్ పెళ్లాలు..' అనుకుంటూ వాళ్లకు దూరంగా పరుగులు పెట్టారు. ఆ తరవాత ఏమైందో తెలియాలంటే 'ఎఫ్ 2' సినిమా చూడాల్సిందే. ఈ పండక్కి సంక్రాంతి అల్లుళ్లుగా సందడి చేయడానికి వెంకీ, వరుణ్ సిద్ధమయ్యారు. వినోదాత్మక కథలు వండి వార్చడంలో సిద్ధహస్తుడు అనిల్ రావిపూడి. కామెడీ టైమింగులో తిరుగులేదని నిరూపించుకున్న నటులు వెంకటేష్, రాజేంద్రప్రసాద్. 'ఇంత మంది కలిశారంటే థియేటర్లో నవ్వుల పువ్వులు పూయాలి' అంటారా..?! అంతేగా.. మరంతేగా!!

అర్జున్ ఏం చేశాడు?

ఆది సాయికుమార్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'ఆపరేషన్ గోల్డ్ ఫిష్'. శషా చెత్రి, కార్తీక్‌రాజు, పార్వతీశం, నిత్యానరేష్, మనోజ్ నందం కీలక పాత్రలు పోషించారు. అడివి సాయికిరణ్ దర్శకత్వం వహించారు. ప్రతిభా అడివి, కట్ట ఆశిష్‌రెడ్డి, కేశవ్ ఉమా స్వరూప్, పద్మనాభరెడ్డి, గ్యారీ బి.హెచ్.జి, సతీష్ డేగలతో పాటు చిత్రంలోని నటులు, సాంకేతిక నిపుణులు కలిసి ఈ సినిమాని నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శకుడు మాట్లాడుతూ "యథార్థ ఘటనల ఆధారంగా రాసుకొన్న ఓ కల్పిత కథతో తెరకెక్కించిన చిత్రమిది. ఈ సినిమా కాన్సెప్ట్, లుక్ కొత్తగా ఉంటుంది. అర్జున్ పండిట్ అనే ఎన్.ఎస్.జి కమాండోగా ఆది సాయికుమార్ నటించారు. ఆపరేషన్ గోల్డ్ ఫిష్ వెనుక కథేంటి? అర్జున్ పండిట్ ఏం చేశాడన్నది తెరపైనే చూడాలి"అన్నారు.


ఆది సాయికుమార్

యుద్ధం కోసం గుర్రమెక్కాడు

అర్జున్ కపూర్ గుర్రమెక్కి కదన రంగంలోకి దూకబోతున్నాడు. శత్రు సైనికులతో వీరోచితంగా పోరాడబోతున్నాడు. ఇదంతా 'పానిపట్' చిత్రం కోసమే. పానిపట్ యుద్ధం నేపథ్యంలో దర్శకుడు అశుతోష్ గొవారికర్ తెరకెక్కిస్తోన్న భారీ చిత్రమిది. అర్జున్ సైన్యాధిపతి సదాశివరావ్ భవ్ పాత్రలో కనిపించనున్నాడు. సంజయ్ దత్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడు. అర్జున్ కెరీర్‌లో అత్యధిక వ్యయంతో తెరకెక్కుతున్న చిత్రమిది. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో తన పాత్రను పండించడానికి అవసరమైన మెలకువలను నేర్చుకుంటున్నాడతను.


అర్జున్ కపూర్

అందులో భాగంగా గుర్రపు స్వారీపై దృష్టిపెట్టాడు. ఓ నెల రోజుల పాటు ఆ విద్యను సాధన చేశాడట. సెట్స్‌లో గుర్రమెక్కి కళ్లెం పట్టి దౌడు తీయించడమే తరవాయి అంటున్నాడు. గుర్రపు స్వారీ చేస్తున్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నాడు అర్జున్. "గత నెలంతా సూర్యోదయాన్ని ఆస్వాదిస్తూ ఈ అందమైన గుర్రంపై స్వారీ చేస్తూ 'పానిపట్' కోసం సిద్ధమవడం మంచి అనుభవం. కొత్త విద్య నేర్చుకోవడంతో కొత్త శక్తి వచ్చినట్లుంది. ఎప్పుడెప్పుడు కెమెరా ముందు గుర్రపు స్వారీ చేస్తానా అని ఎదురుచూస్తున్నాన"ని తెలిపాడు అర్జున్.

క్యాట్ కొట్టేశాం...

లక్ష్యం ఎలాంటిదైనా మనసు పెట్టి చేయగలిగితే... వందశాతం ఫలితం సాధించొచ్చు అని నిరూపించారు ఈ హైదరాబాదీ అమ్మాయిలు. ఒకరు ఆర్థికవేత్త కావాలనుకున్నారు. మరొకరు తండ్రి బాటలో నడవాలనుకున్నారు. ఏదైతేనేం ఆ ఇద్దరి లక్ష్యం ఒకటే... మేనేజ్‌మెంట్ అర్హత పరీక్ష అయిన క్యాట్‌లో మంచి స్కోర్ సాధించడం.

వారిలో సంహిత పదిహేడేళ్లకే 95.95 పర్సంటైల్‌తో అర్హత సాధిస్తే, జుహీ 98.97 తో లక్ష్యాన్ని చేరుకుంది.

ఆర్థికవేత్తను అవుతా... - సంహిత

"కలలు కనండి... వాటిని సాకారం చేసుకోండి' అనే అబ్దుల్‌కలాం మాటలే నాకు స్ఫూర్తి. పదహారేళ్లకి బీటెక్ పూర్తి చేశా. ప్రస్తుతం నాకు పదిహేడేళ్లు. క్యాట్‌లో 95.95 పర్సంటైల్‌తో మంచి ర్యాంకు సాధించగలిగా. ఆర్థికవేత్తను కావడమే నా లక్ష్యం. చిన్నవయసులో ఇదంతా ఎలా సాధ్యం అని అడుగుతుంటారు చాలామంది. ఇష్టం ఉంటే ఏదీ కష్టం కాదు. మన జ్ఞాపకశక్తికి మనమే పదును పెట్టుకోవాలి. ఎప్పటికప్పుడు చదువుతూ, గుర్తుంచుకుంటూ సాధన చేయాలి. మాది హైదరాబాద్. నాన్న ఎల్ఎన్ కాశీభట్ల ఇండిపెండెంట్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. అమ్మ గీత చతుర్వేదుల యాక్సెంచర్‌లో మేనేజర్‌గా పనిచేస్తోంది.



నాకు మూడేళ్లున్నప్పుడే వరుసగా దేశ రాజధానులన్నీ గుర్తించేదాన్ని. నా జ్ఞాపకశక్తిని గమనించి టీచర్లు ప్రోత్సహించారు. అలా ఏడేళ్లకే ఏడో తరగతి పూర్తిచేశాను. పదేళ్లకే పదోతరగతి 8.8 జీపీఏతో పాసయ్యాను. లెక్కలు, సైన్స్‌లో ఏ1 గ్రేడ్ సాధించా. దాంతో ప్రభుత్వ డాక్టర్ నుంచి ఐక్యూ సర్టిఫికెట్ తీసుకుని ప్రత్యేక అనుమతితో కాలేజీలో చేరాను. ఇంటర్ ఎంపీసీలో 89 శాతం మార్కులతో పాసయ్యా. ఆపై సీబీఐటీలో బీటెక్‌లో చేరాను. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో 8.85 జీపీఏతో పాసయ్యా. చివరి సెమిస్టర్‌లో టాపర్‌గా, కాలేజీలో గోల్డ్ మెడల్ కూడా అందుకున్నా. అన్నట్లు చెప్పనేలేదు కదూ... నాకు ఎంబీఏ చేయాలన్న ఆలోచన చిన్నప్పుడే కలిగింది. అప్పట్లో తరచూ వ్యాసరచన పోటీల్లో పాల్గొనేదాన్ని. అలా ఒకసారి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై రాశాను. అప్పుడే నాక్కూడా ఆర్థికవేత్తను కావాలనే ఆలోచన కలిగింది. అలానే ఐదేళ్ల వయసులో సోలార్ వ్యవస్థ మీద పదహారు పేజీల వ్యాసం రాశా. అది చదివిన అబ్దుల్‌కలాం నన్ను కలిసేందుకు అనుమతి ఇచ్చారు. దాంతో నేను చేయగలననే నమ్మకం మరింత నమ్మకం కలిగింది.

ఇష్టంతో చదివా...

బీటెక్ అయిపోయాక నాకు ప్రిపరేషన్‌కి కేవలం వందరోజులు మాత్రమే మిగిలాయి. వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకున్నా. ఈ క్యాట్ పరీక్షలో మూడు రకాల కేటగిరీలు ఉంటాయి. వెర్బల్ ఎబిలిటీ..లాజికల్ రీజనింగ్, క్వాంటిటివ్ ఎబిలిటీ... మూడింటిలోనూ మంచి మార్కులు వస్తేనే స్కోర్ సాధించేది. అందుకే వాటిని అభివృద్ధి చేసుకోవడానికి కొంత శిక్షణ తీసుకున్నా. ఇంకొంత నేనే సొంతంగా సాధన చేశా. అయితే ఇంతసేపు చదవాలని ప్రత్యేకంగా నియమం ఏమీ పెట్టుకోలేదు. చదివిన గంట ఏకాగ్రతతో చదివేదాన్ని. పుస్తకాలు ఎక్కువ చదువుతా. ఒత్తిడి లేకుండా ప్రణాళికతో చదవడమే నా ప్రత్యేకత. దానికి నా జ్ఞాపకశక్తి తోడయ్యింది. ఏ రోజు చెప్పింది. ఆ రోజే చదువుకోవడం వల్ల చదువు కష్టంగా అనిపించదు. నిజానికి నేనెప్పుడూ రాత్రంతా కూర్చుని చదివిందీ లేదు. ఎప్పుడైనా అదేపనిగా చదువుతున్నప్పుడు బోర్ కొడితే నాకెంతో ఇష్టమైన షటిల్ ఆడేదాన్ని. దానివల్ల నా ఏకాగ్రత మెరుగుపడేది. చివరికి ఇలా క్యాట్ పరీక్ష రాసి మూడు విభాగాల్లో 92 పర్సంటైల్, మొత్తంగా 95.95 పర్సంటైల్ అందుకున్నా. నిజానికి చిన్న వయసులో, పెద్దవాళ్లతో కలిసి చదువుతుంటే మొదట్లో అంతా కొత్తగా చూసేవారు. క్రమంగా వయసు భేదం ఉన్నా...నాకెప్పుడూ ఆ భావన కలగకుండా లెక్చరర్లు, తోటి విద్యార్థులు నాకు సాయపడేవారు. చదువుతోపాటు కర్ణాటక సంగీతం నేర్చుకుంటున్నా.

బాధ్యతలు తీసుకోవాలనే... - జుహీ

ఫలితంపై ఎంత శ్రద్ధ చూపిస్తామో! దాని పొందే పద్ధతుల విషయంలోనూ అంతే పక్కాగా ఉండాలి. అందుకే లక్ష్యం నిర్దేశించుకున్న తరువాత దాన్నే లోకంగా మార్చేసుకుంటా. ప్రస్తుతం నేను పెట్టుకున్న లక్ష్యం క్యాట్‌లో మంచి ర్యాంకు సాధించడం. మంచి కాలేజీలో మార్కెటింగ్‌లో ఎంబీఏ చేయడం. దానిలో మొదటి లక్ష్యం క్యాట్‌లో 98.97 పర్సంటైల్‌తో అందుకున్నందుకు సంతోషంగా ఉంది. మాది హైదరాబాద్. నేను ఇప్పటికే బీఆర్క్ పూర్తిచేశాను. నాన్న సునీల్ కుమార్ మార్కెటింగ్ కన్సల్టెంట్. ఆయనకు సొంతంగా ఓ సంస్థ ఉంది.



అమ్మ కృష్ణశ్రీ గృహిణి. మొదటి నుంచీ నాకు కళలంటే అంటే ప్రత్యేక శ్రద్ధ. అందుకే కెరీర్‌గా బీఆర్క్‌ని ఎంచుకున్నా. అందుకోసం 'స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్' భోపాల్‌లో సీటు సంపాదించి చేరిపోయా. చదువయ్యాక హైదరాబాద్ వచ్చి నాన్న సంస్థలోనే ఉద్యోగంలో చేరా. చదువుకునేటప్పుడు వివిధ ఫెస్ట్‌ల నిర్వహణలో కీలకంగా పనిచేశా. స్పాన్సర్లను ఒప్పించడం, మానవవనరుల్ని సమర్థంగా వినియోగించుకోవడం వంటివన్నీ...మేనేజ్‌మెంట్ నైపుణ్యాలపై నాకు ఆసక్తిని కలిగించాయి. దానికి తోడు హైదరాబాద్ వచ్చాక 'యువత' అనే ఎన్‌జీవోలో డైరెక్టర్‌గా చేరా. సుమారు ఆరు అనాథాశ్రమాల బాధ్యతల్ని తీసుకున్నా. ఈ మేనేజ్‌మెంట్ స్కిల్స్ ఎంత అవసరమో అర్థమయ్యింది. మరోపక్క నాన్న సంస్థలోకి వచ్చాక సంస్థ మేనేజ్‌మెంట్ అంశాలపై అవగాహన, దానితో పాటే ఆసక్తీ పెరిగాయి. అలా ఎంబీఏ (మార్కెటింగ్) చేయాలనే లక్ష్యం ఏర్పడింది. అయితే అది మామూలుగా ఏదో ఒక కాలేజీలో కాకుండా, అంతా ప్రతిష్ఠాత్మకంగా భావించే ఐఐఎమ్‌లో చదవాలనుకున్నా.

మాక్ టెస్ట్‌లు రాస్తూ...

అనుకున్నదే తడవుగా సాధన మొదలుపెట్టా. తక్కువ సమయంలోనే ఈ నిర్ణయం తీసుకున్నా కూడా ప్రణాళికాబద్ధంగా చదవడం వల్లే క్యాట్‌లో ఈ స్కోర్ సాధ్యమైంది. దీనిలోని మూడు విభాగాల్లో వెర్బల్ టెస్ట్ విషయంలో ఇబ్బంది లేదు. ఎందుకంటే చిన్నప్పటి నుంచీ ఆంగ్లంపై పట్టు ఉంది. అలాని అదొక్కటే సరిపోదు. లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ వంటివాటిపైనా పూర్తిస్థాయి అవగాహన అవసరం. అందుకోసం కొన్నాళ్లు కోచింగ్ తీసుకున్నా. ఓ పక్కన ఉద్యోగం చేస్తూనే చదవడం మొదలుపెట్టా. రోజూ మూడు గంటల పాటు ఆన్‌లైన్‌లో మాక్ టెస్ట్‌లు రాసేదాన్ని. దాంతో ఏ సమయాన్ని దేనికి కేటాయించుకోవాలో? ఎంత వేగంగా పూర్తిచేయగలుగుతున్నానో వంటివన్నీ తెలిశాయి. ఇలా రోజు మొత్తంలో ఐదారు గంటల సమయాన్ని చదువుకోసం కేటాయించేదాన్ని. నిజానికి నా ఉద్దేశంలో చదువుని బట్టీ పట్టడం వల్ల ప్రయోజనం ఉండదు. దాన్ని ఇష్టంతోనే చదవాలి. అలాని చదువంటే ...పుస్తకాలకే పరిమితం కాదనేది నా అభిప్రాయం. అందుకే ఆంగ్ల నవలలు, వార్తాపత్రికలు క్రమం తప్పకుండా చదువుతా. ఇవన్నీ పదసంపద, పరిజ్ఞానం పెంచాయి. క్యాట్ ఫలితాల్లో వెర్బల్‌లో 99 పర్సంటైల్ సాధించా. మొత్తం 98.97 పర్సంటైల్‌తో మంచి కాలేజీలో సీటు సంపాదించుకునే అర్హత అందుకున్నా.

– స్వాతి కొరపాటి

వసుంధర



రింగు రింగా..

చిన్నప్పుడు చెవులకు చిన్న చిన్న రింగులు పెట్టుకుని ఉంటాం. ఇప్పుడు ఆ సాదా రింగుల హవా తగ్గింది. వాటికి ఫిలిగ్రీ డిజైన్లు, రాళ్లు, ఎనామిల్ పూతలు, ముత్యాలు వంటి అదనపు అలంకరణలు మెరిపిస్తున్నాయి. ఫెదర్, సిల్వర్ వంటివాటితో తయారు చేసిన నయా హూప్స్ ట్రెండీ లుక్ తెచ్చిపెడుతున్నాయి. నిజానికి రింగులు అనగానే గుండ్రంగానే ఉంటాయనుకోకండి. ఇప్పుడు అవి ఎన్నో ఆకృతుల్లోనూ లభిస్తున్నాయి. అలాంటి డిజైన్లలో ఇవి కొన్ని... ఓ లుక్కేయండి.


రంగవల్లిక



17 చుక్కలు, 3 వరుసలు. 3 వచ్చేవరకు.



- కోడూరు జయభువనేశ్వరి
ముదినేపల్లి



16 చుక్కలు, 4 వరుసలు, 4 వచ్చేవరకూ.



- డి.కవిత
దిల్‌సుఖ్‌నగర్
హైదరాబాద్

మా చిరునామా:
వసుంధర,
ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలిం సిటీ,
హయత్ నగర్
మండలం,
రంగారెడ్డి జిల్లా - 501 512.
email: vasundhara@eenadu.net

ఈటీవీ తెలంగాణ జనవరి 5, 2019 విజేతలు

ముత్యాల ముగ్గుల పోటీ 1. బి. బేబి, భూపాలపల్లి 2. ఎన్.దేవి, తిరుపతి, 3. జి.శ్రావణి నాగోల్, హైదరాబాద్, 4. టి. సరళ, మంచిర్యాల, 5. జి.సంజన, మందమర్రి, 6. వి.విజయలక్ష్మి, బోడుప్పల్, హైదరాబాద్, 7. సి.యశోద, సికింద్రాబాద్. 8. బి.శిరీష, హుజూరాబాద్ 9. పి. గంగాజమున, జబితాపూర్, జగిత్యాల, 10. కె.రమ్య, వరంగల్

అందరిపైనా అరిచేస్తోంది!



? మా అమ్మాయి వయసు పదకొండేళ్లు. తనకి ఆత్మవిశ్వాసం కాస్త ఎక్కువ. బాగా చదువుతుంది. పెద్దలంటే గౌరవమే. అయితే ఎవరైనా తనని ఒక చిన్న మాట అన్నా భరించలేదు. గట్టిగా అరుస్తోంది. అలాని మందలిస్తే ఏడుస్తుంది. కోపం పట్టలేక కొన్ని సార్లు తమ్ముడిని కొడుతుంది. ఓపిక చాలా తక్కువ. ఇదేమైనా మానసిక సమస్య. తన కోపం ఎలా తగ్గించాలి?

- ఓ సోదరి

✔ మీ పాప వయసు పదకొండేళ్లన్నారు. బాల్యం నుంచి కౌమారంలోకి మారుతున్నప్పుడు వారి ఆలోచనా దృక్పథంలో, ఉద్వేగాల్లో మార్పులు సహజమే. హార్మోన్ల ప్రభావమూ ఉంటుంది. రెండోది సమాజపరంగా వచ్చే మార్పులు. పెద్దయ్యేకొద్దీ తమ చుట్టూ జరుగుతున్న విషయాలు, ఇతరుల మాటతీరును గమనిస్తుంటారు. దానికి తోడు అమ్మాయిలు సహజంగానే సున్నితంగా ఉంటారు. టీనేజీలోకి అడుగుపెడుతున్నారు కాబట్టి ఆత్మవిశ్వాసంతో పాటు కాస్త మొండితనం కూడా ఉంటుంది. ఎప్పుడైనా వారు చేసిన పనిని సరిచేస్తే ఇష్టపడరు. స్నేహితులు, చుట్టాల ముందు నిలదీసినా, తోబుట్టువులతో పోల్చినా సహించలేరు. మీ పాప చిన్నప్పటి నుంచి ఇంట్లో గారాబంగా పెరిగి మీరంతా మెచ్చుకోవడంతో తనలో ఆత్మవిశ్వాసం పెరిగి ఉండొచ్చు. దాంతో అన్నింట్లోనూ తాను గొప్ప అని అనుకుంటోంది. ఇప్పుడు సమస్యలు చెబుతోంటే భరించలేకపోతుంది. కోపం, అరుపు, ఏడుపు...వంటి ఉద్వేగాలను ప్రదర్శిస్తోంది.

ఏం చేయాలి...

మీ పాప చాలా సున్నితమనస్కురాలై ఉండొచ్చు. మీతో వాదించలేని పరిస్థితిలో ఆమెకు దుఃఖం కలుగుతుంది. కాబట్టి తనతో సమస్య వచ్చినప్పుడు మీరు 'ఇది కరెక్ట్... ఇది తప్పు' అంటూ నేరుగా చెప్పకూడదు. అలా చేస్తే మరింత మొండిగా తయారవ్వొచ్చు. ఆ సమయంలో మౌనంగా ఉండి ఆ తరువాత మీ అభిప్రాయాన్ని మెల్లిగా చెప్పాలి. ఈ మధ్య కాలంలోనే అలా మారింది అంటున్నారు కాబట్టి ఏం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం చేయండి. అలా కాకుండా ఎంతసేపు ఆమె చేసిన తప్పులను ఎత్తిచూపుతోంటే మరింత మొండిగా తయారయ్యే ప్రమాదం ఉంది. సమస్య తెలుసుకునే క్రమంలో ఒత్తిడి చేస్తే చెప్పకపోవచ్చు. ఓపిగ్గా మాట్లాడాలి. తనకి మీపై నమ్మకం కలుగుతుంది. ఆ తరువాత తన తీరుకు కారణాన్ని వివరిస్తే అర్థంచేసుకుంటుంది. క్రమంగా ఆమెలో మార్పు వస్తుంది. ఒకవేళ ఎన్ని రకాలుగా చెప్పినా మార్పు లేకపోతే మానసిక నిపుణుల దగ్గరకు తీసుకువెళ్లండి.

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
పిల్లల మానసిక నిపుణురాలు

- మీ సందేహాలను vasukid@eenadu.net కు పంపించగలరు.

పెసర మొలకల ఛాట్

అమ్మచేత కమ్మగా




పిల్లలకు మాంసకృత్తులు బాగా అందాలంటారు. అందుకోసం మిగతా పదార్థాలతోపాటు పెసర మొలకల్ని కూడా పెట్టి చూడండి. అయితే అచ్చంగా అలాగే కాకుండా ఛాట్ రూపంలో చేసి వడ్డించండి. దీన్ని సాయంత్రాలే కాదు, టిఫిన్‌బాక్సుల్లోనూ పెట్టివ్వొచ్చు.

కావల్సినవి: పెసరమొలకలు - కప్పు, ఉల్లిపాయ, టొమాటో - ఒక్కోటిచొప్పున, కీరదోస - సగం, కొత్తిమీర తరుగు - రెండు చెంచాలు, నిమ్మరసం - రెండున్నర చెంచాలు, ఉప్పు- తగినంత, కారం, గరంమసాలా - అరచెంచా చొప్పున, నూనె - చెంచా.

తయారీ: మొలకలు తయారవడానికి రెండురోజులు పడతాయి. ఓ రాత్రంతా పెసల్ని నానబెట్టి మర్నాడు మెత్తని వస్త్రంలో మూటకడితే మొలకలు తయారవుతాయి. వాటిని కుక్కర్‌లో తీసుకుని అవి మునిగేలా నీళ్లు పోసి పొయ్యిమీద పెట్టాలి. రెండు కూతలు వచ్చేవరకూ ఉడికించుకుని తీసుకుని నీటిని వంపేయాలి. ఇప్పుడు పొయ్యిమీద బాణలి పెట్టి నూనె వేయాలి. అది వేడయ్యాక ఉడికించిన పెసర మొలకలు వేయాలి. నీరు పోయి అవి వేగాక తగినంత ఉప్పు, కారం, గరంమసాలా వేయాలి. రెండు నిమిషాలయ్యాక ఉల్లిపాయ, టొమాటో, కీరదోస ముక్కలు, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి. ఈ ముక్కలు వేగకుండానే దింపేయాలి. చివరగా నిమ్మరసం పిండితే చాలు.

జుట్టెందుకు ఊడిపోతుందంటే...!



టీనేజీలోకి అడుగుపెట్టినప్పటి నుంచీ ఏదో ఒక సందర్భంలో ప్రతి ఒక్కరికీ ఎదురయ్యే సమస్య. జుట్టు ఊడిపోవడం...అయితే అన్ని సార్లూ పోషకాల లేమి, ఇతర అనారోగ్యాలే వల్లే ఇలా కాకపోవచ్చు. మన తప్పిదాలూ అందుకు కారణం కావచ్చు.

❖ కొందరు జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది అనే ఉద్దేశంతో రోజూ తలస్నానం చేస్తుంటారు. అలా చేయడం ఏ మాత్రం మంచిది కాదు. షాంపూల్లోని రసాయనాల ప్రభావం జుట్టు, కుదుళ్ల మీద పడుతుంది. ఎదుగుదల ఉండక పోగా.. బాగా రాలిపోతుంది.

❖ సమయం లేక ఇంకొందరు సరిగా తలస్నానం చేయరు. అసలు జుట్టుని ఏ మాత్రం పట్టించుకోరు. దానివల్ల జుట్టు ఎండుగడ్డిగా మారుతుంది. ఊడిపోతుంది. జుట్టు తత్వాన్ని బట్టి జాగ్రత్తలు తీసుకోవాలి. వారంలో తప్పనిసరిగా రెండు సార్లు తలస్నానం చేయాలి. అంతేకాదు చేసిన ప్రతిసారీ ఎక్కువ నీళ్లతో కడిగేసుకోవాలి. లేదంటే షాంపూల్లో రసాయనాలు అలానే ఉండిపోయి జుట్టు ఎదుగుదలకు అడ్డుపడతాయి.

❖ బిగుతుగా జడ అల్లుకోవడం, రబ్బరు బ్యాండు పెట్టుకోవడం, బలంగా లాగి ముడివేయడం, ఎక్కువ పిన్నులు పెట్టడం లేదంటే పూర్తిగా వదిలేయడం వంటివి చేస్తుంటారు. దీనివల్ల జుట్టు రాలిపోతుంది. అలాకాకుండా కాస్త వదులుగా జడవేసుకోవడం మంచిది.

చదువు

ఐదేళ్ళ పీజీ.. ఐదువేల స్టైపెండ్

బేసిక్ సైన్స్ సబ్జెక్టుల్లో కెరియర్‌ను ఎంచుకోవాలనుకునేవారు ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌సీ చదవటం ప్రయోజనకరం. ఈ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్ష- నేషనల్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్ (నెస్ట్) ప్రకటన ఇటీవలే విడుదలైంది. దీనిలో అర్హత సాధిస్తే ప్రతిష్ఠాత్మకమైన నైసర్, ముంబయి యూనివర్సిటీల్లో కోర్సులను అభ్యసించే అవకాశం కలుగుతుంది. అంతే కాదు, విద్యాభ్యాసంతో పాటు నెలనెలా స్టైపెండ్ అందుకునే వీలూ ఉంటుంది!

ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పూర్తిచేసినవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. మాస్టర్స్ డిగ్రీ, ఆపై పీహెచ్‌డీ పూర్తిచేస్తే జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో శాస్త్రవేత్తలుగా స్థిరపడవచ్చు. విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లుగా అర్హత సాధించవచ్చు. బేసిక్ సైన్సెస్‌లో మాస్టర్స్ చేస్తే అధ్యాపకులుగా స్థిరపడవచ్చు. భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (నైసర్)లోనూ, ముంబయి యూనివర్సిటీ- అటామిక్ ఎనర్జీ డిపార్ట్‌మెంట్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బేసిక్ సైన్స్‌లోనూ అత్యాధునిక పరిశోధక ప్రయోగశాలలు, కంప్యుటేషనల్ సౌకర్యాలున్నాయి. ప్రముఖ శాస్త్రవేత్తలతో విద్యాబోధన నిర్వహిస్తారు. ఈ సంస్థలు బయాలజీ, కెమిస్ట్రీ, మేథమేటిక్స్, ఫిజిక్స్ మొదలైన సబ్జెక్టుల్లో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌సీ కోర్సులను అందిస్తున్నాయి. ఈ కోర్సుల్లో అర్హత సాధించినవారు భారత ప్రభుత్వం నెలకు రూ. 5000 చొప్పున అందించే ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్, సమ్మర్ ప్రాజెక్టు కోసం ఏడాదికి అందించే రూ. 20,000 పొందటానికి అర్హులు.

నెస్ట్- ప్రవేశపరీక్షకు మన తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ లేదా 10+2ను 2017 లేదా 2018లో పూర్తిచేసిన ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ విద్యార్థులు, 2019 పరీక్షలు రాస్తున్న ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ విద్యార్థులు అర్హులు. జనరల్ కేటగిరీ, ఓబీసీ విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో 60% మార్కులుండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడీ విద్యార్థులు 55% మార్కులు సాధించివుండాలి.

ప్రవేశపరీక్ష ఎలా?

ఇది ఆబ్జెక్టివ్ విధానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష. ప్రశ్నలన్నీ ఆంగ్లమాధ్యమంలో ఉంటాయి. సమయం 3.30 గంటలు.

సెక్షన్-1: జనరల్ సెక్షన్. ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ అందరికీ ఉంటుంది. నెగెటివ్ మార్కులుండవు. 30 మార్కుల వెయిటేజీ.

సెక్షన్-2 నుంచి సెక్షన్-5: వీటిలో బయాలజీ, కెమిస్ట్రీ, మేథమేటిక్స్, ఫిజిక్స్ విభాగాలకు సంబంధించి ప్రశ్నలుంటాయి. అన్ని సెక్షన్లలోని ప్రశ్నలకు సమాధానం రాసే వీలు విద్యార్థులకు ఉంటుంది. ప్రతి సెక్షన్‌కూ 50 మార్కుల వెయిటేజీ. ఈ సెక్షన్లలో ఎక్కువ మార్కులు సాధించిన మూడింటిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ఈ విభాగాలకు నెగెటివ్ మార్కింగ్ ఉంది. కొన్ని ప్రశ్నలకు ఒకటికన్నా ఎక్కువ సమాధానాలుంటాయి.

జేఈఈ అడ్వాన్స్‌డ్ స్థాయిలో...

ప్రవేశపరీక్ష నైసర్ స్థాయిలో విద్యార్థుల విశ్లేషణ, తార్కిక సామర్థ్యాలను పరీక్షించేలా ఉంటుంది. ప్రశ్నలు ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ స్థాయిలో ఉంటాయి. అందుకని మొదట సిలబస్, పరీక్ష విధానాలపై పూర్తి అవగాహన తెచ్చుకోవాలి. ప్రాథమిక అంశాలతో సన్నద్ధత ప్రారంభించాలి. అందుకు తెలుగు అకాడమీ, సీబీఎస్ఈ, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు మేలు. ఆపై టాపిక్‌లవారీగా రిఫరెన్స్ పుస్తకాల ద్వారా అధ్యయనం చేయాలి.

ప్రవేశపరీక్షకు ఇంకా 5 నెలల సమయం ఉంది. కాబట్టి, ఇంటర్ రెండో ఏడాది చదువుతున్నవారు ఇప్పటినుంచే ప్రతిరోజూ 5-6 గంటలు కష్టపడి చదవాలి. వీలైనన్నిసార్లు సిలబస్‌ను పునశ్చరణ (రివిజన్) చేయాలి. మాదిరి ప్రశ్నల సాధన, కంప్యూటర్ ఆధారిత నమూనా ప్రశ్నపత్రాలను ప్రయత్నించాలి.

- ఎస్. కిరణ్‌కుమార్
డైరెక్టర్, కెమ్‌బయోసిస్ కోచింగ్ సెంటర్

ఏ సబ్జెక్టులో ఏవి ముఖ్యం?

గత ప్రశ్నపత్రాలను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో ఎక్కువ దృష్టిసారించాల్సినవి-

బయాలజీ: జనరల్ బయాలజీ, సెల్ బయాలజీ, జెనెటిక్స్, ఎకాలజీ అండ్ ఇవల్యూషన్, బయోటెక్నాలజీ, యానిమల్ ఫిజియాలజీ, ప్లాంట్ ఫిజియాలజీ, డీఎన్‌ఏ ధర్మాలు, ఆర్‌డీఎన్‌ఏ టెక్నాలజీ, ట్రాన్స్‌లేషన్, ట్రాన్‌స్క్రిప్షన్ మొదలైనవి.

కెమిస్ట్రీ: ఆర్గానిక్ కెమిస్ట్రీలో జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, రియాక్షన్ మెకానిజం, స్టీరియో కెమిస్ట్రీ, నేమ్‌డ్ రియాక్షన్స్, ఏరోమ్యాటిసిటీ, కార్బోహైడ్రేట్స్, అమైనో యాసిడ్స్, పాలిమర్స్, ఫిజికల్ కెమిస్ట్రీలో మోల్ కాన్సెప్ట్, సొల్యూషన్స్, సాలిడ్ స్టేట్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, కెమికల్ కైనటిక్స్, థర్మోడైనమిక్స్ సంబంధిత అంశాలు. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో సంశ్లిష్ట సమ్మేళనాలు, ఎస్, పి బ్లాక్ మూలకాలు, డి, ఎఫ్ బ్లాక్ మూలకాలు, మెటలర్జీ మొదలైనవి.

ఫిజిక్స్: జనరల్ ఫిజిక్స్, ఆప్టిక్స్, మోడరన్ ఫిజిక్స్, ఎలక్ట్రిసిటీ, మాగ్నటిజమ్, మెకానిక్స్.

మేథమేటిక్స్: కాల్‌క్యులస్, త్రికోణమితి, కోర్డానేట్ జామెట్రీ, ఆల్జీబ్రా, వెక్టర్స్.

అభ్యర్థులు బట్టీ ధోరణిలో కాకుండా సబ్జెక్టును అవగాహన చేసుకుని విభిన్న అంశాలను అన్వయించగలిగితే నెస్ట్‌లో స్కోరు సాధ్యమవుతుంది. గత ప్రశ్నపత్రాలు (2007-18) వెబ్‌సైట్ (www.nestexam.in) లో ఉన్నాయి.





ఏపీపీఎస్‌సీ ద్వారా గ్రూప్-I, 2 సర్వీసుల నియామక పరీక్షలకు నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. వీటిలో ఏ పరీక్షను ఎంపిక చేసుకోవాలనే విషయంలో అభ్యర్థుల్లో చాలా సందేహాలు ఏర్పడ్డాయి. రెండు పరీక్షలూ రాసి, తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చాలామంది ఆశిస్తున్నారు. అయితే పరీక్షల తేదీలు దగ్గర దగ్గరగా ఉండటం, సిలబస్‌లు భారంగా ఉండటంతో ఏం చేయాలనే సంఘర్షణకి గురవుతున్నారు. ఇలాంటి సందర్భంలో రెండు పరీక్షల ఉమ్మడి ప్రిపరేషన్ సాధ్యాసాధ్యాలూ, ఆచరణాత్మకమైన వ్యూహం గురించి తెలుసుకుందాం!

గ్రూప్-I & 2 ఉమ్మడి వ్యూహం

రెండూ రాస్తే..!

రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో కీలక నియామకాలకు సంబంధించినవి గ్రూప్-1, గ్రూప్-2. ఈ రెండు పరీక్షలకూ ఉమ్మడి ప్రిపరేషన్ సాధ్యమేనా? అంటే.. సాధ్యమే! కాకపోతే మెయిన్స్ పూర్తయ్యేంతవరకూ పూర్తిస్థాయిలో సమయాన్నీ, శక్తినీ ఉపయోగించాలి. కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. మార్చి 10న గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష, మే 5న గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇలాంటి నేపథ్యంలో ముందుగా రెండు స్క్రీనింగ్‌లను గట్టెక్కడానికి ఏం చేయాలో చూడాలి.

★ గ్రూప్-2 సిలబస్‌ను ఆధారం చేసుకుని ఇండియన్ ఎకానమీ, ఏపీ ఎకానమీ, ఇండియన్ పాలిటీని లోతుగా అధ్యయనం చేస్తే గ్రూప్-1 స్క్రీనింగ్‌లోని పేపర్-1లోని సెక్షన్-బి, సిలు కొన్ని చాప్టర్లు మినహా సిద్ధమైనట్లే. అవే అంశాలు గ్రూప్-2 స్క్రీనింగ్‌లో, మెయిన్స్‌లో కూడా ఉపయోగపడతాయి. ★ గ్రూప్-1 స్క్రీనింగ్‌లోని వరల్డ్ జాగ్రఫీ, ఇండియన్ జాగ్రఫీ, ఏపీ జాగ్రఫీ చదివినట్లయితే గ్రూప్-2లోని ఇండియన్ జాగ్రఫీ, ఏపీ జాగ్రఫీలకు పనికొస్తుంది. కొత్తగా గ్రూప్-2కి చదవాల్సిన అవసరం ఏమీ లేదు. ★ గ్రూప్-1 స్క్రీనింగ్‌లోని పేపర్-2లోని సైన్స్ అండ్ టెక్నాలజీని బాగా చదివితే గ్రూప్-2లోని జనరల్ స్టడీస్‌కి పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. గ్రూప్-2లో అదనంగా ఉన్న జనరల్‌సైన్స్‌ని గ్రూప్-1 ప్రిలిమినరీ పూర్తైన తరువాత గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్ష తేదీ మధ్య కాలంలో చదువుకుంటే సరిపోతుంది. ★ గ్రూప్-1 స్క్రీనింగ్‌లోని పేపర్-2లోని సెక్షన్-1లో ఉన్న సాధారణ మానసిక సామర్థ్యాలను సరిగా సాధన చేస్తే గ్రూప్-2కు కొత్తగా సన్నద్ధమవ్వాల్సిన అవసరమేమీ ఉండదు. ★ కరెంట్ అఫైర్స్ ఏ పరీక్షకైనా ఒకే రకంగా ఉంటాయి. కాబట్టి, రెండు స్క్రీనింగ్‌లకూ ఒకే ప్రయత్నంతో సన్నద్ధమవ్వొచ్చు. ★ విభజన సమస్యలు, నవ నిర్మాణం అనేది అన్ని స్క్రీనింగ్‌ల్లోనూ తప్పనిసరి అంశంగా మార్చారు. అదేవిధంగా మెయిన్స్‌లోనూ ఒక వ్యాసరూప ప్రశ్నకి అవకాశం ఎక్కువ ఉంది. కాబట్టి స్క్రీనింగ్ పరీక్షల్లో అంతర్భాగంగా చదువుకుంటే మంచిది.

ఏక కాలంలో...

ఈ విధంగా రెండు పరీక్షల్లోని అంశాలకు పైన పేర్కొన్న రీతిలో ప్రాధాన్యమిస్తూ చదివితే గ్రూప్-1 సన్నద్ధత పూర్తవుతుంది. గ్రూప్-1 స్క్రీనింగ్ పూర్తయిన వెంటనే అంటే మార్చి 10 నుంచి మే 5 మధ్యకాలంలో అంతర్జాతీయ, జాతీయ సంఘటనలు, విపత్తు నిర్వహణలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. తద్వారా గ్రూప్-2 స్క్రీనింగ్‌కి కూడా సిద్ధపడొచ్చు.

ఇదే సమయంలో ఇండియన్ ఎకానమీ, ఏపీ ఎకానమీ, ఆంధ్రప్రదేశ్ చరిత్ర, ఇండియన్ పాలిటీలను ఆబ్జెక్టివ్ విధానంలో చదువుకోవాలి. అలా గ్రూప్-2 స్క్రీనింగ్‌కు సిద్ధమవుతూనే జూన్ 10న రాయబోయే మెయిన్స్ పరీక్షకూ డిస్క్రిప్టివ్ తరహాలో సన్నద్ధం కావొచ్చు. అలా చేస్తే మెయిన్స్ ప్రిపరేషన్‌ను కూడా కొన్ని విభాగాల్లో పూర్తి చేయవచ్చు.

ఈ ప్రణాళిక ఆచరణీయమే. కానీ అభ్యర్థులు తమ శక్తియుక్తులను 100% వినియోగించినప్పుడు మాత్రమే రెండు పరీక్షల ఉమ్మడి ప్రిపరేషన్‌కి అవకాశం ఉంటుంది. పైన పేర్కొన్న విధానం వల్ల 2 స్క్రీనింగ్‌లు గట్టెక్కవచ్చేమో కానీ తర్వాత జరిగే మెయిన్స్ ప్రిపరేషన్లో కొన్ని ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. వాటిని యుక్తితో పరిష్కరించుకోవటం అవసరం.

తాజా విషయాలతో ముడిపడి...

గత నాలుగేళ్లుగా ఏపీపీఎస్సీ జరిపిన స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలిస్తే కింది విషయాలు స్పష్టమవుతున్నాయి.

1. సైద్ధాంతిక అంశాల ప్రాధాన్యం కంటే వర్తమాన అంశాలతో ముడిపడిన ఆచరణాత్మక కోణంలో ప్రశ్నలు ఎక్కువ అడుగుతున్నారు. 2016లో జరిగిన గ్రూప్-2 పరీక్షలో ఎకానమీ విభాగంలో అడిగిన 150 ప్రశ్నలకు దాదాపు 70 ప్రశ్నలు దినపత్రికల ఆధారంగా తయారు చేసినవే.
2. పాలిటీలో కూడా వర్తమాన రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ప్రశ్నలు ఎక్కువ అడిగారు. ఇలాంటి సందర్భంలో కూడా దినపత్రికలపై అవగాహన ఉన్న అభ్యర్థులు పూర్తి స్థాయిలో సమాధానాలు గుర్తించి మంచి ఫలితాలు పొందారు.
3. ఎప్పటిలాగే పాఠశాల స్థాయిలోని బేసిక్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు జనరల్ స్టడీస్‌లోని కొన్ని విభాగాల్లో వచ్చాయి. ముఖ్యంగా భౌగోళిక శాస్త్రం, విపత్తు నిర్వహణ, పర్యావరణ అంశాలు, జనరల్ సైన్స్‌లలో ఈ కేటగిరీ ప్రశ్నలు ఎక్కువ వచ్చాయి. అందువల్ల 6-9 తరగతుల పాఠ్యపుస్తకాలపై పట్టు సాధిస్తే తప్పనిసరిగా మంచి స్కోరుకు ఆస్కారముంది.
4. యోజన, ఆంధ్రప్రదేశ్ మ్యాగజీన్లను చదవడం ద్వారా ప్రభుత్వ దృక్పథాలు స్పష్టంగా అర్థమవుతాయి. దానివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న ఆర్థిక ప్రణాళికలతో పాటు ఇతర గవర్నెన్స్ అంశాలపై కూడా అవగాహన ఏర్పడుతుంది. అందువల్ల గ్రూప్- 1, 2 పరీక్షలు ఉమ్మడిగా రాయాలనుకునే అభ్యర్థులు ఇటువంటి జాగ్రత్తలు తీసుకుంటే సన్నద్ధతలో సౌలభ్యం సమకూరుతుంది.
5. ఆధునిక భారతదేశ చరిత్ర, పాలిటీ విభాగాల్లో గ్రాడ్యుయేషన్ స్థాయిలోనే తెలుగు అకాడమీ పుస్తకాల నుంచి ప్రశ్నలు వస్తున్నాయి.
6. ఇండియన్ ఎకానమీ విభాగంలో ఒకటి రెండు చాప్టర్లు తప్ప మిగతా చాప్టర్‌లలో కరెంట్ ఎకానమీతో ముడిపడిన ప్రశ్నలకు ప్రాధాన్యం ఉంది.
7. ఉమ్మడి ప్రిపరేషన్లో భాగంగా గ్రూప్ - 1 మెయిన్స్ ప్రశ్నలు ఎదుర్కోవాలంటే గ్రూప్ 2 స్థాయిలోని ఫ్యాక్ట్స్ చదివేటప్పుడు 10 మార్కుల ప్రశ్నలను ఊహించుకుని సమాధానాన్ని ఆలోచించుకున్నట్లయితే మెయిన్స్ ప్రిపరేషన్లో కూడా సౌలభ్యం ఏర్పడుతుంది.
8. స్క్రీనింగ్ పరీక్షల్లో మానసిక సామర్థ్యాలు స్కోరింగ్ విభాగానికి చెందినవి. తక్కువ సమయంలో తెలివైన ప్రాక్టీస్ ద్వారా మంచి మార్కులు పొందవచ్చు. కాబట్టి అభ్యర్థులు ఈ విభాగంపై పట్టు సాధిస్తే స్క్రీనింగ్ పరీక్షలో ఎక్కువ మార్కులు సాధించవచ్చు.
9. కరెంట్ అఫైర్స్ విభాగంలో పరీక్షకు 4 రోజుల ముందు చదివేవారికి పెద్ద పట్టు దొరకదు. అందువల్ల కరెంట్ అఫైర్స్‌ని ఇప్పటి నుంచి విభాగాలవారీగా అంటే... రాజకీయ అంశాలు, ఆర్థిక అంశాలు, శాస్త్ర సాంకేతిక అంశాలు, క్రీడాంశాలు అని స్పష్టమైన విభజన చేసుకోవాలి. ప్రదేశాలు, వ్యక్తులు, ప్రాధాన్యాలు అనే ఉప అంశాల కింద విభజించుకుని ఇవన్నీ చదవాలి.



కొడాలి భవానీ శంకర్

ప్రస్తుత పరీక్షల తేదీల నేపథ్యంలో ఉమ్మడి ప్రిపరేషన్ అయితే అసాధ్యమేం కాదు. కానీ అభ్యర్థుల సహనం, ఏకాగ్రత, సమయపాలన మాత్రమే దీనికి ఉపకరిస్తాయి. సరైన ప్రణాళికతో ముందుకు వెళితే రెండు పరీక్షల్లోనూ చక్కగా రాణించే అవకాశం ఉంటుంది.

ఇలా చేస్తే సరి!

సమస్య: గ్రూప్ 1 మెయిన్స్ డిస్క్రిప్టివ్ విధానానికి చెందింది. దీనిలో రాత ప్రాక్టీస్ చాలా ఉండాలి. ప్రశ్న - సమయాన్ని బట్టి సమాధానాన్ని పెంచడం, తగ్గించడం చేయగలగాలి. అది రాత ప్రాక్టీసు ద్వారానే అలవడుతుంది. పరీక్షల తేదీలను బట్టి రాత ప్రాక్టీసుకి ఎక్కువ సమయం దొరికేలా కనిపించడం లేదు.

పరిష్కారం: స్క్రీనింగ్ పరీక్షల తర్వాత రాత ప్రాక్టీస్ సరి కాదు. ఇప్పటి నుంచే స్క్రీనింగ్ చదువుకుంటూ కనీసం రెండు గంటలు అయినా 'ప్రశ్న - సమాధానాన్ని' రాసుకుంటూవుండాలి. రాత నిపుణతను పెంచుకోవాలి.

సమస్య: గ్రూప్ 2 మెయిన్స్‌లో సిలబస్‌లోని ఏ అంశమైనా ప్రశ్నగా మారే అవకాశం ఉంది. అందువల్ల ఫ్యాక్ట్స్, సమాచారాన్ని గుర్తు చేసుకోవాల్సిన శ్రమ ఉంటుంది. అందువల్ల గ్రూప్ 1 విధానంలో రాత ప్రాక్టీసుకి ప్రాధాన్యం ఇస్తే గ్రూప్ 2కి ప్రాధాన్యం తగ్గే ప్రమాదముంది.

పరిష్కారం: తప్పనిసరిగా స్క్రీనింగ్ సమయంలోనే ఆబ్జెక్టివ్ విధానాన్ని దృష్టిలో పెట్టుకుని ఫ్యాక్ట్స్ మొదలైనవి అదనపు శ్రమతో అధ్యయనం చేస్తే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు.

సమస్య: గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలో చాయిస్ పద్ధతిలో మొత్తం సిలబస్‌లో 50 నుంచి 60 శాతం మాత్రమే చదువుతారు. కానీ గ్రూప్ 2 పరీక్షలో 100% సిలబస్ చదవాల్సి ఉంటుంది. అందువల్ల ఉమ్మడి ప్రిపరేషన్ విధానం అంత తేలికేమీ కాదు.

పరిష్కారం: గ్రూప్ 1 మెయిన్స్‌లో చాయిస్ విధానంతో చదివినప్పటికీ గ్రూప్ 1 స్క్రీనింగ్ పరీక్ష కోసం కూడా 100% సిలబస్ సిద్ధమవ్వాలి. ఇక గ్రూప్ 2 మెయిన్స్‌కి కూడా 100% చదవాల్సిందే కదా! అందువల్ల స్క్రీనింగ్ ప్రిపరేషన్ సమయంలోనే గ్రూప్ 2 అంశాలు మొత్తం సన్నద్ధమవ్వడం మేలు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఎన్‌పీసీఐఎల్‌లో స్టైపెండరీ ట్రైనీలు

భారత ప్రభుత్వ రంగ సంస్థ న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్)- కాక్రపార గుజరాత్ సైట్‌లో స్టైపెండరీ ట్రైనీ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టులు-ఖాళీలు:** సైంటిఫిక్ అసిస్టెంట్-64, టెక్నీషియన్-ప్లాంట్ ఆపరేటర్-51, టెక్నీషియన్-మెయింటెయినర్-47. **అర్హత:** సైన్స్ సబ్జెక్టులతో పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, ఇంజినీరింగ్ డిప్లొమా, బీఎస్సీ, అనుభవం. **ఎంపిక:** ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు:** జనవరి 7 నుంచి 31 వరకు. **వెబ్‌సైట్:** https://npcilcareers.co.in/

ఐవోసీఎల్‌లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్)కు చెందిన ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథుర రిఫైనరీ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **పోస్టు:** జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్-4

ఖాళీలు: 42 **అర్హత:** సంబంధిత విభాగాల్లో ఇంజినీరింగ్ డిప్లొమాతోపాటు ఏడాది అనుభవం.

వయఃపరిమితి: 18-26 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్/ ప్రొఫిషియన్సీ/ ఫిజికల్ టెస్ట్ (ఎస్‌పీపీటీ) ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **ఫీజు:** రూ. 150. **ఆన్‌లైన్ దరఖాస్తు:** జనవరి 7 నుంచి 28 వరకు. **వెబ్‌సైట్:** https://www.iocrefrecruit.in/iocrefrecruit/

ప్రవేశాలు

క్లాట్ - 2019

దేశంలోని 21 న్యాయ విశ్వవిద్యాలయాల్లో 2019-20 విద్యా సంవత్సరానికిగాను డిగ్రీ, పీజీ న్యాయ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్)-2019 ప్రకటన వెలువడింది.

▌ కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్)-2019

కోర్సులు: 1) అండర్‌గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ - అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా డిగ్రీ **అర్హత:** కనీసం 45శాతం మార్కులతో ఇంటర్మీడియట్ (10+2) ఉత్తీర్ణత. 2019 మార్చి/ ఏప్రిల్‌లో పరీక్షకు హాజరుకానున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు. 2) పీజీ ప్రోగ్రామ్ - ఏడాది ఎల్‌ఎల్‌ఎం డిగ్రీ

అర్హత: కనీసం 55శాతం మార్కులతో ఎల్‌ఎల్‌బీ డిగ్రీ ఉత్తీర్ణత. 2019 ఏప్రిల్/ మేలో పరీక్షకు హాజరుకానున్నవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: ఆఫ్‌లైన్ రాతపరీక్ష (క్లాట్) ద్వారా. **ఆన్‌లైన్ దరఖాస్తు:** జనవరి 10 నుంచి మార్చి 31 వరకు. **క్లాట్ నిర్వహణ తేదీ:** మే 12

వెబ్‌సైట్: https://clatconsortiumofnlu.ac.in/

ఆదివారం నిర్వహించిన
▌ ఏపీ పోలీస్ కానిస్టేబుల్ ప్రాథమిక రాతపరీక్ష ప్రశ్నపత్రం, కీ
▌ ఆలిండియా సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్ష ప్రశ్నపత్రం, కీ కోసం www.eenadupratibha.net చూడండి.

వాక్-ఇన్స్

తెలంగాణ వెటర్నరీ వర్సిటీ

హైదరాబాద్‌లోని పీవీ నర్సింహా రావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ తాత్కాలిక ప్రాతిపదికన కాంట్రాక్ట్ టీచింగ్ ఫ్యాకల్టీ భర్తీకి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది. **పోస్టు:** అసిస్టెంట్ ప్రొఫెసర్ **ఖాళీలు:** 36. **సబ్జెక్టులవారీ ఖాళీలు:** వెటర్నరీ సైన్స్-30, ఫిషరీ సైన్స్-06. **అర్హత:** ఎంవీఎస్సీ/ ఎంఎఫ్ఎస్సీ/ పీహెచ్‌డీ ఉత్తీర్ణత. **వేతనం:** నెట్/ స్లెట్ అర్హత లేని ఎంవీఎస్సీ/ ఎంఎఫ్ఎస్సీ అభ్యర్థులకు నెలకు రూ. 37,800; ఎంవీఎస్సీ/ ఎంఎఫ్ఎస్సీతోపాటు నెట్/ స్లెట్ (లేదా) పీహెచ్‌డీ ఉన్నవారికి నెలకు రూ. 43,470. **వాక్‌ఇన్ ఇంటర్వ్యూ తేదీ:** 11.01.2019. **వేదిక:** అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, రాజేంద్రనగర్, హైదరాబాద్. **వెబ్‌సైట్:** http://tsvu.nic.in/

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు

యువ హృదయం.. జర పదిలం

ఆపీ సదస్సు కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ శ్రీని గంగసానితో 'ఈనాడు' ముఖాముఖి

ఈనాడు - హైదరాబాద్

అమెరికాతో పోల్చితే మన దేశంలో గుండెజబ్బులు ఐదింతలు ఎక్కువని, ముఖ్యంగా యుక్తవయసులో గుండెపోటు వస్తే తీవ్రత ప్రాణాంతకంగా ఉంటుందని అమెరికాలోని అట్లాంటాలో గుండె వైద్యనిపుణులుగా రాణిస్తున్న డాక్టర్ శ్రీని గంగసాని చెప్పారు. మన దగ్గర కుటుంబ వైద్యుడి విధానం కనుమరుగవుతున్న పరిస్థితుల్లో.. బ్రిటన్, అమెరికాలాంటి పాశ్చాత్య దేశాల్లో ఇప్పటికీ దీన్ని ఆదరిస్తున్నారని చెప్పారు. అమెరికాలో భారతీయ మూలాలున్న వైద్యుల సంఘం (ఆపీ) నిర్వహిస్తున్న 37వ వార్షికోత్సవ సదస్సుకు కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న శ్రీని గంగసాని ఇటీవల హైదరాబాద్‌కు వచ్చారు. ఆయనతో 'ఈనాడు' ప్రత్యేక ముఖాముఖి.

● ఆపీ ఎప్పుడు ఏర్పడింది? దీని లక్ష్యాలేమిటి?

భారతీయ మూలాలున్న వైద్యులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను సంఘటితంగా పరిష్కరించుకునేందుకు 1982లో డెట్రాయిట్‌లో ఆపీగా ఏర్పడ్డారు. ఇప్పుడు దీనిలో లక్ష మంది సభ్యులున్నారు. వీరిలో దాదాపు 30 శాతం మంది తెలుగువారే. ఆపీ వైద్యుల విశిష్టత ఏంటంటే.. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోని ప్రతి ఏడుగురు రోగుల్లో ఒకరికి వైద్యసేవలందించేది భారతీయ వైద్యులే. న్యూజెర్సీ, ఇలినాయిస్ వంటి రాష్ట్రాల్లో అయితే ప్రతి నలుగురిలో ఒకరికి వైద్యం చేసేది మనవారే కావడం విశేషం.

● ఉన్నత విద్య కోసం అమెరికా వస్తున్న వైద్య విద్యార్థులకు అవకాశాలెలా ఉన్నాయి?

భారత్ నుంచి వచ్చే వైద్యవిద్యార్థులకు మెరుగైన అవకాశాలే ఉన్నాయి. అక్కడ నిర్వహించే పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలి. వైద్యపరిశోధనలపై పట్టు పెంచుకుంటే మంచి మార్కులు తెచ్చుకోవచ్చు.



● మన దేశంలో యుక్తవయసులోనే గుండెజబ్బుల బారిన పడుతున్నారు. దీనికి పరిష్కారమేంటి?

మన వాళ్లలో ఇప్పుడు 20 ఏళ్ల వయసుల్లోనూ గుండెజబ్బులు బారినపడిన వారిని చూస్తున్నాం. అమెరికన్లతో పోల్చితే భారతీయ మూలాలున్న వ్యక్తుల్లో గుండెజబ్బులు ఐదింతలు అధికం. ప్రపంచ దేశాల్లో 40 ఏళ్లలోపు వారిలో 5 శాతం మంది గుండెపోటుతో మరణిస్తుండగా.. భారతీయుల్లో అది 20-25 శాతంగా ఉంది. ఇందుకు సగం కారణం మన జన్యువులే. మధుమేహం, అధిక రక్తపోటు, చెడు కొలెస్ట్రాల్ వంటివి మిగిలిన కారణాలు. చిన్నప్పుడు పాఠశాలకు నడిచి వెళ్లేవాళ్లం. ఇప్పుడది తగ్గిపోయింది. నిల్వ ఆహారం తినడం, ధూమపానం, ఊబకాయం, వ్యాయామం చేయకపోవడం, పని ఒత్తిడి తదితరాలు కూడా ప్రమాదాన్ని పెంచుతున్నాయి. గుండె రక్తనాళాల్లో 20-30 శాతం పూడికలున్నప్పుడు కూడా తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురయినా, ధూమపానం, చెడు కొలెస్ట్రాల్ తదితర కారణాల వల్ల ఎప్పుడైనా సరే.. ఒక్కసారిగా రక్తనాళం బద్దలై పూడిక వందశాతంగా మారిపోతుంది. దీంతో 5-10 నిమిషాల్లోపే ప్రాణాలు కోల్పోతుంటారు. అందుకే ఎక్కువగా చెమటలు పట్టినా, నడుస్తుంటే ఆయాసంగా అనిపించినా, ఛాతీలో పట్టేసినట్లుగా అనిపిస్తున్నా వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి. ముఖ్యంగా యుక్తవయస్కుల్లో గుండెపోటు వస్తే తీవ్రత అధికంగా ఉంటుంది. క్యాన్సర్ కణాలు ఎంత వేగంగా వ్యాప్తి చెందుతాయో.. గుండె రక్తనాళాలు కూడా అంతే వేగంగా పూడుకుపోతాయి.

> ### శ్రీని వ్యక్తిగతం
> - శ్రీని గంగసాని స్వస్థలం తెలంగాణలోని నాగర్‌కర్నూల్.
> - నల్గొండ జిల్లాలోని 'సర్వైల్' గురుకుల విద్యాలయంలో చదివారు.
> - కర్నూలు వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ వైద్యవిద్య అభ్యసించారు.
> - 1993లో పీజీ వైద్యవిద్యకు అమెరికా వెళ్లి, తర్వాత గుండె వైద్యంలో పట్టా పొందారు.

● గుండె మార్పిడి చికిత్సల్లో అమెరికాలో దాతలు ముందుకొస్తుంటారా?

అమెరికాలో డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చేటప్పుడే అవయవదానంపై అనుమతి కోరతారు. అంగీకారమిచ్చిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో జీవన్మృతుడిగా మారితే.. వెంటనే అవయవాలను సేకరిస్తారు. అయినా కూడా ఇప్పటికీ అమెరికాలో గుండె మార్పిడి చికిత్సలు ఏటా సుమారు 50 వేల మందికి అవసరమవుతుంటే 2,500 మందికి మాత్రమే జరుగుతున్నాయి. గుండెమార్పిడి జరిపితే పదేళ్ల జీవితకాలం పెరుగుతుంది. మన దగ్గర కూడా ఈ శస్త్రచికిత్సలు బాగానే చేస్తున్నారు. అవయవదానంపై చైతన్యం మరింత పెరగాలి.

● అమెరికాలో ప్రాథమిక వైద్యం ఎలా ఉంటుంది? అక్కడ కుటుంబ వైద్యుడి వ్యవస్థ ఉందా?

యూఎస్‌లో ప్రాథమిక వైద్యం పక్కాగా అమలవుతోంది. ప్రతి రోగికి నివాస ప్రాంతంలో కుటుంబ వైద్యుడు (ఫ్యామిలీ ప్రాక్టీషనర్) ఉంటారు. వారిని 'ప్రైమరీ గేట్ కీపర్' అంటారు. రోగి కుటుంబ వైద్యుడి వద్దకు వెళ్తే.. సమస్యను పరిశీలించి అవసరమైతే స్పెషలిస్టు వైద్యుని వద్దకు పంపిస్తారు. ఉదాహరణకు ఛాతీలో నొప్పి ఉంటే అది గుండెనొప్పా? ఛాతీలో మంటా? కండరాల నొప్పా? అనేది కుటుంబ వైద్యుడు గుర్తించి, అవసరమైతేనే ఉన్నత స్థాయి వైద్యానికి పంపిస్తారు. అయితే ఈ క్రమంలో స్పెషాలిటీ వైద్యుడి దగ్గరికి వెళ్లడం కొంచెం ఆలస్యమవుతుంది.

● మన వైద్య వ్యవస్థలో లోటుపాట్లను చక్కదిద్దడంపై మీ సూచన?

ప్రాథమిక వైద్యాన్ని బలోపేతం చేస్తే చాలా సమస్యలు పరిష్కారమవుతాయి. సాంకేతిక పరిజ్ఞానంతో స్పెషాలిటీ వైద్య సేవలను పల్లెలకు అందించాలి. టెలీ వైద్యం విధానాన్ని మరింత విస్తరించాలి.

● మన దగ్గర కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో అనవసర పరీక్షలు చేయిస్తుంటారనే ఆరోపణలున్నాయి. అక్కడెలా ఉంటుంది?

అమెరికాలో అత్యధిక సందర్భాల్లో అవసరమైన పరీక్షలే చేయిస్తుంటారు. స్పెషలిస్టు వైద్యుని వద్దకు వెళ్తే సంబంధిత అవయవానికి సమగ్ర పరీక్షలు చేయిస్తారు. రోగికి ఫలానా పరీక్ష చేయించకపోవడం వల్ల జబ్బును గుర్తించలేకపోయాం, అందువల్లే నష్టం జరిగిందంటే న్యాయపరమైన చిక్కులు కూడా ఎదురవుతాయి. వైద్యులు తప్పుడుగా వ్యవహరిస్తే కఠిన చర్యలే తీసుకుంటారు. అయితే అక్కడ భౌతిక దాడులు, ఆసుపత్రి ధ్వంసం వంటివి ఉండవు.



చెంగున దూకే.. బిట్టుడత

నల్లమల అటవీ ప్రాంతంలో అరుదుగా సంచరించే బిట్టుడత ఇది. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం రంగాపూర్ సమీపంలోని శ్రీ ఉమామహేశ్వరం క్షేత్రం దగ్గర కనిపించింది. సాధారణ ఉడతతో పోలిస్తే ఇవి నాలుగురెట్లు పెద్దగా ఉంటాయి. శరీరానికంటే తోక పెద్దగా ఉండి.. తోక చివర వివిధ రంగుల్లో మెరవడం దీని ప్రత్యేకత. రాష్ట్రంలో అచ్చంపేట పరిధిలోని నల్లమల ప్రాంతంలో దర్శనమిస్తుంది. అరుదైన వన్యప్రాణుల జాబితాలో చేరిన ఇది ఎప్పుడూ చెట్లపై ఉంటూ పండ్లు, ఆకులు మాత్రమే తింటుంది. దీనిపై ఫారెస్ట్ రేంజర్ మనోహర్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఈ ఉడత అరుదైన జీవి అని చెప్పారు. సాధారణ ఉడతలు చెట్టు మీది నుంచి కిందకు దిగి వేరే చెట్టు ఎక్కుతాయని.. ఇవి మాత్రం పక్కచెట్ల మీదికి దూకుతాయని వివరించారు.

-న్యూస్‌టుడే, అచ్చంపేట పట్టణం

'ప్రధాని అయ్యే అవకాశం మమతకే'

- సరదాకి అలా అన్నాను
- భాజపా పశ్చిమ బెంగాల్ అధ్యక్షుడు

కోల్‌కతా: భాజపా పశ్చిమబెంగాల్ శాఖాధ్యక్షుడు దిలీప్ ఘోష్ తమ పార్టీ వైఖరికి భిన్నమైన వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్ నాయకుల్లో ప్రధాని అయ్యే అవకాశం మమతా బెనర్జీకే ఉందంటూ పార్టీని ఇబ్బంది పెట్టారు. ఆదివారం సాయంత్రానికి సర్దుకుని మమత 65వ పుట్టిన రోజు సందర్భంగా తాను అలా పరిహాసం చేశానని తేల్చేశారు. కమల దళానికి, తృణమూల్ కాంగ్రెస్‌కి ఉన్న లోపాయికారి అవగాహనకు ఘోష్ ప్రకటనే తార్కాణమని విపక్షాలు విమర్శించాయి. '...ఆరోగ్యపరంగా మీరు దృఢంగా ఉండాల్సిన అవసరముంది.ఎందుకంటే బెంగాల్ నుంచి ప్రధాని అయ్యే అవకాశం మీకే ఉంది' అని మమతను ఉద్దేశించి ఘోష్ అనడంపై దుమారం రేగింది.

కూటమి నేతృత్వానికి మమత ఆరాటం!

సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని భాజపా వ్యతిరేక ప్రాంతీయ పార్టీల కూటమికి నేతృత్వం వహించేందుకు మమత ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల నేతలతో మంతనాలు జరిపారు. ఐక్యతను చాటేందుకు ఈ నెల 19న కోల్‌కతాలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులిద్దరితో పాటు అనేకమంది విపక్ష నేతలు దీనికి రానున్నారని మమత తెలిపారు.

భారత కరెన్సీ వినియోగంపై ఉత్తర్వులు ఇవ్వండి: నేపాల్

కాఠ్‌మాండూ: పెద్ద నోట్లు రద్దు చేసిన తరువాత విడుదల చేసిన కొత్త నోట్లు తమ దేశంలో చెల్లుబాటయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని భారతీయ రిజర్వు బ్యాంకును నేపాల్ రాష్ట్ర బ్యాంకు (ఎన్ఆర్‌బీ) కోరింది. విదేశీ ద్రవ్య నిర్వహణ చట్టం ప్రకారం నేపాలీయులు ప్రస్తుతం భారత కరెన్సీలో రూ.100, దానికన్నా తక్కువ విలువ ఉన్న నోట్లను కలిగి ఉండడానికే అనుమతి ఉంది. దాన్ని ఇతర నోట్లకు కూడా వర్తింపజేయాలని కోరింది. కొత్త నోట్లను ముద్రించిన తరువాత వాటిని వినియోగించడంపై ఉత్తర్వులు రాలేదని ఎన్ఆర్‌బీ గుర్తు చేసింది. నేపాలీయులు రూ. 25,000 మేరకు భారతీయ కరెన్సీని తమ దగ్గర ఉంచుకునేందుకు అవకాశం ఉండడంతో అందుకు అనుగుణంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరింది.

హక్కుల కమిషన్‌లో వెబ్‌కాస్ట్ సౌకర్యం

దిల్లీ: దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలతో నేరుగా అనుసంధానం కావడానికి జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) వెబ్‌కాస్ట్ సౌకర్యాన్ని ప్రారంభించింది. ఆధునిక దూర దృశ్య (వీడియో కాన్ఫరెన్సింగ్) సౌకర్యాన్ని కలిగించింది. సంస్థ రజతోత్సవాల సందర్భంగా ఈ ఏర్పాట్లు చేసింది. వీటిని ఆ సంస్థ ఛైర్మన్ జస్టిస్ హెచ్.ఎల్.దత్తు ఇటీవల ప్రారంభిచారు. వెబ్ పోర్టల్ webcast.gov.in/nhrc ద్వారా ప్రజలతో నేరుగా అనుసంధానం కావచ్చు. వివిధ శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షించడానికి ఇది ఉపయోగపడుతుంది.

నర్మదానదిలో ఆక్టోపస్‌లు

- మొదటిసారి గుజరాత్‌లో పట్టుకున్న శాస్త్రవేత్తలు

వడోదర: నర్మదానది ఉప్పునీటి జలాల్లో భారతీయ శాస్త్రవేత్తలు మొట్టమొదటిసారిగా ఆక్టోపస్‌ను కనుగొన్నారు. 190 నుంచి 320 మిల్లీమీటర్ల పొడవు ఉన్న 17 ఆక్టోపస్‌లను గుర్తించారు. వీటిని "సిస్టోపస్ ఇండికస్" అనే శాస్త్రీయనామంతో పిలుస్తారు. సముద్రజలాల్లో 50 మీటర్ల లోతున కనిపించే ఈ జీవులు.. భారతీయ సముద్రతీర ప్రాంతంలోని ఉప్పునీటి జలాల్లో కూడా జీవిస్తాయని మొదటిసారి తెలిసిందని సముద్రజీవశాస్త్రవేత్తలు చెబుతున్నారు. గుజరాత్‌లోని వడోదరలో గల కేంద్రీయ



ఉప్పునీటిజలాల చేపల పరిశోధన కేంద్రాని(సీఐఎఫ్ఆర్ఐ)కి చెందిన శాస్త్రవేత్తలు వీటిని కనుగొన్నారు. గుజరాత్‌లోని ఖంభాత్ సముద్రతీరానికి దగ్గరగా గల భాద్‌భుట్ గ్రామం వద్ద నర్మదానది, సముద్రం కలుస్తాయి. ఇక్కడ నీటిలో ఉప్పుశాతం ఎక్కువ. అధిక అలల తాకిడికి ఈ నీటిలోకి ఆక్టోపస్‌లు వచ్చి ఉంటాయని 'సీఐఎఫ్ఆర్ఐ' శాస్త్రవేత్త డాక్టర్ దిబాకర్ భట్కా చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 200రకాల ఆక్టోపస్‌లు ఉండగా, మన భారతీయ సముద్రజలాల్లో 38రకాలు ఉన్నాయన్నారు.

అఫ్గానిస్థాన్‌లో కుప్పకూలిన బంగారం గని

30 మంది మృతి, ఏడుగురికి గాయాలు

కుందుజ్: అఫ్గానిస్థాన్‌లో బంగారం గని కుప్పకూలడంతో 30 మంది సజీవ సమాధి అయ్యారు. మరో ఏడుగురు గాయాల పాలయ్యారు. ఈశాన్య అఫ్గానిస్థాన్‌లోని కొండప్రాంతమైన బదక్షాన్ ప్రావిన్స్‌లో ఆదివారం ఈ దుర్ఘటన చోటుచేసుకుందని కొహిస్థాన్ జిల్లా గవర్నరు రుస్తుం రాఫి తెలిపారు. స్థానిక నది ఒడ్డున గల బంగారం గనిలో 200అడుగుల లోతున గ్రామస్థులు తవ్వకాలు జరిపారు. ఇందుకు పెద్ద యంత్రాన్ని ఉపయోగించారు. వారికి తవ్వకం పనుల్లో నైపుణ్యం లేకపోవడంతో పైనుంచి మట్టిపెళ్లలు విరిగిపడ్డాయి.

ఒక్క గది ఇద్దరు మంత్రులకు

- శాసనసభలో కార్యాలయాలకు భవనాల కొరత
- కమిటీ హాళ్లకూ ఇబ్బంది
- సరిపోని పరిపాలనభవనం
- ఏపీకి కేటాయించిన భవనాలు నిరుపయోగం
- తెలంగాణకు ఇవ్వాలని కోరినా నిరాకరణ

ఈనాడు, హైదరాబాద్: ఈ నెల 17న కొలువుదీరనున్న తెలంగాణ శాసనసభకు వసతుల సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. సగం భవనాల్లో, అరకొర వసతుల మధ్యే తొలి శాసనసభ సాగింది. ఏపీ శాసనసభను హైదరాబాద్‌లో నిర్వహించడం లేదు కాబట్టి వారికి కేటాయించిన భవనాలను కూడా తమకే ఇవ్వాలని తెలంగాణ కోరినా ఆ రాష్ట్ర అధికారులు స్పందించలేదు. దీంతో తెలంగాణ అసెంబ్లీకి ఈసారీ అరకొర వసతులు తప్పేలా కనపడడం లేదు.

రాష్ట్ర విభజన సమయంలో శాసనసభ భవనాలను ఏపీ, తెలంగాణ అసెంబ్లీలకు జనాభా ప్రాతిపదికన విభజించారు. ఇరు రాష్ట్రాలకు చెరో రెండు కమిటీ హాళ్లు కేటాయించారు. మంత్రుల గదుల్లో 16 ఏపీకి, తెలంగాణకు 11 ఇచ్చారు. పాత శాసనసభ భవనం మొత్తం ఆంధ్రకు దక్కగా, కొత్త భవనం తెలంగాణకు వచ్చింది. ఇరు రాష్ట్రాలకు కలిసి ఉన్న పరిపాలన భవనంలో కింది భాగం తెలంగాణకు, పై అంతస్తు ఏపీకి ఇచ్చారు. శాసనసభ ప్రాంగణంలోని బ్యాంకు జరిగే భవనం కింది



భాగాన్ని ఏపీకి కేటాయించారు. గ్రంథాలయంలోనూ ఒక గది ఇచ్చారు. విభజన జరిగిన రెండేళ్లకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్వరాష్ట్రానికి వెళ్లిపోయింది. ఆ తర్వాత ఖాళీగా ఉంటున్న భవనాలను తమకు కేటాయించాలని తెలంగాణ సర్కారు ఏపీ ప్రభుత్వాన్ని కోరింది. శాసనమండలి భవనాన్ని తెలంగాణకు ఇచ్చిన ఏపీ అధికారులు శాసనసభలోని మిగిలిన భవనాలను మాత్రం అప్పగించలేదు. ఆ భవనాలకు తాళం వేయడంతో వాటిలో ఎలుకలు, పందికొక్కులు సంచరిస్తున్నాయి.

అరకొర వసతులతో..

మరోవైపు తెలంగాణ శాసనసభ అరకొర వసతులతో నడుస్తోంది. శాసనసభ, మండలి తరఫున 30కి పైగా సంఘాలున్నాయి. కమిటీ హాళ్లు రెండే అందుబాటులో ఉండడంతో ఖాళీకి అనుగుణంగా సమావేశాలు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది. శాసనసభాపతికి ఒకే గది ఉంది. సభ కార్యకలాపాల సమావేశాలను అందులోనే నిర్వహించాల్సి వస్తోంది. తెలంగాణకు సీఎం, 17 మంది మంత్రులుండగా.. 11 గదుల్లోనే వారికి సర్దుబాటు చేశారు. ఒక్కో గదిలో ఇద్దరేసి మంత్రులు ఉంటున్నారు. మంత్రుల కుర్చీ, టేబుల్‌తోపాటు నాలుగు కుర్చీలకు మాత్రమే వాటిలో చోటు ఉంది. శాసనసభ గ్రంథాలయాన్ని విస్తరించాలనుకున్నా స్థలం చాలని పరిస్థితి. పరిపాలనభవనం ఇరుకుగా మారడంతో దస్త్రాల కోసం బీరువాలు, కంప్యూటర్లను అమర్చుకోలేకపోతున్నారు. క్యాంటీన్ నడిపేందుకు స్థలం లేదు. మీడియా, భద్రత సిబ్బంది లాబీల్లోనే ఉండాల్సి వస్తోంది. లాబీల్లో ఒకదానికి ఏపీ అధికారులు తాళం వేయగా మరో లాబీలో ఒకే దారి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. శాసనసభ ప్రాంగణంలోని బ్యాంకు ప్రస్తుతం ఎక్స్‌టెన్షన్ కౌంటర్‌గా ఉంది. దానిని పూర్తిస్థాయి బ్యాంకుగా విస్తరించడానికి కింది భాగంలోని స్థలం కోరగా ఏపీ అధికారులు నిరాకరిస్తున్నారు. ఈ బ్యాంకులో రెండు రాష్ట్రాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఖాతాలున్నాయి. కార్యకలాపాలను విస్తరిస్తే వారందరికీ మేలు జరుగుతుందని చెప్పినా స్పందించడం లేదు.

మరోసారి లేఖ

నిరుపయోగంగా ఉన్న ఏపీ శాసనసభ భవనాలను తమకు కేటాయించాలని మరోసారి లేఖ రాయాలని తెలంగాణ అసెంబ్లీ వర్గాలు భావిస్తున్నాయి. విభజన చట్టం ప్రకారం పదేళ్ల గడువు ఉన్నందున తమకు ఇచ్చిన భవనాలు నిరుపయోగంగా ఉన్నా కొనసాగించాలనే ధోరణి ఆంధ్రప్రదేశ్ అధికారుల్లో కనిపిస్తోందని, ఇది తెలంగాణ శాసనసభకు ఇబ్బందికరంగా మారిందని ఆ వర్గాలు చెబుతున్నాయి.

పార్టీ ఆలోచనావిధానం మారాలి

కాంగ్రెస్ సీనియర్ నేత, దామోదర రాజనర్సింహ

ఈనాడు, హైదరాబాద్: పార్టీ ఆలోచనా విధానం మారాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ అభిప్రాయపడ్డారు. ఆదివారం గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఓటరు ప్రాధాన్యం మారిపోయిందని.. ఎన్నికలు జరిగిన 20 రోజులు ఏం చేశామనేదే ముఖ్యమైందని పేర్కొన్నారు. అభివృద్ధికి.. ఓట్లకు.. గెలుపునకు సంబంధంలేదన్నారు. కాంగ్రెస్ ఓటమికి మూడు, నాలుగు కారణాలున్నాయని తెలిపారు. ఈసీ నిర్ణయాలు తెరాసకు అనుకూలంగా ఉన్నాయని, అధికార దుర్వినియోగం, డబ్బు, మద్యం ప్రభావం ఎక్కువగా ఉన్నాయని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ విఫలమైందన్నారు. మల్లన్నసాగర్ మినహా ప్రజాసమస్యలపై పోరాటం చేయలేకపోయామని చెప్పారు.

సీఎల్పీ నాయకుడిగా అవకాశం అడిగా

నా సతీమణికి మెదక్ టికెట్ ఇస్తే గెలిపించుకొస్తా: జగ్గారెడ్డి

సీఎల్పీ నాయకుడిగా తనకు అవకాశం ఇవ్వాలని ఏఐసీసీ ఇన్‌ఛార్జి కుంతియా, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను అడిగినట్లు కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు. లోక్‌సభ బరిలో కాంగ్రెస్ బలమైన అభ్యర్థుల్ని దింపాలన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మెదక్ లోక్‌సభ సీటును తన సతీమణి నిర్మలకు ఇస్తే గెలిపించుకుని వస్తానన్నారు. తెలుగుదేశంతో పొత్తుతో కాంగ్రెస్‌కు ఎలాంటి నష్టం లేదన్నారు. వైకాపా వాళ్లు తెరాసకు ఓటేశారని.. అందుకే హైదరాబాద్‌లో పార్టీకి నష్టం జరిగిందని విశ్లేషించారు. పార్లమెంటు ఎన్నికల్లోనూ పొత్తులు ఉండాల్సిందేనని.. అభ్యర్థులను ఫిబ్రవరిలోనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పార్టీ నేతలకు విందిచ్చిన డి.కె.అరుణ

మాజీ మంత్రి డి.కె.అరుణ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలకు ఆదివారం హైదరాబాద్ సమీపంలోని ఫాంహౌస్‌లో విందు ఇచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నేత కె.జానారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు పొన్నం ప్రభాకర్, రేవంత్‌రెడ్డి, మల్లుభట్టి విక్రమార్క సహా పలువురు ముఖ్యనేతలు, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు విందుకు హాజరైనట్లు తెలిసింది.

కొత్త నిబంధనలతో బాణసంచా పరిశ్రమలకు ఇబ్బందులు

ఆల్ ఇండియా ఫైర్‌వర్క్స్ అసోసియేషన్

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: కాలుష్యం నివారణ పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న కొత్త నిబంధనల వల్ల బాణసంచా పరిశ్రమలకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆల్ ఇండియా ఫైర్ వర్క్స్ అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఆదివారం సికింద్రాబాద్‌లో 12 రాష్ట్రాలకు చెందిన ఆ సంఘం ప్రతినిధులు, ట్రేడర్లు, డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫైర్‌వర్క్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్‌రావు, తమిళనాడు అధ్యక్షుడు రాజా చంద్రశేఖరన్ మాట్లాడుతూ..ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో దేశవ్యాప్తంగా కొనుగోళ్లు నిలిచిపోయి బాణసంచా పరిశ్రమలు నష్టాల్లో కూరుకుపోయాయని తెలిపారు. ఈ నెల 16న నాగ్‌పూర్‌లో జరిగే సమావేశంలో ట్రేడర్లు, డీలర్లు అందరూ కలిసి ప్రభుత్వానికి కొన్ని సూచనలు, సలహాలు అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తెలంగాణ ఫైర్‌వర్క్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు శేతురాజు తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో రికార్డు పనులు మొదలు

ఈనాడు డిజిటల్, ఏలూరు: పోలవరం ప్రాజెక్టులో ప్రపంచ రికార్డు కాంక్రీటు పనులు ఆదివారం మొదలయ్యాయి. ఆదివారం ఉదయం 8 గంటలకు గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్సు ఎడ్యుకేటర్ రిషిద్‌నాథ్ కాంక్రీటు పనులను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం భారీ స్థాయిలో కాంక్రీటు పనులు చేపట్టారు. 2017లో యూఏఈలో ఓ టవరు నిర్మాణంలో భాగంగా 24 గంటల్లో 21,580 ఘనపు మీటర్ల కాంక్రీటు వేశారు. ఆ రికార్డును అధిగమించేందుకు గత రెండు రోజుల నుంచి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఉదయం పనులు ప్రారంభించారు. సోమవారం ఉదయం 8 గంటల వరకు ఈ పనులు చేపడతారు. ఆ తర్వాత గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్సు అధికారులు అవార్డు ప్రకటిస్తారు. 24 గంటలకు 30 వేల ఘనపు మీటర్ల కాంక్రీటు వేస్తారు. ఆపై కూడా పనులు కొనసాగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



టెలీబెల్టు ద్వారా బ్లాకులో వేస్తున్న కాంక్రీట్

కేటీఆర్ చెప్పినవి పచ్చి అబద్ధాలు

- గ్రాంట్ల రూపంలో తెలంగాణకు కేంద్రం నుంచి రూ.2 లక్షల కోట్లు
- సాయాన్ని పుస్తకరూపంలో ప్రజల్లోకి తీసుకెళ్తాం: దత్తాత్రేయ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రాల్లోని భాజపాయేతర ప్రభుత్వాల పట్ల ఎన్డీయే ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తూ కక్ష పూరితంగా వ్యవహరిస్తోందంటూ తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన విమర్శల్లో వాస్తవం లేదని ఎంపీ దత్తాత్రేయ అన్నారు. ఆయన చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలంటూ మండిపడ్డారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు అనుకూలంగా ఫలితాలు వస్తాయని గ్రహించి, ప్రజలను పక్కదారి పట్టించేందుకు మోదీ సర్కారుపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లో దత్తాత్రేయ విలేకరులతో మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో తెలంగాణ ప్రభుత్వానికి పైసా ఇవ్వలేదంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సత్య దూరమని.. రూ.రెండు లక్షల కోట్ల నిధుల్ని రాష్ట్రానికి అనేక గ్రాంట్ల రూపంలో కేంద్రం ప్రకటించిందని చెప్పారు.



తెలంగాణలో నిరంతర విద్యుత్తు ఘనత కేంద్రం పుణ్యమేనన్నారు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో జాతీయ రహదారుల నిడివి 2,400 కి.మీ. ఉండగా ప్రాంతీయ వలయ రహదారి సహా కొత్త జాతీయ రహదారులు మంజూరు చేసి ఆ నిడివిని 5,600 కి.మీ.లకు పెంచింది ఎన్డీయే ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్ మెట్రో రైలు, రాష్ట్రానికి 2.10 లక్షల ఇళ్ల మంజూరు.. ఇవన్నీ మోదీ సర్కారు చేసినవి కావా? అని కేటీఆర్‌ను ఆయన ప్రశ్నించారు. ఈ సంవత్సరం ప్రధాన మంత్రి సడక్ యోజన కింద రాష్ట్రానికి రావాల్సిన రూ.1,700 కోట్ల నిధులు రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం కారణంగా వెనక్కి పోయే ప్రమాదం ఉందని దత్తాత్రేయ తెలిపారు. కేంద్రం తెలంగాణకు ఇచ్చిన నిధుల వివరాలను పుస్తక రూపంలో ప్రచురించి ప్రజల్లోకి తీసుకువెళ్తామని దత్తాత్రేయ చెప్పారు.

పేద వృద్ధులకు 'తీర్థయాత్ర'!

- ఐదు రోజులపాటు ఉచిత ప్రయాణం, వసతి
- రాష్ట్రానికి రైల్వేశాఖ ప్రతిపాదన

ఈనాడు, హైదరాబాద్: పేదలకు ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలను సందర్శించే అవకాశాన్ని తెలంగాణ ప్రభుత్వంతో కలిసి అందించేందుకు రైల్వే యోచిస్తోంది. 'తీర్థయాత్ర' పేరుతో రాష్ట్రానికి ప్రతిపాదనలు పంపింది. సర్కారు సానుకూలంగా స్పందిస్తే తెలంగాణ నుంచి యాత్రను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ఇండియన్ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ)వర్గాలు చెబుతున్నాయి.

ఎవరు అర్హులు?


ఇప్పటికే కొన్ని రాష్ట్రాల నుంచి తీర్థయాత్ర పేరుతో రైళ్లను నడుపుతున్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి 60 ఏళ్లు, ఆపై వయసున్న వృద్ధులు అర్హులని ఐఆర్‌సీటీసీ చెబుతోంది. ఇందులో భాగంగా దేశంలోని పలు ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలకు తీసుకెళ్తోంది. "ఐదు రోజులపాటు రైల్లో ప్రయాణం మొదలుకుని భోజనం, వసతి, దర్శనం సహా అన్నిరకాల సౌకర్యాలను అందిస్తాం. ఈ యాత్రకు ఎంపికైన వారు పైసా కట్టక్కర్లేదు. అందరికీ అయ్యే ఖర్చు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఐఆర్‌సీటీసీ భరిస్తుంది" అని ఓ ఉన్నతాధికారి 'ఈనాడు'కు తెలిపారు.

ఒక్కో విడతలో వెయ్యి మంది

యాత్ర ప్రారంభమైతే ఒక్కో విడతలో వెయ్యి మందిని తీసుకెళ్లేందుకు ఐఆర్‌సీటీసీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. అర్హులను గుర్తించాక.. లాటరీ విధానంలో ఎంపిక చేసి ఒక్కో సారి వెయ్యి మందిని తీసుకెళ్లనుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణ, ఉత్తర భారతదేశం, ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్న ముఖ్య పర్యాటక ప్రదేశాలు, ఆధ్యాత్మిక ప్రాంతాల వివరాలతో ఓ జాబితాను రైల్వే అధికారులు రూపొందించారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వానికి అందించామని, ప్రభుత్వం అంగీకరిస్తే, సర్కార్ నిర్ణయాన్ని బట్టి ఆయాప్రాంతాలకు తీసుకెళ్తామని ఐఆర్‌సీటీసీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇప్పటికే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్, ఒడిశా రాష్ట్రాలతోపాటు దిల్లీ నుంచి తీర్థయాత్ర నడుపుతున్నామని ఐఆర్‌సీటీసీ వర్గాలు చెబుతున్నాయి. ఎక్కువగా మధ్యప్రదేశ్ నుంచి ప్రతి నెలా ఆరేడు రైళ్లు నడుపుతున్నట్లు వివరించాయి.

ఈనాడు బిజినెస్

కొనుగోళ్లకు అవకాశం!



సమీక్ష : అంతర్జాతీయ మార్కెట్ల బలహీనతలు, ప్రపంచ వృద్ధిపై భయాలతో గత వారం సూచీలు నష్టాలతో ముగిశాయి. ముడిచమురు ధరలు పెరగడం, స్థూల ఆర్థిక గణాంకాలు, డిసెంబరు వాహన విక్రయాలు నిరాశపరచడం సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో చైనా వృద్ధి తగ్గడం ప్రపంచ మార్కెట్లను కలవరపెట్టింది. డిసెంబరులో చైనా పారిశ్రామికోత్పత్తి రెండేళ్లలోనే తొలిసారిగా ప్రతికూల వృద్ధి నమోదు చేసింది. యాపిల్ ఆదాయ అంచనాల్లో కోత విధించడం మదుపర్లకు ఆందోళన కలిగించింది. దేశీయంగా చూస్తే.. డిసెంబరు వాహన విక్రయ గణాంకాలు అంచనాల కంటే తగ్గడంతో ఈ రంగ షేర్లు కుదేలయ్యాయి. భారత మౌలిక రంగ వృద్ధి 16 నెలల కనిష్ఠానికి చేరడం, జీఎస్‌టీ వసూళ్లు దిగజారడం నష్టాలకు ఆజ్యం పోశాయి. మొత్తం మీద ఈ పరిణామాలతో గత వారం సెన్సెక్స్ 1.1 శాతం తగ్గి 35,695 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 1.2 శాతం నష్టంతో 10,727 పాయింట్ల దగ్గర స్థిరపడింది. వాహన, లోహ, యంత్ర పరికరాల షేర్లు డీలాపడగా, స్థిరాస్తి, బ్యాంకింగ్, మన్నికైన వినిమయ వస్తువుల స్క్రిప్‌లు లాభపడ్డాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) నికరంగా రూ.2127 కోట్ల విలువైన షేర్లను విక్రయించగా, డీఐఐలు, ఫండ్ల కొనుగోళ్లు రూ.514 కోట్లుగా నమోదయ్యాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:1గా నమోదు కావడం.. మార్కెట్లలో అప్రమత్తతను సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } 36400- 36600 పాయింట్ల శ్రేణిలో బలమైన నిరోధం కావడంతో గత వారం మార్కెట్లు నష్టపోయాయి. అయితే సమీపకాలంలో మార్కెట్లకు 35,200- 35,500 పాయింట్ల శ్రేణిలో బలమైన మద్దతు లభించే అవకాశం ఉంది. 35200- 36600 పాయింట్ల శ్రేణిని అధిగమిస్తే.. మార్కెట్లు మరింత ముందుకెళ్లొచ్చు.

ప్రభావిత అంశాలు } అంతర్జాతీయ సంకేతాలు, కంపెనీల త్రైమాసిక ఫలితాలు, 10న జరగనున్న జీఎస్‌టీ మండలి సమావేశం ఈ వారం మార్కెట్లకు దిశానిర్దేశం చేయనున్నాయి. దేశీయంగా చూస్తే.. మూడో త్రైమాసిక కంపెనీల ఫలితాల సమీపకాలంలో మార్కెట్లకు కీలకం కానున్నాయి. రెండో త్రైమాసికంలో కంపెనీలు నిరాశపరచడంతో.. మదుపర్లు మూడో త్రైమాసిక ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ వారం టీసీఎస్, ఇన్ఫోసిస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బంధన్ బ్యాంక్, అవెన్యూ సూపర్‌మార్ట్స్ వంటి దిగ్గజ సంస్థలు త్రైమాసిక ఫలితాలు వెలువరించనున్నాయి. దేశీయ మార్కెట్లపై ముడిచమురు ధరల కదలికలు సైతం ప్రభావం చూపొచ్చు. డాలర్‌తో రూపాయి కదలికలు, ఎఫ్ఐఐ, డీఐఐల పెట్టుబడుల ధోరణి నుంచి మదుపర్లు సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు. అంతర్జాతీయంగా చూస్తే.. నేడు, రేపు అమెరికా-చైనాల మధ్య వాణిజ్య చర్చలు జరగనున్నాయి. సానుకూల వార్తలు వెలువడితే అంతర్జాతీయ మార్కెట్లు ముందుకెళ్లొచ్చు. అమెరికా ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ వ్యాఖ్యలు సైతం సానుకూలంగా కనిపిస్తున్నాయి. రేట్ల పెంపును వాయిదా వేసి, నగదు లభ్యత మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటామని పావెల్ తెలిపారు. అమెరికా ఫెడ్ గత సమావేశ నిర్ణయాలు 10న వెలువడనున్నాయి.

తక్షణ మద్దతు స్థాయిలు: 35,382, 35010, 34,672;
తక్షణ నిరోధ స్థాయిలు: 36,000, 36,285, 36,700

మార్కెట్లకు కొనుగోళ్ల మద్దతు లభించే అవకాశం ఉంది. అయితే అంతకంటే ముందు గరిష్ఠ స్థాయిల దగ్గర లాభాల స్వీకరణ జరగొచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ



కోడి గుడ్లు — 6న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	450	వరంగల్	452
చిల్లరగా (ఒక గుడ్డు)	5.10	విశాఖపట్నం	458
బెంగళూరు	452	చెన్నై	455
7వ తేదీకి...		చిత్తూరు	448
విజయవాడ/గోదావరి	453	నమక్కల్	440

పరుగే పరుగు

• కంపెనీల ఫలితాలపై ఆశావహ దృక్పథం వల్లే • నిఫ్టీ 10610- 10830 మధ్య కదలాడే అవకాశం
• అమెరికా- చైనాల భేటీపై మదుపర్ల దృష్టి • ఐటీ షేర్లపై ఇన్ఫీ, టీసీఎస్ ఫలితాల ప్రభావం

స్టాక్ మార్కెట్ ఈ వారం

స్టాక్ మార్కెట్ ఈవారం లాభాలు పంచే అవకాశం కనిపిస్తోంది. అక్టోబరు- డిసెంబరు త్రైమాసికానికి సంబంధించి కార్పొరేట్ కంపెనీలు వెల్లడించే ఆర్థిక ఫలితాలు ఆశాజనకంగా ఉండొచ్చన్న అంచనాలే ఇందుకు కారణం. నెమ్మదించిన ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే ఉద్దేశంతో బ్యాంకుల వద్ద ఉండాల్సిన నిధుల నిల్వల నిష్పత్తిని 100 బేసిస్ పాయింట్ల మేర చైనా తగ్గించడం, ప్రపంచ మార్కెట్ల సెంటిమెంట్ బలపడటానికి దోహదం చేయొచ్చు. ఈ పరిణామం మన మార్కెట్‌కూ సానుకూలతలు తెచ్చిపెట్టవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈనెల 10న జరగనున్న జీఎస్‌టీ మండలి సమావేశ నిర్ణయాల కోసమూ మదుపర్లు ఎదురు చూస్తారు. వీటిన్నింటి నేపథ్యంలో నిఫ్టీ 10610- 10830 శ్రేణిలో చలించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈవారంలో వెలువడనున్న ఇన్ఫోసిస్, టీసీఎస్ ఫలితాలు ఐటీ రంగ షేర్లపై ప్రబావం చూపుతాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ కూడా ఫలితాలు ప్రకటించనున్న నేపథ్యంలో బ్యాంకింగ్ రంగ షేర్లను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు. ఆయా రంగాలు, షేర్ల కదలికలపై విశ్లేషకుల అంచనాలు ఇలా..

- **ఐటీ** దిగ్గజాలు టీసీఎస్ (10న), ఇన్ఫోసిస్ (11న) ఈవారం వెల్లడించనున్న త్రైమాసిక ఫలితాలతో కార్పొరేట్ కంపెనీల అక్టోబరు- డిసెంబరు ఫలితాల సీజను ప్రారంభం కానుంది. ఫలితాలతో పాటు భవిష్యత్ అంచనాలపై ఈ రెండు కంపెనీలు చేసే వ్యాఖ్యలు ఐటీ రంగ షేర్లకు దిశానిర్దేశం చేస్తాయి. రూపాయి క్షీణత కారణంగా ఇవి మెరుగైన ఫలితాలు ప్రకటించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.
- **ఔషధ** రంగ షేర్లు ఈవారం ఒక శ్రేణికి లోబడి కదలాడే అవకాశం ఉంది. కీలక పరిణామాలేవీ లేకపోవడంతో ఈ రంగ షేర్లపై మదుపర్లు పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. అయితే అక్టోబరు- డిసెంబరు ఫలితాలు ఆశాజనకంగా ఉండొచ్చన్న అంచనాల ప్రభావం ఈ రంగ షేర్లపైనా కనిపించొచ్చు.
- బ్యాంకుల వద్ద ఉండాల్సిన నిధుల నిల్వల నిష్పత్తిని చైనా తగ్గించడం **లోహ, గనుల** రంగ షేర్లకు సానుకూలతను తెచ్చిపెట్టే అవకాశం ఉంది. చైనా, అమెరికాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతుండటం కూడా ఈ రంగ షేర్ల సెంటిమెంటు బలపడటానికి దోహదం చేయొచ్చు.
- **సిమెంటు** రంగ షేర్లు ఈవారం స్వల్ప శ్రేణికి లోబడి చలించే అవకాశం ఉంది. ఈ రంగానికి సంబంధించి కీలక పరిణామాలేవీ లేకపోవడంతో ప్రధాన సూచీల నుంచే ఇవి సంకేతాలను అందిపుచ్చుకోవచ్చు. అక్టోబరు- డిసెంబరు త్రైమాసికానికి సిమెంటు రంగ కంపెనీలు బలహీన ఫలితాలను ప్రకటించే అవకాశం ఉందని విశ్లేషకుల అంచనా వేస్తున్నారు. జీఎస్‌టీ మండలి సమావేశం కోసం కూడా మదుపర్లు ఎదురుచూసే అవకాశం ఉంది.
- **టెలికాం** రంగ కంపెనీలు ఈవారం స్వల్ప శ్రేణిలో కదలడొచ్చు. చందాదార్లను కోల్పోవడం కొనసాగుతుండటంతో భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా షేర్లు దీర్ఘకాలంలో కూడా స్తబ్దుగానే చలించొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. స్పెక్ట్రమ్ విక్రయ ఒప్పందానికి అనుమతులు లభించడంపై ఆర్‌కామ్ షేర్ల కదలికలు ఆధారపడి ఉంటాయి.
- **భారీ యంత్రపరికరాల** రంగ షేర్లకు ఈవారం నష్టాలు వచ్చే అవకాశం ఉంది. డిసెంబరులో ఈ రంగ కంపెనీలకు ఆర్డర్లు గణనీయంగా తగ్గడమే ఇందుకు కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు.
- ప్రభుత్వ రంగ **చమురు** కంపెనీలు ఈవారం స్థిరీకరణకు లోనయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా అంతర్జాతీయ చమురు ధరల ప్రభావం వీటిపై కనిపిస్తుంది. చమురు ధరలు పెరిగితే అప్‌స్ట్రీమ్ కంపెనీలైన ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా షేర్లు కొంత మేర సానుకూలంగా కదలాడొచ్చు. చమురు శుద్ధి సంస్థలైన ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లపై ఈ పరిణామం ప్రతికూల ప్రభావం చూపిస్తుంది.
- **బ్యాంకింగ్** రంగ షేర్లకు ఈవారం కూడా సానుకూలతలు కొనసాగొచ్చు. ప్రధాన సూచీలు రాణించే అవకాశం ఉండటం ఇందుకు దోహదం చేయొచ్చు. బుధవారం వెలువడనున్న ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఫలితాల ప్రభావం ప్రైవేట్ రంగ షేర్లపై కనిపిస్తుంది. ఈసారి ఫలితాల్లో ఆయా బ్యాంకుల ఆస్తుల నాణ్యతపైనే మదుపర్లు ప్రధానంగా దృష్టి సారించే అవకాశం ఉంది.
- **వాహన** రంగ కంపెనీల షేర్లు ఈవారం స్వల్ప శ్రేణికి లోబడి చలించే అవకాశం ఉంది. ప్రధాన సూచీల నుంచి కూడా ఇవి సంకేతాలను అందిపుచ్చుకోవచ్చు.

ఫార్మా	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	725.85	740.50	701.00
సిప్లా	512.80	518.80	505.10
డాక్టర్ రెడ్డీస్	2600.00	2633.30	2545.30
లుపిన్	828.90	838.80	815.40
సన్‌ఫార్మా	433.80	443.00	427.60
ఐటీ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
హెచ్‌సీఎల్ టెక్నాలజీస్	932.35	961.50	910.40
ఇన్ఫోసిస్	661.05	684.90	639.10
టీసీఎస్	1876.85	1933.20	1812.80
టెక్ మహీంద్రా	681.10	708.10	659
విప్రో	324.45	330.90	316.50

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	2117.45	2136.90	2100.60
ఐసీఐసీఐ బ్యాంక్	365.20	374.80	353.30
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1548.20	1583.90	1522.30
ఎస్‌బీఐ	297.65	303.60	288.60
యెస్ బ్యాంక్	189.65	195.90	178.40
వాహన	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
అశోక్ లేలాండ్	96.80	99.90	94.40
హీరో మోటోకార్ప్	2987.85	3074.60	2928.70
ఎం అండ్ ఎం	725.60	737.90	706.30
మారుతీ సుజుకీ	7234.50	7382.70	7087.10
టాటా మోటార్స్	170.95	173.90	167.00
యంత్రపరికరాలు	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
భెల్	71.40	72.90	69.30
సీజీ పవర్	44.30	45.40	42.50
ఎల్ అండ్ టీ	1,388.05	1,423.80	1,355.70
థెర్మాక్స్	1,140.30	1,173.70	1,112.80
సీమెన్స్	1062.70	1087.30	1022.90
చమురు	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
బీపీసీఎల్	359.45	367.80	347.40
హెచ్‌పీసీఎల్	248.20	253.50	243.70
ఐఓసీఎల్	133.95	136.30	131.40
ఓఎన్‌జీసీ	145.70	148.80	140.50
ఆయిల్ ఇండియా	174.55	176.80	171.00
టెలికాం	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
భారతీ ఎయిర్‌టెల్	322.45	332.10	307.60
ఆర్‌కామ్	14.00	14.70	12.90
రిలయన్స్ ఇండస్ట్రీస్	1098.65	1118.10	1071.40
వొడాఫోన్ ఇండియా	36.20	37.10	35.20
టాటా కమ్యూనికేషన్స్	531.45	554.10	511.40
సిమెంట్	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
ఏసీసీ	1,469.10	1,495.30	1,424.40
అంబుజా సిమెంట్స్	216.55	220.70	209.20
ఇండియా సిమెంట్స్	92.65	94.80	89.40
అల్ట్రాటెక్ సిమెంట్	3,914.55	3,973.50	3,823.50
శ్రీ సిమెంట్	16,737.10	17,199.40	16,378.20
లోహ	**ప్రస్తుత ధర**	**నిరోధం**	**మద్దతు**
హిందాల్కో	210.90	215.10	205.40
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	287.95	294.80	277.30
ఎన్ఎమ్‌డీసీ	93.95	96.00	92.00
టాటా స్టీల్	487.65	500.00	473.40
వేదాంతా	192.90	199.10	183.50

ఏటీఎంలు పనిచేసేలా చూడాలి

ఆర్‌బీఐకి పార్లమెంటరీ స్థాయీసంఘం సూచన

దిల్లీ: గ్రామీణ, పట్టణ శివారు ప్రాంతాల్లోని ఏటీఎంలు నిరంతరం మూసి ఉండటం వల్ల, నగదు కొరత సమస్య తీవ్రమవుతోందని, ఈ పరిస్థితిని చక్కదిద్దాలని రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)ను ఆర్థిక వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీసంఘం కోరింది. అవసరాలకు తగినన్ని ఏటీఎంలు నెలకొల్పాలని కూడా బ్యాంకులకు విజ్ఞప్తి చేసింది. 2018 సెప్టెంబరు నాటికి దేశంలో 2,21,492 ఏటీఎంలున్నాయి. వీటిల్లో 1,43,844 ఏటీఎంలు ప్రభుత్వ రంగ బ్యాంకులవి కాగా, ప్రైవేటు బ్యాంకులవి 59,645 కాగా విదేశీ బ్యాంకులు-చెల్లింపుల బ్యాంకులు, చిన్నమొత్తం రుణాలందించే బ్యాంకులు నెలకొల్పినవి, వైట్‌లేబుల్ ఏటీఎంలు కలిపి 18,003 ఉన్నాయి. డిజిటల్ లావాదేవీలు అంతర్జాతీయ స్థాయిలో జరగడం లేదు కనుక, ఏటీఎంలు తప్పనిసరిగా పనిచేస్తూ, నగదును ప్రజలకు అందించాల్సిందేనని కమిటీ పేర్కొంది. ఏ సమయంలోనే అయినా నగదు పొందేందుకు అనువుగా ఉండే ఏటీఎంలు సక్రమంగా పనిచేసేలా చూడాలని బ్యాంకులను ఆదేశించింది.

మరో 1600 మంది వ్యాపార ప్రతినిధులు

• నియామకానికి ఆంధ్రాబ్యాంక్ సన్నాహాలు • ప్రస్తుతం విధుల్లో 2,200 మంది

దిల్లీ: ప్రభుత్వ రంగ ఆంధ్రా బ్యాంకు తమ ఆర్థిక సేవలను మరింతమందికి విస్తరించే కార్యక్రమంలో భాగంగా 1600 మందికి పైగా వ్యాపార ప్రతినిధుల్ని (బిజినెస్ కరెస్పాండెంట్లు-బీసీలు) కొత్తగా నియమించుకోబోతోంది. ఇందులో అధిక శాతం నియామకాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉండబోతున్నాయి. ఏపీలో 922 మంది, తెలంగాణలో 695 మంది బీసీలను మార్చి లోపే నియమించుకోడానికి బ్యాంకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం కార్పొరేట్ బిజినెస్ కరస్పాండెంట్స్ (సీబీసీలు) నుంచి బిడ్లను ఆహ్వానించింది. జనవరి 31 నాటికి ఎంపిక చేసిన సీబీసీ కొత్త వ్యాపార ప్రతినిధుల విస్తరణను పర్యవేక్షించాల్సి ఉంటుంది.

2010 నుంచి..

ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్ర, తమిళనాడు, చత్తీస్‌గఢ్, బిహార్ రాష్ట్రాల్లో 2,200 మంది బీసీలు ఆంధ్రా బ్యాంకు కోసం పని చేస్తున్నారు. కొత్త ఖాతాల ప్రారంభం, ఇంటి వద్దకే బ్యాంకింగ్ సేవలు, మైక్రో ఏటీఎంల నిర్వహణ, మొండి బాకీల వసూలు తదితర సేవల్ని వీరు నిర్వహిస్తున్నారు. 2010 నుంచి వీరిని



ఆంధ్రా బ్యాంకు నియమిస్తోంది. రుణాల రికవరీ, సామాజిక భద్రతా పథకాల్లో కొత్త ఖాతాదారుల్ని చేర్పించడం, బ్యాంకుకు కొత్త తరహా వ్యాపారాన్ని అందించడం వంటి ఇతరత్రా విధుల్ని కూడా బ్యాంక్ వీరికి అప్పగించింది.

ఎవరు అర్హులు?

బీసీ ఏజెంట్లుగా పని చేసేందుకు బ్యాంకులతో అనుసంధానమైన, బాగా నడుస్తున్న స్వయం సహాయక బృందాలకు (ఎస్‌హెచ్‌జీలు) అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు బ్యాంకు తెలిపింది. పదవీ విరమణ చేసిన బ్యాంకు ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కిరాణా దుకాణాల యజమానులు, ప్రజా పంపిణీ వ్యవస్థలో ఉన్న డీలర్లు, ఎక్స్-సర్వీస్‌మెన్లకూ అవకాశం కల్పిస్తామంది. వీరితోపాటు రాబోయే అయిదేళ్ల కాలంలో 200-1000 మంది బీసీలను నేరుగా బ్యాంకు నియమించుకోబోతున్నట్లు తెలిపింది.

నియామకాలు వేగంగా జరపాలి: పార్లమెంటరీ స్థాయీ సంఘం

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో (పీఎస్‌బీలు) సమీప భవిష్యత్తులో అధిక శాతం మంది పదవీ విరమణ చేయబోతున్నందున, జూనియర్, మధ్య స్థాయి ఉద్యోగ నియామకాలు వేగంగా జరపాల్సిన అవసరం ఉందని పార్లమెంటరీ స్థాయీ సంఘం బ్యాంకులను కోరింది. లేదంటే ఉన్న వారిపై ఎక్కువ భారం పడే అవకాశం ఉందని తెలిపింది. 2019-20 నాటికి పీఎస్‌బీల్లో 95 శాతం మంది జీఎం స్థాయి ఉద్యోగులు, 75 శాతం మంది డిప్యూటీ జీఎం స్థాయి ఉద్యోగులు, 58 శాతం మంది అడిషనల్ జీఎం స్థాయి ఉద్యోగులు పదవీ విరమణ చేయబోతున్నట్లు గుర్తించిన ఆర్థిక వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం (ఫైనాన్స్ స్టాండింగ్ కమిటీ) పై సూచన చేసింది.

రూ.11,000 కోట్ల టర్నోవర్ సాధిస్తాం

• ఇప్పటికే రూ.7000 కోట్లు అధిగమించాం
• ముందస్తు పొదుపు ప్రణాళికలే మేలు
• మార్గదర్శి చిట్‌ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్ శైలజాకిరణ్



ఈనాడు, కాకినాడ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా నిర్దేశించుకున్న రూ.11,000 కోట్ల వ్యాపారం సాధించే క్రమంలో ఉన్నామని మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.శైలజా కిరణ్ తెలిపారు. ఇప్పటికే రూ.7000 కోట్ల టర్నోవర్ పూర్తయ్యిందని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని మార్గదర్శి బ్రాంచిని సందర్శించిన ఆమె ఈ వివరాలు చెప్పారు. సభ్యుల నుంచి సజావుగా వసూళ్లతో పాటు, చిట్ పాడుకున్న వారికి త్వరితగతిన చెల్లింపుల్లో మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ ప్రథమ స్థానంలో నిలుస్తోందని వివరించారు. 50 శాతానికి పైగా చెల్లింపులు పదిరోజుల్లోపే జరుగుతున్నాయని, అంతకు మించి ఆలస్యంగా తీసుకున్న వారుంటే డాక్యుమెంట్లు, ష్యూరిటీ ఇవ్వడంలో ఆలస్యం మాత్రమే కారణమని తెలిపారు. చిట్ సభ్యుల నుంచి డబ్బులు ఎంత జాగ్రత్తగా రికవరీ చేయగలుగుతామన్న విషయంలోనూ మార్గదర్శి అగ్రస్థానంలో నిలుస్తోందని చెప్పారు. ఆర్థిక క్రమశిక్షణ ఉన్నవారిని సభ్యులుగా చేర్చుకోవడం, వారికి త్వరితగతిన చెల్లింపులు జరపడం, సక్రమంగా రికవరీ చేయడంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పుతున్నట్లు వివరించారు. భవిష్యత్తు అవసరాల కోసం, తక్కువ వయస్సు నుంచే చిట్‌లలో సభ్యులుగా చేరి, పొదుపు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల అవసరమైనపుడు, అతి తక్కువ వడ్డీకే డబ్బులు పొందగలుగుతారని వివరించారు. కార్యక్రమంలో కాకినాడ శాఖ మేనేజర్ డి.దుర్గాప్రసాద్, రాజమహేంద్రవరం సీనియర్ మేనేజర్ ఎస్.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

2018లో రూ.83,146 కోట్ల ఎఫ్‌పీఐ పెట్టుబడులు వెనక్కి!

దిల్లీ: దేశీయ కేపిటల్ మార్కెట్ల నుంచి గత ఏడాది విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐలు) రూ.83,146 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. 2017లో రికార్డు స్థాయిలో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడుల్ని చొప్పించిన ఎఫ్‌పీఐలు గత ఏడాది మాత్రం నిధులు వెనక్కి తీసుకోవడం గమనార్హం. ముడి చమురు ధరలు ఎగబాకడం, రూపాయి క్షీణించడంతో పాటు అమెరికాలో వడ్డీ రేట్లు పెరగడం వంటి పలు కారణాల వల్ల వారు పెట్టుబడులను వెనక్కి తీసుకున్నట్లు విశ్లేషకులు అంచనా వేశారు. 2019లోనూ ఎఫ్‌పీఐలు ఆచితూచి వ్యవహరించే అవకాశం ఉందని, ఆర్థిక వృద్ధి స్థిరంగా ఉండి, సార్వత్రిక ఎన్నికల అనంతరం స్థిరమైన ప్రభుత్వం కొలువు తీరితే మళ్లీ వారు పెట్టుబడులు కొనసాగించేందుకు వీలుందని అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉంటే 2018లో ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.33,553 కోట్లు, రుణ మార్కెట్ల నుంచి రూ.49,593 కోట్లు ఎఫ్‌పీఐలు తరలించారు. 2002 తర్వాత దేశీయ కేపిటల్ మార్కెట్ల నుంచి ఎఫ్‌పీఐలు ఈ స్థాయిలో నిధులు వెనక్కి మళ్లించడం మళ్లీ ఇదే. 2018కి ముందు వరుసగా ఆరేళ్లపాటు ఎఫ్‌పీఐలు నికర పెట్టుబడిదారులుగా ఉన్న సంగతి తెలిసిందే.

చమురు జోరు!

కమొడిటీస్ ఈ వారం

• బంగారం, వెండి



పసిడి ఫిబ్రవరి ఫ్యూచర్ కాంట్రాక్టు గతవారం రూ.31,571 వద్ద ప్రారంభమైంది. ఆ తర్వాత దిద్దుబాటుకు లోనై రూ.31,300 స్థాయికి దిగివచ్చింది. ఇక్కడ కొనుగోళ్ల మద్దతు లభించడంతో రూ.31,938 వద్ద వారం గరిష్ఠ స్థాయిని చేరింది. అయితే లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో మళ్లీ డీలాపడింది. చివరకు 0.36% నష్టంతో రూ.31,456 వద్ద ముగిసింది. ఈవారంలో అమెరికా, చైనాల మధ్య జరిగే కీలక భేటీ పసిడి కాంట్రాక్టుకు దిశానిర్దేశం చేయనుంది. శాశ్వత ఒప్పందంపై కసరత్తు చేస్తున్నందున 90 రోజుల వరకు ఎలాంటి కొత్త టారిఫ్‌లు విధించకూడదని, గత డిసెంబరు 1న ఇరుదేశాల అధినేతలు ఓ అంగీకారానికి వచ్చిన సంగతి తెలిసిందే. నేడు జరిగే సమావేశంలో వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గే దిశగా ఏమైనా సంకేతాలు కనిపిస్తే, అది పసిడి కాంట్రాక్టుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. సాంకేతికంగా పసిడి కాంట్రాక్టు రూ.31,697 కంటే పైన కదలాడకుంటే.. ప్రతికూలతలకు అవకాశం ఉంటుంది. అందువల్ల ఈ స్థాయి వద్ద స్టాప్‌లాస్ పెట్టుకొని ప్రస్తుత షార్ట్ సెల్ పొజిషన్లు కొనసాగించొచ్చు. అమెరికా విడుదల చేసే ద్రవ్యోల్బణ గణాంకాలను కూడా ట్రేడర్లు పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. వెండి మార్చి కాంట్రాక్టు కిందటి వారం రూ.38,798 వద్ద ప్రారంభమైంది. రూ.38,550 స్థాయికి దిగివచ్చాక తిరిగి పుంజుకొని రూ.39,670 వద్ద వారం గరిష్ఠ స్థాయిని చేరింది. ఆ తర్వాత దిద్దుబాటుకు లోనైనప్పటికీ చివరకు 0.97% లాభంతో రూ.39,173 స్థాయి వద్ద ముగిసింది. ఈవారం వెండి కాంట్రాక్టుకు ప్రతికూల ధోరణి కనిపిస్తోంది. రూ.38,907 కంటే దిగువన ట్రేడ్ కానంతవరకు లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు. అయితే రూ.39,981- 40205 స్థాయిల మధ్య లాభాలు స్వీకరించడం మంచి వ్యూహం అవుతుంది. షార్ట్ పొజిషన్లు తీసుకోదలిస్తే రూ.39,985 వరకు వేచి ఉండటం ఉత్తమం.

• ప్రాథమిక లోహాలు



అమెరికా- చైనాల మధ్య జరగనున్న సమావేశంలో తీసుకునే నిర్ణయాలు లోహ కాంట్రాక్టులన్నింటికీ దిశా నిర్దేశం చేస్తాయి. లోహాలకు సంబంధించి చైనా ప్రధాన విపణి కావడమే ఇందుకు కారణం. రాగి ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం కూడా, మరోసారి అంతక్రితంవారం కనిష్ఠ స్థాయికి దిగివచ్చే అవకాశం ఉంది. అయితే ఏ చిన్న వార్త వచ్చినా తిరిగి పుంజుకునే అవకాశం ఉన్నందున తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్లకు మొగ్గుచూపొచ్చు. సీసం జనవరి కాంట్రాక్టుకు ఈవారం అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. అందువల్ల రూ.139.15 దిగువన లాంగ్ పొజిషన్లకు దూరంగా ఉండాలి. ఒకవేళ లాంగ్ పొజిషన్లుంటే రూ.133 వద్ద తప్పక స్టాప్‌లాస్ పరిగణించాలి. జింక్ జనవరి కాంట్రాక్టు ఈవారం బలహీనంగా కనిపిస్తున్న నేపథ్యంలో కొనుగోళ్లకు దూరంగా ఉండాలి. లాంగ్ పొజిషన్లు ఉన్న ట్రేడర్లు రూ.170కి దరిదాపులో స్టాప్‌లాస్ తప్పక పెట్టుకోవాలి. రూ.173- 176 స్థాయిలో కొత్తగా షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.178.25 వద్ద స్టాప్‌లాస్ పరిగణించాల్సి ఉంటుంది. అల్యూమినియం కాంట్రాక్టు ఈవారం సాంకేతికంగా మరింత దిగివచ్చే అవకాశం ఉన్నప్పటికీ.. గత 11 వారాలుగా నష్టాల్లో ముగిసినందున కొనుగోళ్లకూ ఆస్కారం ఉంది. అందువల్ల రూ.124.45 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకొని, రూ.130.50 కంటే పైన లాంగ్ పొజిషన్లు తీసుకోవచ్చు. ఒకవేళ రూ.124.15 దిగువకు వస్తే లాంగ్ పొజిషన్ల జోలికి వెళ్లొద్దు. నికెల్ జనవరి కాంట్రాక్టును రూ.734 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని కొనుగోలు చేయడం మంచిదే.

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/(క్షీణత)
	(రూ.లలో)		(శాతంలో)
రాగి (ఫిబ్రవరి)	418.90	409.60	(2.22)
సీసం (జనవరి)	142.70	136.60	(4.27)
జింక్ (జనవరి)	175.15	171.55	(2.06)
అల్యూమినియం (జనవరి)	129.85	130.15	0.23
నికెల్ (జనవరి)	752	773.10	2.81
ముడి చమురు (జనవరి)	3,207	3,359	4.74
సహజ వాయువు (జనవరి)	230.50	211.90	(8.07)
సీపీఓ (జనవరి)	502.50	533.50	6.17

• ఇంధన రంగం



ముడి చమురు జనవరి కాంట్రాక్టు గత వారం జోరును, ఈవారమూ కొనసాగించే అవకాశం ఉంది. అందువల్ల ప్రస్తుత లాంగ్‌పొజిషన్లు అట్టేపెట్టుకోవడంతో పాటు మరిన్ని పొజిషన్లు జతచేసుకోవచ్చు. యథావిధిగా ఈవారం కూడా వాతావరణ అంచనాల ప్రభావం సహజ వాయువు జనవరి కాంట్రాక్టుపై కనిపిస్తుంది. ఓవర్ సోల్డ్ పరిధికి సమీపంలో ఉన్నందున ధర తగ్గినప్పుడల్లా కొనుగోలు చేసే వ్యూహంతో ముందుకెళ్లడం మంచిది. ముడి పామోలిన్ నూనె (సీపీఓ) జనవరి కాంట్రాక్టుకు ఈవారం కొనుగోళ్ల మద్దతు లభించొచ్చు. ఏ చిన్న సానుకూల వార్త వచ్చినా కాంట్రాక్టు తిరిగి పుంజుకునే అవకాశం ఉండటమే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో ధర తగ్గినప్పుడల్లా కొనుగోలు చేసే వ్యూహాన్ని అనుసరించడం మేలు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

జాతీయ పార్టీలు అన్యాయం చేశాయి

- అధిక ఎంపీ స్థానాలు గెలవడం ద్వారానే కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు
- మాజీ మంత్రి హరీశ్‌రావు

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రానికి జాతీయ పార్టీలైన కాంగ్రెస్, భాజపాలు అన్యాయం చేశాయని రాష్ట్ర మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. మూడో పంట వేసుకునే ఆంధ్రప్రదేశ్‌కు జాతీయ ప్రాజెక్టు ఇచ్చి, ఒక పంట కూడా వేసుకోలేని తెలంగాణకు ఇవ్వకపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికలు చాలా కీలకమని, రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారానే కేంద్రం నుంచి అధిక నిధులు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రూపొందించిన వ్యవసాయ దైనందిని, కాలమానిని, టెలిఫోన్ డైరెక్టరీల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లోని రెడ్డి హాస్టల్‌లో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ.. మహారాష్ట్రలో నిర్మిస్తున్న సాగు నీటి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.4 వేల కోట్లు గ్రాంటు ఇచ్చిందని, ఆంధ్రప్రదేశ్‌కు పోలవరం జాతీయ ప్రాజెక్టు ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణలో నిర్మిస్తున్న కాళేశ్వరాన్ని మాత్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించలేదన్నారు. ఇందుకోసం ముఖ్యమంత్రి కేసీఆర్ దిల్లీకి వెళ్లి ప్రధానికి అనేక మార్లు విన్నవించినా ఫలితం లేదని చెప్పారు. నరేంద్ర మోదీ భాజపా పాలిత రాష్ట్రాలకే నిధులు, గ్రాంట్లు కేటాయిస్తూ ఆ రాష్ట్రాలకే ప్రధానిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మహబూబ్‌నగర్, వనపర్తి తదితర జిల్లాలలో జిన్నింగ్ మిల్లులు, రైస్ మిల్లులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఆగ్రో సంబంధిత పరిశ్రమల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించనుందని వెల్లడించారు. గతంలో కాంగ్రెస్, తెదేపా హయాంలో రాష్ట్రంలో రైతుల కళ్లలో కన్నీళ్లు చూస్తే.. కేసీఆర్ సారథ్యంలోని తెరాస ప్రభుత్వంలో ఆనందబాష్పాలు చూస్తున్నారన్నారు. వ్యవసాయరంగ నిపుణులు స్వామినాథన్ స్వయంగా కేసీఆర్‌కు అవార్డు ఇవ్వడమే రాష్ట్రంలో జరుగుతున్న వ్యవసాయాభివృద్ధికి నిదర్శనమన్నారు. స్వామినాథన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసిస్తే.. కాంగ్రెస్ నేతలు తిట్టి పోశారని గుర్తు చేశారు. మాజీ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ అధికారులు, ఉద్యోగుల సమస్యలను కేసీఆర్ త్వరలోనే పరిష్కరిస్తారన్నారు. దేశమంతా తెలంగాణ వైపు చూస్తోందని, ఇదే తరహాలో అధికారులు మరో నాలుగేళ్లపాటు పని చేస్తే తెలంగాణ ధనిక రైతుల రాష్ట్రంగా ఆవిర్భవిస్తుందన్నారు. ఐరాసగుర్తించిన వినూత్న కార్యక్రమాలలో రైతు బంధు, రైతు బీమా పథకాలున్నాయని గుర్తు చేశారు. తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం ఛైర్మన్ కృపాకర్‌రెడ్డి మాట్లాడుతూ. . మాజీ మంత్రి హరీశ్‌రావును అపర భగీరథుడని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అనురాధ, ప్రధాన కార్యదర్శి శ్యామ్‌సుందర్ రెడ్డి, రెడ్డి హాస్టల్ ప్రతినిధులు పాపిరెడ్డి, చంద్రారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ వ్యవసాయ శాఖ అధికారుల సంఘం రూపొందించిన దైనందినిని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి. కార్యక్రమంలో పాల్గొన్న సంఘం ఛైర్మన్ కృపాకర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షురాలు అనురాధ

పురోగతిలో మహబూబ్‌నగర్-మునీరాబాద్ మార్గం పనులు

దక్షిణ మధ్య రైల్వే ప్రకటన

ఈనాడు, హైదరాబాద్: మహబూబ్‌నగర్ నుంచి మునీరాబాద్ వరకు నిర్మాణంలో ఉన్న కొత్త రైలు మార్గం పనులు పురోగతిలో ఉన్నాయని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. తెలంగాణ, కర్ణాటకల మధ్య ఉన్న ఈ మార్గం ప్రధానమంత్రి పర్యవేక్షణ బృందం(పీఎంజీ)లో ఉందని, పనులు వేగంగా సాగేలా కేంద్రం దృష్టిపెట్టిందని ఆదివారం ఒక ప్రకటనలో వివరించింది. ఈ మార్గం పూర్తయితే మహబూబ్‌నగర్ జిల్లాలో, కర్ణాటకలో రాయచూరు జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దోహదం చేస్తుందని రైల్వేవర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్ నుంచి హుబ్బళ్లికి, గోవాకు మధ్య దూరం తగ్గనుంది. 1997-98లోనే ఈ ప్రాజెక్టును మంజూరు చేసినప్పటికీ నిధుల కేటాయింపులో ప్రాధాన్యం లభించలేదు. తెలంగాణలో 866 ఎకరాల భూసేకరణ చేయవలసి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం 734 ఎకరాలను సేకరించి రైల్వేకు ఇచ్చింది. దేవరకద్ర-జక్లేర్ 29 కి.మీ మార్గం ఇప్పటికే పూర్తయ్యి అందుబాటులోకి వచ్చింది. జక్లేర్-కృష్ణ మధ్య పనులు పురోగతిలో ఉన్నాయి. 2019-20నాటికి కృష్ణ స్టేషన్ వరకు మార్గం అందుబాటులోకి రానుంది.

గూబ గుయ్..

- హడలెత్తిస్తున్న రైలు, బస్సు ఛార్జీలు
- విశాఖ వైపు వ్యయ ప్రయాసల పండగ ప్రయాణం
- రూ.385 ఉండే స్లీపర్ టికెట్ 'సువిధ'లో రూ.1,365
- ప్రైవేటు బస్సుల్లో టికెట్ ధర రూ. 3 వేలు
- ఈ దోపిడీ దారుణమని వాపోతున్న ప్రయాణికులు



ఈనాడు, హైదరాబాద్: "సంక్రాంతి పండక్కి సొంతూరు అనకాపల్లి వెళ్లేందుకు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న రవికిశోర్ రైలు టికెట్లు కొనేందుకు స్టేషన్‌కు వెళ్లాడు. టికెట్లు దొరకలేదు. వెయిటింగ్ లిస్టే (నిరీక్షణ జాబితా)..అదీ ఐదొందల పైనే ఉంది. దీంతో ఆర్టీసీ బస్సులో ప్రయత్నించగా అక్కడా సీట్లు దొరకలేదు. ప్రైవేటు బస్సుల్లో వెళదామనుకుంటే.. అడ్డగోలు దోపిడీ. అటుతిరిగి, ఇటుతిరిగి మళ్లీ రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. ఏ రైలులో అడిగినా 'రిగ్రెట్' (నిరీక్షణ జాబితా పరిమితి దాటిపోవడం) అన్నారు. ఐఆర్‌సీటీసీ నుంచి 'సువిధ' ప్రత్యేక రైళ్లు వేస్తున్నారన్న విషయం తెలిసి మరుసటి రోజు ఉదయమే టికెట్ల కోసం రవికిశోర్ స్టేషన్‌కు పరుగెత్తాడు. స్లీపర్ టికెట్ ధర రూ.385 కాగా అది సువిధలో రూ.1365గా ఉంది. కానీ అవి అప్పటికే అయిపోయాయన్నారు. థర్డ్ ఏసీలో అయినా రెండు టికెట్లు ఇవ్వమన్నాడు. ఛార్జి వినడంతోనే.. గూబ గుయ్‌మంది. ఒక్కో టికెట్ ధర రూ.3,860గా చెప్పారు. చేసేదిలేక రెండు టికెట్లు తీసుకున్నాడు" ఇలా పండక్కి తమ సొంత ఊళ్లకు వెళ్లే ఒక్కొక్కరిదీ ఒక్కో పరిస్థితి.

ఏసీ బస్సయినా, రైలైనా ఒక్కొక్కరికి 3-4 వేలు

సంక్రాంతికి హైదరాబాద్ నుంచి విశాఖపట్నం సహా ఉత్తరాంధ్ర జిల్లాలకు వెళ్లాలనుకుంటున్న ప్రయాణికుల్లో చాలా మంది రైళ్లు, బస్సుల్లో రిజర్వేషన్ దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేక రైళ్లు, బస్సుల్లో అదృష్టం కొద్దీ టికెట్లు దొరికినా జేబులకు భారీగా చిల్లు పడుతోంది. జనవరి 10 నుంచి 13 వరకు విశాఖ వైపు వెళ్లే రైళ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. వెయిటింగ్ లిస్ట్ 500 నుంచి 600 దాటడంతో ప్రధాన రైళ్లన్నీ రిగ్రెట్‌కు చేరుకున్నాయి. రద్దీకి తగ్గట్లు సరిపడా రైళ్లు, ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రైవేటు ఆపరేటర్లు ఛార్జీల దోపిడీకి తెరలేపారు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నానికి మల్టీయాక్సిల్ ఏసీ బస్సుల్లో టికెట్‌కు సుమారు రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు. సాధారణంగా ఈ ఛార్జి రూ.1,300 ఉంటుంది. ప్రస్తుతం ఇది స్లీపర్ బస్సుల్లో రూ.4 వేలకు చేరింది. అటు ప్రత్యేక రైళ్లలో థర్డ్ ఏసీలో కానీ, ప్రైవేటు ఏసీ బస్సుల్లో టికెట్లు కావాలంటే.. ఒక్కొక్కరికీ రూ. 3 వేల ఖర్చు. నలుగురున్న కుటుంబం వెళితే రాను, పోను రూ.25 వేలు ఛార్జీలు అవుతున్నాయి.

అరగంటలోనే అయిపోయిన టికెట్లు

సికింద్రాబాద్, హైదరాబాద్ నుంచి విశాఖపట్నం ఆపై ప్రాంతాలకు ఒకే ఒక్క ప్రత్యేక రైలుకే పరిమితమైన రైల్వేశాఖ తాజాగా 4 సువిధ రైళ్లను ప్రకటించింది. వీటిలో బుకింగ్ ప్రారంభమైన 30 నిమిషాల్లోనే స్లీపర్ టికెట్లు అయిపోతున్నాయి. విశాఖ వైపు నిత్యం సగటున 10 రైళ్లు వెళతాయి. ప్రధాన రైళ్లలో ఒక్కో దాంట్లో నాలుగైదు వందల మంది రిజర్వేషన్ దొరక్క వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. రిగ్రెట్‌కు చేరడంతో చాలామందికి నిరీక్షణ టికెట్లు తీసుకునే అవకాశమూ రాలేదు. ఇందులో టికెట్ తీసుకుంటే చాలా మందికి ఆర్ఏసీ వస్తోంది. దీంతో బోగీలో సైడ్ లోయర్ బెర్తును ఇద్దరికి కేటాయిస్తున్నారు. అసలు ధరకు మూడు రెట్లు ఖర్చు చేసి టికెట్ కొంటే కూర్చుని ప్రయాణించాలా అని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మిగిలిన మార్గాల్లో రైళ్లేవి?

తెలంగాణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి. . ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి సహా రాయలసీమ నుంచి, విజయవాడ నుంచి విశాఖ వైపు వెళ్లేవారు పెద్దసంఖ్యలో ఉన్నారు. వీరికోసం దక్షిణ మధ్య రైల్వే అదనపు రైళ్లేవీ ప్రకటించలేదు. సికింద్రాబాద్ నుంచి విశాఖ వైపు వెళ్లేవి విజయవాడకు బదులుగా రాయనపాడు నుంచి దారి మళ్లిస్తున్నారు.

ప్రతి బండిలో 'రిగ్రెట్'

జన్మభూమి, కోణార్క్, ఈస్ట్‌కోస్ట్, ఫలక్‌నుమా, విశాఖ, దురంతో, ఎల్‌టీటీ విశాఖ, విశాఖ గరీబ్‌రథ్ సహా అన్ని ప్రధాన రైళ్లు 10, 11, 12, 13 తేదీల్లో 'రిగ్రెట్'కు చేరుకున్నాయి. గోదావరి వంటి రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ అయిదారొందలు దాటేసి రిగ్రెట్‌కు చేరింది. థర్డ్ ఏసీ బోగీల్లోనూ ఇదే పరిస్థితి. గోదావరిలో 200 మంది, గరీబ్‌రథ్‌లో 300 మంది, విశాఖ ఏసీ ఎక్స్‌ప్రెస్‌లో 380 మంది, దురంతోలో 286 మంది నిరీక్షణ జాబితాలో ఉన్నారు.

విశాఖపట్నం, ఆపై వెళ్లే రైళ్లలో పరిస్థితి

తేదీ (జనవరి)	మొత్తం రైళ్లు	రిగ్రెట్	వెయిటింగ్ లిస్ట్
11	10	9	1
12	12	10	2
13	10	7	3

భద్రతా సిబ్బందికి 'సంచార శిక్షణ'

- ప్రత్యేక మొబైల్ వాహనాన్ని ప్రారంభించిన మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: మెట్రో స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న భద్రతాసిబ్బందికి ఎప్పటికప్పుడు శిక్షణ ఇచ్చేందుకు కొత్తగా ప్రవేశపెట్టిన మొబైల్ ట్రైనర్ వ్యాన్‌ను ఆదివారం బేగంపేటలోని మెట్రోరైలు భవన్‌లో హైదరాబాద్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ప్రారంభించారు. స్టేషన్ల వద్దే భద్రతా సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు సాంకేతికంగా అన్ని హంగులున్న వాహనాన్ని ప్రవేశపెట్టడం దేశంలోనే తొలిసారని ఆయన చెప్పారు. ఈ వాహనంలో టీవీ సెట్స్, సీసీ కెమెరా, ఇతర ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలతోపాటు జీపీఆర్ఎస్ పని చేసే వ్యవస్థను ఏర్పాటు చేశారు.


మొబైల్ శిక్షణ వాహనాన్ని ప్రారంభిస్తున్న మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

స్టేషన్లలో పట్టుబడుతున్న ఆయుధాలు

ఇటీవలి కాలంలో నాలుగు మెట్రో స్టేషన్లలో ఆయుధాలు, నిషేధిత పదార్థాలను తీసుకెళుతూ ప్రయాణికులు పట్టుబడ్డారు. ఆయుధాలు స్వాధీనం చేసుకుని దర్యాప్తు నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు. కొద్దినెలల క్రితం ఉప్పల్ మెట్రో స్టేషన్‌లో లైసెన్స్ లేని రివాల్వర్, డిసెంబరు 4న మలక్‌పేట స్టేషన్‌లో పర్సు కత్తి.. పంజాగుట్టలో డిసెంబరు 6న, ఎల్బీనగర్ మెట్రో స్టేషన్‌లో అక్టోబరు 28న హుక్కా గన్, మంటలంటుకునే గుణమున్న ద్రవపదార్థ డబ్బాను స్వాధీనం చేసుకున్నట్లు హైదరాబాద్ మెట్రోరైలు డీసీపీ ఎ.బాలకృష్ణ తెలిపారు. ప్రయాణికుల సామగ్రిని క్షుణ్నంగా తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు.


మెట్రో స్టేషన్లలో ఇటీవల స్వాధీనం చేసుకున్న రివాల్వర్, పర్సు కత్తి

ఏపీ సీఎం అన్నింటా విఫలమయ్యారు



- కుమారుడి కోసం రాష్ట్ర భవిత పణం
- ఎన్టీఆర్ కాంగ్రెస్‌పై పోరాడితే.. ఆయన అల్లుడు ఆ పార్టీకే తలొగ్గారు
- మోదీపై అసత్య ప్రచారాలతో తెలుగు వారి ఆత్మగౌరవం వికసించదు
- కార్యకర్తలతో వీడియో సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ

ఈనాడు - అమరావతి

తన కుమారుడి ఎదుగుదల(సన్‌రైజ్) కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని అస్తమింపజేస్తున్నారని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. కుమారుడి భవిష్యత్తు కోసం సామాన్యుల పిల్లల భవిష్యత్తును పణంగా పెడుతున్నారని ఆరోపించారు. భ్రష్ట విధానాలు, అవినీతితో రాష్ట్రాన్ని వెనక్కి నెట్టేసి ముఖ్యమంత్రి అన్నింటా విఫలమయ్యారని విమర్శించారు. ఆదివారం దిల్లీ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అనంతపురం, కడప, కర్నూలు, నరసరావుపేట, తిరుపతి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ బూత్ స్థాయి కార్యకర్తలతో ఆయన ముఖాముఖి మాట్లాడారు. తొలుత కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకుని ప్రధాని స్పందించారు. 'ఏపీలో ప్రస్తుతం అధికారంలో ఉన్నవారు ప్రజలను మోసగించటం ఇది తొలిసారి కాదు. వారు ఎన్టీఆర్‌నే రెండుసార్లు మోసగించారు. అలాంటివారి నుంచి మోసానికిమించి ఏం ఆశించగలం? ఎన్టీఆర్ కాంగ్రెస్ ముక్తభారత్ ఉద్యమాన్ని నడిపించి నేషనల్‌ఫ్రంట్ ఏర్పాటుచేస్తే, ఇప్పుడు ఆయన అల్లుడే అధికారాన్ని కాపాడుకునేందుకు కాంగ్రెస్ ముందు తలొగ్గారు. తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ కాంగ్రెస్‌ను క్షమించలేదు. ఇప్పుడు ఏపీలో అధికారంలో ఉన్నవారు దాన్ని కాపాడుకునేందుకు ప్రజలకు ద్రోహం తలపెడుతున్నారు' అని విమర్శించారు.

ఒకే కుటుంబం ఆంధ్రప్రదేశ్‌లో అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకుంటే తెలుగు వారి ఆత్మగౌరవం వికసించదు. ప్రజాప్రయోజనాలను తుంగలో తొక్కుతూ మోదీపై నిత్యం అసత్య ప్రచారాలు, నిందారోపణలు చేస్తుంటే ఆ లక్ష్యం నెరవేరదు. ప్రధాని పదవిపై పగటి కలలు కంటుంటే ఆత్మగౌరవం ఇనుమడించదు. ప్రజలందర్నీ గౌరవించినప్పుడు, రాజకీయ ప్రయోజనాలకంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని ఆలోచించినప్పుడే తెలుగు వారి ఆత్మగౌరవం వృద్ధి చెందుతుంది. ఎన్టీఆర్ అదే చేశారు. స్వర్ణాంధ్రప్రదేశ్ అంటే అభివృద్ధి ఫలాలు అందరూ పొందాలే తప్ప ఒక్క కుటుంబం కాదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న వారు భాజపా అంటే భయపడుతున్నారు. ప్రజల్లోకి వెళ్లలేని వారే హింసకు, బెదిరింపులకు దిగుతారనేది గుర్తుంచుకోవాలి. ఏపీలోనూ భాజపా కార్యకర్తల పట్ల అధికారంలో ఉన్నవారు దురుసుగా ప్రవర్తిస్తున్నారు.

- భారత్‌లో ప్రతి ఒక్కరూ మీడియాపై ఫిర్యాదు చేస్తుంటారు. అది సరికాదు. విలేకరులకు ప్రజా సమస్యలపై అవగాహన ఉంటుంది. వారితో సత్సంబంధాలు పెట్టుకోండి. మన ఫొటోలు, వీడియోలు రాకపోయినా ఫరవాలేదు. మనం వెలికితీసిన ప్రజా సమస్యలు వెలుగుచూసేలా చూడండి.
- మన పని ప్రజలకు నిజాన్ని వివరించడం. అసత్యాలు చెబుతున్న వారిని చూస్తూ సమయాన్ని వృథా చేసుకోవద్దు. రోజురోజుకూ వ్యతిరేక ప్రచారం చేస్తున్న వారి సంఖ్య తగ్గుతోంది. అనుకూలుర సంఖ్య పెరుగుతోంది. మీ ఆవేశాన్ని, ఉత్సాహాన్నంతటినీ కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రచారంలో చూపించాలి.

మేం తినం.. తిననివ్వం..

రఫేల్ ఒప్పందంపై ప్రతిపక్షాల ఆరోపణలకు మంత్రులు నిర్మలా సీతారామన్, అరుణ్‌జైట్లీ ఇటీవల పార్లమెంటు వేదికగా ఇచ్చిన సమాధానాలతో రఫేల్‌పై ఉన్న అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి. దేశంలో రెండు రాజకీయ శక్తులున్నాయి. ఒకటి భాజపా నేతృత్వంలోని ఎన్డీయే. రెండోది ఒకే కుటుంబానికి చెందిన నాయకుల ఆధ్వర్యంలోని కూటమి. 'మేం తినం.. తిననివ్వం' అనేది మా నినాదమైతే, వారిది ప్రతి పథకంపైనా దాన్ని దిగమింగే దళారులు, నాయకులపేర్లు రాసి ఉంటాయనేది నినాదం..' అని ప్రధాని పేర్కొన్నారు.

కేంద్రం పెత్తనం తగదు

- వ్యతిరేకించిన వారిపై దాడులు చేస్తున్నారు
- అఖిలేష్ యాదవ్‌పై కేసులు ఇందులో భాగమే
- భాజపా, వైకాపా సంబంధాలు బహిర్గతం
- మోదీ, జగన్, కేసీఆర్‌లు మన రాష్ట్రంపై పడ్డారు
- ఏపీ సీఎం చంద్రబాబు

ఈనాడు - విజయవాడ

రాష్ట్రాలపై కేంద్రం పెత్తనాన్ని సహించేది లేదని, ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ప్రధానిగా మోదీ అన్ని రంగాల్లో విఫలమయ్యారని, మనల్ని నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. విభజన హామీలను నెరవేర్చకుండా ఎదురుదాడి చేస్తున్నారని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలోని పునాదిపాడులో ఆదివారం జన్మభూమి కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధరల నియంత్రణ, ఉద్యోగ కల్పనతో పాటు పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ తదితర అంశాల్లో ప్రధాని ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. దీన్ని కప్పిపుచ్చుకునేందుకే ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. 'ట్రిపుల్ తలాక్‌ను తెదేపా వ్యతిరేకించింది. దీనివల్ల ఆ విడాకులు చెల్లవంటే ఫర్వాలేదు. కానీ మగవారిని జైలులో పెట్టి ప్రాసిక్యూట్ చేస్తామనడం తగదు. ముస్లింలను దెబ్బతీయడమే భాజపా లక్ష్యం. కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేయడం వీరి ఉద్దేశంగా కనిపిస్తోంద'ని అన్నారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశంపై సుప్రీం ఇచ్చిన తీర్పునకు భిన్నంగా భాజపా పనిచేస్తోందని వివరించారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఉత్తరప్రదేశ్‌లో అఖిలేష్‌యాదవ్, మాయావతి సీట్లను సర్దుబాటు చేసుకున్నారని.. దీన్ని జీర్ణించుకోలేని మోదీ వెంటనే అఖిలేష్‌పై పాత అభియోగాలను తిరగదోడి సీబీఐతో కేసులు పెట్టించారని తెలిపారు. ఇదే పనిని మన రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, ఎంపీలు, ఎమ్మెల్యేలపైనా చేశారన్నారు.

రాష్ట్రంపై కుయుక్తులు

జగన్‌కు సానుభూతి వస్తుందని ఆయన అభిమాని కోడికత్తితో దాడి చేస్తే తనపైకి నెపం నెట్టడం తగదని చంద్రబాబు పేర్కొన్నారు.

ఈ కేసును ఎన్ఐయేకు అప్పగించడం ద్వారా భాజపా, వైకాపా సంబంధాలు బయటపడ్డాయని ఆరోపించారు. శాంతిభద్రతల అంశం రాష్ట్రాల పరిధిలోనిదని, దీన్ని ఉల్లంఘించి రాష్ట్రాల హక్కులను హరించేందుకు పూనుకున్నారని అన్నారు. మోదీ, అమిత్‌షాలు దేశాన్ని అన్ని విధాలా భ్రష్టు పట్టించారని ఆరోపించారు. హోదా, ఇతర అంశాలపై పార్లమెంటులో కేంద్రాన్ని నిలదీసినందుకే మన ఎంపీలను సస్పెండ్ చేశారని వివరించారు. రాష్ట్రంనుంచి పెద్ద ఎత్తున వెళ్లి దిల్లీ నడివీధుల్లో నినదిస్తే అరెస్టు చేశారని గుర్తుచేశారు. జగన్, మోదీ, కేసీఆర్‌లు మన రాష్ట్రంపై పడ్డారని.. ఏపీని భ్రష్టు పట్టించాలని కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. పెట్టుబడుల కోసం తాను దావోస్‌కు వెళ్తానంటే దానిపైనా ఆంక్షలు విధించడం తప్పు కాదా? అని ప్రశ్నించారు. కేంద్రం పెత్తందారీ పోకడలను అనుమతించేది లేదని, ఈ లక్ష్యంతోనే నాడు ఎన్టీఆర్ తెదేపాను స్థాపించారని అన్నారు. ఏపీని దెబ్బతీయాలనుకుంటే కుదరదని, ఇది చాలా చైతన్యమైన రాష్ట్రమని వెల్లడించారు.


కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడులో 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా.. కుండలో పొంగలి కలుపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఆమ్ ఆద్మీ పార్టీకి పంజాబ్ ఎమ్మెల్యే రాజీనామా

చండీగఢ్: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రాథమిక సభ్యత్వానికి పంజాబ్‌కు చెందిన తిరుగుబాటు ఎమ్మెల్యే సుఖ్‌పాల్ సింగ్ ఖైరా ఆదివారం రాజీనామా చేశారు. పార్టీ మూల సిద్ధాంతాలకు నాయకత్వం దూరమవుతున్నందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. గతంలో కాంగ్రెస్‌లో ఉన్న ఖైరా 2015లో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆప్‌లో చేరారు. ఆయనను గత ఏడాది జులైలో ప్రతిపక్ష నాయకుడి పదవి నుంచి నాయకత్వం తొలగించింది. గత నవంబరులో పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. అప్పటి నుంచి ఆయన పార్టీ నాయకత్వంపై విమర్శలు చేస్తూనే ఉన్నారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలన్న ప్రయత్నాలపైనా నిరసన తెలిపారు.

బుల్లెట్‌ప్రూఫ్ వాహనం ఛార్జీలు చెల్లించాల్సిందే

- రాజకీయ పార్టీలు, నాయకుల నుంచి వసూలు చేయనున్న పోలీసుశాఖ

ఈనాడు, హైదరాబాద్: ఎన్నికల ప్రచారంలో బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు ఉపయోగించిన 33 మంది రాజకీయ నేతల నుంచి పోలీసుశాఖ ఛార్జీలు వసూలు చేయనుంది. ఈ మేరకు డీజీపీ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి నియమావళి అమలులో ఉండే వరకు ప్రచారంలో పాల్గొనే నేతలు అవసరమైతే బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు వినియోగించుకోవచ్చు. అయితే దానికయ్యే ఖర్చు సదరు నాయకులే చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుంచి డిసెంబరు 7వ తేదీ వరకు ఆయా నాయకులు వాడిన వాహనాలు ఎన్ని కిలోమీటర్లు తిరిగాయన్నది నమోదు చేశారు. దాని ప్రకారం సంబంధిత నాయకులు, పార్టీల నుంచి డబ్బు వసూలు చేస్తున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు వినియోగించిన వారిలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు మధుసూదనాచారి, కాంగ్రెస్ నాయకుడు జానారెడ్డి, భాజపా నాయకుడు కిషన్‌రెడ్డి, ఎంఐఎం నాయకుడు అక్బరుద్దీన్ ఒవైసీ తదితరులు ఉన్నారు. అత్యధికంగా మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి రూ.7.7 లక్షలు చెల్లించాల్సి ఉండగా ఎర్రబెల్లి దయాకర్‌రావు రూ.53 వేలు చెల్లించాల్సి ఉంది. బకాయిలకు సంబంధించి వాహనాలు ఉపయోగించిన నేతలకు లేఖలు రాసినట్లు పేర్కొన్నారు. అలాగే వివిధ రాజకీయ పార్టీల తరఫున ప్రధాన ప్రచారకర్తలు బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు వాడితే ఆ ఖర్చు ఆయా పార్టీల నుంచి వసూలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

సైనిక దినోత్సవ కవాతులో నారీశక్తి

తొలిసారిగా మహిళా అధికారి నాయకత్వం

దిల్లీ: భారత సైన్యం చరిత్రలో మొట్టమొదటిసారిగా సైనిక దినోత్సవ కవాతుకు ఒక మహిళా అధికారి నాయకత్వం వహిస్తున్నారు. ఈ నెల 15న జరిగే ఈ వేడుకలో 'ఆర్మీ సర్వీస్ కోర్' (ఏఎస్‌సీ) విభాగానికి చెందిన 144 మంది సైనిక సిబ్బంది పాలుపంచుకుంటున్నారు. సైనిక సరఫరాలు, రవాణా అంశాలను ఈ విభాగం పర్యవేక్షిస్తుంది. 23 ఏళ్ల తర్వాత ఈ విభాగం సైనిక దినోత్సవ కవాతులో పాలుపంచుకుంటోంది. వీరికి లెఫ్టినెంట్ భావనా కస్తూరి నేతృత్వం వహిస్తారు. ప్రస్తుతం ఆమె తన బృందంతో కలసి కవాతు కోసం సన్నద్ధమవుతున్నారు. తనకు ఈ అరుదైన అవకాశం లభించడంపై ఆమె సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సైన్యంలో జరుగుతున్న పరిణామక్రమానికి ఇది నిదర్శనమని తెలిపారు.

రేపు దిల్లీకి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళవారం దిల్లీ వెళ్లనున్నారు. ఆ రోజు కర్నూలు జిల్లాలో జరిగే జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు దిల్లీకి బయల్దేరి వెళ్తారు. అదే రోజు రాత్రి తిరిగి విజయవాడకు చేరుకుంటారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌పై సీబీఐ కేసు నమోదు చేయడం, ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలపై చట్టబద్ధ సంస్థలతో దాడులు చేయిస్తుండటం తదితర అంశాలపైన చంద్రబాబు పలువురు ప్రతిపక్ష నేతలతో చర్చిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. తెదేపా ఎంపీలతోనూ సమావేశమవుతారని వెల్లడించాయి.

జగన్ కేసు ఎన్ఐయేకు అప్పగింతపై అభ్యంతరం

జగన్‌పై కోడికత్తి దాడి కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐయే)కు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అభ్యంతరం తెలపాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై నిరసన తెలుపుతూ కేంద్ర హోంశాఖకు లేఖ రాయాలని తీర్మానించింది. ఉండవల్లిలోని ప్రజావేదికలో ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డీజీపీ, అడ్వకేట్ జనరల్, ఇతర న్యాయ నిపుణులు, అధికారులతో ఈ అంశంపై చర్చించారు. లేఖలో ఏయే అంశాలను ప్రస్తావించాలనే దానిపై నివేదిక ఇవ్వాలని సీఎం అధికారులను ఆదేశించారు. కేంద్రం హోంమంత్రికి ముఖ్యమంత్రి లేదా రాష్ట్ర హోంమంత్రి లేఖ రాస్తే బాగుంటుందనే అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. జగన్‌పై దాడి కేసు ఎన్ఐయే పరిధిలోకి రాదని ఈ సందర్భంగా న్యాయనిపుణులు చంద్రబాబుకు వివరించారు.



మహా పతంగ్

సూర్యుడిలా కనిపిస్తున్న ఈ గాలిపటాన్ని ప్రత్యేకంగా తయారుచేశారు. అహ్మదాబాద్‌లోని సబర్మతీ నది తీరంలో ఆదివారం జరిగిన 'అంతర్జాతీయ పతంగ్‌ల పండుగ'లో దీన్ని ఎగురవేశారు. భారతీయులతోపాటు విదేశీయులూ ఈ వేడుకలో పాలుపంచుకోవడం విశేషం.

కిచిడీ రికార్డు వండి వార్చారు

• రామ్‌లీలా మైదాన్‌లో 5వేల కిలోల వంటకం తయారీ
• దళితులకు చేరువ కావడమే లక్ష్యం! • దిల్లీ భాజపా ఆధ్వర్యంలో కార్యక్రమం

ఈనాడు, దిల్లీ: దళితులకు చేరువ కావడం, ప్రపంచరికార్డు స్థాపించడమే ధ్యేయంగా దిల్లీ భాజపా ఆధ్వర్యంలో అయిదువేల కిలోల కిచిడీని వండేశారు. కిచిడీ వండటంలో అందెవేసిన చెయ్యిగా పేరొందిన నాగపుర్‌నకు చెందిన పాకశాస్త్ర నిపుణుడు విష్ణుమనోహర్ ఒకే భారీ పాత్రలో అయిదువేల కిలోల వంటకాన్ని వండేశారు. ఇక్కడి రామ్‌లీలా మైదాన్‌లో ఆదివారం దీన్ని సిద్ధం చేశారు. ఇందుకోసం వినియోగించిన బియ్యం, పప్పుదినుసులను దాదాపు మూడులక్షల దళిత కుటుంబాల నుంచి సేకరించారు. సుమారు పాతికవేల మందికి ఈ వంటకాన్ని వడ్డించినట్లు దిల్లీ భాజపా ఎస్సీమోర్చా నేతలు తెలిపారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. భాజపా దళిత మోర్చా ఆదివారం నిర్వహించిన ర్యాలీలో ఈ కిచిడీయే ప్రధాన ఆకర్షణ అయింది. భాజపా అధ్యక్షుడు అమిత్ షా అధ్యక్షతన జరిగిన ఈ ర్యాలీకి వేల మంది దళితులు హాజరయ్యారు.



దిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో ఆదివారం తయారుచేసిన కిచిడీని కలుపుతున్న కేంద్ర మంత్రి హర్షవర్ధన్

ఆధారాలతో నిరూపించండి

లేదంటే తప్పుకోండి

హెచ్‌ఏఎల్ వ్యవహారంలో నిర్మలా సీతారామన్‌కు రాహుల్ డిమాండ్



దిల్లీ

ప్రభుత్వ రంగ సంస్థ అయిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్)కు రూ.లక్ష కోట్ల కాంట్రాక్టులు ఇచ్చామంటూ రక్షణ శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంటులో అసత్యాలు చెప్పారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. కాంట్రాక్టుల మంజూరుకు సంబంధించిన పత్రాలను ఆమె చూపించాలని, లేదంటే తప్పుడు సమాచారం ఇచ్చినందుకు పదవికి రాజీనామా చేయాలని డిమాండు చేశారు. హెచ్‌ఏఎల్‌కు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని, నిధుల్లేక ఆ సంస్థ ఇబ్బందులు పడుతోందంటూ వచ్చిన కథనాలపై ఆయన స్పందించారు. "ఒక అబద్ధం చెప్పారంటే దాన్ని కప్పి పుచ్చుకోవడానికి మరో అబద్ధం చెప్పాల్సి ఉంటుంది. రఫేల్ వ్యవహారంలో ప్రధానికి మద్దతు తెలపాలన్న ఆత్రుతలో ఆమె పార్లమెంటులో అబద్ధమాడారు. హెచ్‌ఏఎల్‌కు రూ.లక్ష కోట్ల మేర కాంట్రాక్టులు ఇచ్చామని చెప్పిన ఆమె అందుకు సంబంధించిన పత్రాలను పార్లమెంటులో సమర్పించాలి. లేదంటే రాజీనామా చేయాలి. సూటు-బూటు మిత్రుని కోసం హెచ్‌ఏఎల్‌ను ప్రధాని బలహీన పరిచారు" అంటూ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ ప్రధాన అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా కూడా ఈ విషయమై ట్వీట్ చేశారు. "హెచ్‌ఏఎల్‌కు రూ.లక్ష కోట్ల ఆర్డర్లు ఇచ్చామని రక్షణ మంత్రి చెప్పారు. అయితే ఒక్క ఆర్డరు గానీ, ఒక్క పైసాగానీ ఇవ్వలేదు. తొలిసారిగా ఆ సంస్థ జీతాల చెల్లింపుల కోసం రూ.1,000 కోట్లు రుణంగా తీసుకొంది" అని చెప్పారు.

రూ. 962 కోట్లు ఓవర్ డ్రాఫ్ట్ తీసుకున్నాం: హెచ్‌ఏఎల్

ఈ మొత్తం వ్యవహారంపై హెచ్‌ఏఎల్ వివరణ ఇచ్చింది. రూ.926 కోట్లు ఓవర్‌డ్రాఫ్ట్ (రుణం) తీసుకున్నట్టు పేర్కొంది. మార్చి నాటికి నగదు లభ్యత మెరుగవుతుందన్న నమ్మకంతో ఈ రుణం తీసుకున్నట్టు తెలిపింది. తేలికపాటి విమానాలైన ఎల్‌సీఏ ఎంకే1ఏ (83), ఎల్‌సీహెచ్ (15) తయారీకి సంబంధించిన ఆర్డర్లు చివరి దశలో ఉన్నాయి" అని పేర్కొంది.

రాహుల్ క్షమాపణ చెప్పాలి

నిర్మలా సీతారామన్



ఈ ఆరోపణపై రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. "ప్రియమైన రాహుల్ గాంధీ! మీకు ఏబీసీల దగ్గర నుంచి అన్నీ కొత్తగా చెప్పాల్సి ఉంటుంది. పత్రికల్లో వచ్చిన దాన్ని పూర్తిగా చదవకుండానే ప్రజలను తప్పుదోవపట్టించడానికి మీలాంటి వారు ప్రయత్నిస్తుంటారు. 2014-18 మధ్య రూ.26,570.8 కోట్ల కాంట్రాక్టులపై హెచ్‌ఏఎల్ సంతకాలు చేసింది. మరో రూ.73 వేల కోట్ల కాంట్రాక్టులు ఇవ్వనున్నాం. సిగ్గుచేటు! కాంగ్రెస్ అధ్యక్షుడు దేశాన్ని తప్పుదోవపట్టిస్తున్నారు. సభాముఖంగా దేశ ప్రజలకు రాహుల్ గాంధీ క్షమాపణలు చెబుతారా? రాజీనామా చేస్తారా?" అంటూ ట్వీట్ చేశారు. ఏ సంవత్సరంలో ఏయే కాంట్రాక్టులు ఇచ్చిందీ వివరంగా పేర్కొంటూ ఈ ట్వీట్‌కు జత చేశారు. రూ.49,797 కోట్లతో 83 తేజస్ విమానాలు తయారు చేయించే వ్యవహారంపై సాంకేతిక పరిశీలన జరుగుతోందని తెలిపారు. రూ.20 వేల కోట్లతో కమోవ్‌కా 226టి హెలికాప్టర్ల కొనుగోలు వ్యవహారమూ ఇదే దశలో ఉందని వివరించారు. లోక్‌సభ రికార్డుల ప్రకారమయితే ఆర్డర్లపై సంతకాలు చేసినట్టు తాను చెప్పలేదని, ఆ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నట్టు మాత్రమే చెప్పానని తెలిపారు. పత్రికల్లోనూ ఇదే విధంగా వార్తలు వచ్చాయని వివరించారు. ఈ ట్వీట్‌పై కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్ తివారీ స్పందిస్తూ కోట్ల రూపాయల కాంట్రాక్టులు ఇచ్చినప్పుడు ఆ సంస్థ జీతాల కోసం ఎందుకు అప్పులు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు.

రాహుల్‌ను తప్పు పట్టిన స్మృతి

రాహుల్ గాంధీ ప్రవర్తన బాగోలేదని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ తప్పు పట్టారు. లోక్‌సభలో నిర్మలా సీతారామన్ ప్రసంగిస్తున్నప్పుడు ఆయన కన్నుకొట్టారని ఆరోపించారు.

సీబీఐని ఎదుర్కొనేందుకు సిద్ధమే: అఖిలేశ్

లఖ్‌నవూ: గనుల అక్రమ తవ్వకాల కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) చేసే విచారణను ఎదుర్కొనేందుకు తాను సిద్ధమేనని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ప్రకటించారు. ఆదివారం ఆయన లఖ్‌నవూలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భాజపా ఒక తరహా సంస్కృతిని దేశంలో ప్రవేశపెడుతోందని, భవిష్యత్తులో ఆ పార్టీకి వ్యతిరేకంగానూ అదే సంస్కృతి పనిచేయక తప్పదని అఖిలేశ్ చెప్పారు. 'గరిష్ఠస్థాయిలో లోక్‌సభ స్థానాలు నెగ్గాలని సమాజ్‌వాదీ పార్టీ ప్రయత్నాలు చేస్తోంది. మమ్మల్ని అడ్డగించాలని చూసేవారితో సీబీఐ ఉంది. గతంలో ఒకసారి కాంగ్రెస్ ఇలాగే సీబీఐ చేత నన్ను ప్రశ్నింపజేసింది. ఇప్పుడు భాజపా నాకు మరో అవకాశం కల్పిస్తోంది. సీబీఐ వారు ఏం అడుగుతారో అడగనీయండి. నేను సమాధానాలిస్తాను. బహుశా మహా కూటమిలో ఎవరికి ఎన్ని స్థానాలు కేటాయించామో వారికి చెప్పాలేమో...! ఇప్పటికైనా భాజపా అసలు రంగు బయటపడడం నాకు సంతోషాన్నిస్తోంది. రాజకీయ మర్యాదల్ని ఆ పార్టీ మంటగలిపింది. ఇతర పార్టీలూ తమలాగే ఉండాలని భాజపా కోరుకొంటోంది. మేం మా రాజకీయ మర్యాదల్ని మార్చుకోం. భాజపాకి తగిన జవాబు ఇవ్వడానికి ప్రజలు మాత్రం సిద్ధంగా ఉన్నారు' అని అఖిలేశ్ చెప్పారు. బీఎస్పీతో సీట్ల సర్దుబాటు గురించి వారంలో ప్రకటిస్తామని అఖిలేశ్ చెప్పారు.

కుదుటపడుతున్న కేరళ

ఆదివారం తగ్గిన హింసాకాండ

తిరువనంతపురం: శబరిమల అయ్యప్పస్వామిని ఈ నెల 2న ఇద్దరు మహిళలు దర్శించుకున్న నేపథ్యంలో మొదలైన హింసాకాండ ఆదివారం కాస్త శాంతించింది. శనివారం సాయంత్రం నుంచి భాజపా-ఆర్‌ఎస్‌ఎస్, సీపీఎం కార్యకర్తల మధ్య పలుచోట్ల దాడులు-ప్రతిదాడులు చోటుచేసుకున్నా ఆదివారం పరిస్థితి అదుపులోకి వచ్చింది. మరోవైపు శబరిమలపై సుప్రీంకోర్టు తీర్పును అమలుచేయడం రాష్ట్రవిధి అని ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. కేరళలో హింసాకాండను ఆపాలని కార్యకర్తలకు సూచించాలని భాజపా జాతీయ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న హింసాకాండకు ఆర్‌ఎస్‌ఎస్, భాజపా, సంఘ్ పరివార్‌లే కారణమని ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తిన భాజపా కార్యకర్తలను అరెస్టు చేస్తున్నారంటూ శనివారం కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఆరోపించిన సంగతి తెలిసిందే. కేరళ 'రాజ్యాంగపరమైన పరిణామాల'ను ఎదుర్కోవలసి వస్తుందని భాజపా జాతీయ అధికార ప్రతినిధి నరసింహారావు నర్మగర్భంగా చేసిన వ్యాఖ్యలపైనా విజయన్ స్పందించారు. 'రాజ్యాంగపరమైన పరిణామాలు' ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కేరళలో పర్యటించే తమ దేశస్థులు జాగ్రత్తగా ఉండాలంటూ అమెరికా, బ్రిటన్ ప్రభుత్వాలు పర్యాటక అప్రమత్తత సూచనలు చేయడం రాష్ట్రానికి అవమానకరమని పర్యాటకమంత్రి కడకంపల్లి సురేంద్రన్ ఆవేదన వ్యక్తం చేశారు.

పల్లెవాసులకు ఆరోగ్య భాగ్యం

రైలు బండే ఆస్పత్రి • దేశవ్యాప్తంగా 'లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్' వైద్యసేవలు

అందరికీ ఆరోగ్యాన్ని పంచేందుకు వచ్చేసింది 'లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్'. దిల్లీ, ముంబయి, బెంగళూరులకు చెందిన నిపుణులైన వైద్యులు, ఇతర సిబ్బంది, ఆధునిక వైద్య పరికరాలతో వచ్చే ఆ రైలు సరైన వైద్య వసతులు అందుబాటులో లేని మారుమూల ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తోంది. ఉచితంగా శస్త్రచికిత్సలు చేయడంతో పాటు మందులు, ఆహారాన్ని ఇక్కడ అందజేస్తారు.



లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్‌లో శస్త్రచికిత్సల్లో పాల్గొన్న వైద్యబృందం

చురైబరి(త్రిపుర)

రోజంతా రెక్కలుముక్కలు చేసుకుంటే కానీ... పూటగడవదు. ముద్దులుమూటగట్టే నా రెండేళ్ల కుమారుడికి పుట్టుకతోనే వచ్చిన ఈ గ్రహణం మొర్రిని సరిచేసేందుకు నేను ఎన్నేళ్లు కష్టపడితే నాలుగు రూకలు చేర్చగలుగుతాను? అనుకుంటూ దినసరి కూలీ అయిన బిశ్వజిత్ చందా రోజూ దిగులుపడేవాడు. బిడ్డను ఒళ్లో పెట్టుకుని భార్య కూడా అంతే బాధపడేది.


కంటిశుక్లాల బాధతో చూపు ఆనట్లేదు... దరిదాపుల్లో ఆసుపత్రి ఆనవాళ్లే లేవు. ఏం చేసేది అంటూ ఎందరో బాధపడేవారు. క్యాన్సర్ అట. ...గట్టెక్కేదారేది! డాక్టరు దగ్గరకెళ్లే మార్గమేది అని మరెందరో వ్యధచెందేవారు. ఏం జబ్బులొచ్చినా దగ్గర్లో దవాఖానాయే లేదు అని బోలెడుమంది నిరుపేద గ్రామస్తులు నిట్టూర్చేవారు.

వీరందరికీ ఉపశమనం కలిగిస్తూ చుక్... చుక్...మంటూ వచ్చేసిన ఓ రైలు ఎక్కడో త్రిపురలోని మారుమూల చురైబరి స్టేషన్‌లో ఆగింది. అంతే...ఆ స్టేషన్‌కు దూరంగా.... అసోం సరిహద్దులో ఉన్న నందిగ్రామ్ గ్రామం నుంచి బిశ్వజిత్ చందా దంపతులు బిడ్డనెత్తుకుని పరిగెత్తుకుంటూ వెళ్లాడు. రెండువారాల తర్వాత బిశ్వజిత్ దంపతుల మొఖం నిండా నవ్వులే. రెండేళ్ల కుమారుడూ 'గ్రహణం' వీడి అమాయకమైన నవ్వులు నవ్వాడు.

'లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్' ఏ ఊర్లో ఆగితే అక్కడే తాత్కాలిక ఆసుపత్రుల్లాంటివి తెరిచేసి వైద్య సేవలు అందిస్తారు. డిసెంబరు 18వ తేదీ నుంచీ చురైబరిలో పనిచేస్తున్నామని...900 మందికి పైగా క్యాన్సర్‌బాధితులకు చికిత్సనందించామని సిబ్బంది తెలిపారు. 12 వందల మందికి కంటి ఆపరేషన్లు చేశారు. దంతసంబంధమైన ఇబ్బందులతో బాధపడే వారికి ఉపశమనం కలిగించారు. మరెందరికో ఆరోగ్యసేవలు అందించినట్లు చెప్పారు. పూర్తి ఎయిర్‌కండిషనింగ్ సదుపాయం ఉన్న ఈ రైలు 1991లో తన యాత్రను మొదలుపెట్టింది. దేశవ్యాప్తంగా ఎన్నో రాష్ట్రాల్లోని కుగ్రామాల్లో వైద్య సేవలు అందించింది. ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్, భారత రైల్వే, కేంద్ర ఆరోగ్యశాఖలు ఈ రైలు వసతిని అందుబాటులోకి తెచ్చాయి.

భాజపా కమిటీల్లో తెలుగువారికి చోటు

రాజ్‌నాథ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రణాళిక రూపకల్పన



దిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికలకు భాజపా సన్నాహాలను ప్రారంభించింది. వివిధ వ్యవహారాల నిమిత్తం 17 సంఘాలను ఏర్పాటు చేస్తూ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా ఆదివారం నిర్ణయం తీసుకున్నారు. వీటిలో కొన్నింటికి కేంద్ర మంత్రులు నేతృత్వం వహిస్తారు. ఇందులో అయిదు కమిటీల్లో తెలుగు వారికి స్థానాలు దక్కాయి. రాం మాధవ్, కంభంపాటి హరిబాబు, బండారు దత్తాత్రేయ, మురళీధర్ రావు, జీవీఎల్, నరసింహారావు, సత్యకుమార్‌లు వివిధ కమిటీల్లో సభ్యులుగా ఉన్నారు.

హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్: 20 మంది సభ్యులు ఉన్న 'సంకల్ప్ పత్ర్' (ఎన్నికల ప్రణాళిక) రూపకల్పన సంఘానికి నేతృత్వం వహిస్తారు. ఈ కమిటీలో కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, నిర్మలా సీతారామన్, రవి శంకర్ ప్రసాద్, పీయూష్ గోయల్, ముక్తార్ అబ్బాస్ నక్వీ, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివ్‌రాజ్ సింగ్ చౌహాన్, థావర్ సింగ్ గెహ్లోత్, కె.జె.ఆల్ఫోన్స్, కిరెన్ రిజీజు, రాం మాధవ్, కంభంపాటి హరిబాబు, కేశవ్ ప్రసాద్ మౌర్య, సుశీల్ మోదీ, నారాయణ్ రాణె, అర్జున్ ముండా తదితరులు సభ్యులుగా ఉన్నారు.

అరుణ్ జైట్లీ: ఎనిమిది మంది సభ్యులతో జైట్లీ ఆధ్వర్యంలో ప్రచార సంఘం ఏర్పాటయింది. కేంద్రమంత్రులు పీయూష్ గోయల్, రాజ్యవర్ధన్ రాథోడ్ తదితరులు సభ్యులుగా ఉన్నారు.

నితిన్ గడ్కరీ: సాంఘిక, సేవా సంఘాలతో సమన్వయం కోసం 17 మందితో కమిటీ ఏర్పాటయింది. కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ సభ్యునిగా ఉన్నారు.

సుష్మా స్వరాజ్: ప్రచారానికి అవసరమైన సమాచారం సేకరణ

రవిశంకర్ ప్రసాద్: మీడియా వ్యవహారాల కమిటీకి ఆధ్వర్యం వహిస్తారు. జీవీఎల్ నరసింహారావుకు ఇందులో చోటు దక్కింది.

ప్రకాశ్ జావ్‌డేకర్: మేధావులతో సమావేశాలు నిర్వహించే కమిటీ. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు సభ్యుడిగా ఉంటారు.

సరోజ్ పాండే: కేంద్రప్రభుత్వ పథకాల లబ్ధిదారులను నేరుగా సంప్రదించే కమిటీకి నేతృత్వం వహిస్తారు. పార్టీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ సభ్యునిగా ఉంటారు.

అరుణ్ సింగ్: మన్ కీ బాత్ ప్రచార కమిటీ



తొలి గ్రహణం

సూర్యుణ్ని చీకటి కమ్ముతున్నట్లు కనిపిస్తోంది కదూ..! చెట్ల కొమ్మలు, పక్షి నీడ నడుమ కనువిందు చేసిన ఈ దృశ్యం.. చైనాలోని ఇంచువాన్ నగరంలో ఆదివారం పాక్షిక సూర్య గ్రహణం మొదలవుతుండగా కెమెరా కళ్లకు చిక్కింది. ఈ ఏడాది సంభవించిన తొలి గ్రహణం ఇదే.

కుమారుడి రక్త దాహం

• ఛత్తీస్‌గఢ్‌లో దారుణం

రాయపూర్: క్షుద్రపూజల మైకం, నరబలి ఉన్మాదంతో ఓ కుమారుడు తన కన్నతల్లినే తెగనరికేశాడు. తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ మూలుగుతున్న ఆమె గాయాలనుంచి ప్రవిస్తున్న రక్తాన్ని తాగేశాడు. ఈ దారుణం ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లాలో డిసెంబరు 31న జరిగినప్పటికీ గురువారం(జనవరి 3వ తేదీ) రాత్రి వెలుగు చూసింది. కుమారుడి క్షుద్ర పూజల పిచ్చికి బలైపోయిన సుమరియా(50) స్నేహితురాలు సమీరన్‌యాదవ్ ఈ దారుణాన్ని కళ్లారాచూసి కొయ్యబారిపోయింది. భయంతో వణికి పోయింది. పరుగున తన ఇంటికెళ్లిపోయింది. చివరకు గురువారం ఎలాగో ధైర్యాన్ని కూడగట్టుకుని జరిగిన విషయాన్ని తన ఇంట్లో చెప్పింది. గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లింది. అంతా కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బిత్తర పోయిన పోలీసులు ఇంతటి దారుణానికి పాల్పడిన దిలీప్‌యాదవ్ కోసం వెతికారు. అతడు పరారీలో ఉన్నాడు.

ముంబయి-దుబాయ్ విమానంలో సాంకేతిక సమస్య

ముంబయి: ఎయిరిండియాకు చెందిన ముంబయి-దుబాయ్ ఎయిర్ ఎక్స్‌ప్రెస్ విమానంలో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా దానిని ఆదివారం అత్యవసరంగా కిందికి దించేయాల్సి వచ్చింది. 177 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో మధ్యాహ్నం 2 గంటలకు ఈ బోయింగ్ విమానం ముంబయిలో బయల్దేరింది. హైడ్రాలిక్ వ్యవస్థ వైఫల్యంతో ఇది గాలిలోనే దాదాపు గంటసేపు చక్కర్లు కొట్టింది. ఈ పరిస్థితుల్లో విమానాన్ని మళ్లీ ముంబయికే తీసుకువచ్చేందుకు అనుమతించాలని పైలట్ అభ్యర్థించడంతో ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పూర్తి అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ప్రయాణికులెవరికీ ఎలాంటి హాని కలగకుండా మధ్యాహ్నం 3 గంటలకు విమానాన్ని సురక్షితంగా కిందికి తీసుకువచ్చినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. లోపాన్ని సరిచేసిన తర్వాత రాత్రి 8 గంటల సమయంలో ఇది దుబాయ్‌కి బయల్దేరిందని తెలిపాయి.



మంచు మార్గం

ఇది శ్రీనగర్ శివార్లలోని రైలు మార్గం. ఎడతెరిపి లేకుండా కురిసిన మంచుతో ఆదివారమిది పాల సముద్రాన్ని తలపించింది. మరోవైపు హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలోనూ విపరీతంగా మంచు కురిసింది. ఇక్కడ ఉష్ణోగ్రతలు మైనస్‌లలో నమోదయ్యాయి.

వైదొలిగిన మలేసియా రాజు

కౌలాలంపూర్: మలేసియా రాజు సుల్తాన్ మహ్మద్ (49) ఆదివారం సింహాసనం నుంచి వైదొలిగారు. దేశ చరిత్రలో ఇలాంటి పరిణామం జరగడం ఇదే మొదటిసారి. ఆరోగ్య కారణాలు చెబుతూ కొంతకాలం పాటు సెలవు తీసుకున్న ఆయన భవితవ్యంపై కొన్ని వారాలుగా ఊహాగానాలు చెలరేగాయి.

ముస్లిం మెజార్టీ దేశమైన మలేసియాకు 1957లో బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం లభించింది. నాటి నుంచి ఈ దేశం రాజ్యాంగపరమైన రాచరిక పాలనలో ఉంది. 9 రాష్ట్రాల్లోని ఇస్లామిక్ రాచ కుటుంబాల వారసుల నడుమ ఐదేళ్లకోసారి సింహాసనం చేతులు మారుతుంటుంది.


సుల్తాన్ మహ్మద్ 2016 డిసెంబర్‌లో సింహాసనాన్ని అధిష్ఠించారు. గత నవంబర్‌లో వైద్య చికిత్స కోసం ఆయన సెలవు తీసుకున్నారు. అయితే ఆ సమయంలో ఆయన మాజీ 'మిస్ మాస్కో' అయిన ఒక అందాలరాశిని రష్యాలో వివాహమాడినట్లు వార్తలు వచ్చాయి. వీటిపై రాచకుటుంబం స్పందించలేదు. సుల్తాన్ మహ్మద్ రాజీనామాకు కారణాలు వెల్లడికాలేదు. మలేసియాలో రాజు పాత్ర లాంఛనప్రాయమే.



సుల్తాన్ మహ్మద్

కార్యనిర్వాహక అధికారాలన్నీ ప్రధాన మంత్రి నేతృత్వంలోని క్యాబినెట్ వద్ద ఉంటాయి. రాజు పట్ల ప్రజలకు అమిత గౌరవం ఉంటుంది. ఆయనను విమర్శించడం నిషిద్ధం. రాజు, రాణిల చిత్రాలు దేశవ్యాప్తంగా ప్రభుత్వ భవనాలపై కనిపిస్తాయి.

చాంపియన్స్



31 ఏళ్లలో తొలిసారి..
ఆస్ట్రేలియా సొంతగడ్డపై ఫాలోఆన్ ఆడడం 31 ఏళ్లలో ఇదే తొలిసారి. ఆ జట్టు చివరి సారి 1988లో ఇదే సిడ్నీలో ఇంగ్లాండ్‌పై ఫాలో ఆన్ ఆడింది.

4
ఆస్ట్రేలియాను భారత్ ఫాలో ఆన్ ఆడించడం ఇది నాలుగో సారి.

2
టెస్టు క్రికెట్లో కుల్‌దీప్ ఐదు వికెట్ల ఘనత సాధించడం ఇది రెండోసారి.

322
భారత్‌కు లభించిన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం. ఆస్ట్రేలియాలో భారత్‌కు ఇదే అత్యధిక ఆధిక్యం.

2005
ఆస్ట్రేలియా చివరి సారి ఫాలోఆన్ ఆడిన సంవత్సరం.

పుజారా ఎన్నో గౌరవాలకు అర్హుడు



సిడ్నీ: బోర్డర్-గావస్కర్ ట్రోఫీ టెస్టు సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన చెతేశ్వర్ పుజారాపై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ ప్రశంసల జల్లు కురిపించాడు. అతను ఎన్నో గౌరవాలకు అర్హుడని చెప్పాడు. "పుజారా ఆస్ట్రేలియా బౌలర్లను అద్భుత రీతిలో ఎదుర్కొన్నాడు. వారు మోకాళ్లపై కూలబడేలా చేశాడు. మిగతా సహచరులు బాగా ఆడేందుకు బాటలు పరిచింది అతనే. భారత క్రికెట్లో కోహ్లి రాజే కావచ్చు. కానీ ఆ రాజ్యంలో అనేక గౌరవాలకు పుజారా అర్హుడు. ప్రస్తుత టెస్టు సిరీస్‌లో భారత్‌కు ఎంతో మేలు జరిగింది. పుజారా మొండి పోరాటం వల్ల జట్టులో చాలామంది లాభపడ్డారు. ఆస్ట్రేలియా జట్టంతా కోహ్లి మీద దృష్టిపెడితే.. చెతేశ్వర్ చాప కింద నీరులా తన పని తాను చేసుకుపోయాడు. అత్యున్నత స్థాయి బౌలింగ్ దళాన్ని అతను అసహనానికి గురి చేశాడు. తద్వారా ఆస్ట్రేలియాలో భారత జట్టు తొలిసారి టెస్టు సిరీస్ గెలిచేందుకు దోహదపడ్డాడు" అని చాపెల్ అన్నాడు.



వానా వానా వద్దప్పా..

దశాబ్దాల నిరీక్షణకు తెరపడినట్లే! ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక సిరీస్ విజయమిక లాంఛనమే. కుల్‌దీప్ ఐదు వికెట్ల ఘనతతో ఆతిథ్య జట్టును ఫాలోఆన్‌లోకి నెట్టేసిన టీమ్‌ఇండియా నాలుగో టెస్టుపై గట్టిగా పట్టుబిగించింది. కానీ విజయంతో ఘనంగా సిరీస్‌ను ముగించాలనుకుంటున్న కోహ్లీసేనకు వాతావరణమే పెద్ద అడ్డంకిగా మారింది. 3-1 ఆశలకు గండికొట్టేలా ఉంది. వర్షం, వెలుతురులేమి కారణంగా సిడ్నీ టెస్టులో ఆదివారం 25.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఆఖరి రోజు కూడా ఇలాంటి వాతావరణమే ఉండే అవకాశం ఉండడం భారత్‌కు ఆందోళన కలిగిస్తోంది. ఆసీస్ డ్రా ఆశలతో ఉంది.

- భారత్ జోరుకు వరుణుడు అడ్డు
- ఆఖరి రోజూ పొంచి ఉన్న ముప్పు!
- ఫాలో ఆన్‌లో ఆస్ట్రేలియా
- తొలి ఇన్నింగ్స్‌లో 300 ఆలౌట్

సిడ్నీ

సిడ్నీ టెస్టులో నెగ్గాలంటే భారత్‌కు ఇంకో పది వికెట్లు కావాలి. ఐతే ఆసీస్ బ్యాట్స్‌మెన్ కన్నా వాతావరణమే భారత్‌కు పెద్ద సవాల్. ఆఖరి రోజు ఆట సరిగ్గా సాగుతుందా అన్నదే ఇప్పుడు ప్రశ్న? వర్షం, వెలుతురులేమి కారణంగా ఆదివారం ఆట కాసేపే సాగినా భారత బౌలర్లు సత్తా చాటారు. ఓవర్‌నైట్ స్కోరు 236/6తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 300 పరుగులకు ఆలౌటైంది. కుల్‌దీప్ యాదవ్ (5/99) ఐదు వికెట్లు పడగొట్టాడు. 322 పరుగుల భారీ ఆధిక్యం సంపాదించిన భారత్.. ఆసీస్‌ను ఫాలోఆన్‌కు ఆహ్వానించింది. . వెలుతురులేమితో ఆట నిలిచిపోయే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 6 పరుగులు చేసింది. ఓపెనర్లు హారిస్ (2), ఖవాజా (4) క్రీజులో ఉన్నారు.

వెలుతురు చాల్లేదు..: వాతావరణం సరిగా లేకపోవడంతో టీమ్‌ఇండియా జోరుకు నాలుగో రోజు కళ్లెం వేసింది. లేదంటే ఇప్పటికే దాదాపు మ్యాచ్‌లో చేతుల్లోకి వచ్చేదే. వర్షం, వెలుతురు లేమి కారణంగా ఉదయం సెషన్ అంతా తుడిచిపెట్టుకుపోయింది. ఆదివారం మూడు గంటల ఆట వృథా అయ్యాక మ్యాచ్ ఆరంభమైంది. ఆసీస్ 22 పరుగుల వ్యవధిలోనే మూడు వికెట్లు చేజార్చుకుంది. ఓవర్‌నైట్ స్కోరుకు ఒక్క పరుగైనా జత కాకుండానే ఆస్ట్రేలియాను షమి దెబ్బతీశాడు. కమిన్స్ (25)ను అతడు బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత హాండ్స్‌కాంబ్ (37; 111 బంతుల్లో 5×4)ను బుమ్రా బౌల్డ్ చేయగా.. లైయన్ (0)ను కుల్‌దీప్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. రెండు సమీక్షలు అందుబాటులో ఉన్నా లైయన్ ఉపయోగించుకోలేదు. డీఆర్ఎస్ కోరి ఉంటే అతడు బతికిపోయేవాడు. లైయన్ ఔటయ్యేటప్పటికి స్కోరు 258. కుల్‌దీప్ తన తర్వాతి ఓవర్లోనే ఐదు వికెట్ల ఘనత పూర్తి చేయాల్సింది. కానీ హేజిల్‌వుడ్ ఇచ్చిన క్యాచ్‌ను విహారి అందుకోలేకపోయాడు. బతికిపోయిన హేజిల్‌వుడ్ (21).. స్టార్క్ (29 నాటౌట్)తో పదో వికెట్‌కు 42 పరుగులు జోడించాడు. చివరికి అతణ్ని వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడం ద్వారా ఈ భాగస్వామ్యాన్ని కుల్‌దీప్ విడదీశాడు. ఆస్ట్రేలియా ఫాలోఆన్‌లో 4 ఓవర్లకే.. వెలుతురు సరిపోవట్లేదన్న కారణంతో అంపైర్లు మ్యాచ్‌ను నిలిపివేశారు. అప్పుడే టీ విరామం కూడా ఇచ్చారు. ఆ తర్వాత ఆట తిరిగి సాధ్యం కాలేదు. వెలుతురులేమి, జల్లుల కారణంగా అంపైర్లు నాలుగో రోజు ఆటను ముగించారు.



కుల్‌దీప్ (5/99)

భారత్ తొలి ఇన్నింగ్స్: 622/7 డిక్లేర్డ్

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: హారిస్ (బి) జడేజా 79; ఖవాజా (సి) పుజారా (బి) కుల్‌దీప్ 27; లబుషేన్ (సి) రహానె (బి) షమి 38; షాన్ మార్ష్ (సి) రహానె (బి) జడేజా 8; హెడ్ (సి) అండ్ (బి) కుల్‌దీప్ 20; హాండ్స్‌కాంబ్ (బి) బుమ్రా 37; పైన్ (బి) కుల్‌దీప్ 5; కమిన్స్ (బి) షమి 25; స్టార్క్ నాటౌట్ 29; లైయన్ ఎల్బీ (బి) కుల్‌దీప్ 0; హేజిల్‌వుడ్ ఎల్బీ (బి) కుల్‌దీప్ 21; ఎక్స్‌ట్రాలు 11 మొత్తం: (104.5 ఓవర్లలో ఆలౌట్) 300; **వికెట్ల పతనం:** 1-72, 2-128, 3-144, 4-152, 5-192, 6-198, 7-236, 8-257, 9-258

బౌలింగ్: షమి 19-2-58-2; బుమ్రా 21-5-62-1; జడేజా 32-11-73-2; కుల్‌దీప్ యాదవ్ 31.5-6-99-5; విహారి 1-0-2-0

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఖవాజా బ్యాటింగ్ 4; హారిస్ బ్యాటింగ్ 2; మొత్తం: (4 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 6

బౌలింగ్: షమి 2-1-4-0; బుమ్రా 2-1-2-0

లైయన్ సమీక్ష ఎందుకు అడగలేదు?

కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూ అయిన ఆస్ట్రేలియా లోయరార్డర్ బ్యాట్స్‌మన్ నేథన్ లైయన్.. సమీక్ష కోరకుండానే పెవిలియన్‌కు వెళ్లిపోవడంపై మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ మండిపడ్డాడు. లైయన్ సమీక్ష అడిగితే నాటౌట్‌గా తేలేవాడని రీప్లేల్లో స్పష్టమైంది. ఈ నేపథ్యంలో పాంటింగ్ మాట్లాడుతూ.. "ఇంకా రెండు సమీక్ష అవకాశాలు అందుబాటులో ఉన్నా లైయన్.. రివ్యూ కోరకుండా వెనుదిరగడం ఆస్ట్రేలియా జట్టు మానసిక స్థితిపై సందేహాలు లేవనెత్తుతోంది. అసలక్కడ ఆలోచించడానికి ఏముంది? నాన్ స్ట్రైక్‌లో ఉన్న స్టార్క్ దీంతో నాకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించడం ఆశ్చర్యకరం. జట్టుకు ఒక భాగస్వామ్యం అవసరమైన స్థితిలో అతను సహచరుడిని కాపాడే ప్రయత్నం చేసి ఉండాల్సింది" అన్నాడు.

అతడే నంబర్‌వన్

"కుల్‌దీప్ నైపుణ్యమున్న బౌలర్. మిగిలిన చైనామన్ బౌలర్ల కంటే అతనెంతో భిన్నమైన ఆటగాడు. వన్డే ఫార్మాట్లో తానేంటో ఇప్పటికే నిరూపించుకున్నాడు. వన్డేల్లో నంబర్‌వన్ బౌలర్ అతనే. క్రీజును ఉపయోగించుకోవడం, రౌండ్ ద వికెట్ బంతులేయడం, వికెట్లకు అతి సమీపంగా వస్తూ బౌలింగ్ చేయడం ద్వారా అతను భిన్నమైన బౌలర్‌గా ఎదిగాడు"

– భరత్ అరుణ్, భారత్ బౌలింగ్ కోచ్

డ్రా కోసం ఆడతాం..

"భారత్‌తో నాలుగో టెస్టులో చివరి రోజు డ్రా కోసమే ఆస్ట్రేలియా ఆడుతుంది. ఆ తర్వాత మేం ఎక్కడ మెరుగుపడాలో.. జట్టుగా ఎలా రాణించాలో అంచనా వేసుకుంటాం. మేం ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకుంటే ఆత్మవిశ్వాసాన్ని సంపాదించుకోవచ్చు. బుమ్రా, కుల్‌దీప్ ప్రపంచ స్థాయి బౌలర్లు. గంటకు 150 కి.మీ వేగంతో బౌలింగ్ చేసే బుమ్రాను ఎదుర్కోవడం చాలా కష్టం. కుల్‌దీప్ చాలా కచ్చితత్వంతో బౌలింగ్ చేస్తాడు"

– హాండ్స్‌కాంబ్

ఛెత్రి చమక్

ఆసియా కప్‌లో భారత్ బోణీ

అబుదాబి

కెప్టెన్ సునీల్ ఛెత్రి మెరవడంతో ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్లో భారత్ ఘనంగా బోణీ కొట్టింది. ఆదివారం జరిగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో భారత్ 4-1 గోల్స్‌తో థాయ్‌లాండ్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో భారత్ విజయంలో ఛెత్రిదే కీలకపాత్ర. 27వ నిమిషంలో గోల్‌పోస్ట్ సమీపంలో థాయ్ డిఫెండర్ చేతికి బంతి తగలడంతో రిఫరీ భారత్‌కు పెనాల్టీ ఇచ్చాడు. ఈ అవకాశాన్ని ఛెత్రి గోల్‌గా మలిచి జట్టును ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. అయితే కాసేపటికే థాయ్‌లాండ్ స్కోరు సమం చేసింది. దోంగ్డా (33వ ని) కొట్టిన ఫ్రీకిక్ నేరుగా భారత గోల్ పోస్టులో పడింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి ఇరు జట్లు 1-1తో సమఉజ్జీలుగా నిలిచాయి. రెండో అర్ధభాగం మొదలైన కాసేపటికే సునీల్ ఛెత్రి (46వ ని) మరోసారి మాయ చేశాడు. ఉదంతా నుంచి క్రాస్‌ను అందుకున్న ఛెత్రి.. మెరుపు వేగంతో గోల్ చేసేశాడు. థాయ్‌లాండ్ కూడా గోల్స్ కోసం బాగానే ప్రయత్నించినా భారత గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సమర్థంగా అడ్డుకున్నాడు. ఆధిక్యాన్ని కొనసాగించిన భారత్ ప్రత్యర్థిపై దాడులు మరింత ఉధృతం చేసింది. ఫలితంగా 68వ నిమిషంలో అనిరుధ్ థాపా గోల్ చేయడంతో భారత్ 3-1తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించింది. మ్యాచ్ కాసేపట్లో ముగుస్తుందనగా జెజె (80వ ని) మరో గోల్ కొట్టి భారత విజయాన్ని ఖాయం చేశాడు. ఈ మ్యాచ్‌లో రెండు గోల్స్ చేసిన ఛెత్రి మొత్తం మీద 67 అంతర్జాతీయ గోల్స్‌తో అర్జెంటీనా దిగ్గజం లియోనల్ మెస్సి (65)ని దాటాడు. 1964 తర్వాత ఆసియా కప్‌లో ఒక మ్యాచ్ గెలవడం భారత్‌కు ఇదే తొలి సారి. ఈ టోర్నీలో ఆడిన 11 మ్యాచ్‌ల్లో మన జట్టుకు ఇది మూడో విజయం మాత్రమే. మరో వైపు డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా అనూహ్యంగా ఓడిపోయింది. గ్రూప్-బి తొలి మ్యాచ్‌లో జోర్డాన్ 1-0తో ఆస్ట్రేలియాకు షాకిచ్చింది.



సెమీస్‌లో హైదరాబాద్ హంటర్స్

అహ్మదాబాద్‌పై విజయం ● ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్

అహ్మదాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ నాలుగో సీజన్‌లో హైదరాబాద్ హంటర్స్ సెమీస్‌లో అడుగుపెట్టింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హంటర్స్ 4-3 తేడాతో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌పై విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో బోడిన్- హై వాన్ జోడీ 15-14, 15-9తో సాత్విక్- సిక్కిరెడ్డి జంటపై గెలిచి హంటర్స్‌కు శుభారంభాన్ని అందించింది. అహ్మదాబాద్ ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకొన్న పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో డారెన్ లీ 15-13, 15-9తో రాహుల్‌పై నెగ్గాడు. ఆ తర్వాతి పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో విక్టర్ 15-11, 13-15, 15-8తో మార్క్‌పై గెలిచాడు. దాంతో అహ్మదాబాద్ 3-1తో ఆధిక్యం సంపాదించింది. ఈ దశలో హైదరాబాద్ ట్రంప్ మ్యాచ్‌గా ఎన్నుకొన్న మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో సింధు 15-14, 12-15, 15-14తో గిల్మోర్‌పై నెగ్గడంతో స్కోరు 3-3తో సమమైంది. ఇక నిర్ణయాత్మక పురుషుల డబుల్స్ మ్యాచ్‌లో బోడిన్- కిమ్ రంగ్ జోడీ 15-10, 11-15, 15-14తో లీ చున్- సాత్విక్ జంటపై గెలవడంతో విజయం హైదరాబాద్ సొంతమైంది. మరో మ్యాచ్‌లో పుణె 7 ఏసెస్ 6-0తో దిల్లీ డాషర్స్‌పై గెలిచి సెమీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. పుణె ట్రంప్ మ్యాచ్‌గా ఎంచుకొన్న మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో ఇవనోవ్- లైన్ జోడీ 15-9, 14-15, 15-8తో మనీపాంగ్- ఎవ్‌జెనియా జంటపై నెగ్గింది. పురుషుల తొలి సింగిల్స్ మ్యాచ్‌లో లక్ష్యసేన్ 15-12, 15-11తో చిరాగ్ సేన్‌పై గెలిచాడు. మహిళల సింగిల్స్‌లో మారిన్ 15-5, 15-6తో ఎవ్‌జెనియాపై నెగ్గడంతో పుణె విజయం ఖరారైంది. దిల్లీ ట్రంప్ మ్యాచ్‌గా ఎన్నుకొన్న పురుషుల డబుల్స్‌లోనూ పుణె పైచేయి సాధించింది. మతియాస్- చిరాగ్ శెట్టి జోడీ 9-15, 15-10, 15-13తో చయ్- మనీపాంగ్ జంటపై గెలిచింది. చివరి పురుషుల సింగిల్స్ మ్యాచ్‌లో దిల్లీ ఆటగాడు టామి 15-7, 15-4తో బ్రైస్‌పై నెగ్గాడు.




పీబీఎల్‌లో ఈనాడు: అవధె వారియర్స్ × చెన్నై స్మాషర్స్ (రాత్రి 7 నుంచి)



రోహిత్ తనయ సమైరా!

ముంబయి: టీమ్‌ఇండియా బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ తన కుమార్తెకు నామకరణం చేశాడు. తనకు సమైరా అనే పేరు పెట్టానని ఆదివారం ట్విట్టర్ ద్వారా ప్రకటించాడు. తనతో భార్య, కుమార్తె ఉన్న ఫొటోను రోహిత్ పోస్టు చేశాడు. దాంతో పాటు తన చిన్నారి కోసం ఒక కవిత కూడా రాశాడు. 'గర్ల్స్ లైక్ యూ' అనే పాట లింక్‌ను షేర్ చేస్తూ "ఈ వీడియో చూసినపుడల్లా ఒళ్లు పులకరిస్తూనే ఉంటుంది" అనే వ్యాఖ్య జత చేశాడు. అంతకుముందు సమైరా.. రోహిత్, రితికల చేతులను పట్టుకుని ఉన్న ఫొటోను అతను ట్విట్టర్‌లో ఉంచిన సంగతి తెలిసిందే. రోహిత్ తన పాప ఫొటోలను పోస్టు చేస్తున్నప్పటికీ ఆమె ముఖం కనిపించకుండా జాగ్రత్త పడుతున్నాడు. భార్యాబిడ్డల్ని చూసేందుకు ముంబయికి వచ్చిన రోహిత్.. ఆస్ట్రేలియాతో నాలుగో టెస్టుకు దూరమైన సంగతి తెలిసిందే. అతను వన్డే సిరీస్ కోసం మంగళవారం తిరిగి జట్టుతో కలవనున్నాడు.

యువీ ప్రపంచకప్ ఆడతాడట!



కోల్‌కతా: టీమ్‌ఇండియా 2011 వన్డే ప్రపంచకప్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన ఆటగాడు యువరాజ్ సింగ్. ఐతే తర్వాత ఫామ్ కోల్పోయిన యువీ 2015 ప్రపంచకప్‌కు ఎంపిక కాలేదు. అతను భారత జట్టుకు దూరమై ఏడాదిన్నర దాటింది. కొంత కాలంగా దేశవాళీల్లోనూ యువీ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయట్లేదు. ఇక మళ్లీ అతను టీమ్‌ఇండియాలోకి వచ్చే సూచనలే కనిపించడం లేదు. కానీ యువీ మాత్రం ప్రపంచకప్‌లో ఆడతానని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. "క్రికెట్ నాకు అన్నీ ఇచ్చింది. నేను ఆటను వీడేటపుడు అత్యుత్తమ దశలో ఉండాలనుకుంటున్నా. ఎలాంటి పశ్చాత్తాపం లేకుండా నిష్క్రమించాలి. ప్రస్తుతం రంజీ ట్రోఫీ చివరి లీగ్ మ్యాచ్ ఆడబోతున్నా. తర్వాత జాతీయ టీ20 టోర్నీలో పాల్గొనాలి. ఆపై ఐపీఎల్ ఉంది. అన్నింట్లోనూ అత్యుత్తమ ప్రదర్శన చేస్తానని ఆశిస్తున్నా" అని యువీ చెప్పాడు.

9.5 ఓవర్లలోనే..

- ఛేదన పూర్తి చేసిన దక్షిణాఫ్రికా
- పాక్‌పై 2-0తో టెస్టు సిరీస్ గెలుపు



కేప్‌టౌన్: లాంఛనం ముగిసింది. పాకిస్థాన్‌తో రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. నాలుగో రోజు, ఆదివారం 41 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఆ జట్టు 9.5 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ ఎల్గర్ 24 పరుగులతో అజేయంగా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో పాక్ 177 పరుగులకే కుప్పకూలగా.. దక్షిణాఫ్రికా 431 పరుగుల భారీ స్కోరు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో పాక్ 294 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన డుప్లెసిస్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు. తొలి టెస్టులో సఫారీ జట్టు 6 వికెట్ల తేడాతో నెగ్గిన సంగతి తెలిసిందే. మూడు టెస్టుల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే దక్షిణాఫ్రికా 2-0తో సొంతం చేసుకుంది.

వర్షాలు ఎక్కువ.. నీరు తక్కువ!

- పట్టణాల్లో వరదలు.. ఖాళీప్రాంతాల్లో కరవు
- ప్రపంచవ్యాప్తంగా ఎండిపోనున్న నదులు
- భవిష్యత్తులో చిత్రమైన వాతావరణ మార్పులు
- ఆస్ట్రేలియాలోని న్యూసౌత్‌వేల్స్ విశ్వవిద్యాలయం పరిశోధకుల అధ్యయనం



ప్రొఫెసర్ ఆశిష్‌శర్మ

మెల్‌బోర్న్: వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా భవిష్యత్తులో విచిత్ర పరిస్థితులు నెలకొననున్నాయి. ఓవైపు వర్షాలు విస్తారంగా కురిసినా, నీటికి కటకట తప్పదు. ప్రపంచవ్యాప్తంగా కరవుకాటకాలు సర్వసాధారణం కానున్నాయి. నేల పొడిబారడమే దీనికి ప్రధాన కారణమని ప్రొఫెసర్ ఆశిష్‌శర్మ నేతృత్వాన ఆస్ట్రేలియాలోని న్యూసౌత్‌వేల్స్ విశ్వవిద్యాలయం పరిశోధకులు జరిపిన అధ్యయనంలో తేలింది. 160 దేశాల్లోని 43 వేల వర్షపాతం నమోదు కేంద్రాలు, 5300 నదుల పర్యవేక్షణప్రాంతాల నుంచి సేకరించిన సమాచారాన్ని నాలుగేళ్లపాటు విశ్లేషించారు. ఈ సమాచారాన్ని కంప్యూటర్లను ఉపయోగించి భవిష్యత్తు వాతావరణ నమూనాలను సృష్టించారు. విచిత్రమైన వాతావరణ పరిస్థితులు తలెత్తనున్నట్లు అధ్యయనంలో తేలింది.

వాతావరణంలో తేమ తగ్గిపోవడం వల్లే

హరితవాయువులు, భూతాపం తదితర కారణాల వల్ల భవిష్యత్తులో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. ఫలితంగా గాలిలో తేమ శాతం తగ్గుతుంది. పర్యావరణవ్యవస్థ సక్రమంగా సాగాలంటే తేమ



న్యూసౌత్‌వేల్స్, విక్టోరియా సరిహద్దుల మధ్య గల మంచినీటి సరస్సు వద్ద ఇప్పటికే ఏర్పడిన విచిత్ర పరిస్థితి ఇది. పక్కనే నిండుకుండలా నీరు తొణికిసలాడుతున్నా, సరస్సును ఆనుకుని ఉన్న నేల బీటలు వారిన దృశ్యాన్ని గమనించవచ్చు.

నిర్ణీతశాతం ఉండాల్సిందే. ఇందుకోసం నేల నుంచి తేమను ఎక్కువగా పీల్చుకుంటుంది. పర్యవసానంగా నేల పొడిబారిపోతుంది. నదులు, చెరువులు, జలాశయాల్లో ఉన్న నీరు ఆవిరిరూపంలోకి ఎక్కువగా మారిపోతే.. నదీపరివాహక ప్రాంతాల చుట్టుపక్కల భూమి నెర్రెలు బారుతుంది. పరివాహకప్రాంతాల్లోనే ఇలాంటి పరిస్థితి ఉంటే, సాధారణ భూమిలో మరింత విషమిస్తుంది. ఫలితంగా భూమిలో మొక్కలు పెరగడానికి నీరు లభ్యం కాదు. ఇది కరవు విలయతాండవం చేయడానికి కారణమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయం చేయడం కష్టమవుతుంది.

పట్టణాల్లో వరదలు

అకాల భారీవర్షాల కారణంగా నగరాలు, పట్టణాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తమవుతుంది. వరదలు ముంచెత్తుతాయి. జనావాసాలులేని మైదానాలు, పర్వతప్రాంతాల్లో ఇందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తుంది. ఇలాంటిచోట్ల వరదల ముప్పు తక్కువగా ఉంటుంది. పొడిబారిన నేల ఎక్కువగా నీటిని పీల్చేసుకోవడమే దీనికి కారణం.

నీటిని నిల్వ చేయలేం

తరచూ ఏర్పడే పెద్దపెద్ద తుపాన్ల కారణంగా భారీవర్షాలు కురుస్తాయి. ఆ నీటిని నిల్వ చేసే జలాశయాల సామర్థ్యం తక్కువగా ఉన్నందున ఎక్కువనీటిని ఒడిసి పట్టలేం. డ్యాముల్లో నీటిని నిల్వ చేయకపోవడం వల్ల వేలాది క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతుంది.

బ్లూవాటర్ వర్సెస్ గ్రీన్ వాటర్



భూమిపై వర్షం సమయంలో పడే ప్రతి వంద బిందువుల్లో 36 బిందువులు మాత్రమే నదులు, చెరువులు, జలాశయాల్లోకి చేరుతాయి. ఇది మానవావసరాలకు ఉపయోగపడుతుంది. దీన్ని "బ్లూవాటర్" అంటారు. మిగిలిన నీరు నేలలో ఇంకి, గాలిలో తేమ రూపంలో ఆవిరిగా మారి జీవావరణానికి ఉపకరిస్తుంది. దీన్ని "గ్రీన్‌వాటర్"గా వ్యవహరిస్తారు. వాతావరణమార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయి కాబట్టి, గాలిలో తేమ తగ్గుతుంది. ఫలితంగా బ్లూవాటర్‌లో ఎక్కువశాతాన్ని జీవావరణ వ్యవస్థ వినియోగించుకుంటుంది. పర్యవసానంగా మానవావసరాలకు నీటి లభ్యత తగ్గుతుంది.



యాదాద్రి ఆలయ విస్తరణ పనులను పరిశీలిస్తున్న సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి. పక్కన కలెక్టర్ అనితా రామచంద్రన్, యాడా ఉపాధ్యక్షుడు కిషన్‌రావు, ఇతర అధికారులు

యాదాద్రి పనుల్లో వేగం పెంచాలి

- గుత్తేదారులను, యాడా నిర్వాహకులను ఆదేశించిన సీఎంవో ప్రత్యేక కార్యదర్శి

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: నిధుల కేటాయింపులో ఎలాంటి జాప్యం జరగకుండా విడుదల చేస్తున్నందున యాదాద్రి క్షేత్ర విస్తరణ పనుల్లో వేగం పెంచాలని గుత్తేదారులు, యాదాద్రి ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ(యాడా) నిర్వాహకులను ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి ఆదేశించారు. యాదాద్రి పుణ్యక్షేత్రాభివృద్ధి పనులను ఆదివారం ఆయన పరిశీలించి సమీక్షించారు. ఆలయ విస్తరణ పనులు పూర్తిస్థాయిలో కృష్ణశిలతో రూపొందించడం విశేషమని, ప్రధానాలయంతోపాటు రామలింగేశ్వర ఆలయం ఫిబ్రవరిలోగా పూర్తయ్యేలా 'యాడా' యంత్రాంగం కృషి చేయాలని సూచించారు. పెద్దగుట్టపై నిర్మితమయ్యే ఆలయ నగరి పనులతోపాటు ప్రెసిడెన్షియల్ సూట్ల నిర్మాణాలనూ భూపాల్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట జిల్లా కలెక్టర్ అనితారామచంద్రన్, యాడా ఉపాధ్యక్షుడు కిషన్‌రావు, ఈఎన్‌సీ రవీందర్, ఈవో గీతారెడ్డి, ఆలయ శిల్పి ఆనందసాయి, ఆర్‌అండ్‌బీ శాఖ ఎస్‌ఈ ఉన్నారు.

హెచ్‌సీయూలో వెలివాడ తొలగింపు

- ఆగంతకుల చర్యను ఖండించిన విద్యార్థి సంఘాలు



వెలివాడను తొలగించిన ప్రాంతం

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో గతంలో పలువురు విద్యార్థులు ఏర్పాటుచేసిన వెలివాడను గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. 2016లో అప్పటి పరిణామాల నేపథ్యంలో రోహిత్ వేములతో పాటు మరో నలుగురు విద్యార్థులను యూనివర్సిటీ సామాజిక బహిష్కరణ చేసింది. దాన్ని వ్యతిరేకిస్తూ ఆ విద్యార్థులు షాపింగ్ కాంప్లెక్స్ వద్ద నిరసనకు దిగారు. అక్కడే వారు బైఠాయించి ఆ ప్రాంతానికి వెలివాడగా నామకరణం చేసి ఆందోళన చేపట్టారు. అనంతరం రోహిత్ మృతితో క్యాంపస్‌లో పెద్దఎత్తున దుమారం రేగింది. అప్పటినుంచి వెలివాడ కేంద్రంగానే విద్యార్థులు రోహిత్ మృతికి కారణమైనవారిని శిక్షించాలంటూ ఉద్యమం చేపట్టారు. పలుమార్లు విశ్వవిద్యాలయ సెక్యూరిటీ సిబ్బంది వెలివాడను తొలగించే యత్నం చేసినా విద్యార్థులు ప్రతిఘటించడంతో ఆ చర్యలను విరమించుకున్నారు. ఈనెల 4న వెలివాడకు విద్యార్థులు మరమ్మతులు చేసి ప్రముఖుల నూతన చిత్రపటాలు ఏర్పాటుచేశారు. అక్కడ ఏర్పాటుచేసిన బ్యానర్లను తొలగించాలని పలువురు విద్యార్థులకు విశ్వవిద్యాలయం నోటీసులు జారీచేసింది. శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. ఇక్కడున్న అంబేడ్కర్, ఇతర ప్రముఖుల చిత్రపటాలను మాయం చేశారు. హెచ్‌సీయూ వీసీ అప్పారావు ఆదేశాల మేరకే వెలివాడను తొలగించారని అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆరోపిస్తూ ఒక ప్రకటన విడుదల చేసింది. భాజపా ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే వెలివాడ తొలగింపునకు వీసీ పాల్పడ్డారని ఆరోపించింది. ఆదివారం సాయంత్రం నిరసనకు దిగిన అసోసియేషన్ సభ్యులు..వెలివాడను పునరుద్ధరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని చెప్పారు.

పెనుగొండలో 90 అడుగుల వాసవీమాత విగ్రహం

ఫిబ్రవరి 14న ప్రతిష్ఠాపన

హైదరాబాద్, న్యూస్‌టుడే: ప్రపంచంలోనే అత్యంత ఎత్తుగా 90 అడుగుల వాసవీకన్యకా పరమేశ్వరి విగ్రహాన్ని పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో రూపొందించినట్టు అఖిలభారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్టు ప్రకటించింది. పంచలోహాలతో తయారుచేసిన ఈ విగ్రహాన్ని ఫిబ్రవరి 14న అక్కడే ప్రతిష్ఠించనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు డా.పీఎన్ గోవిందరాజులు, వెండి రథం కమిటీ ఛైర్మన్ రామ్‌పండు వెల్లడించారు. విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన కరదీపికను ఆదివారం హైదరాబాద్‌లో తమిళనాడు మాజీ గవర్నర్, ట్రస్టు ప్యాట్రన్ కొణిజేటి రోశయ్య ఆవిష్కరించారు. అనంతరం రోశయ్య మాట్లాడుతూ..వాసవీకన్యకా పరమేశ్వరి ఉత్సవాలతో పెనుగొండ వీధులు భక్తి పారవశ్యంతో విరాజిల్లనున్నాయన్నారు. ట్రస్టు ప్రతినిధులు మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు వ్యయం రూ.45 కోట్లని, ఇందులో రూ.17 కోట్లను పంచలోహ విగ్రహ తయారీకే ఖర్చు చేశామన్నారు.

వసతి గృహాల్లో వికటించిన ఆహారం

- చేవెళ్ల కేజీబీవీలో 69 మంది విద్యార్థినులకు అస్వస్థత
- భూపాలపల్లి జిల్లాలో 22 మంది ఆస్పత్రిపాలు

చేవెళ్ల, ఉస్మానియా ఆసుపత్రి, చిట్యాల న్యూస్‌టుడే: వసతి గృహాల్లో ఆహారం వికటించి రంగారెడ్డి జిల్లాలో 69 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 22 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలోని కస్తూర్బాగాంధీ వసతి గృహంలో ఆదివారం ఉదయం కడుపునొప్పి, వాంతులతో ఒక్కొక్కరు అస్వస్థతకు గురికాగా ఉపాధ్యాయులు వారిని చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. శనివారం రాత్రి వారు తీసుకున్న ఆహారం (ఫ్రూట్‌సలాడ్) విషతుల్యమైనట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం పలువురిని హైదరాబాద్‌లోని నిలోఫర్, ఫీవర్, ఉస్మానియా ఆసుపత్రులకు తరలించారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రిలో సరిపడా మంచాలు లేక ఒక్కో మంచంపై ఇద్దరికి వైద్యం అందజేస్తున్నారు.



అస్వస్థతకు గురైన చిట్యాల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని

మరోవైపు జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో 22మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. శనివారం రాత్రి వారు తిన్న ఆహారం విషపూరితం కావడమే ఇందుకు కారణమని భావిస్తున్నారు. రాత్రి 10గంటల నుంచి ఒక్కో బాలిక కడుపులో నొప్పిగా ఉందని అధ్యాపకులకు చెప్పారు. తెల్లారేసరికి సుమారు 40మంది కడుపునొప్పితో బాధపడ్డారు. వారిలో 22మంది వాంతులు చేసుకోవడంతో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అందరి పరిస్థితి నిలకడగా ఉంది.

నెలకు రూ.1500 కోట్ల లావాదేవీలు

- ఇండోర్ కేంద్రంగా బోగస్ సలహా సంస్థల దందా
- షేర్లలో పెట్టుబడుల పేరిట స్వాహా
- దేశవ్యాప్తంగా మదుపరులకు వలేసి వసూళ్లు

ఈనాడు, హైదరాబాద్: షేర్‌మార్కెట్‌లో పెట్టుబడుల్ని లాభదాయకంగా మలిచేందుకు సలహాలిస్తామంటూ మోసాలకు పాల్పడుతున్న ఇండోర్ ముఠా కేసు దర్యాప్తులో విస్మయకర కోణాలు బహిర్గతమవుతున్నాయి. దేశవ్యాప్తంగా ఇండోర్ కేంద్రంగానే భారీ ఎత్తున అక్రమ దందా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఆ నగరంలో ఉన్న సుమారు 600 పెట్టుబడుల సలహా సంస్థల్లో 161 మాత్రమే సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ)లో నమోదు కాగా.. మిగిలిన సంస్థలన్నీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే అక్రమ లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. షేర్లలో పెట్టుబడులపై తొలుత ఉచితంగా సలహాలిస్తున్న ఆయా సంస్థలు తర్వాత మదుపరులను మభ్యపెట్టి బుట్టలో వేసుకుంటున్నాయి. మదుపరుల తరపున భారీగా లాభాలొచ్చే సంస్థల్లో తామే పెట్టుబడులు పెడతామని రూ.లక్షల్లో వసూలు చేసి కొంతకాలం తర్వాత మొహం చాటేస్తున్నాయి. సెబీలో నమోదైన సంస్థలూ ఇదే తరహాలో మోసాలకు పాల్పడుతున్నట్లు సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. దేశవ్యాప్తంగా హైదరాబాద్, ముంబయి, సూరత్, అహ్మదాబాద్, ఇండోర్ తదితర నగరాల్లో ఈ తరహా సలహా సంస్థలున్నా.. ఇండోర్‌లోనే పెద్దఎత్తున అక్రమ సంస్థలు మనుగడలో ఉండటం గమనార్హం. ఆయా సంస్థలు ప్రతి నెలా సుమారు రూ.1500కోట్ల లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వీటిలో ఎక్కువ మొత్తాన్ని సంస్థల ప్రతినిధులే కాజేస్తున్నట్లు భావిస్తున్నారు. ఇప్పటికే అరెస్ట్ చేసిన నిందితులను ఏడు రోజుల కస్టడీకి తీసుకుని విచారణ చేసేందుకు న్యాయస్థానం అనుమతి కోరారు.

టెలీకాలర్లే సలహాదారులు

పెట్టుబడుల సలహా సంస్థను నిర్వహించేందుకు స్టాక్‌మార్కెట్‌లో అనుభవమున్న నిపుణులై ఉండాలి. ఇందుకోసం నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ మార్కెట్స్ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణులై ధ్రువీకరణపత్రం పొందాలి. అలాంటప్పుడే మదుపరులకు సరైన సలహాలిచ్చే అవకాశముంటుంది. అయితే కేవలం సంస్థ నిర్వాహకుడు మాత్రమే ఆ ధ్రువీకరణపత్రం పొంది ఉంటున్నాడు. అతనే సుమారు 200-300 మంది టెలీకాలర్లను నియమించుకుంటున్నాడు. టెలికాం ఆపరేటర్ల నుంచి ప్రైమరీ రేట్ ఆఫ్ ఇంటర్‌ఫేస్ విధానంలో డెస్క్ కాలింగ్ అప్లికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్నారు. మదుపర్లను ఆకర్షించేలా మాట్లాడటంలో టెలీకాలర్లకు తర్ఫీదు ఇస్తూ సలహాలిచ్చే బాధ్యతల్ని వారికే అప్పగిస్తున్నారు. డి-మ్యాట్ ఖాతాదారుల వివరాల్ని స్టాక్ బ్రోకరేజీ సంస్థల నుంచి దొడ్డిదారిన సంపాదించి వలేస్తున్నారు. తొలుత ఉచిత సలహాలిచ్చి నమ్మకం చూరగొంటున్న టెలీకాలర్లు తర్వాత మదుపరుల తరపున తామే పెట్టుబడులు పెట్టి భారీమొత్తంలో లాభాలు తెప్పిస్తామని మభ్యపెడుతున్నారు. సెబీ మార్గదర్శకాల ప్రకారం ఈ సంస్థలు కేవలం సలహాలివ్వడానికే పరిమితం కావాల్సి ఉంటుంది. మరోవైపు సెబీలో నమోదైన సంస్థలూ ఈ తరహాలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఇండోర్‌లో ఎక్కువ సంస్థల కార్యకలాపాలు జరిగే విజయ్‌నగర్‌లోనే సెబీ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఉన్నా పట్టించుకోకపోవడం గమనార్హం.

ఇండోర్‌లో బాధితుల పడిగాపులు

సైబరాబాద్‌లో నలుగురి ఫిర్యాదులపై దర్యాప్తు చేసిన సైబర్‌క్రైమ్ పోలీస్ బృందం ఇండోర్‌లో రెండు రోజులపాటు మకాం వేసింది. ఆయా సంస్థల నిర్వాకంతో దేశవ్యాప్తంగా మోసపోయిన బాధితులు పదుల సంఖ్యలో అక్కడ కార్యాలయాల వద్ద పడిగాపులు పడుతూ కనిపించారు. గుంటూరుకు చెందిన ఓ బాధితుడు ఇలాగే మోసపోయి సంస్థ కార్యాలయం వద్ద పోలీస్‌బృందం కంటపడ్డాడు. పోలీసులు బాధితుల మాదిరిగానే ఆయా సంస్థల కార్యాలయాల్లోకి వెళ్లారు. సీసీ కెమెరాల్లో వారి కదలికలను గుర్తించిన హైబ్రో సంస్థ ప్రమోటర్ స్వప్నిల్ ప్రజాపతి వారి దృష్టి మరల్చి తప్పించుకుని పారిపోయే ప్రయత్నం చేశాడు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఇండోర్ క్రైంబ్రాంచ్ పోలీసుల సహకారంతో నిందితులను అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు.

విమర్శ సహేతుకంగా ఉండాలి

- విజేతలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి
- ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షికోత్సవ సభలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యలు



ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్ వార్షికోత్సవ సభలో డీఆర్‌డీవో ఛైర్మన్ సతీష్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. వేదికపై కైలాష్ సత్యార్థి

ఈనాడు డిజిటల్, విజయవాడ: సంపాదన కోసం ప్రతి ఒక్కరూ విదేశాలకు వెళ్లొచ్చని, కానీ జన్మభూమిని మరవొద్దని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఉద్బోధించారు. కృష్ణాజిల్లా ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్ మూడో వార్షికోత్సవంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. విమర్శ ఎప్పుడూ సహేతుకంగా ఉండాలని..స్థాయిని మరచి ఉన్నత వ్యక్తులను విమర్శించడం తగదని అన్నారు. ఈ మధ్య కాలంలో కొందరు నాయకులకు నోరుజారడం అలవాటైందని, అలాంటి వారు జారిపడటం ఖాయమన్నారు. కార్యక్రమంలో భాగంగా నోబెల్ శాంతి పురస్కారం గ్రహీత కైలాష్ సత్యార్థి, భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) ఛైర్మన్ సతీష్‌రెడ్డిలను సన్మానించారు. బాలల హక్కుల కోసం పనిచేస్తున్న కైలాష్ సత్యార్థి దేశానికి గర్వకారణమని ఉపరాష్ట్రపతి కొనియాడారు. సతీష్‌రెడ్డి చిన్న వయసులోనే డీఆర్‌డీవో ఛైర్మన్‌గా ఎదిగారని...ఇలాంటి వారి నుంచి యువత స్ఫూర్తి పొందాలని సూచించారు. స్వర్ణభారత్‌ట్రస్ట్.. యువతకు సాంకేతిక నైపుణ్య శిక్షణను అందిస్తే డీఆర్‌డీఓ తరపున సహకారమందిస్తామని సతీష్‌రెడ్డి తెలిపారు.

లెక్కల్లో చూపని ఆదాయం రూ.109 కోట్లు

- కన్నడ సినీ ప్రముఖుల ఇళ్లలో ముగిసిన ఆదాయ పన్ను సోదాలు
- 25.3 కిలోల బంగారం స్వాధీనం

బెంగళూరు, న్యూస్‌టుడే: కన్నడ సినీ కథానాయకులు, నిర్మాతల నివాసాలపై ఆదాయ పన్ను శాఖ జరిపిన దాడులు శనివారం అర్ధరాత్రి ముగిశాయి. కథానాయకులు శివరాజ్‌కుమార్, పునీత్ రాజ్‌కుమార్, సుదీప్, యశ్, నిర్మాతలు రాక్‌లైన్ వెంకటేశ్, విజయ్ కిరంగదూరు, సి.ఆర్.మనోహర్, పంపిణీదారులు జాక్ మంజు, జయణ్న-భోగేంద్రల నివాసాల నుంచి లెక్కల్లోకి రాని రూ.109 కోట్ల ఆస్తులను గుర్తించి, దస్త్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆ శాఖ ఆదివారం వెల్లడించింది. వీటితో పాటు బినామీల పేరిట ఉన్న రూ.11 కోట్ల స్థిరాస్తులు, 25.3 కిలోల బంగారు ఆభరణాలు, రూ.2.85 కోట్ల నగదు స్వాధీనపరచుకున్నట్లు తెలిపింది. స్వాధీనపరచుకున్న సొత్తు వివరాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు అందించాలని ఐటీ అధికారులు నిర్ణయించారు. వీరందరికీ క్రిమినల్ నోటీసులు జారీ



బెంగళూరులోని సినీ ప్రముఖుల ఇళ్లలో జరిపిన సోదాల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు

చేసి దశల వారీగా విచారణ ప్రారంభించాలని నిర్ణయించారు. 'పన్నులను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాం. అన్ని వివరాలను అధికారులకు చెప్పాం. మా దస్త్రాలను స్కానింగ్ చేసుకున్నారు' అని దాడులను ఎదుర్కొన్న కథానాయకులు, నిర్మాతలు తెలిపారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00